సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+20 వెల : ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 312

శుక్రవారం 2-2-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

బడ్జెట్ మొత్తం.. 24,42,213 కోట్లు

రెవెన్యూ వసూళ్లు	17,25,738 కోట్లు	మూలధన వసూళ్లు	7,16,475 కోట్లు
మొత్తం వసూళ్లు	24,42,213 కోట్లు	రెవెన్యూ లోటు..	4,16,034 కోట్లు

రాష్ట్రానికి మొండిచేయి

చివరి బడ్జెట్‌లోనూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం

- పోలవరం, రాజధాని, రైల్వే జోన్ ఊసేలేదు
- వెనుకబడిన జిల్లాలకు నిధులూ లేవు
- విభజన చట్టంలోని హామీలకూ దిక్కులేదు
- రాజకీయ అవసరాల కోసం రాజీనే కారణమా

- వివరాలు 2లో

ఏపీ ప్రస్తావనే లేదు.. వైఎస్సార్‌సీపీ ఎంపీల ఆవేదన 2లో



ఆరోగ్య శ్రీ రథం... ఆ'కర్షక' ధ్వజం..

గెలుపే లక్ష్యం!

ఎన్ని'కలల' బడ్జెట్ ప్రవేశపెట్టిన అరుణ్ జైట్లీ

- దేశవ్యాప్తంగా 10 కోట్ల పేద కుటుంబాలకు ఆరోగ్య బీమా
- ఏడాదికి రూ.5లక్షల వరకూ ఉచిత కవరేజీ
- రైతుల కనీస మద్దతు ధర నిర్ణయానికి కొత్త యంత్రాంగం
- 4 కోట్ల కుటుంబాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు
- ఎల్‌కేజీ నుంచి 12వ తరగతి వరకూ ఉచిత విద్య
- గ్యాస్ కనెక్షన్ల లక్ష్యం 5 నుంచి 8 కోట్లకు పెంపు

అది మహా భారతం. కురుక్షేత్ర సంగ్రామం. అస్త్రాలు సంధించేది అర్జునుడే అయినా... దేనినెప్పుడు సంధించాలో... దేనినెలా ఎదుర్కోవాలో... ఎప్పుడు ఏ మాయ చేయాలో అన్నీ తెలిసినవాడు శ్రీ కృష్ణుడు. అర్జునుడి రథానికే కాదు, యావద్భారత సంగ్రామానికీ తనే సారథి. కర్ణుడిపైకి అంజలీకాన్ని సంధించినా... బ్రహ్మాస్త్రాన్ని వదిలి వెనక్కు తీసుకున్నా... సమ్మోహనాన్ని ప్రయోగించినా... జయద్రథుడిపైకి పాశుపతాన్ని పంపినా... అర్జునుడి గాండీవానికి కృష్ణుడే మార్గదర్శి.

మన భారతంలో... మరో ఏడాదిలో ఎదుర్కోవాల్సిన ఎన్నికల కురుక్షేత్రానికి శంఖారావం పూరించారు నరేంద్రమోదీ. ప్రధానిగా యావద్భారతాన్నీ నడిపిస్తున్న మోదీ.. బడ్జెట్ రథ సారథిగా అరుణ్ జైట్లీకి శక్తిమంతమైన అస్త్రాలనందించారు. ఏకంగా 50 కోట్ల మందిని సమ్మోహితుల్ని చేసే ఆరోగ్య బీమాస్త్రం... పాశుపతంలాంటిదే. 10 కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ.5 లక్షల వరకూ ఉచిత ఆరోగ్య బీమా కల్పించటం దీని లక్ష్యం. ఒకరకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ లాంటిదే ఇది కూడా. ఇపుడు దేశవ్యాప్తం కాబోతోంది!!

ఆహార భారతానికి వెన్నెముకయిన రైతును ఆకట్టుకోవడమే లక్ష్యంగా ఆ'కర్షక'అస్త్రం వేశారు జైట్లీ. ఖరీఫ్ పంటల కోసం రైతులు వెచ్చించే పెట్టుబడి వ్యయానికి 50% ఎక్కువగా కనీస మద్దతు ధరనిస్తామన్నారు. వేతన జీవులకు ఆదాయపు పన్ను శ్లాబులు మార్చకుండా నిరాశ కలిగించినా... రూ.40 వేల స్టాండర్డ్ డిడక్షన్‌తో ఆశపెట్టారు. మొత్తంగా చూస్తే... ఇది ఎన్నికల కురుక్షేత్రానికి శంఖారావం పూరించిన బడ్జెట్ రథం. కాకపోతే మన భారతంలో కురుక్షేత్రం ఐదేళ్లకోసారి జరుగుతుంది. అందులో గెలుపోటములే... అంతిమంగా జనం చేతిలోని అస్త్రాలు.

మరిన్ని వివరాలు, కథనాలు 2, 3, 5, 6, 7, 8, 9, 10, 11, 12, 13, 14 పేజీల్లో


అందరికీ ఆరోగ్యమే లక్ష్యం

- ప్రజా సంకల్ప యాత్రలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్
- దారిపొడవునా సమస్యలు చెప్పుకున్న వివిధ వర్గాల ప్రజలు

ఫుల్‌అవుట్ IIIలో



ఇదం జగత్



బడ్జెట్ హైలైట్స్

- వ్యక్తిగత ఆదాయపన్ను శ్లాబులు, రేట్లలో మార్పు లేదు
- కిసాన్ క్రెడిట్ కార్డులను పశు, చేపల పెంపకందారులకిస్తారు.
- 2018 ఆర్థిక సంవత్సరం చివరి 6 నెలల్లో 7.2-7.5% వృద్ధి రేటు నమోదు కావొచ్చు.
- 2017-18కి సవరించిన ద్రవ్య లోటు అంచనా 5.95 లక్షల కోట్లు. జీడీపీలో ఇది 3.5%.
- దశాబ్దం తర్వాత మళ్లీ స్టాండర్డ్ డిడక్షన్ అమలు. వేతన ఉద్యోగులకు రూ.40 వేల వరకు ప్రయాణ, వైద్య ఖర్చులకు స్టాండర్డ్ డిడక్షన్ వర్తింపు.
- రూ.50 లక్షలు మించి రూ.కోటికి తక్కువ ఆదాయం ఉన్న వారిపై 10%, రూ.కోటి కంటే ఎక్కువ ఆదాయం ఉన్న వారిపై 15% సర్‌చార్జ్ కొనసాగింపు.
- 2018-19 ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ.11 లక్షల కోట్ల మేర పంట రుణాల మంజూరు లక్ష్యం. గత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.10 లక్షల కోట్లే.
- అన్ని రంగాల్లో కొత్తగా చేరే ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించే ఈపీఎఫ్‌ను 12 శాతానికి పెంచారు. ఇది మూడేళ్ల పాటు అమలవుతుంది.
- రాష్ట్రపతి గౌరవ వేతనం నెలకు రూ. 5లక్షలకు పెంపు. ఉపరాష్ట్రపతి గౌరవ వేతనం రూ.4 లక్షలకు, గవర్నర్ల గౌరవ వేతనం రూ. 3.5 లక్షలకు పెంపు.
- మొబైల్ ఫోన్ల దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ 15 నుంచి 20 శాతానికి పెంపు. టీవీలకు సంబంధించి కొన్ని విడిభాగాలపై కస్టమ్స్ డ్యూటీ 15 శాతానికి పెంపు.
- దేశంలో 10 కోట్ల పేద కుటుంబాలకు లబ్ధి చేకూరేలా జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని కింద ఒక్కో కుటుంబానికి గరిష్టంగా ఏటా రూ. 5 లక్షల వైద్య బీమా సదుపాయం కల్పిస్తారు.

పెరిగేవి..

కార్లు, మోటార్ సైకిళ్లు, బస్సులు, ట్రక్కుల రేడియల్ టైర్లు, మొబైల్ ఫోన్లు, వాటి యాక్సెసరీలు, ఎల్‌సీడీ, ఎల్‌ఈడీ, ఓఎల్‌ఈడీ టీవీ ప్యానెళ్లు, ఇతర టీవీ విడిభాగాలు, ధరించగలిగిన ఎలక్ట్రానిక్ వస్తువులు, పెర్ఫ్యూమ్‌లు, డియోడ్రంట్లు, టాయిలెట్ వాటర్, టాయిలెట్ స్ప్రేలు, సౌందర్య ఉత్పత్తులు, పాదరక్షలు, పట్టు వస్త్రాలు, రంగు రాళ్లు, కొన్ని రకాల వజ్రాలు, పండ్లు, కూరగాయల



జ్యూస్‌లు, వంటనూనెలు, బంగారం, వెండి, సన్‌గ్లాసెస్, సన్‌స్క్రీన్, సన్‌ట్యాన్ లోషన్లు, మ్యానిక్యూర్, పెడిక్యూర్‌లలో వాడే పదార్థాలు..

తగ్గేవి

ముడి జీడిపప్పు, కాక్లియర్ ఇంప్లాంట్‌ల తయారీలో వాడే పరికరాలు, సౌర ఫలకాల తయారీలో వాడే సోలార్ టెంపర్డ్ గ్లాస్‌లు, కొన్ని రకాల మేకులు


కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా

సాక్షి, న్యూఢిల్లీ/అమరావతి: 2018–19కి కేంద్ర పన్నుల్లో ఏపీ వాటా రూ.33,929.84 కోట్లుగా ఉంది. ఇది మొత్తం పంపిణీ చేసే పన్నుల్లో (42% రాష్ట్రాలకు) 4.305%గా ఉంది. ఇందులో కార్పొరేషన్ పన్ను రూ.9526.44 కోట్లు, ఆదాయ పన్ను రూ.8,430.37 కోట్లు, సెంట్రల్ జీఎస్టీ రూ.10,919.11 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూ.904 కోట్లు, కస్టమ్స్ ట్యాక్స్ రూ.1671.58 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ.1628.92 కోట్లు తదితరాలు ఉన్నాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది కేంద్ర పన్నుల్లో వాటా రూ. 4,791 కోట్లు అదనంగా రానుంది.

ఏడాది	ఏపీకి కేంద్ర పన్నుల్లో వాటా
2014-15	రూ. 14,106.93 కోట్లు
2015-16	రూ. 21,893.79 కోట్లు
2016-17	రూ. 26,263.88 కోట్లు
2017-18	రూ. 29,138.82 కోట్లు
2018-19	రూ. 33,929.84 కోట్లు

నేడు రాష్ట్రానికి ఉపరాష్ట్రపతి

గన్నవరం నుంచి మేడారం వెళ్లనున్న వెంకయ్యనాయుడు




సాక్షి, న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు శుక్రవారం రాష్ట్రానికి రానున్నారు. శుక్రవారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఆయన బయలుదేరి గన్నవరం విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో తెలంగాణలోని మేడారానికి చేరుకుని సమ్మక్క, సారలమ్మ జాతరను సందర్శిస్తారు. వనదేవతల గద్దెలను సందర్శించి బంగారాన్ని (బెల్లం) సమర్పించిన అనంతరం విజయవాడ చేరుకుని శంకర కంటి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అదనపు సౌకర్యాలను ప్రారంభిస్తారు. ఆ తరువాత కృష్ణా జిల్లా ఆత్కూరు గ్రామంలో ఏర్పాటు చేయనున్న ప్రాథమిక చికిత్సా కేంద్రానికి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. శనివారం గుంటూరు జిల్లా పెదనందిపాడులో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్వర్ణ జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా వెంకయ్యనాయుడు పాల్గొంటారు. అనంతరం ఒమేగా ఆసుపత్రి 150 పడకల సూపర్ స్పెషాలిటీ అంకాలజీ సెంటర్‌ను ఆయన ప్రారంభించి నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ స్వర్ణ జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆదివారం ఉదయం కృష్ణా జిల్లా ఆత్కూరు గ్రామంలోని స్వర్ణభారత్ ట్రస్టు వార్షికోత్సవంలో పాల్గొని ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తారు. అదేరోజు మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో ఢిల్లీ పయనమవుతారు. కాగా, మాతృభాష పరిరక్షణకు మాతృమూర్తులందరూ నడుంబిగించాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. గురువారం ఢిల్లీలోని తన నివాసంలో ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి బృంద సభ్యులతో వెంకయ్యనాయుడు, ఆయన సతీమణి ఉషా నాయుడు ముచ్చటించారు.

జేఎన్‌టీయూ- కే ప్రొఫెసర్ బాబులు అరెస్ట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ), కాకినాడ లీగల్: తూర్పు గోదావరి జిల్లా జేఎన్‌టీయూ–కేలో ఎంటెక్ విద్యార్థినులపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రొఫెసర్ కె. బాబులును సర్పవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. విద్యార్థినుల నుంచి వచ్చిన ఫిర్యాదు ఆధారంగా జేఎన్‌టీయూ–కేలో మూడురోజులపాటు సహచర అధ్యాపకులతోపాటు విద్యార్థులను విచారించామని, విచారణ అనంతరం సెక్షన్ 354,354(ఏ),509ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ కంటిపూడి శ్రీహరి ఈ నెల 15వరకు బాబులుకు రిమాండ్ విధించారు. ఈ మేరకు కాకినాడ సబ్‌జైలుకు నిందితుడిని తరలించారు.

రాష్ట్రానికి మొండిచేయి



- చివరి బడ్జెట్‌లోనూ రాష్ట్రాన్ని కనికరించని కేంద్రం
- వెనుకబడిన జిల్లాలకు నిధులూ లేవు
- విభజన చట్టంలోని హామీలకూ దిక్కులేదు
- రాజకీయ అవసరాల కోసం సీఎం చంద్రబాబు రాజీనే కారణమా?

సాక్షి, అమరావతి: కేంద్రంపై రాష్ట్రం పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. విభజన గాయాలతో సతమతమవుతున్న రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం కనికరం చూపలేదు. రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాల ప్రస్తావనే కేంద్ర బడ్జెట్‌లో లేకుండాపోయింది. పోలవరం ప్రాజెక్టు.. రాజధాని నిర్మాణం.. రెవెన్యూ లోటు భర్తీ.. రైల్వే జోన్ ఏర్పాటు.. ఆంధ్ర ప్రజలకు అత్యంత కీలకమైన వీటిలోని ఒక్క అంశమూ బడ్జెట్‌లో కనీసం ప్రస్తావనకు కూడా నోచుకోలేదు. విభజన చట్టంలో ఇచ్చిన మిగిలిన హామీల గతీ ఇంతే. ఎన్నికల ఏడాది ముందు ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్‌లోనైనా రాష్ట్రానికి కొంత మేలు జరుగుతుందని ఆశించినా నిరాశే ఎదురైంది.

ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి పూర్తిగా అన్యాయం జరిగింది. రాష్ట్ర ప్రజల జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు నిధులిచ్చే విషయాన్ని మాటమాత్రంగానైనా జైట్లీ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటునూ పట్టించుకోలేదు. దీనిపై ఉద్యమాలు జరుగుతున్నా అవి కేంద్రానికి కనపడలేదు. రాష్ట్ర విభజన వల్ల ఏర్పడిన రెవెన్యూ లోటును భర్తీ చేయాల్సివుండగా ఆ విషయాన్ని పరిగణలోకి తీసుకోలేదు. విభజన చట్టంలో ఇచ్చిన హామీ ప్రకారం రెవెన్యూ లోటు భర్తీ బాధ్యత కేంద్రానిదే. మూడున్నరేళ్లయినా దీనిగురించి పట్టించుకోని కేంద్రం బడ్జెట్‌లోనూ అందుకు కనీస కేటాయింపులు చేయలేదు. రాజధాని నిర్మాణానికి సహకరించాల్సి ఉన్నా ఆ విషయాన్ని వదిలేసింది. విభజన చట్టం ప్రకారం జాతీయ విద్యా సంస్థల ఏర్పాటుకు ఇచ్చిన నిధులు అరకొరే. ఈ నిధులతో ఆ సంస్థలు ఎన్నేళ్లకు ఏర్పాటవుతాయో కూడా తెలియని పరిస్థితి. ముంబై, బెంగుళూరు మెట్రో రైలు ప్రాజెక్టులకు నిధులు కేటాయించి విజయవాడ, విశాఖ మెట్రో ప్రాజెక్టులను గాలికి వదిలేసింది. ప్రత్యేక హోదా అంశాన్ని మరుగునపరిచి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పినా దానికీ దిక్కులేకుండాపోయింది. ఈ ప్యాకేజీ కింద ఒక్క రూపాయి కూడా ఈ బడ్జెట్‌లో కేటాయింపు లేదు. ఈ బడ్జెట్‌లో అన్ని రకాలుగా రాష్ట్రానికి మొండిచేయే మిగిలింది.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణం

కేంద్ర ప్రభుత్వం ఇలా నిర్లక్ష్యం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణంగా కనపిస్తోంది. నిధులు, కీలక అంశాల గురించి రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా పట్టు పట్టకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించిందనే వాదన వినిపిస్తోంది. సొంత ప్రయోజనాలు చూసుకున్న రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు రాష్ట్రానికి మేలు చేసే అంశాల గురించి కేంద్రంపై ఒత్తిడి చేయలేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ సీఎం చంద్రబాబు రాజకీయ అవసరాలనే ప్రధానంగా ప్రస్తావించడంతో కేంద్రం దృష్టిలో చులకనయ్యారు. ఎంతసేపూ అసెంబ్లీ సీట్లు పెంపుపైనే దృష్టి సారించి దానికోసమే లాబీయింగ్ చేయడంతో కేంద్రం ఆయన్ను పట్టించుకోవడం మానేసింది. చివరికి ప్రత్యేక హోదాను గాలికి వదిలేసి ప్యాకేజీకి ఒప్పుకున్నా దాన్నీ గట్టిగా డిమాండ్ చేయలేకపోయారు. అవినీతి వ్యవహారాలతో పోలవరం ప్రాజెక్టు గురించి అడగలేని పరిస్థితి తెచ్చుకున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులతోపాటు, చట్టంలో రైల్వే జోను, దుగరాజపట్నంలో పోర్టు ఏర్పాటు, వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంటు ఏర్పాటు గురించి ఎన్నడూ కేంద్రంతో మాట్లాడలేదనే అభిప్రాయం రాష్ట్ర అధికార వర్గాల్లోనే వ్యక్తమవుతోంది. రాజధాని అమరావతికి సాయం చేయమని గట్టిగా అడగలేదు. చివరికి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి బడ్జెట్‌లో పైసా కేటాయింపు చేయలేదు. పైకి ఎంతో హడావుడి చేసి, అన్ని విషయాలపైనా ఒత్తిడి చేస్తున్నామని ప్రచారం చేసుకుని చివరికి రాజకీయ అంశాలపైనే ఒత్తిడి చేస్తుండడంతో రాష్ట్ర ప్రయోజనాలు గాలిలో కలిసిపోయాయి. మిత్రపక్షంగా ఉంటూ, అధికారాన్ని పంచుకుంటూ.. గత నాలుగేళ్లలో రాష్ట్రానికి ఏమీ సాధించలేదనే దానికి నిదర్శనంగా ఈ బడ్జెట్‌ను చెప్పవచ్చు.

బీజేపీ మిత్రధర్మాన్ని పాటించట్లేదు: రాయపాటి

రాజీనామాకు సిద్ధం




రాయపాటి

సాక్షి, నెట్‌వర్క్: బీజేపీ మిత్ర ధర్మాన్ని పాటించకుండా చిన్నచూపు చూస్తోందని టీడీపీ ఎంపీ రాయపాటి సాంబశివరావు వ్యాఖ్యానించారు. విభజన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకపోయినా, అణిగిమణిగి ఉంటున్నాం కదా అని లెక్కలేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గురువారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా తాను రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. బడ్జెట్ ఏపీకి నిరాశ మిగిల్చిందని కేంద్ర సహాయ మంత్రి, టీడీపీ నేత సుజనా చౌదరి అన్నారు. గురువారం ఢిల్లీలో టీడీపీ ఎంపీలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రైల్వే జోన్, రెవెన్యూ లోటు భర్తీ, రాజధానికి నిధులు, నియోజకవర్గాల పునర్విభజన తదితర పెండింగ్ అంశాలను పరిష్కరించి ఉంటే బాగుండేదన్నారు. కాగా, రాష్ట్ర మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి కూడా బడ్జెట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్ట్, రాజధాని, రైల్వేజోన్ అంశాలను బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం సరికాదని పుల్లారావు అన్నారు. గ్రామీణ వ్యవసాయ మార్కెట్లకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని సోమిరెడ్డి తెలిపారు.

అసంతృప్తే.. ఆగ్రహం వద్దు..

- బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని మాత్రమే చెప్పండి
- రాజీనామాలు, బహిష్కరణలపై ప్రకటనలు వద్దు
- ఎంపీలు, మంత్రులకు సీఎం చంద్రబాబు సూచన



సాక్షి, అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపడంపై అసంతృప్తి వ్యక్తం చేయాలే తప్ప తొందరపాటు ప్రకటనలు చేయొద్దని సీఎం చంద్రబాబు నాయుడు టీడీపీ ఎంపీలు, మంత్రులకు నిర్దేశించారు. బడ్జెట్ తీవ్రంగా నిరుత్సాహపరిచిందని, భాగస్వామ్య పక్షంగా టీడీపీకి ఇది తీవ్రమైన అంశమని, అయినప్పటికీ వెంటనే ఓ నిర్ణయానికి రాలేమని, ఆచితూచి స్పందించాల్సి ఉందని ఆయన అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి చేసిన కేటాయింపులపై గురువారం చంద్రబాబు టీడీపీ ఎంపీలు, మంత్రులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. తొలుత ఢిల్లీలో ఉన్న టీడీపీ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్డీయేలో కొనసాగడం మంచిది కాదని పలువురు ఎంపీలు చెప్పగా.. తామంతా రాజీనామాలు చేస్తామని ఉత్తరాంధ్రకు చెందిన ఓ ఎంపీ అన్నట్టు సమాచారం. రాజీనామాలకంటే ఈ బడ్జెట్ సమావేశాల్ని బహిష్కరించడం ద్వారా నిరసన తెలిపితే బాగుంటుందని మరికొందరు ఎంపీలు అభిప్రాయపడగా, కేంద్రంపై గట్టిగా ఒత్తిడి తేవాలని ఒకరిద్దరు సూచించారు. అందరి మాటలు విన్న చంద్రబాబు ఆవేశపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేమని, ఎంపీలు తొందరపాటుగా ఎక్కడా మాట్లాడవద్దని సూచించారు. ఆదివారం జరిగే టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పూర్తిస్థాయిలో చర్చించాక ఓ నిర్ణయానికి వద్దామని, అప్పటివరకు ఆచితూచి స్పందించాలన్నారు. కేంద్రమంత్రి సుజనాచౌదరితో ఆయన విడిగా మాట్లాడి ఢిల్లీ పరిణామాల గురించి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు, టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశమై బడ్జెట్‌పై ఎలా మాట్లాడాలనే దానిపై సూచనలు చేశారు. కేంద్రం రాష్ట్రాన్ని పట్టించుకోకున్నా ఎన్డీయేను టీడీపీ వదలట్లేదనే భావన ప్రజల్లో ఉందని, ఇలాంటి సమయంలో ఏదో ఒక గట్టి నిర్ణయం తీసుకోకపోతే పార్టీకి ఇబ్బంది వస్తుందని పలువురు మంత్రులు చెప్పినట్లు తెలిసింది. సీఎం స్పందిస్తూ.. కేంద్రంపై ఒత్తిడి చేయడమే మన ముందున్న మార్గమని, అంతకుమించి ఎక్కువ చేయొద్దని స్పష్టం చేశారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందనే చెప్పాలని, నేరుగా కేంద్రం, బీజేపీపై విమర్శలు చేయొద్దని సూచించారు. శుక్రవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చిద్దామని, కేంద్రమంత్రులను కలవడమా? నిరసన తెలపడమా? ఇంకా గట్టిగా ఒత్తిడి తేవడమా? అనే విషయాన్ని రెండురోజుల్లో నిర్ణయిద్దామని చెప్పారు. బీజేపీతో తెగతెంపులు చేసుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులొచ్చే అవకాశం ఉంటుందనే అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైనట్లు సమాచారం. బీజేపీని దూరం చేసుకోవడం వల్ల నష్టపోతామని, దూరదృష్టితో ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పలువురు మంత్రులు అభిప్రాయపడినట్లు తెలిసింది.

ఏపీకి తీవ్ర అన్యాయం..

- కేంద్ర బడ్జెట్ ఏపీ ఆశలను నీరుగార్చింది
- విభజన హామీలు ఒక్కటీ అమలు చేయలేదు
- వైఎస్సార్ సీపీ ఎంపీల ఆవేదన
- హామీలు సాధించుకునే వరకు పోరాడుతామని స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ కేంద్ర బడ్జెట్‌లో చేర్చకపోవడం పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లుగా హామీలు అమలవుతాయని ఎదురుచూస్తున్న ఏపీ ప్రజల ఆశలను కేంద్రం నీరుగార్చిందని వారు అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికిచ్చిన హామీలను సాధించుకునే వరకు వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని పేర్కొన్నారు. గురువారం పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం వైఎస్సార్‌సీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలు మీడియాతో మాట్లాడారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ..''కేంద్ర బడ్జెట్ ఏపీ ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించింది. విభజన చట్టంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ బడ్జెట్‌లో చేర్చలేదు. ఎన్డీయేకు ఇదే చివరి పూర్తి స్థాయి బడ్జెట్ కావడంతో ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్‌ప్లాంట్, పోలవరం పూర్తికి నిధుల మంజూరులో స్పష్టత ఇస్తుందని ఆశించాం. కానీ ఏ ఒక్క విషయంలోనూ స్పష్టత ఇవ్వలేదు. హామీలను సాధించుకునేవరకు వైఎస్సార్‌సీపీ పోరాడుతుంది. ఇప్పుడు మేం రాజీనామాలు చేస్తే హామీలపై ఎవరూ కేంద్రాన్ని ప్రశ్నించరు. తుదివరకు పోరాడి అప్పటికీ కేంద్రం తలొగ్గకపోతే అప్పుడు రాజీనామా అస్త్రాలు ప్రయోగిస్తాం'' అని స్పష్టం చేశారు. గిట్టుబాటు ధరను 1.5 శాతం పెంచినందువల్ల.. తీవ్ర కరువుతో అప్పుల ఊబిలో చిక్కుకున్న రాష్ట్రంలోని రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఏపీలో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని కేంద్రం దేశవ్యాప్తంగా అమలు చేయాలని భావిస్తోందని, ఏటా ప్రతి ఒక్కరికీ ఐదులక్షల మేరకు ఆరోగ్య బీమా కల్పించడం అభినందనీయమని అన్నారు. ఏడాదిలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామంటున్న కేంద్రం ఇప్పటివరకు కేవలం రూ.10వేల కోట్ల పని మాత్రమే చేసిందని, మరి మిగిలిన రూ.40 వేల కోట్ల పనులను ఏడాదిలో ఎలా పూర్తి చేస్తుందని మిథున్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డిలు ప్రశ్నించారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో విజయసాయిరెడ్డి, అవినాశ్‌రెడ్డి, మిథున్‌రెడ్డి

'ఏపీ ప్రస్తావన లేకపోవడం బాధాకరం'

రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం బాధాకరమని విజయసాయిరెడ్డి అన్నారు. ''చట్టంలో ఇచ్చిన 11 కేంద్రప్రభుత్వ సంస్థల్లో రెండు మినహాయించి మిగిలిన తొమ్మిదింటిని ఎప్పట్లోగా ఏర్పాటు చేస్తామన్నది చెప్పలేదు. ఈ 9 సంస్థలకు నాలుగేళ్లలో కేవలం రూ.421 కోట్లే ఇచ్చారు. వీటిని పూర్తిస్థాయిలో స్థాపించేందుకు రూ.11,267 కోట్లు అవసరమవుతాయని కేంద్రమే చెప్పింది. అలాంటిది.. అరకొరగా నిధులు కేటాయిస్తూ ఈ సంస్థలను ఎప్పట్లోగా స్థాపించాలని కేంద్రం భావిస్తోందో తెలియట్లేదు. రైల్వేజోన్ లాభదాయకం కాదని వెనకడుగు వేయడం సరికాదు. చట్టంలో ఇచ్చిన హామీని కేంద్రం అమలు చేయాల్సిందే. ఇక గ్రాస్ ఫిక్స్‌డ్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ 1.4 శాతం పడిపోవడం అభివృద్ధికి సూచిక కాదు. ప్రస్తుత ఆర్థిక స్థితిగతులను పరిశీలిస్తే కేంద్రం చెబుతున్నట్టు జీడీపీ 7–7.5 శాతం చేరుకునే పరిస్థితులు కనిపించట్లేదు. కేంద్రం ఈ ఏడాది 70 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పింది. గత నాలుగేళ్లుగా ఉపాధి కల్పనలో 1.4 శాతం తగ్గుదల ఉన్న పరిస్థితుల్లో కేంద్రం ఈ హామీని నిలబెట్టుకుంటే మా పార్టీ అభినందిస్తుంది. మద్దతు ధర కేవలం 1.5 శాతం పెంపుద్వారా రైతులకు ఆదాయం రెట్టింపుకాదు.. ఏటా 20 శాతం పెంచినప్పుడే అది సాధ్యమవుతుంది. ఈ విషయాలన్నింటిపై బడ్జెట్‌పై చర్చ సందర్భంగా పార్లమెంటులో కేంద్రాన్ని ప్రశ్నిస్తాం. విభజన హామీలను అమలు చేయకుండా కేంద్రం చేస్తున్న అన్యాయంపై టీడీపీ సమాధానం చెప్పాలి'' అని విజయసాయిరెడ్డి అన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 64,334 మంది హాజరు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి స్పెల్ కింద ఫిబ్రవరి 1 నుంచి నుంచి 5 వరకు 2,65,832 మంది ఈ పరీక్షలు రాయనున్నారు. గురువారం ఉదయం 43,385 మంది, మధ్యాహ్నం 20,949 మంది మొత్తం 64,334 మంది ప్రాక్టికల్స్‌కు హాజరయ్యారు. మొత్తం 538 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

2016 గ్రూప్-1 ఇంటర్వ్యూలు మార్చి 12 నుంచి..

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) 2016లో 78 గ్రూప్– 1 పోస్టులకు నిర్వహించిన మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ ఏడాది మార్చి 12 నుంచి 23 వరకు మౌఖిక పరీక్షలు (ఇంటర్వ్యూలు) నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి వైవీఎస్‌టీ.సాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 78 పోస్టులకు 151 మందిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేసినట్లు వివరిం చారు. ఇంటర్వ్యూలు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 వరకు విజయవాడ ఎంజీ రోడ్డులో ఇందిరాగాంధీ మున్సిపల్ కాంప్లెక్స్ ఎదురుగా న్యూహెచ్‌ఓడీల భవనం, రెండో అంతస్తులోని కమిషన్ కార్యాలయంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఇంటర్వ్యూల తేదీలను తెలియజేస్తూ ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థులకు సమాచారమిస్తామన్నారు.

'ఫీజు' భూతానికి విద్యార్థిని బలి!

పరీక్షకు అనుమతించలేదని ఆవేదనతో బలవన్మరణం



సాయిదీప్తి (ఫైల్)

హైదరాబాద్ : ఫీజుల భూతానికి మరో చదువుల తల్లి బలైపోయింది. ఫీజు కట్టలేదంటూ పాఠశాల యాజమాన్యం పరీక్షలకు అనుమతించకపోవడంతో ఆవేదనతో ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకుంది. హైదరాబాద్‌లోని మల్కాజిగిరి జేఎల్‌ఎస్ నగర్‌లో ఈ విషాదం చోటుచేసుకుంది. జేఎల్‌ఎస్ నగర్‌కు చెందిన బాలకృష్ణ, సునీత భార్యాభర్తలు. బాలకృష్ణ పెయింటర్‌గా పనిచేస్తుండగా, సునీత బోయిన పల్లిలోని ఓ సూపర్ మార్కెట్‌లో పనిచేస్తోంది. వారికి సాయిలత, సాయిదీప్తి ఇద్దరు కుమార్తెలు. సాయిలత బీటెక్ చదువుతుండగా.. సాయిదీప్తి స్థానికంగా ఉన్న జ్యోతి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఇటీవల బాలకృష్ణ ఆర్థిక ఇబ్బందులతో దీప్తి ఫీజులను చెల్లించలేకపోయాడు. ఈ క్రమంలో గురువారం నిర్వహించిన పరీక్షలకు దీప్తిని అనుమతించలేదు. దీంతో పాఠశాలకు వెళ్లిన కొద్దిసేపటికే తిరిగి ఇంటికి వచ్చింది. త్వరగా వచ్చావేమిటని అక్క అడగడంతో.. ఫీజు కట్టలేదని పరీక్ష రాయనీయలేదని బాధతో చెప్పింది. అనంతరం సాయిలత బయటికి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి.. దీప్తి ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు ముందు 'నన్ను ఎగ్జామ్ రాయనీయలేదు.. సారీ మామ్' అని దీప్తి నోట్‌బుక్‌లో రాసిపెట్టినట్లు గుర్తించారు.

బడ్జెట్ అభిప్రాయాలు..

నిరాశ కలిగించిన కేంద్ర బడ్జెట్



కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశను కలిగించింది. కర్ణాటక శాసన సభకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్రానికి బడ్జెట్‌లో మెట్రో రైలును ప్రకటించి ఎక్కువ నిధులు కేటాయించారు. ఏపీకి సంబంధించిన అంశాలను అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించకపోవడం శోచనీయం.

– యనమల రామకృష్ణుడు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి

వాణిజ్య వర్గాలకు నిరాశ

అరుణ్‌జైట్లీ ప్రవేశ పెట్టిన బడ్జెట్ వ్యాపార, వర్తక, వాణిజ్య వర్గాలను నిరాశకు గురిచేసింది. వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిమితి పెంచకపోవడం సరి కాదు. ఏపీలో అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పరిశ్రమలకు ప్రోత్సాహాలు కూడా ఇవ్వలేదు.

– వక్కలగడ్డ భాస్కరరావు, వీసీసీఐ అధ్యక్షుడు

రైల్వే జోన్‌పై సానుకూల నివేదిక ఇవ్వలేదు



కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగావృద్ధి చెందడానికి తోడ్పడుతుంది. ఏపీ విభజన చట్టంలోని ఐదు హామీలు అమలుకావాల్సి ఉంది. విభజన చట్టంలో రైల్వే జోన్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని మాత్రమే ఉంది. దీనిపై కేంద్రం వేసిన కమిటీ సానుకూల నివేదిక ఇవ్వలేదు.

– కంభంపాటి హరిబాబు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు

చంద్రబాబు నీతిబాహ్యమైన చర్యల వల్లే ఈ దుస్థితి



విభజన వల్ల నష్టపోయిన రాష్ట్రానికి కనీసం ఈ చివరి బడ్జెట్‌లోనైనా తగిన నిధులు రాబట్టలేకపోవడం పూర్తిగా చంద్రబాబు వైఫల్యమే. విశాఖ రైల్వేజోన్, రాజధాని నిర్మాణానికి ప్రత్యేక నిధులు, రెవెన్యూ లోటు భర్తీ, పోలవరం ప్రాజెక్టుకు నాబార్డు ద్వారా నిధులు.. ఇలా గత నాలుగేళ్లలోనే కాదు ఈసారి కూడా న్యాయం చేయలేకపోయారు. రాష్ట్రానికీ దుస్థితి వచ్చిందంటే అది కేవలం చంద్రబాబు నీతిబాహ్యమైన, చిల్లర పనుల వల్లే. ఓటుకు కోట్లు కేసు ఒక్కటే కాదు.. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను కార్యకర్తలకు పప్పుబెల్లాల పంచేయడం, రాజధానికి సేకరించిన భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం, పోలవరం పనుల్లో కమీషన్లకు కక్కుర్తి పడటం వంటి చర్యల వల్ల చంద్రబాబుపై కేంద్రంలో విశ్వాసం సన్నగిల్లిపోయింది.

– ధర్మాన ప్రసాదరావు,
వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్,

రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కేంద్రం ముందు తాకట్టు పెట్టారు. కర్ణాటకలో ఎన్నికల దృష్ట్యా మెట్రో రైలుకు రూ.17 వేల కోట్లు కేటాయించడం దారుణం.

– రఘువీరారెడ్డి, పీసీసీ అధ్యక్షుడు

కేంద్రం ద్రోహం చేసింది



బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసింది. విభజన చట్టంలో పేర్కొన్న రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీ వంటి వాటిని ప్రకటించలేదు. అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయించలేదు. ప్రత్యేక ప్యాకేజీ అమలుకు కూడా ఎలాంటి కేటాయింపులు చేయలేదు. .

– పి.మధు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

ప్రజా ఆందోళనలు చేపట్టాలి



విభజన చట్టంలో పేర్కొన్న హామీలకు సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ఏపీకి జరిగిన అన్యాయంపై రెండ్రోజులపాటు నిరసనలు, పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు చేపట్టాలి. సీఎం చంద్రబాబు మభ్యపట్టే మాటలు చెప్పడం మాని, అఖిలపక్షం ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి.

– కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

కార్మికులకు ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు

కేంద్ర బడ్జెట్‌లో కార్మికులకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. రాష్ట్రంలోని అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, 108, 104 వంటి తదితర స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం పెంచేందుకు చర్యలు తసుకోలేదు. లాభాల్లో నడుస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ వంటి సంస్థలను ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర చేస్తున్నారు.

– ఆర్.రవీంద్రనాథ్,
ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి

ఇది వ్యవసాయ, సంక్షేమ బడ్జెట్

కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి, సంక్షేమం, వ్యవసాయానికి పెద్ద పీట వేశారు. రూ. 250 కోట్ల లోపు టర్నోవర్ ఉన్న కంపెనీలకు కార్పొరేట్ ట్యాక్స్‌ను 25 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయం. వ్యవసాయ రంగానికి రూ. 11 లక్షల కోట్ల రుణాలు ఇవ్వనుండటం శుభపరిణామం.

– జేఎస్‌ఆర్‌కే ప్రసాద్, సీఐఐ ఏపీ చాప్టర్ చైర్మన్,
జి.సాంబశివరావు, ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రెసిడెంట్

మీకిచ్చిన అధికారం

వ్యాపారానికా?

- ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్రానికి అన్యాయం
- చంద్రబాబుపై మాజీ మంత్రి వడ్డే ధ్వజం



ఉయ్యూరు (పెనమలూరు): మంచి పాలన అందించాలని టీడీపీకి ప్రజలు అధికారమిస్తే సీఎం చంద్రబాబు మాత్రం రైతుల భూములపై వ్యాపారం చేస్తూ నియమ నిబంధనలు అతిక్రమిస్తున్నారని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లా ఉయ్యూరులోని తన నివాసంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. రైతులు, ప్రభుత్వ భూములను స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, వ్యాపారాలు నిర్వహించుకోడానికి ఇచ్చే హక్కు ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. ఇతర దేశాల్లో పర్యటిస్తూ ఏదో సాధిస్తున్నామంటూ ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం మానుకోవాలని సూచించారు. ఎప్పుడు ఏ దేశమెళ్లినా గతంలో కలిసిన ఆ పది మంది వ్యక్తులతోనే సమావేశాలు పెట్టడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కేంద్ర నిఘా వర్గాల అత్యంత గోప్య సమాచారంతోనే రాష్ట్రంలో ఏం జరుగుతుందో కేంద్రం అర్థం చేసుకుని ఆ మేరకే ప్రాధాన్యతనిస్తోందన్నారు. నవయుగ కంపెనీ ప్రయోజనాలు కాపాడేందుకే దుగరాజపట్నం పోర్టును వెలుగులోకి తీసుకొచ్చి రామయ్యపట్నం, బందరు పోర్టులను తొక్కేస్తున్నారని మండిపడ్డారు. మొదటి నుంచి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా పోరాడితే తెలుగు ప్రజలకు అన్యాయం జరిగేది కాదన్నారు. చంద్రబాబుకు ప్రైవేటు సంస్థలపై ఉన్న మోజు కేంద్ర సంస్థలను తెచ్చుకోవడంలో లేదన్నారు. లక్షలాది మంది రైతులు జన్మభూమి, మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు పెట్టుకుంటే సరిచేసే దిక్కు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ పర్యటనను మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రికి సూచించారు.

పట్టాలెక్కని రైల్వే జోన్

- నాలుగో 'సారీ' రెడ్ సిగ్నలే
- కేంద్ర బడ్జెట్‌లో ఒక్క కొత్త ప్రాజెక్టుకూ నోచుకోని ఏపీ
- పాత వాటికి నిధుల కేటాయింపు అంతంతే

సాక్షి, అమరావతి: రైల్వే జోన్ కోసం నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి నిరాశే మిగిలింది. విశాఖపట్టణం, విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లతో కలిపి విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో పార్లమెంట్ సాక్షిగా హామీ ఇచ్చినా.. రాష్ట్ర పాలకుల అనాసక్తి కారణంగానే కేంద్రం మళ్లీ మొండిచెయ్యి చూపింది. గురువారం పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి జైట్లీ ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో రైల్వే జోన్ ప్రకటించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. రాష్ట్రానికి సరుకు రవాణా కారిడార్లు, రైల్వే యూనివర్సిటీ కేటాయించలేదు. రైల్వే యూనివర్సిటీ విశాఖపట్టణానికి కేటాయించాలని గతేడాది ఎంపీలు చేసిన వినతిని పక్కనపెట్టి వడోదరకు కేటాయించింది. ఏపీకి నార్త్–సౌత్ డెడికేటెడ్ సరుకు రవాణా కారిడార్ (2,173 కి.మీ), ఈస్ట్ కోస్ట్ డెడికేటెడ్ కారిడార్ (1,100 కి.మీ.) మంజూరు చేయాలన్న వినతులూ బుట్టదాఖలే అయ్యాయి. ఏపీలో ప్రాధాన్యత ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు మొత్తం రూ.14 వేల కోట్లకు పైగా నిధులు అవసరం కాగా, ఈ బడ్జెట్‌లో కేవలం రూ.2,012 కోట్లు కేటాయించారు. గతేడాది రూ.వెయ్యి కోట్లు తక్కువగా కేటాయించడం గమనార్హం. ఏపీ రాజధాని అమరావతికి రైల్వే కనెక్టివిటీ కోసం గత బడ్జెట్‌లో రూ.2,700 కోట్లు కేటాయించగా ఈసారి ఆ ఊసే లేదు. విజయవాడలో శాటిలైట్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలనూ పట్టించుకోలేదు. పొరుగునున్న తెలంగాణలోని చర్లపల్లి స్టేషన్‌కు రూ.5 కోట్లతో శాటిలైట్ టెర్మినల్ కేటాయించారు. ఏపీలో అత్యంత ప్రాధాన్యత ప్రాజెక్టు నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ అంచనాలు పెరగకముందే నిధులు పూర్తిగా కేటాయించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఇటీవలే దక్షిణ మధ్య రైల్వే జీఎం సమావేశంలో కోరగా, ఈ బడ్జెట్‌లో రూ.340 కోట్లు మాత్రమే కేటాయించారు. విజయవాడలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు (ఆర్పీఎఫ్) శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని సీఎం హామీ ఇచ్చినా బడ్జెట్‌లో ప్రకటన లేదు.



విశాఖపట్నం రైల్వే స్టేషన్

రైల్వే బడ్జెట్‌లో ఏపీకి దక్కినవి..

- కోటిపల్లి–నర్సాపూర్ కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టుకు రూ.430 కోట్లు కేటాయింపు
- విజయనగరం–స్తంభాలపూర్ మూడోలైన్‌కు 90 కోట్లు
- నడికుడి–శ్రీకాళహస్తి కొత్త లైన్‌కు రూ. 340 కోట్లు
- కాజీపేట–విజయవాడ మూడోలైన్‌కు రూ. 100 కోట్లు
- 'నల్లపాడు–గుంతకల్' విద్యుదీకరణ రూ. 150 కోట్లు
- విజయవాడ–గుడివాడ– మచిలీపట్నం–భీమవరం–నర్సాపూర్–నిడదవోలు రైల్వేలైన్ల డబ్లింగ్ పనులకు రూ. 122 కోట్లు కేటాయింపు
- విజయనగరం–రాయగడ్–రాయపూర్ విద్యుదీకరణకు రూ.120 కోట్లు
- విజయవాడ–గూడురు మూడోలైన్‌కు రూ. 100 కోట్లు
- ఓబులవారిపల్లె–కృష్ణపట్నం కొత్త లైన్‌కు రూ. 100 కోట్లు
- గుంతకల్–బళ్లారి హోస్పేట్ విద్యుదీకరణకు రూ. 70 కోట్లు
- కడప–బెంగళూరు రైల్వేలైన్‌కు రూ. 240 కోట్లు
- కాకినాడ–పిఠాపురం కొత్త రైల్వేలైన్‌కు రూ. 150 కోట్లు

ఆమోదం లభించిన పనులు

గుంతకల్లు – కల్లూరు మార్గంలో 40 కి.మీలు విద్యుదీకరణ, ఓబులవారిపల్లి – వెంకటాచలం మధ్య 95 కి.మీల మేర కొత్త రైలు మార్గం ఏర్పాటు, దేవరపల్లి – పెనుగొండ మార్గంలో 49 కి.మీల మేర డబ్లింగ్ పనులకు బడ్జెట్‌లో ఆమోదం లభించింది. అయితే వీటికి నిధులు మాత్రం కేటాయించలేదు.

ఏపీలోని ఆదర్శ రైల్వే స్టేషన్లు..

ఆదర్శ రైల్వే స్టేషన్లలో భాగంగా ఏపీలోని వినుకొండ, గుంటూరు, మంత్రాలయం రోడ్, మచిలీపట్నం, మార్కాపూర్ రోడ్, రాజమండ్రి, ఒంగోలు, దొనకొండ, ఆదోని, విశాఖ, దువ్వాడ, బొబ్బిలి, పార్వతీపురం, కడప, తిరుపతి, విజయవాడ, విశాఖ రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయనున్నారు. రేణిగుంట, ధర్మవరం, రాజమండ్రి, తుని, బేతంచర్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. రాయనపాడు, గుంతకల్లు, పలాస, మార్కాపూర్, పాకాల, పానపాకం, నక్కనదొడ్డి, పుల్లంపేట, ఇచ్ఛాపురం, సాలూరు, కొత్తవలస, లక్కవరపు కోట, ఎస్.కోట, శివలింగాపురం, బొద్దవరం, బొర్రా గుహలు, అరకు, సిమిలిగూడ రైల్వే స్టేషన్లలో ప్లాట్‌ఫాంలు విస్తరించనున్నారు.

ఇక దేవదాయ ధర్మదాయ శాఖ

సాక్షి, అమరావతి: దేవాదాయ ధర్మాదాయ శాఖ పేరును ఇక నుంచి దేవదాయ ధర్మదాయ శాఖగా పేరు మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్ జీవో జారీ చేశారు.

డిజిటల్ తరగతులు చురుగ్గా నిర్వహించాలి

డీఈవోలకు విద్యాశాఖ కమిషనర్ ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, అమరావతి: స్కూళ్లలో డిజిటల్ తరగతులను చురుగ్గా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డిజిటల్ తరగతుల వినియోగం రాష్ట్రంలో అంతంతమాత్రమేనని 'సాక్షి'లో కథనం వెలువడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీటి నిర్వహణపై కమిషనర్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డిజిటల్ తరగతుల సమయం తదితర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు.

దుర్గమ్మ సేవలో మెక్సికో రాయబారి హరీశ్

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమం): మెక్సికో రాయబారిగా నియమితులైన పి.హరీశ్ గురువారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనదుర్గమ్మను దర్శించుకున్నారు. తొలుత ఆలయానికి విచ్చేసిన హరీశ్ దంపతులకు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



హరీశ్ దంపతులకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

జీపీఎఫ్ సమస్యల పరిష్కారానికి వాట్సప్ గ్రూప్

సాక్షి, అమరావతి: జీపీఎఫ్ చందారులు, పెన్షనర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక వాట్సప్ గ్రూప్‌ని ప్రారంభించింది. ఈ యాప్ ద్వారా పీఎఫ్, పెన్షన్ల సమస్యలను పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించింది. ఈ గ్రూప్‌లో చేరదల్చుకున్న వారు 8500603447 నెంబరుకు మెసేజ్ చేయాలని తెలిపింది.

కొల్లేరులో పక్షుల పండుగ

- 3న తాటిదోనేల పోటీ
- 4న పెలికాన్ ఫెస్టివల్
- తరలిరానున్న సినీ ప్రముఖులు

సాక్షి, అమరావతి: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కృష్ణా జిల్లా కై కలూరు సమీపంలోని కొల్లేరు 'ఆటపాక పక్షుల సంరక్షణ కేంద్రం'లో ఈనెల 4న పక్షుల పండుగ జరగనుంది. ప్రపంచ వ్యాప్తంగా 182 రకాల పక్షులు ఇక్కడికి వస్తుంటాయి. ప్రధానంగా దక్షిణాసియా దేశాల నుంచి వచ్చే పెలికాన్ పక్షి ఇక్కడి ప్రత్యేకం. ఏటా సుమారు 10 వేలకుపైగా పెలికాన్ పక్షులు వచ్చి సుమారు ఆరు నెలలపాటు ఉంటాయి. సెప్టెంబర్‌లో వచ్చే పెలికాన్ పక్షులు ఇక్కడే ఉండి సంతానోత్పత్తిని చేసుకుని ఫిబ్రవరిలో తిరిగివెళతాయి. వాటి ప్రాధాన్యతను వివరించేలా అధికార యంత్రాంగం పెలికాన్ ఫెస్టివల్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2న ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని, 3న కొల్లేరులో తాటిదోనెల పోటీ నిర్వహిస్తున్నారు. కొల్లేరులో సంప్రదాయ చేపల వేటకు ఉపయోగించే తాటిదోనెలతో పోటీ ప్రత్యేక ఆకర్షణ కానుంది. పోటీలో విజేతలకు 4న పెలికాన్ ఫెస్టివల్‌లో బహుమతులు అందించనున్నారు. ఫెస్టివల్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు అనేక పోటీలు, విజేతలకు బహుమతి ప్రధానం, ప్రముఖుల ఉపన్యాసాలు, ఫెస్టివల్‌కు తరలివస్తున్న సినీతారల ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. సినీ హీరో దగ్గుబాటి వెంకటేశ్, వందేమాతరం శ్రీనివాస్, గీతామాధురి, ధనుంజయ, ఉషా, యాంకర్ అనసూయ తదితరులు రానున్నారు.

సీమలోనే హైకోర్టు ఏర్పాటు చేయాలి

కదంతొక్కిన న్యాయవాదులు, విద్యార్థులు

లీగల్ (కడప అర్బన్)/కర్నూలు(న్యూసిటీ): రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో గురువారం న్యాయవాదులు, విద్యార్థులు ఆందోళనను ఉధృతం చేశారు. వైఎస్సార్ జిల్లా కోర్టు ఎదురుగా న్యాయవాదులు రాస్తారోకో చేశారు. అమరావతిలో తాత్కాలిక హైకోర్టును ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనకు నిరసనగా న్యాయవాదులు జిల్లా కోర్టు ప్రధాన గేటుకు తాళం వేశారు. దాదాపు గంటసేపు రాస్తారోకో చేశారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అలాగే జడ్జిలను లోపలకు వెళ్లనీయకుండా న్యాయవాదులు అడ్డుకున్నారు. రాయలసీమలోనే హైకోర్టును ఏర్పాటు చేయాలని న్యాయవాదుల జేఏసీ నేతలు ముక్తకంఠంతో నినదించారు. ఈ సందర్భంగా రాయలసీమ జేఏసీ ఉద్యమ నేతలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోకవరపు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ వినతిపత్రాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫ్యాక్స్‌లో పంపిస్తామని తెలిపారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో విద్యార్థులు కదంతొక్కారు. కర్నూలులోని కొండారెడ్డి బురుజు నుంచి రాజ్‌విహార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు నాగలక్ష్మిదేవి మాట్లాడుతూ.. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయక పోతే ప్రత్యేక రాయలసీమ ఉద్యమం వస్తుందని హెచ్చరించారు. కాగా, హైకోర్టు కోసం శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్షలు గురువారం 12వ రోజుకు చేరాయి.



కర్నూలులో హైకోర్టు కోసం ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



వర్షాభావ ప్రాంతాలకు కరువు నివారణ పథకం

వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి

సాక్షి, అమరావతి: వర్షాభావ ప్రాంతాలైన వైఎస్సార్, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో సన్న, చిన్నకారు రైతుల కోసం ఆంధ్రప్రదేశ్ కరువు నివారణ పథకం (ఏపీడీఎంపీ) అమలు చేయనున్నామని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. విజయవాడలోని ది మెట్రోపాలిటన్ హోటల్‌లో గురువారం కరువు నివారణ ప్రాజెక్ట్ విధివిధానాలపై వర్క్‌షాపు జరిగింది. ఆయా ప్రాంతాల్లో రైతులు ఏటా కరువు, తెగుళ్లు, గిట్టుబాటు ధరల లేమితో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీరి కోసం అంతర్జాతీయ వ్యవసాయ అభివృద్ధి నిధి (ఐఎఫ్ఏడీ) సాయంతో ఐదేళ్లపాటు ఏపీడీఎంపీ అమలు చేయనున్నామని పేర్కొన్నారు. ఐదు జిల్లాల్లోని 105 మండలాల పరిధిలో 315 గ్రామపంచాయతీల్లో 1.65 లక్షల కుటుంబాలకు ప్రయోజనం ఉంటుందన్నారు. దీనికోసం రూ.1042 కోట్లు కేటాయిస్తామన్నారు.

ఈడీ కేసులో ఆదిత్యనాథ్ దాస్‌కు ఊరట

- అభియోగాల ప్రక్రియ నాలుగు వారాల పాటు నిలుపుదల
- వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు
- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్ : జగన్ కంపెనీల్లో పెట్టుబడుల వ్యవహారానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి ఆదిత్యనాథ్ దాస్‌కు ఊరట లభించింది. ఈ కేసులో ఆదిత్యనాథ్ దాస్‌పై నాలుగు వారాలపాటు అభియోగాలు నమోదు చేయవద్దని ఈడీ ప్రత్యేక కోర్టును హైకోర్టు ఆదేశించింది. అంతేకాక, వ్యక్తిగత హాజరు నుంచి సైతం ఆయనకు మినహాయింపునిచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. తనపై సీబీఐ చార్జిషీట్ ఆధారంగా ఈడీ నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ ఆదిత్యనాథ్ దాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ విచారణ జరిపారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఇండియా సిమెంట్స్‌కు నీటి కేటాయింపుల వ్యవహారంలో పిటిషనర్ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తున్న ఈడీ అందుకు సంబంధించి ఎటువంటి ఆధారాలను చూపలేదన్నారు. ఆధారాలను పరిశీలించకుండానే ఈడీ ప్రత్యేక కోర్టు.. ఈడీ దాఖలు చేసిన ఫిర్యాదును విచారణ నిమిత్తం పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్–3 కింద నేరానికి పాల్పడ్డారని ఆరోపిస్తున్న ఈడీ ఇప్పటివరకు ఆ ఆరోపణలను రుజువు చేసే ఆధారాలను మాత్రం చూపలేదని వివరించారు. నీటి కేటాయింపులన్నీ కూడా నిబంధనల ప్రకారమే జరిగాయన్నారు. సీబీఐ చేసిన ఆరోపణలనే ఈడీ సైతం చేసిందని, పిటిషనర్ తప్పు చేసినట్లు సీబీఐ కూడా ఇప్పటివరకు ఆధారాలను చూపలేకపోయిందన్నారు. కింది కోర్టులో విచారణ ప్రక్రియను నిలిపేయడంతో పాటు వ్యక్తిగత హాజరు నుంచి ఆదిత్యనాథ్ దాస్‌కు మినహాయింపునివ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అభియోగాల నమోదు ప్రక్రియను నాలుగు వారాల పాటు నిలుపుదల చేయడంతో పాటు, వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపునిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

సీటీపీసీ లక్ష్మీప్రసాద్‌కు రిమాండ్

ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆస్తుల విలువ రూ.6.27 కోట్లు

ఆరిలోవ (విశాఖ తూర్పు): ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న కేసులో వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ జి.లక్ష్మీప్రసాద్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీఎస్పీ రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. విజయవాడలో వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు వచ్చిన సమాచారంతో ఏసీబీ అధికారులు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో బుధవారం దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇక్కడి ఏసీబీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో లక్ష్మీప్రసాద్ ఆస్తుల చిట్టాను డీఎస్పీ వివరించారు. కొన్ని పద్దులు మినహాయించగా ఆయన మొత్తం ఆస్తుల విలువ ప్రభుత్వ ధరల ప్రకారం రూ 6.27 కోట్లు ఉంటుందన్నారు. బంగారు ఆభరణాలు, పలుచోట్ల స్థలాలు, నివాసాలు, ప్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయన విశాఖ ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడం, ఇక్కడ కూడా అక్రమ ఆస్తులున్నట్లు గుర్తించడంతో విశాఖలోనే కేసు నమోదు చేశామన్నారు. లక్ష్మీప్రసాద్‌ను గురువారం అరెస్టుచేసి 14 రోజుల పాటు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ ఆస్తులు ఆయన మొదటి భార్య అలివేలు, రెండో భార్య మల్లితోపాటు పలువురు బినామీల పేర్లతో ఉన్నట్లు గుర్తించామన్నారు. బ్యాంకు లాకర్ల నుంచి బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిజానికి ఆయన సర్వీసులో రూ1.35 కోట్లకు మించి ఆదాయం ఉండకూడదని.. కానీ, అదనంగా సుమారు రూ.5 కోట్లు కూడబెట్టినట్లు చెప్పారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి ఘోర పరాభవం

- వైఎస్సార్ సీపీ నేతల ఆవేదన
- కళ్లుండీ చూడలేని పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ధ్వజం
- రైల్వేజోన్ విషయంలో కేంద్రం ఉత్తరాంధ్రను మోసం చేసింది
- గుడివాడ అమరనాథ్



శంకర్ విలాస్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టిన వైఎస్సార్‌సీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి, చిత్రంలో పార్టీనేతలు



మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్. చిత్రంలో పార్టీ నేతలు అమర్‌నాథ్, తైనాల, వంశీకృష్ణ, గొల్ల బాబూరావు, ధర్మశ్రీ తదితరులు

పట్నంబజారు(గుంటూరు)/డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ)/విజయవాడ: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులకు సంబంధించి రాష్ట్ర చరిత్రలోనే ఇంతటి ఘోర పరాభవం ఏనాడూ జరుగలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు మండిపడ్డారు. విభజన హామీల విషయంలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయన్నారు. ఈ బడ్జెట్‌లోనైనా విశాఖ రైల్వేజోన్ ప్రకటిస్తారని వేయి కళ్లతో ఎదురు చూసిన ఉత్తరాంధ్ర ప్రజలకు కేంద్రం మొండిచేయి చూపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో గురువారం వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇస్తామని, నిధులు కుమ్మరిస్తామని చెప్పిన బీజేపీ నేతలు ఈవిధంగా చేతులెత్తేయడం సరికాదన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా సీఎం చంద్రబాబు కళ్లుండీ చూడలేని విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. యథేచ్ఛగా విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తున్నా నోరు మూసుకుని కూర్చోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు బందా రవీంద్రనాథ్, నూనె ఉమామహేశ్వరరెడ్డి, గనిక ఝాన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జోన్ సాధించే వరకు పోరాటం ఆగదు

విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలంటూ జీవీఎంసీ గాంధీ విగ్రహం సాక్షిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి ఒక రోజు దీక్ష చేపట్టింది. పార్టీ నగర అధ్యక్షుడు మళ్ల విజయ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన దీక్షలో నగరం నుంచే కాక జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. రైల్వేజోన్ విషయంలో నాలుగేళ్లు మోసం చేసిన కేంద్ర ప్రభుత్వం చిట్టచివరి బడ్జెట్‌లోనైనా ప్రకటన చేస్తుందని వేయి కళ్లతో ఎదురు చూసిన ఉత్తరాంధ్ర ప్రజానీకానికి మొండి చెయ్యి చూపిందంటూ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. జోన్ సాధించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైల్వేజోన్‌పై చంద్రబాబు పెదవి విప్పకపోవడం శోచనీయమన్నారు. రాజ్యసభలో వైఎస్సార్ సీపీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి విశాఖకు చెందిన డ్రెడ్జింగ్ కార్పొరేషన్, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వేజోన్‌పై ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆశీల్‌మెట్ట ఫ్లైఓవర్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం రాస్తారోకో నిర్వహించారు. దీక్షలో ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు, పలు నియోజకవర్గ సమన్వయకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఎం ఆందోళన

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం విజయవాడలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగింది. పార్టీ కార్యకర్తలు, నాయకులు కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా బీసెంట్ రోడ్డులో ధర్నా, రాస్తారోకో చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని సీపీఎం నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేశారు. ఈ ఆందోళనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు పార్టీ రాజధాని ప్రాంత కన్వీనర్ సిహెచ్.బాబూరావు, కృష్ణాజిల్లా నాయకులు దోనేపూడి కాశీనాథ్, డి.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

• జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడిగా దేరంగుల ఉదయ్‌కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వివిధ రాష్ట్రాల బీసీ ప్రతినిధుల సమావేశం గురువారం హైదరాబాద్‌లోని జూబ్లిహిల్స్‌లో నిర్వహించారు. ప్రతినిధులంతా ఉదయ్‌కిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


సాక్షి
శుక్రవారం, ఫిబ్రవరి, 2

జైట్లీ పల్లెబాట

చాన్నాళ్లకు కేంద్ర బడ్జెట్ పల్లెబాట పట్టింది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంత ఓటర్ల ఆగ్రహాన్ని పసిగట్టడం వల్లకావొచ్చు... మరి కొన్ని నెలల్లో ప్రారంభం కాబోతున్న అసెంబ్లీ ఎన్నికల పరంపరను దృష్టిలో పెట్టుకుని కావొచ్చు... లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు జరిపే ఉద్దేశంతో కావొచ్చు–ఈ బడ్జెట్ పల్లెసీమలపైనా, వ్యవసాయంపైనా ప్రధానంగా దృష్టి పెట్టింది. అలాగే కీలకమైన ఆరోగ్య బీమా ప్రతిపాదన చేసింది. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ గురువారం పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెడుతూ వ్యవసాయ దిగుబడులకైన వ్యయంపై 50 శాతం అదనంగా లెక్కేసి కనీస మద్దతు ధరను నిర్ణయిస్తామని ప్రకటించారు. ఇప్పటికే రబీ దిగుబడులకు అమల్లో ఉన్న ఈ విధానం ఇకపై ఖరీఫ్‌కు కూడా వర్తింపజేస్తామన్నారు. అలాగే రూ. 2,000 కోట్లతో అగ్రి మార్కెట్ మౌలిక సదుపాయాల నిధి ఏర్పాటు, పంట రుణాలను రూ. 10 లక్షల కోట్ల నుంచి రూ. 11 లక్షల కోట్లకు పెంచడం, కౌలు రైతులకు రుణ సదుపాయం వంటివి కూడా ఇందులో ఉన్నాయి. స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో వ్యవసాయం వాటా 14 శాతం. ఇప్పటికీ గ్రామసీమల్లో అత్యధికులకు ఉపాధి కల్పిస్తున్నది సాగురంగమే. ఆ కోణంలో ఈ రంగంపై దృష్టి సారించడం హర్షించదగినదే. అయితే పంటకయ్యే వ్యయాన్ని ఏ ప్రాతిపదికన లెక్కేస్తారన్నది కీలకం. అందులో ఎరువులకయ్యేదే చాలా ఎక్కువ. విత్తనాలు, పురుగుమందులు, నీటిపారుదల వ్యయం, కూలీల వేతనాలు, కౌలు వంటి ఇతర ఖర్చులుంటాయి. చాలా ప్రాంతాల్లో రైతులు భూగర్భ జలాలపై ఆధారపడాల్సి వస్తుంది. సరైన విద్యుత్ సదుపాయం లేనిచోట మోటార్లకు డీజిల్ వినియోగం తప్పనిసరి. ఈ వ్యయాన్నంతటినీ పరిగణించి దిగుబడి ఖర్చును లెక్కేసినప్పుడే రైతుకు ప్రయోజనం ఉంటుంది. కనీస మద్దతు ధరకు ప్రభుత్వానికి పంటను అమ్మే రైతులు కేవలం 6 శాతం మాత్రమే. మిగిలినవారంతా దళారులకు తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ఈ దళారీ వ్యవస్థను సమర్థవంతంగా అరికట్టినప్పుడే రైతులకు మేలు జరుగుతుంది. సాగు రంగ సంక్షోభంవల్ల ఏటా వేలాదిమంది రైతులు ప్రాణాలు తీసుకుంటున్నారు.

పది కోట్ల పేద కుటుంబాల ఆరోగ్యావసరాలను తీర్చగలదంటున్న జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకాన్ని (ఎన్‌హెచ్‌పీఎస్) కూడా ఈ బడ్జెట్‌లో ప్రకటించారు. వాస్తవానికి ఇది పాత పథకమే. పాత పథకం కింద కుటుంబానికి లక్ష రూపాయల వరకూ ఆరోగ్య బీమా కల్పిస్తే, ఆ పరిమితిని ఇప్పుడు రూ. 5 లక్షలకు పెంచారు. అయితే ఈ పథకం విధివిధానాలెలా ఉంటాయో చూడాల్సి ఉంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూపకల్పన చేసి సమర్థవంతంగా అమలు చేసిన ఆరోగ్యశ్రీ పథకం నిరుపేద వర్గాలకు అత్యున్నత వైద్య సేవలను చేరువ చేసింది. తర్వాత కాలంలో ఆ పథకాన్ని వేరే రాష్ట్రాలు కూడా అనుసరించాయి. కేంద్ర పథకం ఆ స్థాయిలో ఉంటేనే పేద కుటుంబాలకు మేలు కలుగుతుంది. ఈసారి బడ్జెట్‌లో ఆరోగ్యరంగానికి కేటాయించింది రూ. 52,800 కోట్లు. ఇది గత బడ్జెట్‌కన్నా రూ. 5,448 కోట్లు... అంటే 11.5 శాతం మాత్రమే ఎక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలను పటిష్టం చేసి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చిన్న చిన్న వ్యాధులకిచ్చే ఔషధాలు అక్కడ లభ్యమయ్యేలా చూడాలన్న ఆలోచన మెచ్చదగ్గదే అయినా దీనికి కేటాయించిన మొత్తం రూ. 1,200 కోట్లు చాలా స్వల్పం. క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం నిమిత్తం రూ. 600 కోట్లు కేటాయింపు మంచి నిర్ణయం. ఈ పథకంకింద చికిత్స చేయించుకుంటున్న సమయంలో రోగికి నెలకు రూ. 500 ఇస్తారు. ఇది సక్రమంగా అమలయ్యేలా చూస్తే ఆ రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నిరుడు ప్రకటించిన జాతీయ ఆరోగ్య విధానం 2025నాటికి జీడీపీలో 2.5 శాతం వ్యయం చేయడం గురించి మాట్లాడింది. అంతేకాదు... పేదరికం విస్తరించడానికి గల ప్రధాన కారణాల్లో ఆరోగ్యానికి పెట్టే అపరిమిత ఖర్చు కూడా ఒకటని గుర్తించింది. మన దేశంలో 61 శాతం మరణాలకు కేన్సర్, మధుమేహం, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులే కారణం. ఇవి వ్యక్తులు, కుటుంబాలను మాత్రమే కాదు.. ఉత్పాదకతను కూడా దెబ్బతీస్తున్నాయి. తాజా బడ్జెట్‌లో ప్రకటించిన ఎన్‌హెచ్‌పీఎస్‌కూ, ఇప్పటికే అమలవుతున్న కుటుంబసంక్షేమ పథకాల అమలుకూ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీ)ను సాధించడానికీ ప్రస్తుత కేటాయింపులు ఏమాత్రం సరిపోవు.

బడ్జెట్ రాబోతుందనగానే కోట్లాదిమంది వేతన జీవులందరూ ఎదురుచూసేది ఆదాయం పన్ను మినహాయింపుల గురించే. కానీ అరుణ్ జైట్లీ వారి విషయంలో చాలా నిర్దయగా వ్యవహరించారని చెప్పాలి. చాన్నాళ్ల తర్వాత స్టాండర్డ్ డిడక్షన్ విధానం ప్రవేశపెట్టి దాన్ని రూ. 40,000గా నిర్ణయించినా ఇప్పుడున్న రవాణా, వైద్య చికిత్స వ్యయాలకిచ్చే రూ. 34,200 మినహాయింపును రద్దు చేశారు. పైగా ఆదాయంపన్నుపై చెల్లించే సెస్సు 3 శాతాన్ని 4 శాతానికి పెంచారు. ఏతావాతా ఉద్యోగులకు లభించేది అతి స్వల్పం. రూ. 250 కోట్ల టర్నోవర్ కంటే తక్కువ ఉన్న పరిశ్రమలకు 25 శాతం ఆదాయంపన్ను రాయితీ ఇవ్వడం హర్షదాయకం. అయితే షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ అమ్మితే వచ్చే లాభాలపై 10 శాతం పన్ను విధింపు ప్రతిపాదన మదుపుదార్లను నిరుత్సాహపరుస్తుంది. అంతిమంగా అది కార్పొరేట్‌లపై ప్రభావాన్ని చూపుతుంది. ఉత్పాదకత పెంపుపై దృష్టి సారించి ద్రవ్యలోటు తగ్గించడానికి బదులు మన ప్రభుత్వాలు పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా దాన్ని సాధించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ బడ్జెట్‌లోనూ అది కనబడుతుంది. ఇక రెండు తెలుగు రాష్ట్రాలకూ ఈ బడ్జెట్‌లో దక్కింది శూన్యం. ఆంధ్రప్రదేశ్‌కు వరసగా నాలుగోసారి విశాఖ రైల్వే జోన్ విషయంలో వాగ్దానభంగం జరిగింది. పోలవరం, కడప స్టీల్‌ప్లాంట్, దుగరాజపట్నం పోర్టు వగైరాల ప్రస్తావనే లేదు. అమరావతి ఊసే లేదు. ఇటు తెలంగాణ పరిస్థితి కూడా అందుకు భిన్నంగా లేదు. కాళేశ్వరం, మిషన్ భగీరథ, ఎయిమ్స్‌లకు చోటు దక్కలేదు. సారాంశంలో ఇది ఎవరినీ పూర్తిగా సంతృప్తిపరచలేని బడ్జెట్‌గా మిగిలిపోయింది.



బడ్జెట్ అనేది కేవలం అర్థాల్య సేకరణ మాత్రమే కాదు. అది మనం పాటిస్తున్న విలువల, ఆకాంక్షల వ్యక్తీకరణ.

– జాకబ్ ల్యూ
శ్రీ రాజకీయ నేత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి బ.విదియ ప. 3.54 వరకు, తదుపరి తదియ, నక్షత్రం మఖ సా.4.00 వరకు, తదుపరి పుబ్బ, వర్జ్యం రా.11.42 నుంచి 1.15 వరకు దుర్ముహూర్తం ఉ.8.48 నుంచి 9.33 వరకు, తదుపరి ప.12.34 నుంచి 1.20 వరకు, అమృతఘడియలు ప. 1.43 నుంచి 3.14 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం : 5.50
రాహుకాలం : ఉ.10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

నమాజ్ వేళలు

ఫజర్ : 5.33
జొహర్ : 12.30
అసర్ : 4.36
మగ్రీబ్ : 6.12
ఇషా : 7.26

రైతుకు చోటెక్కడ?





యోగేంద్ర యాదవ్

ఏమాత్రం రాజకీయ సంకల్పం లేకపోతే ఇలాగే ఉంటుంది. ఈ బడ్జెట్ రైతులకు ఎంతో కొంత మేలు చేస్తుందని ఎదురుచూసినవారికి దింపుడు కళ్లం ఆశలే మిగిలాయి. ఇలా ఆశ పెట్టుకోవడానికి కారణాలు లేకపోలేదు. అందులో మొదటిది– వ్యవసాయం పరిస్థితి ఎంతమాత్రం ఆశాజనకంగా లేదన్న వాస్తవాన్ని ఆర్థిక సర్వే గుర్తించింది. ఈ పరిస్థితితో సేద్యం భవిష్యత్తు మరింత క్లిష్టతరం కాగలదని కూడా సర్వే అంగీకరించింది. రెండు– గడచిన ఆరు మాసాలుగా దేశంలో పలుచోట్ల రైతాంగ ఆందోళనలు మిన్నంటు తున్నాయి. ఇది రైతుల ఆగ్రహాన్ని ప్రతిబింబించే పరిణామమే. మూడు– గ్రామీణ ప్రాంతాలవారు అసంతృప్తికి లోనైతే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో ఈ బడ్జెట్ పరిగణనలోనికి తీసుకుంటుందని అంతా ఆశ పడ్డారు. పోనీ ఇవేమీ కాకున్నా, వచ్చే ఎన్నికల కోసమైనా తాజా బడ్జెట్ రైతులు కంటున్న కొన్ని కలలను నెరవేరుస్తుందని అంతా ఎదురుచూశారు.


ఇలాంటి ఎదురుచూపులకు ఇంకొన్ని కారణాలు కూడా దోహదం చేశాయి. మధ్యప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'భవంతార్ యోజన' పథకాన్ని దేశ వ్యాప్తంగా విస్తరిస్తారని చాలా నివేదికలు వెల్లడించాయి. కేంద్ర, రాష్ట్రాల మద్దతుతో 'మార్కెట్ జోక్యం కలిగిన పథకం' అమలు చేస్తారని కూడా నివేదికలు వచ్చాయి. బేషరతుగా లేదా పాక్షికంగా రుణమాఫీ పథకాన్ని ప్రభుత్వం ప్రకటిస్తుందని కూడా చాలామంది ఆశించారు. సేద్యానికి అయిన వ్యయానికి యాభయ్ శాతం కలిపి, దిగుబడులకు హామీగా ప్రభుత్వం ధరలు ప్రకటిస్తుందని కూడా చాలామంది భావించారు. నిజానికి ఇలాంటి ధరల హామీ బీజేపీ తన ఎన్నికల ప్రణాళికలో ప్రకటించింది. అంతేకాకుండా చాలాకాలం నుంచి ఈ హామీని ఎటూ తేల్చకుండా ఉంచింది. దీనికే ఇప్పుడు మోక్షం వస్తుందని ఆశించారు. ఇన్ని అంశాల గురించి ఎదురుచూసినప్పటికీ అందులో ఒక్కటి కూడా సంతృప్తికరంగా లేదు. ఈ బడ్జెట్‌కు మనం పది మార్కులు వేయాలని నిర్ణయించారు. అయితే ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగాన్ని ముగించాక ఎన్ని మార్కులు సాధించారో మనకే అర్థం కాలేదు. నాలుగు అంశాలు భారత రైతాంగానికి ఎంతో కీలకమైనవి. అయినా కూడా వాటి గురించిన ప్రస్తావనే లేదు. అవి– బీమా, పంటలకు నష్ట పరిహారం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సాగు నీటి వ్యవస్థ. మొత్తం బడ్జెట్‌లో జరిగిన కేటాయింపులను గమనించిన తరువాత ఆ నాలుగు అంశాలను ఆర్థికమంత్రి ప్రస్తావించలేదన్న సంగతి తెలుస్తుంది. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి చట్టబద్ధంగా కనీసం జరగవలసిన కేటాయింపు మొత్తం రూ. 80,000 కోట్లు. ఇక పంటల నష్టపరిహారం, సాగునీటి వ్యవస్థలకు జరిగే కేటాయింపులు మామూలే. అలాగే ప్రధాని ఫసల్ బీమా యోజన అంత ప్రోత్సాహకరంగా లేదు. మొత్తంగా సేద్యానికి కేటాయించిన బడ్జెట్‌లో 13 శాతం పెరిగింది. మొత్తం బడ్జెట్‌లో కూడా సేద్యం వాటా అంతే. అయితే ఈ పెంపు రైతాం గానికి ఏ విధంగా ఊతం ఇవ్వగలదు? మత్స్య, పశుసంవర్ధక శాఖకు, గ్రామీణ మండీల మెరుగుదలకు ప్రకటించిన సానుకూల చర్యలు మేలు చేకూర్చే ఆలోచనే. అయితే మిగిలిన రంగాలకు ప్రభుత్వం ఇచ్చిన చేయూతతో చూస్తే ఇది తక్కువ. నిజం చెప్పాలంటే భారతీయ రైతాంగం కోరుకుంటున్న చేయూత ఈ స్థాయిలోది కాదు. గడచిన ఏడెనిమిది మాసాలుగా భారతీయ రైతాంగం ఆందోళనలు చేస్తూ, సంఘర్షించడానికి వెనుక ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. వారు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు రావాలనీ, రుణ బాధ నుంచి విముక్తం కావాలనీ వారు కోరుకుంటున్నారు. సరిగ్గా ఈ విషయంలోనే రైతాంగం మనసును తాజా బడ్జెట్ తీవ్రంగా గాయపరిచింది. పూర్తిస్థాయిలో లేదా పాక్షికంగా గానీ, షరతులతో కూడిన లేదా బేషరతుగా గానీ రుణ మాఫీ గురించి ఈ బడ్జెట్‌లో ప్రకటించలేదు. బ్యాంకుల ద్వారా కార్పొరేట్ సంస్థలకు, చిన్న పరిశ్రమలకు రుణమాఫీ ప్రకటించిన ప్రభుత్వం రైతుల విషయంలో మాత్రం అలాంటి ఔదార్యం చూపకపోవడంతో వారి మనోభావాలు తీవ్రస్థాయిలో గాయపడినాయి.

రైతులను పెద్దగా నిరాశపరిచిన మరొక అంశం– దిగుబడుల ధరల గురించి ప్రభుత్వం చేసిన అట్టహాసపు ప్రకటన. సేద్యపు ఖర్చులు + 50 శాతం కలిపి రైతులకు భరోసాగా ధర నిర్ణయిస్తామని బీజేపీ తన ఎన్నికల ప్రణాళికలో చేసిన ప్రకటనను నెరవేరుస్తున్నట్టుగానే పటాటోపంగా ఆర్థిక మంత్రి ఈ ప్రకటన చేశారు. కానీ ఈ ప్రకటనలో అంత పస లేదని ఆర్థిక మంత్రికి కూడా బాగా తెలుసు. నిజానికి సేద్యపు వ్యయం + 50 శాతం అనే సూత్రాన్ని ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదించింది. దీని స్వరూపం గురించి ఆ కమిషన్ ఎలాంటి శషభిషలు లేకుండా వివరించింది కూడా. ఇక్కడ వ్యయం అంటే సమగ్ర వ్యయం. అంటే, చెల్లించిన మొత్తం, కుటుంబం అందించిన శ్రమ, కౌలు అద్దె, కౌలు వడ్డీ. సాంకేతిక పరిభాషలో దీనినే సీ2 అంటారు. అలాగే రైతులు కనీస మద్దతు ధరను ఎలా పొందగలరు అన్న కీలక ప్రశ్న జోలికి కూడా ఆర్థికమంత్రి వెళ్లలేదు. మొత్తంగా గమనిస్తే ఈ బడ్జెట్ ఇస్తున్న సందేశం సుస్పష్టమే. రైతుల దయనీయ స్థితిని ఈ ప్రభుత్వం పట్టించుకోదు. అలాంటి ఉద్దేశం కూడా లేదు. రైతులకు ఎటువంటి మేలు చేయకున్నా వారి ఓట్లు తమకే దక్కుతాయన్న ధోరణిలో ఈ ప్రభుత్వం ఉంది. రైతుల కోణం నుంచి ఈ బడ్జెట్‌ను పరిశీలిస్తే రాజకీయ సంకల్పం కాస్త కూడా లేని వాస్తవం తెలుస్తుంది. ఇక వ్యవసాయం చేయాలా వద్దా అనేది రైతులు నిర్ణయించుకోవాలి. ఇదికాకుండా వారికి మిగిలివున్న ఏకైక మార్గం ఆందోళన బాట పట్టడమే.

వ్యాసకర్త స్వరాజ్ అభియాన్, జైకిసాన్ సంస్థల్లో సభ్యులు
మొబైల్ : 98688 88986



చేదునిజాల చివరి బడ్జెట్



ఎన్. వేణుగోపాల్

మూడింట రెండు వంతుల జనాభా ఉన్న మహిళల, పిల్లల సంక్షేమానికి కేటాయించినది రూ. 1,84,632 కోట్లు, పదహారు శాతం జనాభాగా ఉన్న షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి ఇస్తున్నది రూ. 52,393 కోట్లు. రక్షణ కేటాయింపులు రూ. 2,82,114 కోట్లు అంటేనే ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏమిటో అర్థమవుతుంది.

వచ్చే ఎన్నికలకు (2019) ముందు కేంద్ర ప్రభుత్వానికి మరొక బడ్జెట్ ప్రవేశపెట్టడానికి అవకాశం ఉంది. అయినా అది కొద్దికాలానికి మధ్యంతర బడ్జెటే అవుతుంది. కనుక, ఈ బడ్జెటే ఎన్‌డీఏ ప్రభుత్వపు చివరి పూర్తి బడ్జెట్. అందువల్లనే ఈ బడ్జెట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, అత్యధిక సంఖ్యాక వోటర్లయిన గ్రామీణ, వ్యవసాయ రంగ ప్రజలను ఉద్దేశించి, వారిని ఆకర్షించడానికి తయారయింది. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెద్దనోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను వంటి విధానాల పర్యవసానాల గురించి, దుష్పరిణామాల గురించి, వాటిని పరిష్కరించడానికి అవసరమైన చర్యల గురించి మాట మాత్రం కూడ ప్రస్తావించకుండా, ఆ తప్పుడు విధానాలు కూడ సత్ఫలితాలను సాధించాయని గొప్పలు చెప్పుకోవడం కళ్ల ముందు కనిపిస్తున్న చేదు నిజాల్ని దాచిపెట్టే ప్రయత్నమే. అదానీలకు, అంబానీలకు అనుకూలమైన విధానాలు అమలుచేస్తూ అవినీతి రహిత భారతదేశాన్ని నిర్మించడంలో ముందడుగు వేస్తున్నామని ప్రకటించడం తడిగుడ్డతో గొంతు కోయడమే. వృద్ధిరేటు ఎనిమిది శాతానికి పెరగబోతున్నదని చేసిన గంభీరమైన ప్రవచనాలను అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు కూడ అంగీకరించకపోవడం ఒక ఎత్తయితే, వృద్ధిరేటు ఎంత పెరిగినా వాస్తవికంగా ప్రజాజీవనానికి అది ఏ మేలూ చేయడం లేదనేది మరొక కీలకమైన అంశం.

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, ఉపాధికల్పన, మధ్యతరహా, చిన్న, సూక్ష్మ పరిశ్రమల రంగాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని ప్రకటించిన అరుణ్ జైట్లీ బడ్జెట్ ఉపన్యాసంలోని అంకెల గారడీని, అబద్ధాలను, అతిశయోక్తులను విప్పి చూస్తే వాస్తవంగా ఆ రంగాలకు ఒరిగినదేమీ లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం మా లక్ష్యం అని గత బడ్జెట్లలో చెప్పిన పాత వాగ్దానాన్నే పునరుక్తి చేయడం మినహా, ఆ వాగ్దానానికి గత మూడున్నర సంవత్సరాలలో ఏమి జరిగిందో కనీసం సమీక్షించుకోవాలని కూడ ఆర్థిక మంత్రి అనుకోలేదు. వ్యవసాయ రంగానికి ఏదో ఒరగబెడుతున్నట్టు నటించి, భారీ అంకెల మాయ చేసి వ్యవసాయ రంగపు వోటర్లను ఆకర్షించడానికి బడ్జెట్ ప్రయత్నించింది. కాని వాగ్దానం చేసిన పదిలక్షల కోట్ల రూపాయల రుణాలు, అరవై రోజుల వడ్డీమాఫీ వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించగలవా అనే ప్రశ్న లేదు. గత సంవత్సరం ఎనిమిదిన్నర లక్షల కోట్ల రూపాయల రుణాలు, ఇదే స్థాయిలో వడ్డీ మాఫీ ఉండినప్పటికీ రైతుల ఆత్మహత్యలు ఎందుకు నిర్విరామంగా జరిగాయో, వ్యవసాయ రంగ సమస్యలను పరిష్కరించడానికి నిజంగా ఏమి చేయవలసి ఉన్నదో చర్చ లేదు. గిట్టుబాటు ధరలు అందకపోవడంతో ఇబ్బందుల పాలవుతూ దేశం దృష్టిని ఆకర్షించిన కాయగూరల, ప్రధానంగా బంగాళాదుంప, టమాటా, ఉల్లిపాయ రైతులను ఆదుకోవడానికి, ఆపరేషన్ గ్రీన్స్ అనే ఆకర్షణీయమైన పేరుతో ప్రకటించిన పథకానికి రు. 500 కోట్లు మాత్రమే కేటాయించడం జరిగిందంటే ప్రభుత్వ ప్రకటనలకూ ఆచరణకూ మధ్య హస్తిమశకాంతరం తేటతెల్లమవుతుంది. 2019 నాటికి ఒక కోటి మంది గ్రామీణులను దారిద్ర్యరేఖ నుంచి తప్పిస్తామని, గ్రామీణాభివృద్ధికి రు. 3 లక్షల కోట్లు వెచ్చించబోతున్నామని, గ్రామీణ ప్రాంతాలలో ఇళ్లు లేని వారికి ఒక కోటి ఇళ్లు నిర్మించబోతున్నామని చేసిన వాగ్దానాలను కూడ ఆపరేషన్ గ్రీన్స్ ఉదాహరణ నేపథ్యంలోనే చూడాలి.

ఓట్లు దండుకోవడానికి వాగ్దానాలు, అవసరమైన రంగాలకు తక్కువ కేటాయింపులు, సంక్షేమ రంగాలకు కేటాయించిన నిధులను కూడ ఇతర రంగాలకు మళ్లించడం, అనవసరమైన, తమకు ముడుపులు దక్కే, తమ ఆశ్రితులకు కాంట్రాక్టులు దక్కే రంగాలకు ఇబ్బడి ముబ్బడి కేటాయింపులు చేసి, అంతకన్న ఎక్కువ కూడ వెచ్చించడం అనే భారత బడ్జెట్ల నిత్య స్వభావానికి ఈ బడ్జెట్ కూడ అద్దం పడుతున్నది. దేశంలో మూడింట రెండు వంతుల జనాభా ఉన్న మహిళల, పిల్లల సంక్షేమానికి ఈ బడ్జెట్ కేటాయించినది రూ. 1,84,632 కోట్లు, పదహారు శాతం జనాభాగా ఉన్న షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి ఇస్తున్నది రూ. 52,393 కోట్లు కాగా రక్షణ శాఖ కేటాయింపులు రూ. 2,82,114 కోట్లు అంటేనే ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏమిటో అర్థమవుతుంది. ఇటువంటి దీర్ఘకాలిక, సామాజిక, స్థూల స్థాయి తప్పుడు ప్రాధాన్యతలు మాత్రమే కాదు, సంకుచిత, తాత్కాలిక, వ్యక్తిగత, సూక్ష్మ స్థాయిలో కూడ స్వార్థాన్ని, అల్పత్వాన్ని బైటపెట్టుకుంటూ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్లు, ఎంపీల జీతాల పెంపును కూడ ఈ బడ్జెట్ ప్రకటించింది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

ఒక ఆశ.. ఒక నిరాశ

ఈ బడ్జెట్‌లోని 'ఆయుష్మాన్ భారత్' కార్యక్రమాన్ని సాదరంగా ఆహ్వానించవలసిన అవసరం ఉన్నది. ప్రాథమిక, మాధ్యమిక, తృతీయక ఆరోగ్య సేవా కేంద్రాలను పెంపొందించాలన్న ఆలోచనను స్వాగతించవలసిందే. ఇందుకు అవసరమైన కార్యాచరణ కోసం నిష్ణాతులైన భాగస్వాములను కలుపుకొని బడ్జెట్ పరిధిని దాటి విస్తృత పరచవలసిన అవసరం ఉన్నది. జాతీయ ఆరోగ్య భద్రతా పథకాన్ని 50 కోట్ల మంది లబ్ధిదారులకు అన్వయించడం కూడా ముదావహం.



ప్రొ॥ జె. మనోహర్‌రావు

ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ మెజారిటీ వర్గాల్లో, ప్రజల్లో, ప్రాంతాల్లో తీవ్ర నిరుత్సాహమే మిగిల్చింది. స్వతహాగా ఎంతో ఉత్సాహంగా, హాస్యోక్తులను జోడించి, వైరి వర్గాల, పార్టీల వారిని సున్నితంగా ఎత్తిచూపుతూ ప్రసంగించే ఆర్థికామాత్యులు, అందుకు భిన్నంగా, చప్పగా, పేలవంగా తన ప్రసంగాన్ని ముగించడం ఆయన సమర్థకులనే కాదు, ప్రత్యర్థులను కూడా ఒకింత విస్మయపరచిన మాట వాస్తవం.

ఇందుకు కారణం ప్రస్తుత బడ్జెట్‌లో లక్ష్యసిద్ధి, గమ్య స్పష్టత, నిర్దిష్ట ప్రణాళికా గమనం, నిబద్ధత లోపించడం కావచ్చు. 2016, నవంబర్ 8న ప్రధాని మోదీ నోట్ల రద్దు చర్య తర్వాత క్రమక్రమంగా ఈ ప్రభుత్వ ఆర్థిక గమనం, సాంద్రత తగ్గి పలుచబడటం మొదలయ్యింది. ఈరోజు సాధారణ బడ్జెట్ స్వరూపం కూడా అందులో భాగమేనేమో! తాజా బడ్జెట్‌లో ఉటంకించిన మూడు ప్రధాన లక్ష్యాలు: 1. వ్యవసాయరంగం, గ్రామీణ ఆర్థికవ్యవస్థలపై స్పష్టమైన దృష్టి. 2. ఆరోగ్య, విద్యా, సామాజిక ఉత్పత్తి (Social Production) రంగాలను ప్రత్యేక ప్రోత్సాహకాలతో అభివృద్ధి చేయడం. 3. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (MSME) పరిశ్రమలను ప్రోత్సహించడానికి చర్యలు.

ఈ మూడింటినీ వరుస క్రమంలో మొదట పరిశీలిద్దాం. తర్వాత ఇతర అంశాలను విశ్లేషించుకుందాం. వ్యవసాయ రంగంలో ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంపొందించే దిశగా చర్యలు చేపట్టడం ఇప్పటి వరకు ఉన్న ఆనవాయితీ. అంటే వ్యవసాయానికి కావలసిన ఇన్‌పుట్స్, సాధనాలు, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, మౌలిక వసతులు, ఎరువులు వగైరాలపై దృష్టి పెట్టడం ద్వారా అధిక ఉత్పత్తి సాధించడం. అందుకు భిన్నంగా ప్రధాని పిలుపు మేరకు 75వ స్వాతంత్ర్య దినోత్సవం (2022) నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశలో ఒక నమూనా మార్పు, లేదా పారడైం షిఫ్ట్‌ని ప్రవేశపెడ్తున్నట్లు జైట్లీ పేర్కొన్నారు. దీనికోసం వ్యవసాయాన్ని ఒక ఎంటర్‌ప్రైజ్‌గా పరిగణించి రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచే దిశలో వ్యవసాయ ధరలను మార్కెట్ ద్వారా పెంచేందుకు ప్రయత్నం చేయడం గమనార్హం. అంటే ధాన్యాలు, దినుసులు, పండ్లు, కూరగాయలు, నూనెగింజలు, వంటనూనెలు మొదలైన వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులను కార్పొరేట్ పరిధిలోకి తీసుకురావడంగా అర్థమవుతుంది. దీనివల్ల రైతులకు ఒనగూడే ప్రయోజనం సంగతి అటుంచి, దళారీలకు, కార్పొరేట్లకు లాభాలు తెచ్చి పెట్టే అవకాశమే ఎక్కువ. ఈ వాస్తవాన్ని ఆచరణలో ఉన్న గణాంకాలు, ప్రపంచవ్యాప్తంగా కనిపించే అనుభవాల సారం సూచిస్తున్నాయి. కనీస మద్దతు ధర విషయంలో రాష్ట్ర, కేంద్ర పథకాల ప్రయోజనాలు రైతులకు చేరడం లేదనేది అందరికీ తెలిసిన సత్యమే. ప్రసంగంలోని 15వ పేరాలో చెప్పిన ప్రకారం కోతల తర్వాత పంటలకు సరసమైన ధరలను సాధించుకోవడం కోసం రైతులు 'సరైన నిర్ణయాలు' తీసుకోవాలని సూచించడం స్పష్టంగా 'ఏ ధరకు అమ్ముకోవాలో మీరే నిర్ణయించుకోండి' అని రైతులను ప్రోత్సహించడంగానే చూడవచ్చు. 2018–19లో పంట రుణాల సౌకర్యాన్ని రూ. లక్షల కోట్లకు పెంచుతున్నట్టు ప్రతిపాదించారు. ఈ అంశం ద్వారా స్పష్టమయ్యే ఒక వాస్తవం ఏదంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏవీ కూడా కౌలుదారుల వివరాలను సమగ్రంగా సేకరించలేదు. కాబట్టి నిజమైన కౌలుదారుడు లబ్ధి పొందటం కష్టం. ఈ పరిస్థితులలో రుణ సదుపాయాలు కూడా సరియైన ఫలితాలను సాధించటం కష్టం.

ఆర్థిక, సామాజిక స్వప్నాలు సాకల్యం చేసుకోవడం కోసం జనాభా గణన, సామాజిక–ఆర్థిక కుల పరిగణన, అనాథ పిల్లలు, దివ్యాంగుల వివరాల ఆధారంగా జాతీయ సామాజిక సహాయతా కార్యక్రమానికిగాను ఈ సంవత్సరం రూ. 9,973 కోట్లు కేటాయించడం హర్షించతగినదే. ప్రాథమిక విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి ఉపాధ్యాయ శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానంతోపాటు ఇంకా ఎన్నో చర్యలు తక్షణం చేపట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ముఖ్యంగా బడి చదువులు మధ్యలోనే ఆపివేసే, బాలబాలికల సంఖ్యను గణనీయంగా తగ్గించవలసిన అవసరం ఉన్నది. ఈ బడ్జెట్‌లోని 'ఆయుష్మాన్ భారత్' కార్యక్రమాన్ని సాదరంగా ఆహ్వానించవలసిన అవసరం ఉన్నది. ప్రాథమిక, మాధ్యమిక, తృతీయక ఆరోగ్య సేవా కేంద్రాలను పెంపొందించాలన్న ఆలోచనను స్వాగతించవలసిందే. ఇందుకు అవసరమైన కార్యాచరణ కోసం నిష్ణాతులైన భాగస్వాములను కలుపుకొని బడ్జెట్ పరిధిని దాటి విస్తృత పరచవలసిన అవసరం ఉన్నది. జాతీయ ఆరోగ్య భద్రతా పథకాన్ని 50 కోట్ల మంది లబ్ధిదారులకు అన్వయించడం కూడా ముదావహం. అయితే డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 'ఆరోగ్యశ్రీ' పథకం ద్వారా కొత్త ఒరవడి సృష్టించారు. కానీ అధిక ప్రయోజనాలను కార్పొరేట్ హాస్పిటల్స్ దండుకున్నాయి. సామాన్య ప్రజలు, దళితులు, ఆదివాసీలు, బడుగువర్గాలు పొందిన ప్రయోజనాలు స్వల్పమేనని ఎన్నో అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ బడ్జెట్‌లో ప్రకటించిన పథకం అలాంటి లోటుపాట్లకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

చిన్న మధ్య, సూక్ష్మ పరిశ్రమలు తక్షణమే కుదుటపడాలంటే రూ. 3,794 కోట్ల రుణ సదుపాయం ఒక్కటే సరిపోదు. మన దేశంలో ఈ రంగానికి చెందిన పరిశ్రమలు 95 శాతం ఉద్యోగావకాశాలు సృష్టిస్తున్న విషయం మన వార్షిక పారిశ్రామిక సర్వే గణాంకాల ద్వారా స్పష్టమైంది. అందులో ప్రస్తావించని విషయం ఏమిటంటే, ఈ కార్మికుల వివరాలు రిజిస్టరులో నమోదు కావు. దీనికి పెద్ద కారణం ఉంది. తాత్కాలిక భృతితోనో, కాంట్రాక్టులతోనో కాలం గడిపేవారి సంఖ్య చాలా ఎక్కువ. ఈ కారణంచేత లావాదేవీలన్నీ నగదు రూపేణా తప్ప, డిజిటల్ రూపంలో ఉండవు. అందుకే నోట్ల రద్దు కాలంలో తక్షణ ప్రభావం ఈ రంగంపైన కలిగిందనడం వాస్తవం. ఈ పరిస్థితి మారడానికి కూడా చాలా కాలం పట్టవచ్చు. ఈ రకమైన రుణ సదుపాయాలు ఏ మేరకు లక్ష్యాన్ని సాధించగలవన్నది ప్రశ్నార్థకమే. చివరగా 24,000 ప్రభుత్వ రంగ పరిశ్రమల అమ్మకం ద్వారా రూ. 80,000 కోట్లు సమీకరించడం అంత విజ్ఞతతో కూడిన చర్య అనిపించుకోదు.

వ్యాసకర్త హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు

చేనేతకు చుక్కలు చూపించారు!

అన్ని పథకాల కంటే చేనేత రంగానికి కేటాయింపులను దారుణంగా తగ్గించేశారు. పెరిగిన ఉత్పత్తి ధరలు, అసమంజస పోటీ, ప్రత్యర్థి రంగాలకు సబ్సిడీ ఇవ్వడం వంటి పరిణామాలతో చేనేతరంగం గిడసబారిపోతోంది.



డా॥దొంతి నరసింహారెడ్డి

తాజా బడ్జెట్ చేనేత పరిశ్రమపై శీతకన్ను వేసినట్లే చెప్పాలి. చేనేత రంగానికి గత సంవత్సరం రూ. 604 కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్‌లో కేవలం రూ. 386.09 కోట్లు కేటాయించారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ ప్రభావంతో కుదేలైన చేనేత రంగంపై దీంతో మూలిగే నక్కపై తాటిపండు పడినట్లయింది. గత వందేళ్లలో చేనేత రంగానికి ఇంత తక్కువ ఎన్నడూ కేటాయించలేదు. భారీ నష్టాలు, పెరిగిన అప్పులతో సతమతమవుతున్న చేనేత కార్మికులు, ఈ ఏటి బడ్జెట్‌లో అయినా ప్రభుత్వం కాస్త ఉపశమనం కలిగిస్తుందని, ప్రత్యక్ష నగదు బదిలీతో ప్రోత్సహిస్తుందని పెట్టుకున్న ఆశలు ఆవిరైపోయాయి.

చూస్తుంటే ప్రభుత్వానికి ఆలోచనలే కరువై చేష్టలుడిగినట్లు కనిపిస్తోంది. అన్ని పథకాల కంటే చేనేత రంగానికి కేటాయింపులను దారుణంగా తగ్గించేశారు. పెరిగిన ఉత్పత్తి ధరలు, అసమంజసమైన పోటీ, ప్రత్యర్థి రంగాలకు సబ్సిడీ ఇవ్వడం వంటి పరిణామాలతో చేనేతరంగం గిడసబారిపోతోంది. నూలు సరఫరా స్కీం కేటాయింపుల్లో భారీ కోతలు తమ ప్రభావాన్ని చూపుతూనే ఉన్నాయి. పట్టు, పత్తి, నూలు, ఇతర సహజ ఫైబర్‌కి సంబంధించిన ముడి సరుకు ధర పెరిగిపోవడంతో చేనేత రంగం నిత్యం ప్రకంపనలకు గురవుతూనే ఉంది.బీజేపీ ఎన్నికల ప్రణాళికల్లో, ఎన్నికల ప్రసంగాల్లో సమీకృత అభివృద్ధి గురించి వాగ్దానం చేసింది. కానీ జైట్లీ బడ్జెట్ ఈ అభివృద్ధిలో చేనేత



కార్మికులను భాగం చేయలేదు. చేనేతరంగాన్ని పైకి తీసుకురావడానికి కనీస ప్రతిపాదనలు కూడా పొందుపర్చలేదు. 14 శాతం నుంచి 60 శాతం వడ్డీ రేట్లు చెల్లిస్తున్న తమకు తక్కువ వడ్డీతో అప్పు ఇప్పించాలని చేనేత కార్మికులు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. పైగా, చేనేత ఉత్పత్తికి సంబంధించి అతి ముఖ్యమైన భాగం పెట్టుబడి. సాంప్రదాయిక వనరుల నుంచి చేనేతకు పెట్టుబడులు తరిగిపోతున్నాయి. చేనేత రంగానికి అంతో ఇంతో పెట్టుబడులు అందించేదిగా పేరుపడిన నాబార్డ్ చాలా వరకు ఆ బాధ్యతను తగ్గించుకుంది. దీని ఫలితంగా అధిక ఖర్చు భారాన్ని మోపే ప్రైవేట్ వనరుల వైపు మళ్లవలసి వస్తోంది. అధిక వడ్డీ రేట్లు, జాగరూకత లేమి, దోపిడీ పరిస్థితులు చేనేత కార్మికుల కష్టాలను మరింతగా పెంచుతున్నాయి.


ఈ నేపథ్యంలో రుణమాఫీ చేనేతకు జీవగర్ర లాంటిది. కానీ ఈ విషయంలో కేంద్రం స్పందన రానురానూ తగ్గిపోతున్నట్లు స్పష్టమవుతూనే ఉంది. 2013–14 బడ్జెట్‌లో రూ. 157 కోట్ల స్వల్పమొత్తాన్ని కేటాయించిన ప్రభుత్వం 2016–17 నాటికి చేనేత కార్మికుల వెతలను విస్మరించేసింది.

వ్యాసకర్త స్వతంత్ర జౌళి విధాన నిపుణులు
ఈ–మెయిల్ : nreddy.donthi16@gmail.com



బడ్జెట్ హైలైట్స్

- 2018-19 ఆర్థిక సంవత్సరానికి జీడీపీలో ద్రవ్యలోటు అంచనా 3.3 శాతం.
- 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీల సంక్షేమానికి రూ.56,619 కోట్లు.. ఎస్టీల సంక్షేమానికి రూ.39,135 కోట్లు కేటాయింపు.
- ప్రస్తుతం ప్రపంచంలోనే ఏడో అతిపెద్ద ఆర్థికశక్తిగా భారత్. భారత ఆర్థిక వ్యవస్థ విలువ రూ.160 లక్షల కోట్లు. త్వరలోనే ఐదో అతిపెద్ద ఆర్థికశక్తిగా అవతరించనుంది.
- ఖరీఫ్‌లో అన్ని పంటలకు ఉత్పత్తి వ్యయం కన్నా 1.5 రెట్లు అధికంగా మద్దతు ధర కల్పించేందుకు చర్యలు.
- 2018-19 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ నుంచి ప్రభుత్వ రుణాల సేకరణ అంచనా రూ.4.07 లక్షల కోట్లు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.4.79 లక్షల కోట్లుగా ఉంది.



దేశంలో డిజిటల్ చెల్లింపులు (రూ.కోట్లలో)



(కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం)



టాప్ 5 సంపన్న దేశాలు

దేశం	మొత్తం సంపద (రూ.కోట్లలో)
అమెరికా	41,07,54,240
చైనా	15,77,47,080
జపాన్	12,41,59,920
యూకే	6,30,84,840
జర్మనీ	6,14,37,600
భారత్	5,23,42,800

ఈ జాబితాలో భారత్ ఆరో స్థానంలో ఉంది

(న్యూ వరల్డ్ వెల్త్ సంస్థ నివేదిక ప్రకారం..)

మొత్తం సంపద

ప్రతి దేశంలో నివసిస్తున్న ప్రైవేట్ సెక్టార్‌లోని వ్యక్తుల మొత్తం ఆస్తుల (స్థిరాస్తులు, నగదు, ఈక్విటీస్, వ్యాపార ఆసక్తులు) నుంచి అప్పులను తీసివేయగా వచ్చినదే ఈ మొత్తం సంపద విలువ. ప్రభుత్వ ఆస్తులను ఇందులో లెక్కించలేదు.



ఆహా.. ఏమి వాడకం

మన ఆర్థిక మంత్రులు ఏడాదికో కొత్త బడ్జెట్ బ్యాగ్‌ను పట్టుకుని పోజిస్తున్నారు గానీ.. బ్రిటన్‌లో 130 ఏళ్లకు పైగా.. ఒకే బడ్జెట్ బాక్స్‌ను వాడారు. ఆ సంగతి మీకు తెలుసా? ఆ బాక్సే ఇది. దీని పేరు గ్లాడ్‌స్టోన్ రెడ్ బాక్స్. 1860ల్లో అప్పటి బ్రిటన్ ఆర్థిక మంత్రి విలియమ్ ఎడ్వర్డ్ గ్లాడ్‌స్టోన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం కోసం దీన్ని తొలిసారిగా వాడారు. అప్పట్నుంచి.. దాదాపు వందేళ్ల పాటు పెచ్చులూడిపోతున్నా.. చిరిగిపోతున్నా.. ప్రతి ఆర్థిక మంత్రి ఈ బాక్స్‌నే వాడారు. 1964-67 మధ్య అప్పటి ఆర్థిక మంత్రి జేమ్స్ కలాగన్ దీన్ని కాకుండా కొత్త బ్యాగును వాడారు. తర్వాత మళ్లీ షరా మామూలే. మరో 30 ఏళ్లు దీనిదే హవా. 1997లో గోర్డాన్‌బ్రౌన్.. 2007 వరకూ అంటే దశాబ్దం పాటు కొత్త బ్యాగులను ఉపయోగించారు. తర్వాత మళ్లీ 2010 జూన్ వరకూ దీన్నే వాడారు. ఇక వాడితే బాక్స్ బద్దలయ్యే ప్రమాదముందని గ్రహించారో ఏమో.. దీనికి రిటైర్‌మెంట్ ప్రకటించి.. కేబినెట్ వార్‌రూమ్‌లో దాచిపెట్టారు.



తులం బంగారం రూ. 88

అదేంటి.. బంగారం ధర 88 రూపాయలేమిటి అంటారా? నిజమే..! కానీ అది మన దేశానికి స్వాతంత్య్రం వచ్చిన 1947లో. అప్పట్లో పది గ్రాముల బంగారం ధర కేవలం రూ. 88.62 మాత్రమే. ఇప్పుడేమో ఏకంగా రూ. 30,000కు పైనే ఉంది. అంటే 67 ఏళ్లలో 300 రెట్లకుపైగా పెరిగింది. మరో విశేషం ఏమిటంటే.. 2013 ఆగస్టులో బంగారం రూ. 35,574 వరకూ వెళ్లింది.

ఆరోగ్యశ్రీ రథం... ఆ'కర్షక' ధ్వజం

గెలుపే లక్ష్యం!

ఎన్నికల నేపథ్యంలో 'సంక్షేమ' మంత్రం పఠించిన జైట్లీ.. వైద్యం, విద్య, వ్యవసాయానికి పెద్దపీట

ఈసారి బడ్జెట్‌లో ప్రపంచంలోనే అత్యంత భారీ ఆరోగ్య బీమా పథకాన్ని జైట్లీ ప్రకటించారు. ఎందుకంటే 10 కోట్ల పేద కుటుంబాలు.. అంటే దాదాపు 50 కోట్ల మందికి వర్తించేలా ఏడాదికి రూ.5 లక్షల కవరేజీతో ఆరోగ్య బీమా పథకాన్ని అమల్లోకి తెస్తామని జైట్లీ ప్రకటించారు. గురువారం 2018-19 బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పిస్తూ.. ఈ కీలక ప్రకటన చేశారు. ఈ పథకం ఎప్పట్నుంచి అమల్లోకి వస్తుందనేది, ప్రత్యేకంగా కేటాయింపులెంతనేది వెల్లడించలేదు. మొత్తంగా ఆరోగ్యం, విద్య, సామాజిక పరిరక్షణకు రూ.1.38 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏడాదిలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జనాభాలో 40 శాతం మందిని ఆకర్షించే ప్రయత్నం చేశారన్నది నిపుణుల మాట.

– సాక్షి, ప్రత్యేక ప్రతినిధి

వ్యవసాయానికి పెద్ద పీట!



ఈసారి బడ్జెట్లో వ్యవసాయానికి, గ్రామీణ భారతానికి పెద్ద పీట వేశారు జైట్లీ. ''నవ భారత నిర్మాణానికి ఇదే చోదకం'' అని బడ్జెట్ అనంతరం జైట్లీ వ్యాఖ్యానించడాన్ని బట్టి ఈ రంగాలకిచ్చిన ప్రాధాన్యం అర్థమవుతుంది. పంట చేతికొచ్చినపుడు సరైన ధర లేక... సరైన ధర ఉన్నపుడు చేతిలో పంట లేక రైతులు నష్టపోతున్నారని వ్యాఖ్యానించిన జైట్లీ... పంటల నిల్వకోసం ఉచితంగా గిడ్డంగుల సౌకర్యం కల్పించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాక కనీస మద్దతు ధర నిర్ణయించేటపుడు రైతు పెట్టుబడిని పరిగణనలోకి తీసుకుంటామని, పెట్టుబడికన్నా కనీసం 50 శాతం అధికంగా ఉండేలా కనీస మద్దతు ధరను నిర్ణయిస్తామని తెలియజేశారు. వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి రూ.2000 కోట్లివ్వటం, కిసాన్ క్రెడిట్ కార్డుల్ని మత్స్య, పశు సంవర్థక రైతులకూ వర్తింపజేయటం... ఇవన్నీ రైతాంగానికిచ్చిన వరాలేనని చెప్పాలి.

సీనియర్ సిటిజన్లకు ఊరటే!



సంపాదించినన్నాళ్లూ పొదుపు చేసుకుని... రిటైరయ్యాక బ్యాంకు డిపాజిట్లపై వచ్చే వడ్డీయే ఆదాయంగా బతుకుతున్న వారు కోకొల్లలు. ఎందుకంటే అసంఘటిత రంగమే అత్యధిక ఉద్యోగుల్ని పోషిస్తున్న మన భారతంలో పింఛన్ వచ్చేది అతితక్కువ మందికే. అందుకేనేమో.. డిపాజిట్లపై వచ్చే వడ్డీ రూ.10 వేలు దాటితే పన్ను చెల్లించాల్సిన పరిస్థితిని తప్పించి.. ఆ మొత్తాన్ని రూ.50వేలకు పెంచారు. వారు వైద్య అవసరాల కోసం (క్రిటికల్ ఇల్‌నెస్) వెచ్చించే దాంట్లో పన్ను మినహాయింపునకు అర్హమయ్యే మొత్తాన్ని రూ.లక్షకు పెంచారు కూడా.




అంపశయ్యపై ఉండి కూడా... రాజ్యపాలన రీతులు, లోతులు, ధర్మ సూక్ష్మాలు తదితరాలను ధర్మజుడికి, పాండవులకు తన అనుభవాన్నంతా రంగరించి వివరిస్తాడు భీష్ముడు. ప్రజా సంక్షేమమే పరమావధి అంటాడు. ధర్మనందనుడి పాలనకు ఒకరకంగా అవే శిలాక్షరాలు. అందుకేనేమో సంక్షేమ మంత్రాన్ని పఠిస్తూ అన్ని వర్గాలనూ సంతృప్తిపరిచే ప్రయత్నం చేశారు జైట్లీ.

వేతన జీవికి విదిలింపే!



ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పులు చేస్తారని అంతా ఎదురు చూసినా... ఈసారి జైట్లీ వాటి జోలికెళ్లలేదు. అయితే అందరికీ వర్తించేలా రూ.40 వేల స్టాండర్డ్ డిడక్షన్‌ను అమల్లోకి తెస్తామని ప్రకటించారు. అంటే ప్రతి ఒక్కరికీ పన్ను ఆదాయంలో ఎలాంటి బిల్లులూ లేకుండా రూ.40 వేలను మినహాయిస్తారన్న మాట. అయితే అదే సమయంలో ప్రస్తుతం పన్ను మినహాయింపు పరిధిలో ఉన్న రవాణా భత్యాన్ని, వైద్య ఖర్చుల్ని దాన్నుంచి తొలగించారు. పైపెచ్చు ప్రస్తుతం పన్ను ఆదాయంపై విధిస్తున్న 3 శాతం విద్యా సెస్సును 4 శాతానికి పెంచారు. అంటే మొత్తంగా చూసినపుడు స్టాండర్డ్ డిడక్షన్ వల్ల లాభం పరిమితమేనని చెప్పాలి. అలాగే షేర్లపై వచ్చే లాభానికి ప్రస్తుతం ఏడాది దాటితే పన్ను లేదు. కానీ లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పేరిట దీన్ని జైట్లీ అమల్లోకి తెచ్చారు. కాకపోతే దీనికి కొన్ని పరిమితులు విధించడం కొంత ఊరట. ఈక్విటీ మ్యూచ్‌వల్ ఫండ్లు చెల్లించే డివిడెండ్లపైనా 10 శాతం పన్ను వేశారు.

లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్



షేర్లను కొని, ఏడాదికన్నా ఎక్కువకాలం వాటిని అట్టేపెట్టుకుంటే వాటిపై వచ్చే లాభాలపై లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్ను ఉండదు. ఏడాదిలోపు విక్రయిస్తే మాత్రం షార్ట్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ కింద పన్నుంటుంది. నిజానికి పద్నాలుగేళ్ల కిందట లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్నును తొలగించారు. దాన్ని జైట్లీ మళ్లీ తెచ్చారు. రూ.లక్షకు మించి వచ్చిన లాభాలపై 10 శాతం పన్ను విధిస్తామని చెప్పారు. నిజానికి 2004 జూలైలో లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్నును తొలగించి... దాని స్థానంలో సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ను తెచ్చారు. ఇప్పుడు రెండూ అమల్లో ఉండటం గమనార్హం.

గ్రామీణులకు వరాలు



నిరుపేదలకు ఉచితంగా ఇస్తున్న గ్యాస్ కనెక్షన్ల లక్ష్యాన్ని ఈ బడ్జెట్లో ప్రస్తుతమున్న 5 కోట్ల నుంచి 8 కోట్లకు పెంచారు. దీనికితోడు 4 కోట్ల కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తామని ప్రకటించారు. వ్యవసాయం, గ్రామీణ ఇళ్ల నిర్మాణం, ఆర్గానిక్ వ్యవసాయం, పశు సంవర్ధకం, మత్స్య పరిశ్రమ వంటి వాటికి జైట్లీ ఏకంగా రూ.14.34 లక్షల కోట్లు కేటాయించారు.

దిగుమతి సుంకాల పెంపు!



మిగిలిన పన్నులన్నీ జీఎస్‌టీ పరిధిలోకి వచ్చి ఎప్పటికప్పుడు సవరణలు జరుగుతుండటంతో ఈ సారి వాటిలోకి ప్రవేశించే అవకాశం జైట్లీకి రాలేదు. దీంతో దిగుమతి సుంకాలను పెంచేశారు. సెల్‌ఫోన్లు, అత్తర్లు, ముస్తాబు సామగ్రి (టాయ్‌లెట్రీ), వాచ్‌లు, ఆటోమొబైల్ భాగాలు, సన్‌గ్లాసులు, ట్రక్-బస్సు టైర్లు వంటి వస్తువులపై దిగుమతి సుంకాలను పెంచేశారు.

ద్రవ్య నియంత్రణ కష్టమేనా

విద్య, ఆరోగ్యాలకు రూ.1.38 లక్షల కోట్లను ప్రకటించిన జైట్లీ... ఈ ఏడాది ద్రవ్యలోటు ముందుగా అంచనా వేసినట్టుగా జీడీపీలో 3.2 శాతంగా కాకుండా 3.5 శాతంగా ఉండవచ్చని స్పష్టంచేశారు. 2018-19లో ఇది 3.3 శాతానికి చేరుకోవచ్చన్నారు.

కార్పొరేట్ ట్యాక్స్ ఊరట కొందరికే

కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాలన్న డిమాండ్‌పై జైట్లీ కొందరికే ఊరటనిచ్చారు. ప్రస్తుతం రూ.50 కోట్ల వరకూ వార్షిక టర్నోవర్ ఉన్న సంస్థలకు ఈ వెసులుబాటు ఉండగా.. ఇకపై రూ.250 కోట్ల టర్నోవర్ చేసే సంస్థలకు కూడా వర్తింపజేశారు.


నల్లధనం కట్టడికి మరిన్ని చర్యలు: జైట్లీ

న్యూఢిల్లీ: నల్లధనానికి చెక్ చెప్పేందుకు చేపట్టిన పలు పథకాలు సత్ఫలితాలివ్వడంతో ముమ్ముందు మరిన్ని చర్యలు చేపడతామని అరుణ్ జైట్లీ తెలిపారు. పన్ను ఎగవేత కట్టడి చర్యల్లో భాగంగా గత రెండేళ్లలో రూ.90 వేల కోట్ల అదనపు మొత్తాన్ని వసూలు చేసినట్లు కేంద్ర బడ్జెట్‌లో వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థలో నగదు వినియోగాన్ని తగ్గించేలా, పన్ను వ్యవస్థను విస్తృతం చేసేలా చేపట్టిన పలు చర్యల్ని జైట్లీ ఉదహరించారు. '2016-17, 2017-18లలో ప్రత్యక్ష పన్నుల్లో వృద్ధి రేటు ఆశాజనకంగా ఉంది. గతేడాది వృద్ధి రేటు 12.6 శాతంగా ఉంటే.. జనవరి 15, 2018 నాటికి 18.7 శాతం ఉంది' అని వెల్లడించారు. వ్యక్తిగత ఆదాయ పన్నుల వసూళ్లు పెరిగాయని, 2016-17, 2017-18లలో వ్యక్తిగత ఆదాయపు పన్నుల ఉత్తేజిత(బ్యుయన్సీ) రేటు 1.95, 2.11 గా ఉందని చెప్పారు. అంతకముందు ఏడేళ్ల సరాసరి వ్యక్తిగత ఆదాయపు పన్నుల ఉత్తేజిత రేటు 1.1గా ఉందని వెల్లడించారు. దేశంతో పాటు విదేశాల్లోని నల్లధనానికి అడ్డుకట్ట వేసేందుకు చట్టాల్ని రూపొందించామని గుర్తుచేశారు. పెద్ద నోట్ల రద్దు అంశాన్ని ప్రస్తావిస్తూ.. 'నిజాయతీ ఉత్సవం'గా అందరి మన్ననలు అందుకుందని పేర్కొన్నారు.

సులభతర వ్యాపారాలకు 372 సంస్కరణలు

అమలు బాధ్యత రాష్ట్రాలదే: జైట్లీ

న్యూఢిల్లీ: వ్యాపారాల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు 372 సంస్కరణలను గుర్తించినట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. రాష్ట్రాలు వీటిని యుద్ధప్రాతిపదికన అమలు చేయాల్సి ఉంటుందని, నిర్మాణాత్మకంగా ఒకదానితో మరొకటి పోటీపడాలని సూచించారు. ఈ విషయంలో ఆయా రాష్ట్రాల పనితీరుపై కేంద్రం ఎప్పటికప్పుడు పారిశ్రామిక వర్గాల నుంచి అభిప్రాయాలు సేకరిస్తుందని తెలిపారు. వ్యాపారాల నిర్వహణను సులభతరం చేయడం ద్వారా మరిన్ని పెట్టుబడులు ఆకర్షించవచ్చని, ఇన్వెస్టర్లకు అనుకూల పరిస్థితులు కల్పించవచ్చని బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. 2016 'ఆలిండియా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాయి. ప్రపంచ బ్యాంకు ఇటీవలే విడుదల చేసిన వ్యాపారాలకు అనువైన 190 దేశాల జాబితాలో భారత్ 30 స్థానాలు ఎగబాకి 100వ ర్యాంకుకు చేరుకున్న తెలిసిందే. భవిష్యత్తులో టాప్ 50లోకి చేరాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు జైట్లీ వెల్లడించారు.



చురుక్కుల్లేవ్.. చమక్కుల్లేవ్!



న్యూఢిల్లీ: చురుక్కుల్లేవ్.. చమక్కుల్లేవ్.. కవితలు లేవు.. పంక్తులు లేవు.. జైట్లీ బడ్జెట్ ప్రసంగం ఎలాంటి ఛలోక్తులు లేకుండా అత్యంత సాదాసీదాగా సాగింది! బడ్జెట్‌లో చివర్లో వివేకానందుడి మాటలు తప్ప ఎక్కడా కవులు, ప్రముఖుల సూక్తులను ఉటంకించలేదు. గురువారం ఆయన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆసాంతం.. రైతులు, పేదలు, గ్రామీణం, మహిళలు.. ఈ నాలుగు అంశాల చుట్టే తిరిగింది. తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలను ప్రస్తావించే సమయంలో హిందీలో ప్రసంగించారు. మిగతా వివరాలన్నీ ఇంగ్లిష్‌లోనే చెప్పారు. తమది 'భారత్ కోణం'లో ఉన్న బడ్జెట్ అని చెబుతూ.. వీలైనచోటల్లా మోదీ లక్ష్యాలు, ఆశయాలను ప్రస్తావించారు. ''ఈ దేశ అత్యున్నత స్థానంలో ఉన్న నాయకత్వం పేదల కష్టాలు, కన్నీళ్లను అతి దగ్గరి నుంచి చూసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు మా నాయకత్వానికి తెలుసు. పేదలు, మధ్యతరగతి వర్గాలు మాకు కేస్‌స్టడీ మాదిరి కాదు.. ఎందుకంటే స్వయంగా మా నాయకత్వమే ఆయా వర్గాలకు చెందినది. సుమారు 1.50 గంటలపాటు సాగిన జైట్లీ ప్రసంగంలో.. 'రైతులు' అన్న పదం 27 సార్లు, 'పేదలు' 21 సార్లు, 'గ్రామీణం' 20 సార్లు, 'వ్యవసాయం' 16 సార్లు, 'మహిళలు' 10 సార్లు ఉచ్చరించారు. వ్యవసాయ రంగం బలోపేతంతోపాటు గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, ఉపాధి, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు, మౌలిక వసతుల రంగాలపై దృష్టి సారించినట్లు వివరించారు.

ప్రసంగం చివరల్లో 'మనం ఆశిస్తున్న ఉజ్వల భారతం తప్పకుండా ఆవిర్భవించి తీరుతుంది' అంటూ వివేకానందుడు ఐరోపా యాత్రలో చేసిన వ్యాఖ్యలను ఉటంకించారు. ''రైతుల ఇళ్లల్లోంచి, వారి చేతుల్లోని నాగళ్లలోంచి, జాలర్ల పూరి గుడిసెల్లోంచి, అపార ప్రకృతి సంపదలోంచి భరతమాత ఉద్భవిస్తుంది..'' అన్న వివేకానందుడి మాటలతో ప్రసంగాన్ని ముగించారు.




ఆర్థిక అవసరాలు తీరుస్తుంది

తమ బడ్జెట్ గ్రామీణం, వ్యవసాయ రంగాలకు ఊతమిచ్చేందుకు ఎంతగానో దోహదపడుతుందని అరుణ్‌జైట్లీ అన్నారు. ఆర్థికరంగ అవసరాలను తీరుస్తుందని పేర్కొన్నారు. ''ఈ ఏడాది ద్రవ్యలోటును 3.2 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా జీఎస్‌టీ అమలు, ఇతరత్రా కారణాల వల్ల 3.5 శాతానికి సవరించాల్సి వచ్చింది..'' అని వివరించారు.



బడ్జెట్ హైలైట్స్

- వ్యవసాయ మార్కెట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.2,000 కోట్లతో నిధి. దీని ద్వారా దేశవ్యాప్తంగా 22 వేల గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు, 585 ఏపీఎంసీల అభివృద్ధి.
- అన్ని రంగాల్లో ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత.
- రూ. 2.5 లక్షలు, అంతకు మించిన లావాదేవీలకు పాన్ కార్డు తప్పనిసరి.
- ఫుడ్ ప్రాసెసింగ్‌కు గత ఏడాది రూ.715 కోట్లు కేటాయిస్తే.. ఈసారి అది రూ.1,400 కోట్లకు పెరిగింది.
- ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో వాయు కాలుష్యం నియంత్రణకు చర్యలు.
- స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా మరో 2 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం
- జాతీయ జీవనోపాధి మిషన్‌కు రూ.5,750 కోట్లు.
- 'ఆయుష్మాన్‌భవ' కింద 2 ప్రధాన కార్యక్రమాలను ప్రభుత్వం ప్రకటించింది.





బడ్జెట్ బ్యాక్‌గ్రౌండ్..

బడ్జెట్ అనగానే చాలామంది లెక్కల చిక్కులే అనుకుంటారు! కానీ ఈ మూడక్షరాల వెనుక చాలా కృషి దాగుంటుంది. ఎంతో కసరత్తు.. లెక్కకు మించి భేటీలు.. ఆద్యంతం గోప్యత.. అబ్బో చాలా తతంగమే ఉంటుంది. అదేంటో ఓ లుక్కేయండి!

సెప్టెంబర్లో..

రానున్న ఆర్థిక సంవత్సరంలో ఏయే రంగానికి ఎంత ఖర్చు పెట్టాలన్న కసరత్తు మొదలవుతుంది. దేశంలో మొత్తం జనాభా తమ తిండి కోసం ఏడాది అంతా ఎంత ఖర్చు చేస్తున్నారో దాదాపు అంత మొత్తాన్ని ప్రభుత్వం బడ్జెట్‌కు కేటాయిస్తుంది.

అక్టోబర్లో..

తమకు కావాల్సిన నిధులపై వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు ఆర్థికశాఖతో చర్చల్లో తలమునకలవుతారు.

డిసెంబర్..

ముసాయిదా బడ్జెట్ కాపీలను అధికారులు ఆర్థికమంత్రికి నివేదిస్తారు. ఈ ముసాయిదా పత్రాలన్నీ నీలం రంగులో ఉంటాయి.

జనవరి..



పారిశ్రామిక, బ్యాంకింగ్ రంగాలకు చెందిన వివిధ సంఘాల ప్రతినిధులు ఆర్థిక మంత్రిని కలసి తమ సమస్యలను సలహాలను, సూచనలను అందజేస్తారు. ఈ సందర్భంగా ఆర్థికమంత్రి అందరి వాదనలు వింటారుగానీ ఎవరికీ నిర్దిష్టమైన హామీ ఇవ్వరు.

ముద్రణ ప్రక్రియ..

బడ్జెట్‌కు సంబంధించిన అన్ని వివరాలను అత్యంత రహస్యంగా ఉంచేందుకు జనవరి నుంచి ఆర్థికమంత్రిత్వ శాఖ కార్యాలయాల్లోకి జర్నలిస్టుల ప్రవేశాన్ని నిషేధిస్తారు.

ఫోన్ ట్యాపింగ్..

బడ్జెట్ ప్రతిపాదనలు ఏమాత్రం లీక్ కాకుండా చూసే బాధ్యతను ఇంటెలిజెన్స్ విభాగం చూసుకుంటుంది. ఇందుకు కొందరు ఉన్నతాధికారుల ఫోన్లను సైతం ట్యాప్ చేస్తుంటుంది.

సందర్శకులపై మూడో కన్ను..



ఆర్థిక శాఖ కార్యాలయానికి వచ్చే సందర్శకులపై సీసీటీవీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు నిఘా ఉంటుంది. ఈ కెమెరాల పరిధిని దాటి వారు కనీసం కుర్చీలపై కూర్చోవడానికి కూడా అనుమతి ఉండదు.

అంతా 'ప్రత్యేకం'

బడ్జెట్ పత్రాలను తయారు చేసే 'ప్రింటింగ్ ప్రెస్' సిబ్బందిని ఎవరితో సంబంధం లేకుండా ప్రత్యేకంగా ఉంచుతారు. వీరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు.

ఆహారంపైనా జాగ్రత్త



ప్రింటింగ్ ప్రెస్ సిబ్బందికి అందించే తిండిపై అత్యంత జాగ్రత్త తీసుకుంటారు. ఏ ఆహారాన్నైనా పరీక్షించిన తర్వాతే వారికి ఇస్తారు.

నీడలా వెన్నంటే..

ముద్రణ విభాగంలో పనిచేసే సిబ్బంది ఎవరైనా అత్యవసరంగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తే.. సదరు వ్యక్తి వెంట ఓ ఇంటెలిజెన్స్ అధికారి, ఓ పోలీసు ఉంటారు. వారు అనుక్షణం ఆయనను నీడలా అనుసరిస్తారు.

ఫిబ్రవరి 1న..

ఉదయం 11 గంటలకు ఆర్థికమంత్రి పార్లమెంటుకు బడ్జెట్‌ను సమర్పిస్తారు. సభలో ప్రవేశపెట్టేముందు రాష్ట్రపతి, ప్రధానమంత్రికి బడ్జెట్ గురించి స్థూలంగా వివరిస్తారు.

పరీక్ష పేపర్లే కాదు.. బడ్జెట్ పేపర్లు కూడా లీకైన సంఘటన 1950లో చోటుచేసుకుంది. అప్పట్లో బడ్జెట్ పత్రాల్ని రాష్ట్రపతి భవన్‌లో ముద్రించే వారు. 1950లో ఈ పత్రాలు ముందే లీక్ కావడంతో అప్పట్నుంచి మింట్‌రోడ్‌లోని సెక్యూరిటీ ప్రెస్‌కు ముద్రణ వేదికను మార్చారు. 1980 నుంచి ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో బడ్జెట్ పత్రాల్ని ముద్రిస్తున్నారు. ఇందుకోసం అక్కడ ప్రత్యేకంగా ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేశారు.

ఒక్కో కుటుంబానికి ఏటా రూ.5 లక్షల వైద్య బీమా

'ఆరోగ్య శ్రీ'కారం



10 కోట్లు లబ్ధి చేకూరే కుటుంబాల సంఖ్య

- ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ వైద్య పథకం
- సుమారు 50 కోట్ల మందికి లబ్ధి
- కొత్తగా 24 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు
- టీబీ పేషెంట్లకు పోషకాహారం అందించేందుకు 600 కోట్లు

న్యూఢిల్లీ

ఆరోగ్యశ్రీ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకం పేదలపాలిట సంజీవనిలా నిలిచింది! బీదాబిక్కికి కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించి లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపింది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే దిశగా అడుగులు వేస్తోంది. ఆరోగ్యశ్రీ తరహాలోనే బడ్జెట్‌లో కొత్త పథకాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో కీలక ప్రకటన చేశారు. దేశంలో 10 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరేలా జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకాన్ని ప్రవేశపెడతామని వెల్లడించారు. దీనికింద ఒక్కో కుటుంబానికి గరిష్టంగా ఏటా రూ.5 లక్షల వైద్య బీమా సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వరంగంలో ఇది ప్రపంచంలోనే అతిపెద్ద వైద్య పథకమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా సుమారు 50 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న జిల్లా ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేస్తూ కొత్తగా 24 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రతి మూడు పార్లమెంటరీ నియోజకవర్గాలకు కనీసం ఒక మెడికల్ కాలేజీ ఉండేలా చూస్తామన్నారు. ''ఆరోగ్యభారతం ద్వారానే సంపన్న భారతం సాకారమవుతుంది. పౌరులు ఆరోగ్యంగా ఉంటేనే దేశాభివృద్ధి సాధ్యపడుతుంది. అందుకే జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకాన్ని ప్రవేశ పెడుతున్నాం. ఆరోగ్య రంగానికి సంబంధించి ప్రపంచంలోనే ఇది అతిపెద్ద ప్రభుత్వ పథకం. ఈ పథకం ఎలాంటి ఇబ్బందులు లేకుండా నడిచేందుకు తగినన్ని నిధులు కేటాయిస్తాం. ముున్ముందు దేశ ప్రజలందరికీ వర్తించేలా 'సార్వత్రిక ఆరోగ్య బీమా' వైపు అడుగులు వేస్తాం'' అని జైట్లీ పేర్కొన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు వివిధ ఆరోగ్య పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రస్తుతం కేంద్రం అమలు చేస్తున్న రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్ఎస్‌బీఐ) కింద పేదలకు ఏటా రూ. 30 వేల వైద్య బీమా మాత్రమే ఉంది. ఈ పథకానికి తాజా బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించారు.

ఆరోగ్య బడ్జెట్ రూ.54,667 కోట్లు

ఆరోగ్య రంగానికి గతేడాది రూ.53,198 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.54,667 కోట్లు కేటాయించారు. అలాగే ఆరోగ్య పరిశోధన విభాగానికి కిందటేడాది రూ.1,500 కోట్లు కేటాయిస్తే.. ఈసారి రూ.1,800 కోట్లు ప్రతిపాదించారు.

➜ దివ్యాస్త్రాలతో ఆకాశానికి అడ్డుగోడ కట్టి అర్జునుడు కాపు కాస్తుండగా... అనేకానేక అమూల్యమైన మూలికలకు నిలయమైన ఖాండవ వనాన్ని వేయి నాల్కలతో కబళించి ఆరోగ్యం పుంజుకుంటాడు అగ్నిదేవుడు. అదే మాదిరిగా ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా పథకంతో ఏకంగా 50 కోట్ల మంది భారతీయుల ఆరోగ్యానికి రక్షణ ఛత్రం కల్పించనున్నట్టు ప్రకటించారు విత్త మంత్రి...!



జైట్లీ ఇంకా ఏమన్నారంటే..


- 'ఆయుష్మాన్ భారత్' కార్యక్రమంలో భాగంగా జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం, 1.5 లక్షల హెల్త్, వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటును చేపట్టాం.
- ఈ సెంటర్ల ద్వారా పేదలకు ఉచిత మందులతోపాటు వైద్య పరీక్షల సౌకర్యం కల్పిస్తాం
- ఆరోగ్య రంగంలో తెస్తున్న కొత్త పథకాల ద్వారా లక్షల మందికి.. ప్రత్యేకించి మహిళలకు ఉపాధి కల్పిస్తాం
- కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్ఆర్) కింద హెల్త్, వెల్‌నెస్ సెంటర్లను దత్తత తీసుకునేలా ప్రైవేటు కంపెనీలను ఆహ్వానిస్తాం
- క్షయ వ్యాధి ఏటా ఎందరినో బలితీసుకుంటోంది. అందుకే టీబీ రోగులకు పోషకాహారం అందించేందుకు రూ.600 కోట్లు కేటాయిస్తున్నాం. చికిత్స పొందే కాలంలో రోగులకు నెలకు రూ.500 చొప్పున అందిస్తాం
- 'ఆయుష్మాన్ భారత్' కింద 2022 నాటికల్లా అందరూ ఆరోగ్యంగా ఉండే, ఉత్పత్తిని పెంచే, పేదరికం లేని నవ భారత్‌ను నిర్మిస్తాం

"వైద్య చికిత్సల కోసం దేశంలో లక్షలాది మంది ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తోంది. మరెందరో అప్పుల పాలవుతున్నారు. అలాంటి నిరుపేదలను ఆదుకునేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. వైద్య సదుపాయాలను మరింత విస్తృతం చేస్తాం. నాణ్యమైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతోనే కొత్తగా 24 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

- అరుణ్‌జైట్లీ

రాష్ట్రపతి వేతనం రూ.5 లక్షలు

ఉపరాష్ట్రపతి, గవర్నర్లకూ పెంపు • ఎంపీల మూలవేతనాలు రెట్టింపు



న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి వేతనాలు భారీగా పెరిగాయి. రాష్ట్రపతి వేతనం నెలకు రూ.5 లక్షలకు, ఉపరాష్ట్రపతి వేతనం నెలకు రూ.4 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే గవర్నర్ల వేతనం రూ.3.5 లక్షలకు చేరింది. ప్రస్తుతం రాష్ట్రపతికి నెలకు రూ.1.50 లక్షలు, ఉపరాష్ట్రపతికి 1.25 లక్షలు, గవర్నర్లకు రూ.1.10 లక్షల చొప్పున జీతాలు చెల్లిస్తున్నారు. ఈ వేతనాల పెంపును బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ..వారి జీతభత్యాలు చివరిసారి 2006 జనవరి 1న పెరిగిన సంగతిని గుర్తుచేశారు. రెండేళ్ల క్రితం ఏడో వేతన సంఘం సిఫార్సులు అమల్లోకి వచ్చినప్పటి నుంచి కేబినెట్ కార్యదర్శి, ఇతర కార్యదర్శులు రాష్ట్రపతి కన్నా ఎక్కువ వేతనాలు పొందుతున్న సంగతి తెలిసిందే.

ఎంపీలకు డబుల్ ధమాకా...

ఎంపీల మూల వేతనాలు రెట్టింపు కానున్నాయి. వచ్చే ఏప్రిల్ 1 నుంచి వారి మూలవేతనాన్ని ప్రస్తుతమున్న రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచుతూ తాజా బడ్జెట్‌లో జైట్లీ ప్రతిపాదించారు. వారికిచ్చే ఇతర భత్యాలను కూడా పెంచనున్నారు. ద్రవ్యోల్బణం ఆధారంగా ఐదేళ్లకోసారి ఎంపీల వేతనాలు, భత్యాలను ఆటోమేటిక్‌గా సవరించేందుకు కూడా జైట్లీ కొత్త చట్టాన్ని ప్రతిపాదించారు. ఎంపీల వేతనాల పెంపుపై ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతులు విమర్శలకు దారితీస్తున్నాయని అన్నారు. అందుకే వచ్చే ఏప్రిల్ 1 నుంచి ఎంపీల వేతనాలు, నియోజకవర్గాల భత్యం, కార్యాలయాల ఖర్చులు, సమావేశాల భత్యాలను సవరించే విధానాల్లో మార్పులు తెస్తున్నట్లు ప్రకటించారు.

'ఆయుష్'కు రూ. 1,626 కోట్లు

న్యూఢిల్లీ:

13 శాతం పెరుగుదల

ఆయుష్ మంత్రిత్వ శాఖకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.1626.37 కోట్లు కేటాయించారు. ఇది గతేడాది కన్నా 13 శాతం ఎక్కువ. ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలుచేస్తున్న వివిధ ప్రాజెక్టులు, పథకాలకయ్యే మొత్తం వ్యయాన్ని రూ.71.36 కోట్లుగా అంచనా వేశారు. గతేడాది బడ్జెట్‌లో ఇందుకోసం తొలుత రూ.68.86 కోట్లు కేటాయించి తరువాత రూ.87.64 కోట్లకు పెంచారు. నియంత్రణ సంస్థలు, స్వయంప్రతిపత్తి సంస్థలకు ఈసారి కేటాయింపులు పెరిగాయి. చట్టబద్ధ, నియంత్రణ సంస్థలకు రూ.9.60 కోట్లు, స్వయంప్రతిపత్తి సంస్థలకు రూ.906.70 కోట్లు కేటాయించారు. చట్టబద్ధ, నియంత్రణ సంస్థల కింద న్యూఢిల్లీలోని సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి, సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్, స్వయంప్రతిపత్తి సంస్థల్లో ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఉన్నాయి.

మంత్రుల జీతభత్యాలకు రూ. 295 కోట్లు

29% తగ్గింపు

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రులు, సహాయ మంత్రులు, మాజీ ప్రధానుల జీతభత్యాలు, ప్రయాణ ఖర్చులకు 2018–19 కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రూ. 295 కోట్లను కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 400 కోట్లు కేటాయించారు. ఈ మొత్తంలో 29% తగ్గించారు. బడ్జెట్‌లో కేటాయించిన మొత్తాన్నే మంత్రి మండలి, సహాయ మంత్రులు, మాజీ ప్రధానుల జీతభత్యాలకు, ఇతర సౌకర్యాలు, విందు, ప్రయాణ ఖర్చుల నిమిత్తం వినియోగించాలి. ఇక వీవీఐపీలు వినియోగించే విమానాల నిర్వహణ ఖర్చులను కూడా ఈ మొత్తంలోనే ఖర్చు చేయాలని జైట్లీ తెలిపారు. 2017–18 కేంద్ర బడ్జెట్‌లో రూ. 418.49 కోట్లను కేటాయించారు. ప్రధాని కార్యాలయం పాలనాపరమైన ఖర్చులకు ఈ ఏడాది బడ్జెట్లో రూ. 50.35 కోట్లను కేటాయించారు.

ఇక కంపెనీలకూ 'ఆధార్'

న్యూఢిల్లీ: దేశంలోని ప్రతి వ్యక్తికి ఆధార్ సంఖ్య ఉన్నట్లే ఇకపై ప్రతి కంపెనీకి కూడా ఓ గుర్తింపు సంఖ్య ఉండేలా కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం ప్రకటించింది. అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా మాట్లాడుతూ.. చిన్న కంపెనీ కానీ, పెద్ద కంపెనీ కానీ ప్రతి ఒక్క కంపెనీకి ఓ గుర్తింపు కార్డు ఉండాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ప్రత్యేకమైన పథకాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే దాదాపు 119 కోట్ల మంది భారతీయులకు ఆధార్ కార్డును కేంద్రం అందజేసింది. ప్రస్తుతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు లబ్ధిదారుల ఎంపికలో ఆధార్ తప్పనిసరైంది.

బిట్ కాయిన్.. బంగారు కొండ



కొంతకాలంగా సంచలనం సృష్టిస్తున్న వర్చువల్ కరెన్సీ బిట్‌కాయిన్. కేవలం సంక్లిష్టమైన ప్రోగ్రామింగ్ కోడ్‌ల ఆధారంగా రూపొందే క్రిప్టో కరెన్సీల జాబితాలోదే ఇది కూడా. కానీ ప్రతి లావాదేవీ నిక్షిప్తమయ్యే బ్లాక్‌చెయిన్, నిర్ణీతంగా మాత్రమే అందుబాటులో ఉండడం, యజమానుల వివరాలు రహస్యంగా ఉండడం, ప్రపంచవ్యాప్తంగా చాలా సంస్థలు కరెన్సీగా మార్పిడికి అంగీకరించడంతో డిమాండ్ బాగా పెరిగిపోయింది. 2010లో ఆమోదిత లావాదేవీలు మొదలైనా.. 2015 నుంచి జైత్రయాత్ర చేసింది. దీని విలువ ఏకంగా కొన్ని లక్షల రెట్లు పెరిగిపోయింది.

ఏమేం కొనొచ్చు?

BITCOIN ACCEPTED HERE!

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వివిధ సంస్థలు బిట్‌కాయిన్‌ను కరెన్సీగా అంగీకరిస్తున్నాయి. లావాదేవీ జరిగిన సమయంలో బిట్‌కాయిన్ విలువ ఆధారంగా ఈ కరెన్సీ మార్పిడి ఉంటుంది. మైక్రోసాఫ్ట్, డెల్, వర్జిన్ గెలాక్టిక్, హాలిడే ఇన్, సబ్‌వే, దిపైరేట్స్ బే, బ్లూమ్‌బర్గ్, అమెరికా డిష్ నెట్‌వర్క్ వంటి ప్రముఖ సంస్థలతో పాటు వందలాది ఆన్‌లైన్ షాపింగ్ సైట్లలో బిట్‌కాయిన్‌తో లావాదేవీలు నిర్వహించుకోవచ్చు.

ఉండేవి 2,10,00,000 మాత్రమే

అత్యంత క్లిష్టమైన ప్రోగ్రామింగ్ కోడ్‌లతో బిట్‌కాయిన్‌ను సృష్టిస్తారు. ఇలా కోడ్‌లను ఛేదించేవారిని బిట్‌కాయిన్ మైనర్లు అంటారు. ఒక రకంగా చెప్పాలంటే వజ్రాల్లా బిట్‌కాయిన్లను తవ్వి తీసేవారన్న మాట. దీని బేస్ ప్రోగ్రామ్ ప్రకారం.. మొత్తంగా 2.1 కోట్ల బిట్‌కాయిన్లను మాత్రమే సృష్టించగలరు. దీనివల్ల కూడా వీటికి ఇంత డిమాండ్.

en.bitcoin.it/ wiki/Main-Page

ఇది బిట్‌కాయిన్ వికీ..

బిట్‌కాయిన్ చరిత్ర, కొనుగోళ్ల నుంచి ప్రస్తుత ధర దాకా సమాచారం అందించేందుకు ఏకంగా వికీపీడియా తరహాలో ఓ వెబ్‌సైట్ ఉంది. ఈ వెబ్‌సైట్‌ను 'బిట్‌కాయిన్ వికీ'గా పిలుస్తారు. ఇందులో బిట్‌కాయిన్ల వినియోగం, అమ్మకం, కొనుగోళ్లు, నెట్‌వర్క్, దాని భద్రతకు తీసుకుంటున్న చర్యలు వంటి వివరాలన్నీ ఉంటాయి.

బిట్‌కాయిన్ మొదటి రిటైల్ లావాదేవీ: **2010 మే 22**
నాటి ధర: 25 పైసలు (0.004 డాలర్లు)

బిట్‌కాయిన్ గరిష్ఠ ధర నమోదైన రోజు: **2017 డిసెంబర్ 16**
ఆ రోజున విలువ: రూ. 12,20,738(19,194 డాలర్లు)

2018 జనవరి 30
నాటికి ఒక్కో బిట్‌కాయిన్ విలువ రూ. 7,14,228 (11,230 డాలర్లు)
ఏడున్నరేళ్లలో బిట్‌కాయిన్ విలువ పెరుగుదల శాతం..: **30 లక్షల రెట్లు**

సామ్‌సంగ్, మోటొరోలా కంపెనీలు సృష్టించాయా?

SAMSUNG
THOSHIBA
NAKAMICHI
MOTOROLA

'సతోషి నకమొటో'

బిట్‌కాయిన్‌ను సృష్టించినది ఎవరనేది ఇప్పటివరకు తేలక పోవడం గమనార్హం. తొలి బిట్‌కాయిన్ మైనర్ 'సతోషి నకమోటో' అనే మారుపేరుతో 2008లో బిట్‌కాయిన్‌ను సృష్టించారు. అసలు ఆ వ్యక్తి ఎవరనే వివరాలేవీ తెలియవు. తర్వాత మరికొందరు మైనర్లు కలసి బిట్‌కాయిన్లను సృష్టించడం మొదలు పెట్టారు. అయితే బిట్‌కాయిన్‌ను నాలుగు పెద్ద కంపెనీలు సామ్సంగ్, తోషిబా, నకమిచి, మోటోరోలా కలసి సృష్టించాయనే ప్రచారముంది. ఈ 4 కంపెనీల పేర్లలోని తొలి అక్షరాలను తీసుకునే.. 'సతోషి నకమొటో' పేరుతో తొలి మైనర్ వ్యవహరించారని చెబుతుంటారు. కానీ ఎవరూ నిర్ధారించలేదు.

రెండు పిజ్జాలు.. 714 కోట్లు


బిట్‌కాయిన్‌తో మొట్టమొదట కొనుగోలు చేసిన వస్తువేమిటో తెలుసా.. పిజ్జా. 2010 మే 22న లాజ్‌లో హన్యెజ్ అనే బిట్ కాయిన్ మైనర్ డోమినోస్ సంస్థ నుంచి రెండు పిజ్జాలు కొన్నారు. ఆ పిజ్జాల ధర 41 డాలర్లు (సుమారు రూ.2,500). ఈ సొమ్ము కింద 10,000 బిట్‌కాయిన్లు చెల్లించారు. ప్రస్తుతం 10 వేల బిట్‌కాయిన్ల విలువ మన కరెన్సీలో రూ. 714 కోట్లపైమాటే! ఈ లావాదేవీకి గుర్తుగా ఏటా మే22న 'బిట్‌కాయిన్ పిజ్జా డే'గా జరుపుకొంటున్నారు.




బడ్జెట్ హైలైట్స్

- జౌళి రంగానికి రూ.7,148కోట్లు
- ప్రధాన మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆర్థిక సహాయాన్ని ఫైనాన్స్ కార్పొరేషన్ అందజేస్తుంది.
- ఎయిర్‌పోర్ట్‌ల సామర్థ్యాన్ని ఐదు రెట్లు పెంచాలి. ఏడాదిలో బిలియన్ ట్రిప్పులను నిర్వహించే సామర్థ్యాన్ని సాధించాలి.
- రూ.17 వేల కోట్ల అంచనా వ్యయంతో ముంబైలో 160 కి.మీ. సబర్బన్ రైల్వే నెట్‌వర్క్ అభివృద్ధి.
- 2018–19 ఆర్థిక సంవత్సరానికి ఆహార సబ్సిడీ రూ.1.69 లక్షల కోట్లకు పెంపు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.1.4 లక్షల కోట్లే.
- దేశంలోని 600 ప్రధాన రైల్వే స్టేషన్ల అభివృద్ధికి చర్యలు.
- రైల్వేలకు స్థూల బడ్జెటరీ సహాయాన్ని రూ.3 లక్షల కోట్లకు పెంచారు. 2017–18లో ఇది రూ.2.73 లక్షల కోట్లు.

వ్యవసాయ, అనుబంధ రంగాలకు కేటాయింపులు రూ. కోట్లలో





సాగుకు సాయం.. రైతుకు మోదం

ఉత్పత్తి వ్యయం కన్నా 50% అధికంగా కనీస మద్దతు ధర

మత్స్య, పశు సంవర్థక రంగాల్లో మౌలిక సదుపాయాల కోసం		వ్యవసాయ రుణ మంజూరు లక్ష్యం
10,000	రూ. కోట్లలో	11,00,000

కుండల నిండా అన్నంతో, చూస్తూనే చవులూరించేలా రకరకాల కూరలతో, నోరూరించే అనేకానేక ఆదరువులతో... బకాసుర సంహారానికి బయల్దేరిన భీమసేనుడి బండి అక్షరాలా అన్నపు కొండనే తలపిస్తుంది! అలాగే మన దేశాన్ని అన్నపూర్ణగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా వ్యవసాయ రంగానికి తాజా బడ్జెట్ కేటాయింపుల్లో ఇతోధిక ప్రాధాన్యమిచ్చారు జైట్లీ...

న్యూఢిల్లీ

బడ్జెట్‌లో కీలక రంగాలపై దృష్టి సారించిన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ... వ్యవసాయ రంగానికి భారీ వరాలు గుప్పించారు. వరి తదితర ఖరీఫ్ పంటలకు ఉత్పత్తి వ్యయం కన్నా 50 శాతం అధికంగా మద్దతు ధర కల్పించేందుకు చర్యలు చేపడతామని ప్రకటించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.11 లక్షల కోట్లు పంట రుణాలు ఇస్తామని వెల్లడించారు. రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని.. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయడమే లక్ష్యమని తెలిపారు. వ్యవసాయ శాఖ బడ్జెట్ కేటాయింపులను గతేడాది (రూ.51,576 కోట్లు) కన్నా 13 శాతం అధికంగా రూ. 58,080 కోట్లకు పెంచారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనకు ఈసారి రూ.13,000 కోట్లు కేటాయించారు. దీనికి గతేడాది కేటాయింపులు రూ.10,698 కోట్లే.

ఖరీఫ్ పంటలకు మద్దతు

వరి, మొక్కజొన్న, సోయాబీన్, పప్పుధాన్యాల వంటి ఖరీఫ్ పంటలకు కచ్చితమైన కనీస మద్దతు ధర అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు జైట్లీ వెల్లడించారు. ఆయా పంటల ఉత్పాదక వ్యయానికి 50 శాతం అదనంగా జోడించి మద్దతు ధర అందిస్తామని ప్రకటించారు. పంట ఉత్పత్తుల ధరలు పడిపోయినా రైతులకు కనీస మద్దతు ధర కచ్చితంగా అందేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. రైతులకు తగిన మద్దతు ధర అందించేలా వ్యవస్థీకృత ఏర్పాట్లపై నీతి ఆయోగ్ రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తుందని తెలిపారు. రబీ పంటల మద్దతు ధరలను ఇప్పటికే పెంచినట్లు చెప్పారు. వ్యవసాయ భూముల యజమానులకు ఎలాంటి సమస్య తలెత్తకుండానే... కౌలు రైతులకు రుణాలు, నిధులు అందేలా చర్యలు చేపడతామని ప్రకటించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలతో నీతి ఆయోగ్ సంప్రదింపులు జరుపుతుందని తెలిపారు.

కూరగాయల ధరల నియంత్రణకు 'ఆపరేషన్ గ్రీన్స్'

ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు ఉండే ఉల్లి, టమాటా వంటి వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయల ధరల నియంత్రణ, పర్యవేక్షణ కోసం 'ఆపరేషన్ గ్రీన్స్'ను చేపడతామని జైట్లీ ప్రకటించారు. దేశంలో పాల ఉత్పత్తి పెంపునకు దోహదపడిన 'ఆపరేషన్ ఫ్లడ్'తరహాలో దీనిని చేపడతామని చెప్పారు. 'ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో)'లను ప్రోత్సహించేందుకు.. ఆయా ఉత్పత్తుల నిల్వ, రవాణా, ప్రాసెసింగ్, నిర్వహణ కోసం రూ.500 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రూ.100 కోట్లలోపు టర్నోవర్ ఉన్న ఎఫ్‌పీవోలకు పూర్తి పన్ను మినహాయింపు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

భారీగా వ్యవసాయ ఎగుమతుల లక్ష్యం

వివిధ వ్యవసాయోత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. దేశం నుంచి ప్రస్తుతం 30 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 2 లక్షల కోట్లు) విలువైన వ్యవసాయోత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని.. ఇవి 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 6.4 లక్షల కోట్లు)కు చేరే అవకాశముందని పేర్కొన్నారు. ముఖ్యంగా టీ, కాఫీ, పండ్లు, కూరగాయల ఎగుమతులను ప్రోత్సహిస్తామని, ఇందుకోసం నిబంధనలను సరళీకరిస్తామని ప్రకటించారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌కు ప్రోత్సాహం

ఫుడ్ ప్రాసెసింగ్‌కు గతేడాదికన్నా వంద శాతం అధికంగా రూ.1,400 కోట్లు కేటాయిస్తున్నట్లు జైట్లీ ప్రకటించారు. స్థానిక ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను రక్షించుకునేందుకు విదేశాల నుంచి దిగుమతయ్యే పలు ప్రాసెస్డ్ ఫుడ్‌పై కస్టమ్స్ సుంకాలను సవరిస్తున్నట్లు తెలిపారు. ఆరెంజ్ జ్యూస్‌పై 30 నుంచి 35 శాతానికి, ఇతర పళ్ల రసాలు, కూరగాయల జ్యూస్‌లపై 30 శాతం నుంచి 50 శాతానికి సుంకాన్ని పెంచారు. సోయా ప్రొటీన్ మినహా ఇతర వ్యవసాయ ప్రాసెస్డ్ ఉత్పత్తులపైనా సుంకాన్ని 50 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ముడి జీడిపప్పు దిగుమతి సుంకాన్ని 5 శాతం నుంచి 2.5 శాతానికి తగ్గిస్తున్నట్లు తెలిపారు. కాగా ఫుడ్ ప్రాసెసింగ్‌కు నిధులు పెంచడంపై ఆ శాఖ కేంద్ర మంత్రి హర్‌సిమ్రత్‌కౌర్ హర్షం వ్యక్తం చేశారు. దీనివల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందని, లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

లక్ష్యాలివీ..

- రైతులకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 11 లక్షల కోట్ల మేర పంట రుణాల మంజూరు లక్ష్యం. గత ఆర్థిక సంవత్సరం కంటే ఇది రూ.లక్ష కోట్లు అదనం.
- ఒక్కో జిల్లా పరిధిలో ఒక్కో తరహా పంట పండించేలా 'క్లస్టర్'ఆధారిత వ్యవసాయ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు చర్యలు. ఇందుకోసం ప్రస్తుత పథకాల్లో మార్పులు చేర్పులు.
- మత్స్య పరిశ్రమ, పశువుల పెంపకానికి మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.10,000 కోట్లతో ఇన్‌ఫ్రా ఫండ్ ఏర్పాటు.
- జాతీయ వెదురు మిషన్‌కు రూ.1,290 కోట్లు.. ఔషధ, సుగంధ ద్రవ్యాల మొక్కల పెంపకానికి రూ.200 కోట్లు.
- ఈ–నామ్ (జాతీయ వ్యవసాయ మార్కెట్) కింద ఈ ఏడాది మార్చి నాటికి దేశవ్యాప్తంగా ఉన్న మార్కెట్ల అనుసంధానం.
- దేశవ్యాప్తంగా మెగా ఫుడ్‌పార్కుల ఏర్పాటు. ప్రస్తుతమున్న 42 మెగా ఫుడ్‌పార్కుల్లో అత్యాధునిక సదుపాయాల కల్పనకు చర్యలు. శీతల గిడ్డంగుల నిర్మాణం. 'ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన'కింద రూ.1,313 కోట్లు కేటాయింపు.
- వ్యవసాయ మార్కెట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ఇన్‌ఫ్రా ఫండ్ కింద రూ.2,000 కోట్లు కేటాయింపు. దేశవ్యాప్తంగా 22 వేల సంతలను గ్రామీణ వ్యవసాయ మార్కెట్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు.
- వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్‌కు నిధులు అందించేందుకు ప్రత్యేకంగా 'ఆగ్రో–ప్రాసెసింగ్ ఫైనాన్షియల్'సంస్థల ఏర్పాటు.
- మత్స్య పరిశ్రమ, పశువుల పెంపకం చేపట్టే రైతులకు కూడా కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరు.

రైతుల ఆదాయం రెట్టింపు

రైతులు అధిక ఆదాయం పొందాలన్నదే మా లక్ష్యం. ప్రస్తుతం సాగు చేస్తున్న విస్తీర్ణంలో.. తక్కువ ఖర్చుతో ఇప్పటికన్నా ఎక్కువ దిగుబడి సాధించాలి. ఇదే సమయంలో పంటలకు ప్రస్తుతం కన్నా అధిక ధర పొందాలి. కేవలం మద్దతు ధరే కాదు.. అంతకన్నా ఎక్కువ ధర లభించాలి. 2022 నాటికి రైతుల ఆదాయం రెండింతలు కావాలన్నదే మా లక్ష్యం..

– అరుణ్ జైట్లీ

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటు

ఇది వినూత్న బడ్జెట్. వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. 2020 నాటికి రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ బడ్జెట్ తోడ్పడుతుంది..

– ఇఫ్కో ఎండీ అవస్థీ

ఇది రైతుల బడ్జెట్

బడ్జెట్‌లో వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఇది రైతుల బడ్జెట్. ఇక ముందు వ్యవసాయం నష్టదాయకం కాబోదు. దీనివల్ల యువత కూడా వ్యవసాయం వైపు మళ్లుతుంది.

– చౌదరి బీరేందర్‌సింగ్, కేంద్ర మంత్రి

47% దాకా 'మద్దతు'

ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో పేర్కొన్న ప్రకారం ఖరీఫ్ పంటలకు మద్దతు ధర 47% వరకు పెరుగుతుంది. పంటను బట్టి 8 శాతం నుంచి 47% వరకు పెరగవచ్చు. క్వింటాల్ రూ. 1,900గా ఉన్న రాగుల మద్దతు ధర రూ. 2,791కు చేరుతుంది.

– రమేశ్ చాంద్ (నీతి ఆయోగ్ సభ్యుడు)



నవభారత లక్ష్య సాధన దిశగా..!

- అభివృద్ధిని పరుగులు పెట్టించేలా రూపకల్పన
- జైట్లీ బడ్జెట్‌పై ప్రధాని ప్రశంసల జల్లు
- ఎన్‌పీఏలపై చర్యలను త్వరలో వెల్లడిస్తామని ప్రకటన

న్యూఢిల్లీ

2018–19 సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ప్రధాని మోదీ ప్రశంసించారు. 'ఈ బడ్జెట్ అభివృద్ధి అనుకూల, నవభారత నిర్మాణ లక్ష్యాలను బలపరిచేలా ఉంది. జైట్లీ, బడ్జెట్ బృందానికి అభినందనలు. రైతులు, దళితులు, గిరిజనులు దీని ద్వారా లబ్ధి పొందుతారు. గ్రామీణ భారతంలో కొత్త అవకాశాలు పెరిగేందుకు ఇది దోహదపడనుంది. రైతు, సామాన్యుడు, వ్యాపారస్తుల అనుకూల బడ్జెట్ ఇది. నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ), ఎమ్ఎస్ఎమ్ఈల మొండి బకాయిలను పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరలోనే చర్యలు చేపట్టనుంది' అని మోదీ పేర్కొన్నారు. వ్యవసాయం నుంచి మౌలిక వసతుల వరకు అన్ని రంగాల దృష్టిని ఆకర్షించేలా బడ్జెట్ ఉందన్నారు. 'దేశాభివృద్ధిని పరుగులు పెట్టించేలా పద్దును రూపొందించారు. జీవించేందుకు అనుకూల, వ్యాపారానుకూల వాతావరణాన్ని ఈ బడ్జెట్ సృష్టించింది. చాలాకాలంగా, ఎమ్ఎస్ఎమ్ఈ రంగం పన్నుల భారాన్ని మోస్తోంది. బడ్జెట్‌లో ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్పొరేట్ పన్నులను తగ్గించాం. గతంలో ఉన్న 30 శాతానికి బదులుగా ఇకపై 25 శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుంది' అని ప్రధాని తెలిపారు.


పేదల బతుకుల్లో 'ఆయుష్మాన్'

ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా పేదలు ఏడాదికి రూ.5లక్షల వరకు ఆసుపత్రి చికిత్స ఖర్చులను పొందవచ్చన్నారు. 'నాణ్యమైన వైద్యం అందుకోలేక ఇబ్బందిపడుతున్న పేదలకు ఇదో గొప్ప అవకాశం. పదికోట్ల కుటుంబాలు (40–50 కోట్ల మంది) ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతాయి. ప్రపంచంలో ప్రభుత్వ నిధులతో జరిగే అతిపెద్ద వైద్య సహాయం ఇదే' అని ప్రధాని పేర్కొన్నారు. కొత్త విమానాశ్రయాలు, పోర్టులు, రైల్వే ట్రాక్‌లు, మెట్రో ప్రాజెక్టుల ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. '125కోట్ల మంది భారతీయుల కలల బడ్జెట్ ఇది. మన రైతులు రికార్డు స్థాయిలో ధాన్యాలు, కూరగాయలు ఉత్పత్తి చేస్తున్నారు. వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేసేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాం' అని మోదీ తెలిపారు. అనంతరం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని అమలుచేస్తోందన్నారు.

పరిశీలనలో రైల్వేల ప్రైవేటీకరణ

న్యూఢిల్లీ: ప్రైవేటు సంస్థలు రైల్వే లైన్లను సొంతంగా నిర్మించి, నిర్వహించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని రైల్వే బోర్డు సీనియర్ అధికారులు గురువారం చెప్పారు. ప్రాజెక్టులకు మొత్తం వ్యయాన్ని ప్రైవేటు సంస్థలే భరించి, రైల్వేకు లైసెన్సు ఫీజు మాత్రం చెల్లించేలా ఈ ప్రతిపాదన ఉందని వారు వెల్లడించారు. రైల్వే మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ 'రైల్వే రంగంలోనూ ప్రైవేటు కంపెనీలు రావాలి. ప్రైవేటును అనుమతిస్తేనే రైల్వేల సామర్థ్యం పెరుగుతుంది. ఎక్కువ పెట్టుబడులు వస్తాయి' అని అన్నారు. 150 ఏళ్ల నాటి సిగ్నలింగ్ వ్యవస్థ కారణంగానే రైళ్ల రాకపోకల్లో ఆలస్యం చోటు చేసుకుంటోందని, వచ్చే ఆరేళ్లలో మొత్తం సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అపూర్వ బడ్జెట్: అడ్వాణీ



న్యూఢిల్లీ: కేంద్రం అపూర్వమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అడ్వాణీ కొనియాడారు. 'ప్రజా సంక్షేమం కేంద్రంగా ఆర్థికవృద్ధిపై బీజేపీ దృష్టి సారించడం ఆనందంగా ఉంది. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఉన్నత స్థాయి లక్ష్యాలు, నిబద్ధత ఉన్న ఇలాంటి బడ్జెట్‌ను గతంలో నేనెన్నడూ చూడలేదు. భారత్ ఉజ్వలమైన భవిష్యత్‌వైపు దూసుకెళ్తుంది. ఈ బడ్జెట్ దేశాన్ని, బీజేపీని గర్వపడేలా చేసింది. ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నా'అని అడ్వాణీ తెలిపారు.

రెట్టింపు ఆదాయం అసాధ్యం: మన్మోహన్



న్యూఢిల్లీ: 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం అసాధ్యమని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అభిప్రాయపడ్డారు. వ్యవసాయ వృద్ధిరేటు 12 శాతానికి చేరనిదే ఆ లక్ష్యం నెరవేరదన్నారు. ఆర్థిక లోటు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. హామీలను ప్రభుత్వం ఎలా నెరవేరుస్తుందో చూడాలన్నారు. ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకే ప్రకటించిన ఇలాంటి బడ్జెట్‌ను తాను తప్పు పట్టడంలేదని అన్నారు. ఈ బడ్జెట్ సంస్కరణల ఆధారితమా అని ప్రశ్నించగా..'సంస్కరణలు'అనే పదాన్ని అతిగా వాడి దుర్వినియోగం చేశామని అన్నారు.

హమ్మయ్యా.. మరో ఏడాదే మోదీ పాలన: రాహుల్




న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ వ్యంగ్యంగా స్పందించారు. దేశ ప్రజల అదృష్టం కొద్దీ మోదీ ప్రభుత్వ పాలన ఇంకా ఏడాది మాత్రమే ఉందన్నారు. 'అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అయిపోయినా.. ఇంకా రైతుల పంటకు మద్దతు ధర కల్పిస్తామని బీజేపీ హామీలు ఇస్తూనే ఉంది. నాలుగేళ్లలో దేశంలోని యువతకు ఎలాంటి ఉద్యోగావకాశాలు కల్పించలేదు. మన అదృష్టం కొద్దీ మోదీ పాలన ఇంకో ఏడాది మాత్రమే ఉంటుంది'అని రాహుల్ ట్వీట్ చేశారు.

ఇదీ బడ్జెట్ స్వరూపం

(అంకెలు రూ.కోట్లలో)

	2016-2017 వాస్తవ కేటాయింపులు	2017-2018 బడ్జెట్ అంచనాలు	2017-2018 సవరించిన అంచనాలు	2018-2019 బడ్జెట్ అంచనాలు
1. రెవిన్యూ వసూళ్లు(2+3)	13,74,203	15,15,771	15,05,428	17,25,738
2. పన్ను ఆదాయం	11,01,372	12,27,014	12,69,454	14,80,649
3. పన్నేతర ఆదాయం	2,72,831	2,88,757	2,35,974	2,45,089
4. మూలధన వసూళ్లు(5+6+7)	6,00,991	6,30,964	7,12,322	7,16,475
5. రుణాల రికవరీ	17,630	11,933	17,473	12,199
6. ఇతర వసూళ్లు	47,743	72,500	1,00,000	80,000
7. అప్పులు, ఇతరత్రా వసూళ్లు	5,35,618	5,46,531	5,94,849	6,24,276
8. మొత్తం వసూళ్లు(1+4)	19,75,194	21,46,735	22,17,750	24,42,213
9. పథకాలుకాక ఇతర వ్యయం(10+13)	19,75,194	21,46,735	22,17,750	24,42,213
10. రెవిన్యూ ఖాతా	16,90,584	18,36,934	19,44,305	21,41,772
11. వడ్డీ చెల్లింపులు	4,80,714	5,23,078	5,30,843	5,75,795
12. మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు	1,65,733	1,95,350	1,89,245	1,95,345
13. మూలధన ఖాతా	2,84,610	3,09,801	2,73,445	3,00,441
14. రెవెన్యూ లోటు(10-1)	3,16,381	3,21,163	4,38,877	4,16,034
15. నికర రెవిన్యూ లోటు(14-12)	1,50,648	1,25,813	2,49,632	2,20,689
16. ద్రవ్య లోటు [9-(1+5+6)]	5,35,618	5,46,531	5,94,849	6,24,276
17. ప్రాథమిక లోటు (16-11)	54,904	23,453	64,006	48,481





బడ్జెట్ హైలైట్స్


- 2018-19లో ఎస్సీల సంక్షేమానికి రూ.56,619 కోట్లు.. ఎస్టీల సంక్షేమానికి రూ.39,135 కోట్లు కేటాయింపు.
- ముద్రా పథకం కింద రుణ లక్ష్యం రూ. 3 లక్షల కోట్లు.
- డిజిటల్ ఇండియా పథకానికి రూ. 3,073 కోట్లు కేటాయింపు.
- టెలికం రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 10 వేల కోట్ల కేటాయింపు.
- మౌలిక వసతుల రంగానికి ప్రాధాన్యత. రూ. 5.97 లక్షల కోట్లు కేటాయింపు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.4.94 లక్షల కోట్లు కేటాయించిన ప్రభుత్వం.
- ప్రతి వ్యాపార సంస్థకు ఆధార్ తరహాలో గుర్తింపు సంఖ్య.
- 2018-19 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.80 వేల కోట్లు.
- గోల్డ్ పాలసీని రూపొందిస్తున్నట్లు ప్రకటన.

విద్యా రంగానికి కేటాయింపులు(రూ. కోట్లలో)



లక్ష కోట్లతో 'రైజ్'

పిట్ట కన్ను మినహా మరేదీ కనిపించనంతటి ఏకాగ్రత పాండవ మధ్యముడిదైతే... గిరిజనుడిగా పుట్టినా, మట్టిబొమ్మలోనే గురువును ఆవాహన చేసి విలువిద్యలో సాటిలేని మేటిగా నిలిచిన పట్టుదల ఏకలవ్యుడిది...! భావి భారత పౌరులను కూడా ఇదే తరహాలో సాన పెట్టడమే లక్ష్యమని పేర్కొన్నారు జైట్లీ. గిరిజనుల కోసం ఏకలవ్య గురుకుల పాఠశాలలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. విద్యా రంగానికి కేటాయింపులు కూడా భారీగా చేశారు...



ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటన

- బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.85 వేల కోట్లు
- ఉన్నత విద్యాసంస్థల్లో పరిశోధనలకు ప్రోత్సాహం
- ఏటా 1,000 మంది బీటెక్ విద్యార్థులకు పీఎం ఫెలోషిప్‌లు
- గిరిజన ప్రాంతాల్లో 'ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లు'
- కొత్త ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విద్యాసంస్థలు
- ఉపాధ్యాయులకు శిక్షణ కోసం సమీకృత బీఈడీ కోర్సులు
- ప్రతి మూడు పార్లమెంట్ నియోజకవర్గాలకు ఒక వైద్య కళాశాల

న్యూఢిల్లీ

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగం అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. ఈ రంగానికి రూ.85,010 కోట్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. ఇందులో రూ.35,010 కోట్లు ఉన్నత విద్యారంగానికి, రూ.50,000 కోట్లు పాఠశాల విద్యకు కేటాయించామన్నారు. వచ్చే నాలుగేళ్లలో ఉన్నత విద్యాసంస్థల్లో పరిశోధనలను ప్రోత్సహించడానికి, మౌలిక సదుపాయాలు కల్పించడానికి రూ.లక్ష కోట్లతో 'రివైటలైజింగ్ ఆఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సిస్టమ్ ఇన్ ఎడ్యుకేషన్(రైజ్)' పేరిట ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ఫండింగ్ ఏజెన్సీ ద్వారా ఈ నిధులు కేటాయిస్తామన్నారు. 'ప్రధాన మంత్రి ఫెలోషిప్ పథకం'కింద ప్రతిఏటా ప్రముఖ విద్యాసంస్థల నుంచి అత్యంత ప్రతిభావంతులైన 1,000 మంది బీటెక్ విద్యార్థులను గుర్తించి, వారికి ఐఐటీలు, ఐఐఎస్సీలో పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పిస్తామన్నారు. అంతేకాకుండా ఆకర్షణీయమైన ఉపకార వేతనం అందజేస్తామని తెలిపారు.

బ్లాక్ బోర్డుల నుంచి డిజిటల్ బోర్డులకు..

వడోదరలో స్పెషలైజ్డ్ రైల్వే యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు అరుణ్ జైట్లీ ప్రకటించారు. అలాగే పూర్తిస్థాయిలో రెండు కొత్త ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా ఐఐటీలు, ఎన్ఐటీల్లో స్వయం ప్రతిపత్తి కలిగిన 18 ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ స్కూళ్లను నెలకొల్పనున్నట్లు తెలిపారు. విద్యారంగంలో నాణ్యత నానాటికీ పడిపోతోందని జైట్లీ ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలను పాఠశాలలకు రప్పించగలుగుతున్నాం కానీ వారికి నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నామని చెప్పారు. పాఠాలు బోధించే ఉపాధ్యాయుల్లో నాణ్యత పెరిగితే విద్యలోనూ నాణ్యత తప్పనిసరిగా పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయుల కోసం సమీకృత బీఈడీ కోర్సులను ప్రవేశపెడతామన్నారు. 13 లక్షల మందికిపైగా టీచర్లకు శిక్షణ ఇస్తామన్నారు. ఇటీవల ప్రారంభించిన 'దీక్షా'పోర్టల్ ద్వారా ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. విద్యారంగంలో డిజిటల్‌కు ప్రాధాన్యం పెరగాల్సి ఉందని వివరించారు. బ్లాక్ బోర్డుల నుంచి డిజిటల్ బోర్డుల వైపు వెళ్లాలని సూచించారు. 50 శాతానికి పైగా గిరిజన జనాభా గల ప్రాంతాలు లేదా 20 వేల గిరిజన జనాభా ఉన్న ప్రతిచోట నవోదయ విద్యాలయాల తరహాలో 2022 నాటికి 'ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ఏర్పాటు చేయనున్నట్లు జైట్లీ వెల్లడించారు.

24 కొత్త మెడికల్ కాలేజీలు

దేశంలో వైద్యుల–రోగుల నిష్పత్తిలో అంతరాన్ని పూరించేందుకు 24 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేయనున్నట్లు అరుణ్ జైట్లీ ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న జిల్లా ఆసుపత్రుల స్థాయిని పెంచుతూ ఈ కళాశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మూడు పార్లమెంట్ నియోజకవర్గాలకు కనీసం ఒకటి చొప్పున మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

విద్య, వైద్యం సెస్సు 4 శాతానికి పెంపు

వ్యక్తిగత ఆదాయపు పన్ను, కార్పొరేట్ పన్నులపై 3 శాతంగా ఉన్న విద్య సెస్సును 'విద్య, వైద్యం సెస్సు'కింద 4 శాతానికి పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. పేద, గ్రామీణ కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ పెంపు ద్వారా రూ.11 వేల కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

బడ్జెట్ టాప్ 5

ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్, 2018–19 సంవత్సరానికి తన బడ్జెట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో కొన్ని బడా దేశాల బడ్జెట్లపై దృష్టి సారిద్దాం. సీఐఏ వరల్డ్ ఫ్యాక్ట్‌బుక్ అత్యధిక మొత్తాలతో బడ్జెట్లు ప్రవేశపెట్టే దేశాల జాబితా రూపొందించింది. ఇందులో భారత్ 22వ స్థానంలో ఉంది. 2016వ సంవత్సరం నాటి గణాంకాల ప్రకారం టాప్ 5 బడ్జెట్ల వివరాలు... (రూ.లక్షల కోట్లలో)


అమెరికా
రెవెన్యూ : 391
వ్యయం : 446
లోటు : 55





చైనా
రెవెన్యూ : 217
వ్యయం : 245
లోటు : 28


జపాన్
రెవెన్యూ : 116
వ్యయం : 132
లోటు : 16





జర్మనీ
రెవెన్యూ : 103
వ్యయం : 101
మిగులు : 2

ఫ్రాన్స్
రెవెన్యూ : 88
వ్యయం : 93
లోటు : 5






1947


ఇప్పుడు బడ్జెట్ లెక్కలన్నీ వేలు, లక్షల కోట్లలోనే.. మరి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్ లెక్కేంటి? అప్పుడు మన ఆదాయం ఎంత? రక్షణ శాఖ బడ్జెట్ ఎంత? ఆ వివరాలు తెలుసుకుందామా.. (అంకెలు రూ.కోట్లలో)

మంత్రి:	ఆర్కే షణ్ముగం చెట్టి,
తేదీ:	1947, నవంబర్ 26
రెవెన్యూ అంచనా:	171.15
రెవెన్యూ వ్యయం:	197.39
రెవెన్యూ లోటు:	26.24
రక్షణశాఖకు:	92.74
ఆదాయపు పన్ను ద్వారా ఆదాయం:	119
కస్టమ్స్ ఆదాయం:	50.5
ఫారెక్స్ నిల్వలు:	1,547



గణతంత్ర భారత దేశంలో మొట్టమొదటి బడ్జెట్‌ను జాన్ మతాయ్ 1950 ఫిబ్రవరి 28న సభలో ప్రవేశపెట్టారు.

'పేదలు, రైతుల ఆకాంక్షలకు ఊతం'



న్యూఢిల్లీ: 'ఆర్థికమంత్రి జైట్లీ గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలోని పేదలు, రైతులు, మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలకు ఊతమిచ్చేలా ఉందని బీజేపీ చీఫ్ అమిత్ షా ప్రశంసించారు. 'గ్రామీణ, వ్యవసాయ రంగాలకు రికార్డు స్థాయిలో నిధుల కేటాయింపులతో గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్లడంతో పాటు అద్భుతమైన వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుంది. రైతుల పంటకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)ను ప్రభుత్వం ఒకటిన్నర రెట్లు పెంచింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని ఇది ధ్రువపరుస్తోంది. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సాధికారత కల్పించడంతో పాటు వారి సంక్షేమానికి ఈ న్యూ ఇండియా బడ్జెట్ దోహదం చేస్తుంది'అని షా ట్వీటర్‌లో వెల్లడించారు. బడ్జెట్‌లో 2018–19 సంవత్సరానికి ముద్ర పథకం కింద రూ.3 లక్షల కోట్లు కేటాయించినందుకు ప్రభుత్వానికి షా ధన్యవాదాలు తెలిపారు. ఈ బడ్జెట్ రైతులు, గ్రామీణ రంగం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతమిచ్చేలా ఉందని పునరుద్ఘాటించారు. 2022 నాటికల్లా సరికొత్త భారతాన్ని ఆవిష్కరించాలన్న ప్రభుత్వ కల సాకారానికి, సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి ఫలాలు అందుకోవడానికి ఈ బడ్జెట్ దోహదం చేస్తుందని పేర్కొన్నారు.దాదాపు 10 కోట్ల మందికి ఆరోగ్య రక్షణ కల్పించే మోదీ కేర్ పథకానికి మంచి స్పందన వచ్చిందని వెల్లడించారు. స్వచ్ఛభారత్ కింద 2018–19లో 2 కోట్ల మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు షా తెలిపారు.

'ప్రగతిశీల సానుకూల భారత బడ్జెట్'



న్యూఢిల్లీ: 2018–19 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం 'ప్రగతిశీల, సానుకూల భారత్'బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. గ్రామీణ, పట్టణ భారతాల మధ్య ఉన్న అంతరాన్ని రూపుమాపేందుకు ఈ బడ్జెట్ దోహదం చేస్తుందని తెలిపారు. 'ప్రగతిశీల, సానుకూల భారతం కోసం దోహదం చేసే బడ్జెట్ ఇది. ఈసారి బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రాధమ్యాలు మారాయి. ఇది దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి దోహదం చేస్తుంది. సరికొత్త భారతం కోసం చారిత్రక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి జైట్లీకి అభినందనలు. ప్రధాన మంత్రి ఉజ్వల్ యోజన పరిధిలోకి 8 కోట్ల కుటుంబాలను తీసుకురావడం.. సాధారణ ప్రజల జీవితాలను మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నిరూపిస్తోంది. గత కొన్నేళ్లలో వచ్చిన బడ్జెట్లలో రైతులు, ప్రజలకు అత్యంత అనుకూలంగా ఉన్న బడ్జెట్లలో ఇదొకటి. ప్రతి పేద, బలహీన కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున 10 కోట్ల కుటుంబాలకు ఆరోగ్యబీమా కల్పించడం ఆరోగ్యరంగంలో తీసుకొచ్చిన గొప్ప మార్పు. ప్రభుత్వం తీసుకురానున్న ఆపరేషన్ గ్రీన్ పథకంతో అద్భుతమైన వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుంది. తద్వారా 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోగలం'అని రాజ్‌నాథ్ వెల్లడించారు.




జిల్లాకో నైపుణ్య కేంద్రం ఏర్పాటు

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి కౌశల్ కేంద్ర పథకం కింద ప్రతి జిల్లాలో ఓ నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని జైట్లీ గురువారం పార్లమెంటులో ప్రకటించారు. ఇందుకోసం 2018–19 బడ్జెట్‌లో రూ.3,400 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ పథకానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.2,356.22 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించడానికి దేశవ్యాప్తంగా ఇప్పటికే 306 ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

కొన్ని సమస్యల్నే ప్రస్తావించింది

బడ్జెట్‌పై రంగరాజన్ వ్యాఖ్య



చెన్నై / వాషింగ్టన్: ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో కొన్నింటిని మాత్రమే ప్రస్తావించిందని ప్రముఖ ఆర్థికవేత్త, ప్రధాని ఆర్థిక సలహా మండలి మాజీ చైర్మన్ సి.రంగరాజన్ అభిప్రాయపడ్డారు. 'ఆర్థిక వృద్ధి నెమ్మదించడం, ప్రైవేటు పెట్టుబడులు తగ్గిపోవడం, వ్యవసాయ సంక్షోభం ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయ సంక్షోభంతో పాటు ప్రైవేటు పెట్టుబడుల గురించి కొద్దిగా ప్రస్తావించారు. కేవలం ఈ బడ్జెట్ సాయంతో ఆర్థిక వృద్ధి సాధ్యమా? అంటే అది అనుమానాస్పదమే. ఒకవేళ దేశంలోకి పెట్టుబడుల రాక పెరిగితే ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుంది. అందుకే నేను ఈ బడ్జెట్ కొన్ని సమస్యల్ని మాత్రమే స్పృశించిందనీ, అన్ని సమస్యల్ని ప్రస్తావించలేదని చెప్పాను' అని రంగరాజన్ వ్యాఖ్యానించారు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్యారంగానికి నిధుల కేటాయింపులు పెరగడం ఈ బడ్జెట్ విశేషమని రంగరాజన్ తెలిపారు. ఈ మార్పులు సరైన దిశలోనే సాగుతున్నాయని వెల్లడించారు. ఇకపై ఆర్థికలోటు ఎట్టిపరిస్థితుల్లోనూ పెరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. జైట్లీ ప్రకటించిన జాతీయ ఆరోగ్య రక్షణ పథకంపై మరింత స్పష్టత రావాల్సిన అవసరముందని రంగరాజన్ అభిప్రాయపడ్డారు.

ఆచరణీయ బడ్జెట్: పనగరియా

కేంద్ర బడ్జెట్ ఆచరణీయంగా ఉందని నీతి ఆయోగ్ మాజీ చైర్మన్ అరవింద్ పనగరియా తెలిపారు. 'మొత్తం బడ్జెట్‌లో దాదాపు 10 కోట్ల కుటుంబాలను బీమా పరిధిలోకి తీసుకొచ్చే జాతీయ ఆరోగ్య రక్షణ పథకం అత్యంత ముఖ్యమైనది. ఇది దేశంలోని ప్రజల్ని సార్వత్రిక ఆరోగ్య బీమావైపు తీసుకెళ్తుంది. ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆచరణీయంగా ఉంది. జీఎస్టీ అమలుతో పరోక్ష పన్నులు కేవలం 11 నెలలకే వసూలు చేయగలిగారు. అలాగే నామమాత్రపు వృద్ధిరేటు కూడా అనుకున్నంతగా లేకపోవడంతో ఆర్థిక లోటు 3.2 శాతం నుంచి 3.5 శాతానికి చేరుకుంది' అని వెల్లడించారు.

ఇది ఎన్నికల బడ్జెట్: శివసేన

ముంబై: 2019లో పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేంద్రం ఈ సారి 'ఎన్నికల బడ్జెట్'ను ప్రవేశపెట్టిందని శివసేన ఎంపీ అరవింద్ సావంత్ విమర్శించారు. 'ఇదో ఎన్నికల బడ్జెట్. అందువల్లే కేంద్రం ధ్యాస పరిశ్రమల నుంచి రైతులు, విద్య, ఆరోగ్య రంగాలపైకి మళ్లింది. గుజరాత్ ఎన్నికల ఫలితాలతో పాటు వస్తుసేవల పన్ను(జీఎస్టీ), నోట్ల రద్దుపై విమర్శలు వెల్లువెత్తడంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బ్యాంకుల సర్వీస్ చార్జీలు గత కొంతకాలంగా పెరుగుతూనే ఉన్నాయి. దీన్నుంచి సామాన్యుడికి ఉపశమనం లభించేదెప్పుడు? ఈసారి బడ్జెట్‌లో శానిటరీ నాప్‌కీన్స్‌పై జీఎస్టీని తగ్గిస్తారని మహిళలందరూ ఆశించారు. కానీ దాని ఊసేలేదు. దేశంలో ద్రవ్యోల్బణం తగ్గడంపై కేంద్రం మాట్లాడుతోంది. కానీ పెట్రోల్, డీజిల్ ధరలు ఎన్నడూ లేనంతగా పెరిగిపోవడంపై ప్రభుత్వం ప్రజలకు జవాబివ్వాలి'అని సావంత్ తెలిపారు.

ముద్రా యోజనకు రూ.3 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: స్వయం ఉపాధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముద్రా యోజన పథకంపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వరాల జల్లు కురిపించారు. 2018–19 ఆర్థిక సంవత్సరానికి ముద్రా పథకం కింద రూ.3 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. 2015 ఏప్రిల్‌లో ప్రారంభించిన ముద్రా యోజన పథకం ద్వారా రూ.4.6 లక్షల కోట్ల రుణాలను ఇచ్చారు. ఈ పథకం కింద 10.38 కోట్ల మంది లబ్ధిపొందారు. రుణ ఖాతాలు ఉన్న వారిలో 76 శాతం మంది మహిళలు ఉండగా, 50 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు ఉన్నారని జైట్లీ తెలిపారు. ప్రధాన మంత్రి ముద్రా యోజన(పీఎంఎంవై)లో శిశు, కిషోర్, తరుణ్ అనే పథకాల కింద రుణాలను ఇస్తారు.

డీవోపీటీకి రూ. 192 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దేశ విదేశాల్లో శిక్షణ ఇచ్చేందుకు, అందుకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖకు 2018–19 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రూ.192 కోట్లు కేటాయించారు. ఈ మొత్తంలో రూ.75.35 కోట్లతో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ అండ్ మేనేజ్‌మెంట్(ఐఎస్‌టీఎం), లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(ఎల్‌బీఎస్ఎన్ఏఏ) సంస్థల్లో మౌలిక వసతులు కల్పించనున్నారు. ఎల్‌బీఎస్ఎన్ఏఏ ఆధునీకరణకు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఐఎస్‌టీఎంను అభివృద్ధి చేసేందుకు మిగిలిన రూ.116.75 కోట్లు ఖర్చు చేయనున్నారు. కాగా, గతేడాది ఈ శాఖకు రూ.194.3 కోట్లను కేటాయించిన సంగతి విదితమే. దీంతో పాటు కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ), పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డుకు రూ.26.54 కోట్లు, సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యునల్(క్యాట్)కు రూ.111.86 కోట్లు కేటాయించారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)కు రూ. 286.13 కోట్లు, ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల నివాస సముదాయాల నిర్మాణానికి అడ్వాన్స్‌గా రాష్ట్రాలకు రూ.1.65 కోట్లు కేటాయించారు.

తయారీకి చేయూత

- సిల్క్ వస్త్రాలపై కస్టమ్స్ డ్యూటీ పెంపు
- మరికొన్ని ఉత్పత్తులపైనా ఇదే విధమైన చర్య



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'భారత్‌లో తయారీ'లో భాగంగా దేశీ తయారీని ప్రోత్సహించే చర్యలను ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టారు. పది రంగాలకు సంబంధించి దిగుమతి చేసుకునే పలు ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకాలను భారీగా పెంచారు. చైనా నుంచి చౌకగా వచ్చి పడుతున్న దిగుమతులను నియంత్రించడంతో పాటు, దేశీయంగా ఉపాధిని పెంచేందుకు ఈ చర్యలు తీసుకున్నారు. సిల్క్ ఫ్యాబ్రిక్స్‌పై కస్టమ్స్ సుంకాన్ని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ రెట్టింపు చేశారు. ప్రస్తుతం ఇది 10 శాతం ఉండగా దీన్ని 20 శాతంగా బడ్జెట్లో పేర్కొన్నారు. అయితే ఈ చర్యను సిల్క్ ఎగుమతిదారుల సమాఖ్య మాత్రం వ్యతిరేకించింది. ఎగుమతులపై ఇది ప్రభావం చూపిస్తుందని సమాఖ్య చైర్మన్ సతీష్ గుప్తా ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, మొబైల్ ఫోన్లపై 15 శాతంగా ఉన్న కస్టమ్స్ సుంకాన్ని 20 శాతం చేశారు. మొబైల్ యాక్సెసరీలపై 7.5 శాతం నుంచి 15 శాతానికి, టీవీలపైనా 15 శాతానికి కస్టమ్స్ సుంకాన్ని పెంచారు. కొత్తగా చార్జింగ్ అడాప్టర్లపై 10 శాతం సుంకం ప్రవేశపెట్టారు. ముఖ్యంగా పళ్లరసాలపై భారీగా పెంచారు. కాన్‌బెర్రీ జ్యూస్‌పై ఐదు రెట్లు పెంచి 50 శాతం చేశారు. అన్ని రకాల పళ్ల, కూరగాయల జ్యూస్‌పైనా 30 నుంచి 50 శాతం చేశారు. సిల్క్ ఫ్యాబ్రిక్స్ మాదిరే పాదరక్షలపైనా దిగుమతి సుంకాన్ని 20 శాతానికి పెంచారు. ఫర్నిచర్, ల్యాంపులు, కళ్లద్దాలు, కొవ్వొత్తులు, పతంగులు, లైటర్లు, సెంట్ స్ప్రేయర్లు, పెర్‌ఫ్యూమ్‌లు, గడియారాలు, ఆట వస్తువులపైనా రెట్టింపైంది. ఆటోమొబైల్ విడిభాగాలు, కొన్ని రకాల యాక్సెసరీలు, మోటారు కార్లు, మోటారు సైకిళ్లపై 7.5–10 శాతం మధ్య పన్ను ఉండగా దాన్ని 15 శాతానికి పెంచారు.

ఘనవ్యర్థాల నిర్వహణకు 'గోబర్ ధన్'

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 'స్వచ్ఛ భారత్ మిషన్'కింద 2 కోట్ల మరుగుదొడ్లు నిర్మించాలని కేంద్రం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అలాగే ఘనవ్యర్థాల నిర్వహణ కోసం గోబర్–ధన్ అనే పేరుతో కొత్త పథకాన్ని ప్రతిపాదించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని మరుగుదొడ్లు నిర్మిస్తామని గురువారం లోక్‌సభలో బడ్జెట్ ప్రసంగంలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద ఇప్పటికే 6 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించినట్లు జైట్లీ పేర్కొన్నారు. దీంతో దేశంలోని మహిళల గౌరవం, బాలికల విద్య.. మొత్తంగా కుటుంబ ఆరోగ్యం మెరుగుపడిందని చెప్పారు. భారత్‌ను బహిరంగ మలవిసర్జన రహిత దేశంగా మార్చే లక్ష్యంలో భాగంగా గోబర్–ధన్ (గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయో–ఆగ్రో రిసోర్సెస్ ధన్) కార్యక్రమాన్ని ప్రతిపాదిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పశువుల పేడ, ఘన వ్యర్థాలను కంపోస్ట్, ఎరువులు, బయోగ్యాస్‌లా మార్చడంలో తోడ్పడుతుందని పేర్కొన్నారు.



బడ్జెట్ హైలైట్స్

- → రూ.5 లక్షల కోట్ల అదనపు రుణాలు అందించేలా బ్యాంకులకు మూలధన సాయం.
- → ఎంపీల వేతనం, నియోజకవర్గ అలవెన్సు, ఆఫీసు ఖర్చులు, అలవెన్సుల్లో మార్పులకు ప్రతిపాదన. ద్రవ్యోల్బణం ఆధారంగా ఐదేళ్లకోసారి వేతనాల సమీక్షకు చర్యలు.
- → 2018–19 ఆర్థిక సంవత్సరంలో రక్షణ శాఖకు రూ.2.82 లక్షల కోట్ల కేటాయింపు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది 2.67 లక్షల కోట్లు.
- → జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాల కోసం రూ.150 కోట్లు కేటాయింపు.
- → 2018 జనవరి 15 వరకూ ప్రత్యక్ష పన్నుల వసూలు 18.7 శాతం వృద్ధి.
- → 2016–17 ఆర్థిక సంవత్సరంలో రూ.250 కోట్ల టర్నోవర్ కలిగిన సంస్థలపై కార్పొరేట్ పన్ను 25 శాతానికి తగ్గింపు.

రక్షణ కేటాయింపులు (రూ. కోట్లలో)



నాణేనికి మరోవైపు..

బడ్జెట్ అంటే అంతా డబ్బుతో పని. ఇప్పుడంటే అంతా నోట్లలోనే నడుస్తోంది గానీ.. గతంలో అన్నీ నాణేలే. మరి దేశంలోని మొదటి నాణెం నుంచి మనం స్వర్ణయుగమని చెప్పుకునే గుప్తుల నుంచి విజయనగర రాజుల వరకూ, అటు మొగలుల నుంచి ఇటు హైదరాబాద్ నిజాం కాలం వరకూ నాణేలు ఎలా ఉండేవి.. ఇదిగో ఇలా ఉండేవి.

ఇండో-గ్రీక్



కుషాణులు



గుప్తులు



బాల్బన్



ఖిల్జీలు



విజయనగర రాజులు





మహమ్మద్ బిన్ తుగ్లక్. దేశంలో ఈయనొక్కడే ఈ తోలు నాణేలను ప్రవేశపెట్టాడు.

అక్బర్‌కాలంనాటి మొహర్





ఔరంగజేబు కాలం నాటి మొహర్

మరాఠాలు



అవధ్ రాజ్యం




సిక్కులు



హైదరాబాద్ అష్రఫీ



నాణెం నోటు



ఇదే ప్రపంచంలో మొదటి నాణెం

దేశంలో ఇదే తొలి పంచ్‌మార్క్ నాణెం





నిజాం కాలంలోని పైసా

నిజాం కాలంలో రూపాయి



నిజాం కాలంనాటి నోట్లు

ఇది రూపాయి నోటు...




5 రూపాయల నోటు ఇదే...



10 రూపాయల నోటు ఇలా ఉండేది...



మహిళల జీవితాల్లో ఉజ్వల



8	కోట్ల మంది పేదలకు ఉచిత ఎల్పీజీ కనెక్షన్లు	స్వయం సహాయక బృందాల రుణాలు	రూ.42,500	కోట్లకు పెంపు

అష్ట సతుల్లోనూ కృష్ణునికి అత్యంత ఇష్టురాలు సత్య. నారీ శక్తికి, స్త్రీ ఆత్మగౌరవానికి తిరుగులేని ప్రతీక. నరకునితో పోరుతూ వాసుదేవుడు సొమ్మసిల్లిన వేళ విల్లు చేపట్టి అంతటి రాక్షసుణ్నీ అలవోకగా నిలువరిస్తుంది. ఆధునిక భారత మహిళను సత్యభామలా సాధికార పరచడమే లక్ష్యంగా ఈ బడ్జెట్లో పలు కీలక కేటాయింపులు చేశారు అరుణ్ జైట్లీ...

మహిళా ఉద్యోగులకు ఈపీఎఫ్ కంట్రిబ్యూషన్‌లో వెసులుబాటు

బడ్జెట్‌లో మహిళలకు పెద్దపీట వేశామన్న జైట్లీ

న్యూఢిల్లీ

తాజా బడ్జెట్‌లో మహిళలపై కేంద్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. ఉచిత గ్యాస్ కనెక్షన్లు సహా.. ఉద్యోగాలు చేసే మహిళలు, స్వయం సహాయక బృందాలకు భారీగా నిధులను కేటాయించింది. పేద మహిళలకు ఇవ్వాల్సిన ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ల లబ్ధిదారుల సంఖ్యను 8 కోట్లకు పెంచినట్లు జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో భాగంగా వెల్లడించారు. పేద మహిళలకు వంటచెరకు పొగనుంచి విముక్తి కల్పించేందుకు ఉజ్వల పథకాన్ని ప్రవేశపెట్టాం. ప్రారంభంలో 5 కోట్ల మంది పేద మహిళలకు ఉచితంగా వంటగ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించి పనిచేస్తున్నాం. ఈ పథకానికి పేద మహిళల్లో ఆదరణ పెరగటంతో ఈ లక్ష్యాన్ని 8 కోట్లకు పెంచాలని నిర్ణయించాం'అని జైట్లీ పేర్కొన్నారు.

తొలి మూడేళ్ల వరకు ఈపీఎఫ్ 8 శాతమే!

మహిళా ఉద్యోగులను ప్రోత్సహించడంలో భాగంగా ఈసారి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. నూతనంగా ఉద్యోగంలో చేరిన మహిళలు అధిక మొత్తంలో టేక్ హోమ్ శాలరీ (నికర జీతం) తీసుకునే విధంగా వెసులుబాటును ఇచ్చింది. ఉద్యోగ భవిష్యనిధిలో వీరి వాటా చెల్లింపును తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. వారి ఈపీఎఫ్ కంట్రిబ్యూషన్‌ను ప్రస్తుతం ఉన్న 12 శాతం నుంచి 8 శాతానికి తగ్గిస్తున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. ఈ మేరకు 'ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ అండ్ మిస్లేనియస్ ప్రొవిజన్స్ యాక్ట్–1952'లో మార్పులు చేస్తున్నట్లు జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో తెలియజేశారు. ఇందులో భాగంగా మహిళా ఉద్యోగులు తొలి మూడేళ్ల వరకు 8 శాతం ఈపీఎఫ్ మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీంతోపాటుగా సామాజిక భద్రత పథకాల్లో భాగంగా మూడేళ్లపాటు. కొత్తగా ఉద్యోగాల్లో చేరే అందరు ఉద్యోగులకు ఎంప్లాయర్ (యాజమాన్యం) వాటా ఈపీఎఫ్ 12 శాతాన్నీ ప్రభుత్వమే భరించే ప్రతిపాదన చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు ప్రధాన్ మంత్రి రోజ్‌గార్ ప్రోత్సాహన్ యోజన కింద వస్త్ర, తోలు, ఫుట్‌వేర్ పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు పొందుతున్న ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రయోజనాన్ని మిగిలిన రంగాలకు కూడా వర్తింపచేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో ఈ పథకం కింద ఇచ్చిన ప్రయోజనాలు ఇప్పుడిప్పుడే సత్ఫలితాలను ఇస్తున్నాయని జైట్లీ పేర్కొన్నారు.

స్వయం సహాయక బృందాలకు..

జాతీయ గ్రామీణ జీవన కార్యక్రమంలోని క్లస్టర్లలో స్వయం సహాయక బృందాలు సేంద్రియ వ్యవసాయం చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను ప్రకటించింది. 2019 మార్చి వరకు ఈ కార్యక్రమం కోసం ఇచ్చే రుణాలను రూ.75 వేల కోట్లకు పెంచుతున్నట్లు జైట్లీ వెల్లడించారు. స్వయం సహాయక బృందాలకు ఇచ్చే రుణాలను గతేడాదితో పోలిస్తే 37 శాతం పెంచి.. రూ.42,500 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలైన 'బేటీ బచావో, బేటీ పఢావో', సుకన్య సమృద్ధి అకౌంట్ పథకాలు అద్భుతమైన విజయాన్ని సాధించాయని జైట్లీ పేర్కొన్నారు. 'నవంబర్ 2017 వరకు బాలికల పేర్లతో 1.26 కోట్ల అకౌంట్లు దేశవ్యాప్తంగా తెరిచారని.. ఇందులో రూ.19,183 కోట్లు దాచుకున్నారు'అని ఆయన తెలిపారు.

నిరాశాపూరితమైన బడ్జెట్: కాంగ్రెస్

న్యూఢిల్లీ: 2018–19 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాపూరితమైనదిగా కాంగ్రెస్ పార్టీ అభివర్ణించింది. ఈ బడ్జెట్ ప్రజల్ని తీవ్రంగా నిరుత్సాహపర్చిందని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం విమర్శించారు. 'ఇదో నిరాశాపూరితమైన బడ్జెట్. ఆర్థిక వ్యవస్థను పట్టిపీడిస్తున్న పలు సమస్యల్ని పరిష్కరించడంలో తాము విఫలమైనట్లు తాజా బడ్జెట్‌తో కేంద్రం అంగీకరించినట్లయింది. ఇందులో ఆందోళన కల్గించే తీవ్రమైన ప్రతిపాదనలు ఉన్నాయి. దురదృష్టవశాత్తూ ఈ బడ్జెట్‌లోని ప్రతిపాదనలు తీవ్రంగా నిరుత్సాహపర్చాయి. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున 10 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య రక్షణ కల్పిస్తామని జైట్లీ చెప్పడం పెద్ద బూటకం'అని విమర్శించారు. ఆర్థిక స్థిరీకరణ పరీక్షలో జైట్లీ తీవ్రంగా విఫలమయ్యారని ఆరోపించారు. 'ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ 2018–19 బడ్జెట్‌లో ఆర్థిక స్థిరీకరణ పరీక్షలో విఫలమయ్యారు. 2017–18 ఆర్థిక లోటును 3.2 శాతానికి పరిమితం చేయలేకపోయారు. ప్రస్తుతం ఆర్థికలోటును ప్రభుత్వం 3.5 శాతంగా అంచనా వేస్తోంది. ఈ వైఫల్యంతో దేశం తీవ్రమైన పర్యావసనాలను ఎదుర్కోవాల్సి వస్తుంది'అని చిదంబరం హెచ్చరించారు.

ఇది బూటకపు బడ్జెట్: వామపక్షాలు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పెద్ద బూటకం(బడా జుమ్లా)గా వామపక్షాలు అభివర్ణించాయి. 'రాబోయే లోక్‌సభ ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకునే ఈ బడ్జెట్‌ను కేంద్రం ప్రకటించిందని స్పష్టంగా తెలుస్తోంది. బడ్జెట్‌ను ఎన్నికల ప్రచారంగా మార్చేశారు. దీన్ని మేం పెద్ద బూటకంగా భావిస్తున్నాం. ముందుగా ఎన్నికలకు వెళ్లేందుకు కేంద్రం చేస్తున్న ప్రచారంగా దీన్ని మేం పరిగణిస్తున్నాం' అని సీపీఎం లోక్‌సభ పక్షనేత మొహమ్మద్ సలీం తెలిపారు. సీపీఐ నేత డి.రాజా మాట్లాడుతూ.. 'దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో 2018లో ఎన్నికలు జరగనున్న వేళ ..ప్రభుత్వం ప్రజల్ని మోసం చేయడానికి యత్నిస్తోందని ఈ బడ్జెట్‌తో తెలుస్తోంది. ఇది అభివృద్ధి అనుకూల బడ్జెట్ కాదు. ఇందులో ఉద్యోగకల్పన గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలంటే ఏటా వ్యవసాయ రంగం 12 శాతం అభివృద్ధి సాధించాలి. దీనిపై బడ్జెట్‌లో వివరణ లేదు. మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీలకు గతంలో ఇచ్చిన ప్రాధాన్యత ఈసారి బడ్జెట్‌లో దక్కలేదు. నిరుద్యోగం సమస్యపై నోరు మెదపడం లేదు. దేశంలో ప్రతిఒక్కరూ పకోడాలు వండలేరు కదా' అని ఎద్దేవా చేశారు.

పోలీస్ బలగాలకు జై

- హోంశాఖకు రూ.92,679 కోట్లు
- గతంలో పోలిస్తే దాదాపు 10.5 శాతం పెంపు
- పోలీస్ బలగాలకే రూ.62.741 కోట్లు

న్యూఢిల్లీ: పారామిలిటరీ బలగాల బలోపేతమే లక్ష్యంగా ఈ సంవత్సరం (2018–19) కేంద్ర బడ్జెట్‌లో హోంశాఖకు నిధుల కేటాయింపు జరిగింది. ఈ సారి రూ.92,679.86 కోట్లను కేటాయించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఇది 10.5 శాతం అదనం. గత సంవత్సరం (2017–18)లో రూ.83.823.30 కోట్లు ఇచ్చిన విషయం తెలిసిందే. మొత్తం కేటాయింపుల్లో సగానికిపైగా పారామిలిటరీ దళాలకే వెచ్చించనున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. దేశ రాజధాని ఢిల్లీ పోలీసుల కోసం రూ.6,946.28 కోట్లు, సరిహద్దుల్లో మౌలిక వసతుల కల్పనకు రూ. 1,750 కోట్లు కేటాయించారు. భారత్–పాక్, భారత్–చైనా సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ మేరకు కేటాయింపులు జరిపినట్లు మంత్రి పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో పనిచేసే కేంద్ర పోలీస్ బలగాల(సీఆర్పీఎఫ్)కు రూ.20,268 కోట్లు కేటాయించారు. అలాగే భారత్–పాక్, భారత్–బంగ్లాదేశ్ సరిహద్దుల్లో పనిచేస్తున్న సరిహద్దు భద్రతా దళాల కోసం ఈ సారి రూ.17,118.64 కోట్లు కేటాయించారు. జాతీయ పోలీస్ బలగాలకు మొత్తంగా రూ.62,741.31 కోట్లు కేటాయించారు. అలాగే ఇంటెలిజెన్సీ బ్యూరో కోసం రూ.1,876.44 కోట్లు కేటాయించారు.

మరికొన్ని కేటాయింపులిలా..

ఎస్పీజీ: రూ.385 కోట్లు	పోలీసుల మౌలిక సదుపాయాల కల్పన: రూ.4289.05 కోట్లు	బలగాల ఆధునీకరణ: రూ.897.29 కోట్లు
హిందీ భాషావ్యాప్తి: రూ. 1,139.67 కోట్లు	ఎన్డీఆర్ఎఫ్: రూ.864.10 కోట్లు	నిర్భయ ఫండ్: రూ.100 కోట్లు
	జనగణన ఆపరేషన్స్: రూ.551.14 కోట్లు	

మార్పుల్లేని లోక్‌పాల్ బడ్జెట్

సెంట్రల్ విజిలెన్స్ బడ్జెట్‌లో స్వల్ప పెరుగుదల

న్యూఢిల్లీ: అవినీతి కట్టడికి ఏర్పాటు చేయనున్న లోక్‌పాల్ కోసం కేటాయించిన రూ.4.29 కోట్ల బడ్జెట్‌లో ఎలాంటి మార్పులు లేవు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు కేటాయించిన బడ్జెట్‌లో మాత్రం 1.5 కోట్ల స్వల్ప వృద్ధి కనిపించింది. గురువారం పార్లమెంట్‌లో జైట్లీ సమర్పించిన 2018–19 బడ్జెట్ లెక్కల ప్రకారం, అవినీతి నిరోధానికి ఏర్పాటు చేయబోయే లోక్‌పాల్‌కోసం 4.29 కోట్లు కేటాయించారు.

సీబీఐకి నామమాత్రమే..

గతేడాది కన్నా 2.79 శాతమే ఎక్కువ

న్యూఢిల్లీ: సీబీఐకి రూ.698.38 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోల్చితే ఇది 2.79 శాతమే అధికం. గత ఐదు బడ్జెట్లలో అతి తక్కువ పెంపు కూడా ఇదే కావడం గమనార్హం. సీబీఐ ఈ–గవర్నర్స్, శిక్షణ కేంద్రాల ఆధునీకరణ, సాంకేతిక, ఫోరెన్సిక్ అనుబంధ యూనిట్ల స్థాపన, సీబీఐ శాఖల కార్యాలయాల నిర్మాణం తదితరాలకు ఈ నిధులను వినియోగించనున్నట్లు బడ్జెట్ ప్రతుల్లో పేర్కొన్నారు.

సాంస్కృతిక శాఖకు రూ.2,843 కోట్లు

న్యూఢిల్లీ: సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు బడ్జెట్‌లో రూ.2,843 కోట్లను కేటాయించారు. గతేడాదితో పోలిస్తే ఇది 3.82 శాతం ఎక్కువ. గత బడ్జెట్‌లో ఆ శాఖకు రూ.2,738.47 కోట్లను కేటాయించారు. మరోవైపు భారత పురావస్తు శాఖకు రూ.974.56 కోట్లను కేటాయించారు. గతేడాదితో పోలిస్తే ఇది 5.42 శాతం అధికం. గ్రంథాలయాలకు రూ.109.18 కోట్లు, మ్యూజియాల కోసం రూ.80.60 కోట్లు కేటాయించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రముఖ వ్యక్తుల జయంతులు, వార్షికోత్సవాలకు వినియోగించే నిధుల్లో కేంద్రం కోత విధించింది. ఆ నిధులను రూ.243.01 కోట్ల నుంచి రూ.100 కోట్లకు తగ్గించింది. 'కళా సంస్కృతి వికాస్ యోజన'పథకానికి రూ.310 కోట్లు కేటాయించింది. ఈ పథకం ద్వారా మహాత్మా గాంధీ హెరిటేజ్ సైట్స్ మిషన్ అండ్ దండి సంబంధిత ప్రాజెక్టులు, కళలు, సంస్కృతి, స్కాలర్‌షిప్, ఫెలోషిప్‌లను అందిస్తోంది.

పేదల వ్యతిరేక బడ్జెట్: మాయావతి

లక్నో: పేదలకు వ్యతిరేకంగా, పెట్టుబడిదారులకు అనుకూలమైన బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందని బీఎస్పీ అధినేత్రి మాయావతి విమర్శించారు. 'మోదీ ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ల లాగే ఈసారి కూడా ప్రవేశపెట్టింది. దేశానికి మంచిరోజులు తెస్తామని 2014 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ఇచ్చిన హామీ ఏమైంది? తప్పుడు ప్రసంగాలు, వాదనలతో దేశప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. పేదలు, కార్మికులు, రైతులు, ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోక నిరుద్యోగం, ధనిక–పేదల మధ్య అంతరం పెరిగిపోతోంది' అని ఆరోపించారు.

రక్షణకు రూ.2.95 లక్షల కోట్లు

గతేడాది కంటే 7.81 శాతం పెరుగుదల

మొత్తం బడ్జెట్‌లో రక్షణకు కేటాయింపు	12.10%	పెన్షన్‌కు ప్రత్యేకంగా కేటాయింపు	రూ. 1.08 కోట్లు

న్యూఢిల్లీ: చైనా, పాకిస్తాన్‌తో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అంచనాలకు తగ్గట్టుగా రక్షణ రంగానికి కేంద్రం బడ్జెట్‌లో నిధులివ్వలేదు. 2018–19 బడ్జెట్‌లో రక్షణ రంగానికి రూ. 2,95,511 కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయింపులు రూ. 2.74 లక్షల కోట్ల కంటే 7.81 శాతం ఈ ఏడాది ఎక్కువ. మొత్తం బడ్జెట్‌లో రక్షణ రంగానికి కేటాయింపులు 12.10 శాతం.. జీడీపీలో 1.58 శాతంగా రక్షణ రంగ కేటాయింపులు ఉన్నాయి. ఇక రక్షణ రంగం కేటాయింపుల మొత్తంలో ఆయుధాలు, యుద్ధవిమానాలు, యుద్ధ నౌకలు, ఇతర రక్షణ సామగ్రి కొనుగోలుకు రూ. 99,947 కోట్లు కేటాయించారు. రక్షణ బడ్జెట్‌లో సిబ్బంది జీతాలు, నిర్వహణ, ఇతరత్రా ఖర్చులకు సంబంధించి రెవెన్యూ వ్యయం రూ. 1,95,947 కోట్లుగా ఉంది. కాగా, రక్షణ రంగ సిబ్బంది పెన్షన్ కోసం ప్రత్యేకంగా రూ. 1,08,853 కోట్లు కేటాయించారు. ఇది గతేడాది కేటాయింపు రూ. 85,740 కోట్లు కంటే 26.60 శాతం అధికం.



కేటాయింపులు సరిపోవు

చైనా, పాకిస్తాన్‌ల సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో రక్షణ రంగాన్ని ఆధునీకరించడానికి ఈ కేటాయింపులు సరిపోవు అని నిపుణులు పేర్కొంటున్నారు. అంచనాలకు తగ్గట్టుగా బడ్జెట్ లేదని డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలిసిస్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డా. లక్ష్మణ్ బెహరా చెప్పారు. ద్రవ్యోల్బణం, పరికరాల రేట్లు పెరుగుదలతో పోలిస్తే కేటాయింపులు స్వల్పమని మాజీ సైనికాధికారి ఎస్కే చటర్జీ చెప్పారు.

రెండు ఇండస్ట్రియల్ కారిడార్లు

రక్షణ రంగానికి సంబంధించి దేశీయ పరిశ్రమల ప్రోత్సాహకానికి రెండు ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వ, ప్రైవేట్, ఎంఎస్ఎంఈ విభాగాల్లో దేశీయంగా ఆయుధ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి డిఫెన్స్ ప్రొడక్షన్ పాలసీ–2018ని తీసుకువస్తామని బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ పేర్కొన్నారు. దేశీయ రక్షణ పరికరాల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి ఇప్పటికే పలు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రక్షణ పరికరాల పరిశ్రమల్లో విదేశీ పెట్టుబడుల కోసం సరళీకరణ విధానాలు అవలంభిస్తున్నామని, ప్రైవేట్ రంగం పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. బడ్జెట్‌లో మూలధనం కేటాయింపు రూ. 3,00,441 కోట్లు అని జైట్లీ తెలిపారు. మూలధనం ఖాతాలోని మొత్తం ఖర్చులో ఇది 33.1 శాతం అని పేర్కొన్నారు.

అరుణాచల్ 'సేలా' కనుమల్లో సొరంగం



చైనా సరిహద్దుకు సమీపంలో అరుణాచల్ ప్రదేశ్‌లోని సేలా కనుమల్లో సొరంగం నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. 13,700 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతంలో సొరంగం పూర్తయితే... దేశ రక్షణ పరంగా వ్యూహాత్మక ప్రాంతమైన తవాంగ్‌కు వేగంగా బలగాల్ని తరలించేందుకు వీలవుతుందని ఆయన చెప్పారు. బడ్జెట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ 'ప్రతికూల వాతావరణంలోను ప్రయాణించేలా లడఖ్ ప్రాంతంలో రోహతంగ్ సొరంగం పూర్తిచేశాం. అలాగే 14 కిలోమీటర్ల జోజిలా సొరంగం కోసం పనులు కొనసాగుతున్నాయి. ఇప్పుడు సేలా కనుమల్లో సొరంగం నిర్మాణానికి ప్రతిపాదన చేస్తున్నాం'అని వెల్లడించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్, పశ్చిమ కామెంగ్ జిల్లాల మధ్య వ్యూహాత్మక ప్రాంతంలో సేలా కనుమ ఉంది.



బడ్జెట్ 2018-19

బడ్జెట్ హైలైట్స్

- వయోధిక పౌరుల బ్యాంకు, పోస్టాఫీస్ డిపాజిట్ల వడ్డీ ఆదాయంపై పన్ను మినహాయింపు పరిమితి రూ.10 వేల నుంచి రూ.50 వేలకు పెంపు.
- సీనియర్ సిటిజన్ల వైద్య ఖర్చులు, వైద్య బీమా ప్రీమియంపై రూ.50 వేల వరకూ అదనపు రాయితీ.
- ఈక్విటీ మార్కెట్‌లో లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌ను ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. రూ.లక్ష దాటిన లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై 10 శాతం పన్ను
- విద్యా, వైద్య సెస్సు 3 నుంచి 4 శాతానికి పెంపు.
- ప్రతి మూడు లోక్‌సభ నియోజకవర్గాలకు ఒక వైద్య కళాశాల ఏర్పాటు.
- ప్రభుత్వ బీమా కంపెనీల విలీనం.
- టామాటో, ఉల్లి, ఆలు ఉత్పత్తికి రూ. 500 కోట్లతో గ్రీన్ ఆపరేషన్ పథకం.
- విదేశీయులను ఆకర్షించేందుకు 10 ప్రధాన పర్యాటక ప్రాంతాల అభివృద్ధి.

రైల్వేకు కేటాయింపులు రూ. కోట్లలో





1851 డిసెంబర్ 22

భారత్‌లో తొలి రైలు 1851 డిసెంబర్ 22న పట్టాలెక్కింది. రూర్కీలో నిర్మాణ సామగ్రితో అది ప్రయాణించింది. ప్రయాణికుల రైలు మాత్రం 1853 ఏప్రిల్ 16న బాంబే నుంచి థానే మధ్య (34 కిలోమీటర్లు) నడిచింది. దీన్నే భారత్‌లో తొలి రైలుగా పేర్కొంటారు.



1925 ఫిబ్రవరి 3

తొలి ఎలక్ట్రిక్ రైలు 1925 ఫిబ్రవరి 3న బాంబే వీటీ, కుర్లా మధ్య నడిచింది. రైళ్లలో తొలిసారిగా 1891లో టాయిలెట్లు(ఒకటో తరగతిలో) ప్రవేశపెట్టారు. దిగువ తరగతుల్లో 1907లో వాటిని ఏర్పాటుచేశారు. తొలి రైల్వే వంతెన.. ముంబై–థానే మార్గంలోని దపూరీ వయాడక్ట్



ఇప్పుడంటే సెకండ్ క్లాస్ స్లీపర్. అప్పట్లో థర్డ్ క్లాస్ స్లీపర్ కూడా ఉండేది. అదే ఇది. మూడు వరుసలలో స్లీపర్ బెర్తులుండేవి.





రాజావారి రైలు

ఇది రాజావారి రైలు. రాచరిక వ్యవస్థ ఉన్న రోజుల్లో శ్రీకాకుళం జిల్లా పర్లాకిమిడి మహారాజా కృష్ణచంద్ర గజపతి తన కుటుంబంతో కలిసి గుణుపూర్ నుంచి నౌపడ ఉప్పు గల్లీల వరకు, అటు నుంచి తీర ప్రాంత సందర్శనకు వీలుగా ప్రత్యేక రైల్వే లైనునే నిర్మించుకున్నారు. నౌపడ–గుణుపూర్‌ల మధ్య నిర్మించిన నేరో గేజ్ రైల్వే లైన్‌ను 1912లో ఆయన జాతికి అంకితమిచ్చారు. ఆ తర్వాత 1953లో భారత ప్రభుత్వం ఈ రైల్వే లైన్‌ను స్వాధీనం చేసుకున్నా.. దశాబ్దం క్రితం వరకు ఈ లైను దశ మారలేదు. అదే నేరో గేజ్.. అదే రాజావారి బండి కొన సాగాయి. 2002లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం దీన్ని బ్రాడ్‌గేజ్‌గా మార్చాలని ప్రతిపాదించింది. ఎట్టకేలకు 2010లో బ్రాడ్‌గేజ్ నిర్మాణం పూర్తయ్యింది. 2011 డిసెంబర్‌లో పూరి–పర్లాకిమిడి మధ్య బ్రాడ్‌గేజ్ రైలు ప్రయాణం ప్రారంభమైంది.



ఐస్ ఏసీ

ఇది భారత్‌లో తొలి ఏసీ రైలు ఫ్రాంటియర్ మెయిల్. దీన్ని 1934లో ప్రారంభించారు. అప్పట్లో ఏసీ అంటే.. ఇలా పెద్ద పెద్ద ఐస్ గడ్డల్ని బోగీకి రెండు చివర్లా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్సుల్లో వేసేవారు. బ్యాటరీ ద్వారా పనిచేసే బ్లోయర్ ద్వారా ఈ బాక్సుల్లోకి గాలిని పంపిస్తే.. అది ప్రత్యేకంగా ఉన్న చిల్లుల ద్వారా ఇన్సులేటెడ్ బోగీల్లోకి వెళ్లేది. అలా బోగీల్లోపల చల్లదనం ఉండేలా చేసేవారు. ఒక ఐస్ గడ్డ కరిగిపోయాక మరొకటి వేసేందుకు వీలుగా.. రైలు వెళ్లే మార్గంలో కొన్ని చోట్ల ఇలా ఐస్ గడ్డలను సిద్ధంగా ఉంచేవారు. ఈ రైలును ఎక్కువగా బ్రిటిష్ వాళ్లు ప్రయాణించడానికి వాడేవారు.

వైఫై రైళ్లు!

న్యూఢిల్లీ

ఈసారి బడ్జెట్‌లో రైల్వేలు 'వైఫై' కూత పెట్టాయి. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లు, రైళ్లలో దశలవారీగా వైఫై సదుపాయం కల్పించనున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2018–19 బడ్జెట్‌లో ప్రకటించారు. రైల్వే స్టేషన్ల ఆధునీకరణతోపాటు ప్రయాణికుల భద్రత కోసం సీసీటీవీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయనున్నారు. ప్రధానమైన కొత్త రైళ్లు ఏవీ ప్రకటించకపోవటం ఈసారి బడ్జెట్‌లో నిరాశ కలిగించే అంశం. రైల్వే బడ్జెట్‌ను విడిగా ప్రవేశపెట్టే 92 ఏళ్ల సంప్రదాయానికి గత ఏడాది ముగింపు పలికి కేంద్ర బడ్జెట్‌లో కలపటం తెలిసిందే.

1,48,528

కోట్ల రూపాయలతో రైల్వేల కూత

3,600 కి.మీ రైల్వే లైన్ల పునరుద్ధరణ

రైల్వేలకు ఈసారి బడ్జెట్‌లో 1,48,528 లక్షల కోట్లను కేటాయించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 13 శాతం అదనం. గత ఏడాది బడ్జెట్‌లో రైల్వేలకు రూ.1.31 లక్షల కోట్లు కేటాయించారు. రైల్వేలను పరిపుష్టం చేసి రవాణా సామర్థ్యాన్ని మెరుగుపరచనున్నట్లు అరుణ్‌జైట్లీ చెప్పారు. 'రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్' కింద నిధులు కేటాయించి ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. దేశవ్యాప్తంగా 18 వేల కి.మీ. డబ్లింగ్, 5 వేల కి.మీ. మేర 3, 4 లైన్ల ట్రాక్‌లుగా మార్చటం వల్ల రైల్వే నెట్‌వర్క్ దాదాపుగా బ్రాడ్‌గేజ్‌లోకి మారుతుందని జైట్లీ చెప్పారు. రైల్వే ట్రాక్‌ల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని, 3,600 కి.మీ మేర రైల్వే లైన్లను పునరుద్ధరించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు.



సారథి అనగానే కృష్ణుడు, లేదంటే శల్యుడు గుర్తొస్తారు గానీ నిజానికి ఉత్తర గోగ్రహణ వేళ బృహన్నల రూపంలో అర్జునుడు ప్రదర్శించే రథచోదన ప్రావీణ్యం నభూతో! గాలితో పందెం వేస్తూ వాయువేగ మనోవేగాలతో రథాన్ని పార్థుడు పరుగులెత్తిస్తుంటే ఉత్తర కుమారుడికి పై ప్రాణాలు పైనే పోతాయి. దేశీయ విమానయానాన్ని కూడా అదే తరహాలో ఉరకలెత్తించను న్నట్టు ప్రకటించారు జైట్లీ. రైల్వేల ఆధునీకరణనూ వేగవంతం చేస్తామన్నారు..


'ట్రైన్ 18'.. 'ట్రైన్ 20'

ప్రయాణికులకు సౌకర్యవంతమైన అనుభూతి కోసం ప్రపంచశ్రేణి రైళ్లను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా చెన్నైలోని కోచ్‌ల తయారీ కేంద్రంలో 'ట్రైన్ 18', 'ట్రైన్ 20' తయారు కానున్నాయి. జర్మనీకి చెందిన లింక్ హాఫ్‌మాన్ బాష్ టెక్నాలజీతో తయ్యారయ్యే ఈ ప్రయాణికుల రైళ్లు 2018లో ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో 'ట్రైన్ 18' అని వ్యవహరిస్తున్నారు. గంటకు 160 కి.మీ వేగంతో దూసుకెళ్లటం వీటి ప్రత్యేకత. ఇక 'ట్రైన్ 20' మరింత ఆధునికంగా స్లీపర్ కోచ్‌లతో ఉంటుంది. 2020లో ఇది అందుబాటులోకి రానుంది. వంద రైళ్లను ఉత్పత్తి చేసి శతాబ్ది, రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్థానంలో ప్రవేశపెట్టే యోచన ఉన్నట్లు రైల్వే మంత్రి గోయల్ తెలిపారు.

రూ.3 వేల కోట్లతో సీసీటీవీలు

దేశవ్యాప్తంగా 11 వేల రైళ్లలో 12 లక్షల సీసీటీవీ కెమెరాల కోసం రైల్వే శాఖ రూ. 3 వేల కోట్లను వ్యయం చేయనుంది. 8,500 స్టేషన్లు సీసీటీవీల నిఘాలో ఉంటాయి. ప్రతి బోగీకి 8 సీసీటీవీలను అమరుస్తారు. ప్రస్తుతం 395 స్టేషన్లు, 50 రైళ్లను సీసీటీవీలతో అనుసంధానించారు. వచ్చే రెండేళ్లలో ప్రతి రైలులో ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తామని రైల్వే శాఖ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఇక ప్రయాణికుల సదుపాయాల కోసం ఈసారి రూ.1,657 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఇది దాదాపు 50 శాతం ఎక్కువ.

ప్రత్యేక బడ్జెట్ సమస్యలనే మిగిల్చింది: పీయూష్ గోయల్



రైల్వే బడ్జెట్‌ను ప్రత్యేకంగా ప్రవేశపెట్టే అవకాశాన్ని కోల్పోయినట్లుగా తానేమీ భావించటం లేదని రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. నిజానికి రైల్వే బడ్జెట్‌ను విడిగా ప్రవేశపెట్టటం రైల్వేలకు సమస్యలనే మిగిల్చిందన్నారు. రైల్వే మంత్రి చేతుల మీదుగా ఏదైనా కొత్త రైలు పేరును ప్రకటించాలని కోరుకుంటున్నారా? అన్న ప్రశ్నకు తనకు ప్రయాణికుల భద్రతే, సౌకర్యమే ముఖ్యమన్నారు. 'ప్రతి రైలుకు, ప్రతి బోగీకి సిబ్బంది ద్వారా భద్రత కల్పించటం ఖరీదైన ప్రక్రియ. ఈ నేపథ్యంలో అన్ని రైళ్లు, బోగీల్లో సీసీ కెమెరాలు, వైఫై వైపు దృష్టి పెట్టాం' అని చెప్పారు.

రైల్వేలకు ఇచ్చినవి..

- రైల్వేస్టేషన్ల పరిసరాలలో వాణిజ్య సముదాయాల అభివృద్ధి
- పెరంబూర్‌లోని రైల్వే కోచ్‌ల తయారీ పరిశ్రమలో అధునాతన కోచ్‌ల నిర్మాణం. 2018–19లో తొలి రైలు పట్టాలపై పరుగులు తీయనుంది.
- రైల్వే సిబ్బందికి శిక్షణ కోసం వడోదరలో ఇన్‌స్టిట్యూట్.
- భారత రైల్వే స్టేషన్ల అభివృద్ధి కంపెనీ లిమిటెడ్ ద్వారా 600 ప్రధాన రైల్వే స్టేషన్ల అభివృద్ధి
- 25,000 మించి ప్రయాణికులు రాకపోకలు సాగించే అన్ని రైల్వే స్టేషన్లలో ఎస్కలేటర్ల ఏర్పాటు.
- వచ్చే రెండేళ్లలోగా బ్రాడ్ గేజ్ పరిధిలో కాపలా లేని 4,267 రైల్వే గేట్ల తొలగింపు.
- ముంబై రైళ్లలో రద్దీ నివారణకు 90 కి.మీ. మేర రూ.11 వేల కోట్లతో డబుల్ లైన్ల పనులకు నిర్ణయం.
- సిగ్నలింగ్, టెలి కమ్యూనికేషన్ వ్యవస్థ ఆధునీకరణ కోసం రూ. 2,025 కోట్లు
- రైల్వే ట్రాక్‌ల నవీకరణ కోసం రూ.11,450 కోట్లు
- రాష్ట్రీయ రైల్ సంరక్షణ కోష్ తదితరాల కింద ప్రయాణికుల భద్రత కోసం రూ.73,065 కోట్లు

ముంబై, బెంగళూరులకు

బొనాంజా

న్యూఢిల్లీ: ముంబై, బెంగళూరు సబర్బన్ ప్రయాణికులకు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బంపర్ బొనాంజా ప్రకటించారు. ముంబై సబర్బన్ రైలు నెట్‌వర్క్ విస్తరణ, 90 కిలోమీటర్ల మేర రెండు లైన్ల నిర్మాణం కోసం రూ.11,000 కోట్లు కేటాయించారు. అలాగే రూ.40,000 కోట్ల వ్యయంతో అదనంగా 150 కి.మీ. మేర సబర్బన్ నెట్‌వర్క్, ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. ముంబై సబర్బన్ నెట్‌వర్క్ కేటాయింపులపై ప్రకటన వెలువడిన వెంటనే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్.. 'సెలబ్రేట్ ముంబై' అని ట్వీట్ చేశారు. ప్రతి రోజూ 2,342 లోకల్ రైలు సర్వీసులను నడిపిస్తున్న ముంబై సబర్బన్ రైల్వే.. 75 లక్షల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తోంది. తొలిసారి నెట్‌వర్క్ పరిధిని విస్తరిస్తున్నారు. ఇక ఈ ఏడాదిలో ఎన్నికలు జరగనున్న బెంగళూరులో 160 కిలోమీటర్ల సబర్బన్ రైలు ప్రాజెక్టుకు రూ.17,000 కోట్లను కేటాయించారు. కర్ణాటక ప్రభుత్వం, భారత రైల్వే కలసి చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో 20 శాతం ఆ రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. సబర్బన్ నెట్‌వర్క్ ద్వారా బెంగళూరు మెట్రోపాలిటన్ అభివృద్ధి చెందుతుందని జైట్లీ పేర్కొన్నారు.

వీవీఐపీల హవా!



బడ్జెట్‌లో విమానయాన రంగానికి 6 వేల కోట్లు

అత్యంత ప్రముఖుల విమానాల కొనుగోలుకు రూ.4,469.5 కోట్లు

న్యూఢిల్లీ

పౌర విమానయాన శాఖకు తాజా బడ్జెట్‌లో రూ.6,602.86 కోట్ల నిధులు దక్కా యి. గతేడాదితో పోలిస్తే కేటాయింపులు మూడు రెట్లు పెరిగాయి. అయితే ఇందులో రూ.4,469.5 కోట్లను కేవలం రెండు విమా నాలు కొనడానికే ప్రత్యేకంగా కేటాయించారు. రెండు బోయింగ్ 777–300 ఈఆర్ విమానా లను కొనుగోలు చేసి కేవలం వీవీఐపీల పర్య టనల కోసం మాత్రమే వాడనున్నారు. ఉడాన్ పథకం కోసం రూ.1,014.09 కోట్లను కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉడాన్ కోసం కేటాయించిన నిధులు రూ.200 కోట్లు మాత్రమే.

విమానాశ్రయాల సామర్థ్యం ఐదు రెట్లు..

ప్రభుత్వ విమానయాన సంస్థ ఎయిరిండియాకు నిధులు భారీగా తగ్గించి తాజా బడ్జెట్‌లో కేవలం రూ.650 కోట్లు కేటాయించారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కి కూడా నిధులను దాదాపు సగానికి తగ్గించి రూ.73.3 కోట్లను మాత్రమే ఇచ్చారు. ఐఈబీఆర్ (ఇంటర్నల్ అండ్ ఎక్స్‌టర్నల్ బడ్జెటరీ రిసోర్సెస్) మార్గంలో ఏఏఐ మరో రూ.4,086 కోట్లు సమీకరిస్తుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో పైలట్ శిక్షణా కేంద్రమైన ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీతో పాటు రాజీవ్ గాంధీ విమానయాన విశ్వవిద్యా లయాలకు కలిపి రూ.50 కోట్లు కేటాయించారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)కు రూ.210 కోట్లు, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్)కి రూ.70 కోట్ల నిధులు దక్కాయి. 'ఎన్ఏబీహెచ్ (నెక్ట్స్‌జెన్ ఎయిర్‌పోర్ట్స్ ఫర్ భారత్) నిర్మాణ్' ప్రాజెక్టులో భాగంగా దేశ విమానాశ్రయాల సామర్థ్యాన్ని ఐదు రెట్లు పెంచనున్నట్లు జైట్లీ చెప్పారు.

900 కొత్త ఎయిర్‌క్రాఫ్ట కొనుగోలుకు ఆర్డర్లు

దేశవ్యాప్తంగా వాడుకలో లేని 56 విమానాశ్రయాలు, 31 హెలిపాడ్లను 'ఉడాన్' పథకం కింద వినియోగంలోకి తీసుకురా నున్నట్లు జైట్లీ ప్రకటించారు. ఏటా వంద కోట్ల ప్రయాణాలకు అనువుగా వీలుగా విమానాశ్ర యాలు విస్తరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటికే 16 ఎయిర్‌పోర్టుల్లో సేవలు ప్రారంభమైనట్లు వివరించారు. 'గత మూడేళ్లుగా దేశీయ ప్రయాణికుల సంఖ్య ఏటా 18 శాతం పెరిగింది. మన విమానయాన సంస్థలు 900 కొత్త ఎయిర్‌క్రాఫ్ట కొనుగోలుకు ఆర్డర్లు ఇచ్చాయి' అని చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో హవాయి చెప్పులు ధరించే వారు సైతం విమానాల్లో ప్రయాణిస్తారని వ్యాఖ్యానించారు.

సీ ప్లేన్ పరిశ్రమకు

ప్రోత్సాహం

న్యూఢిల్లీ: దేశంలో సీ ప్లేన్ (నీటి మీదనే ల్యాండ్, టేకాఫ్ అయ్యే చిన్న విమానాలు)ల కార్యకలాపాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. గతేడాది డిసెంబరులో విమానయాన సంస్థ స్పైస్‌జెట్ ముంబై దగ్గర్లో వీటిని ప్రయోగా త్మకంగా నడిపింది. 400 మిలియన్ల అమెరికన్ డాలర్ల వ్యయంతో 100 సీ ప్లేన్‌లను కొనేందుకు కూడా ఈ సంస్థ ప్రణాళికలు రచిస్తోంది. ఈ రంగానికి పెట్టుబడు లను ప్రోత్సహించే చర్యలు తీసుకుంటామని జైట్లీ చెప్ప డంపై స్పైస్‌జెట్ చైర్మన్, ఎండీ అజయ్ సింగ్ సంతోషం వ్యక్తం చేశారు. సీ ప్లేన్‌ల ద్వారా ప్రతి నదిని ఒక రన్‌వేగా, ప్రతి చెరువును ఒక విమానాశ్రయంగా మార్చడం సాధ్యపడుతుందని ఆయన అన్నారు.



మౌలికం.. కీలకం!

బడ్జెట్‌లో ఇన్ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.5.97 లక్షల కోట్లు • ఆర్థికాభివృద్ధికి మౌలిక రంగమే చోదకశక్తి: జైట్లీ

న్యూఢిల్లీ

''ఆర్థికాభివృద్ధికి మౌలిక రంగమే చోదకశక్తి. ఈ రంగంలో భారీగా పెట్టుబడులకు అవకాశం ఉంది. రూ. 50 లక్షల కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తే జీడీపీ వృద్ధిరేటు పెరుగుతుంది. తద్వారా రోడ్లు, ఎయిర్‌పోర్ట్‌లు, రైల్వేలు, భూగర్భ జలాలు మెరుగుపడి ప్రజ లకు నాణ్యమైన సేవలు అందించేందుకు అవకాశం లభిస్తుంది''అని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ స్పష్టం చేశారు. ఈసారి సాధారణ బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనకు జైట్లీ పెద్దపీట వేశారు. 2018–19 ఆర్థిక సంవత్సరానికిగానూ మౌలిక వసతుల కల్పనకు రూ.5.97 లక్షల కోట్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ కేటాయింపులు రూ. లక్ష కోట్ల మేరకు పెరిగాయి. 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఈ రంగానికి కేటాయించింది రూ. 4.94 లక్షల కోట్లే. వృద్ధికి ఊతమివ్వడం, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ రంగానికి కేటాయింపులు పెంచారు. రోడ్డు రవాణా, హైవేలకు మొత్తం రూ.71 వేల కోట్లు కేటాయించారు.

ప్రాజెక్టులపై నిరంతరం సమీక్ష

మౌలిక ప్రాజెక్టుల లక్ష్యాలు, వాటిని పూర్తి చేసే అంశాలను ప్రధాని మోదీ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఇందుకోసం ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థను వినియోగిస్తున్నారని జైట్లీ చెప్పారు. ప్రస్తుతం రూ.9.46 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని, వీటిని మరింత వేగవంతం చేస్తామన్నారు. రహదారులు, రైల్వేలకు గతంలో ఎన్నడూ లేనంతగా భారీ కేటాయింపులు చేశామని, అవసరమైతే మరిన్ని నిధులు



ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 2018–19లో 9,000 కిలోమీటర్ల జాతీయ రహదారులను విస్తరించనున్నట్టు ప్రకటించారు. భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా దేశ సరిహద్దులు, వెనకబడిన ప్రాంతాలకు రోడ్ కనెక్టివిటీని విస్తరిస్తామన్నారు. భారత్‌మాల ఫేజ్ 1లో 35,000 కిలోమీటర్ల జాతీయ రహదారులను, రూ.5.35 లక్షల కోట్లతో నిర్మిస్తామన్నారు. రైల్వే శాఖకు మూలధన వ్యయం కింద రూ.1,48,528 కోట్లు కేటాయించామని, దేశ భద్రత దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో కనెక్టివిటీకి సంబంధించి మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామన్నారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం సీప్లేన్లకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు ప్రకటించారు. 16 కొత్త ఎయిర్‌పోర్ట్‌లు ఏర్పాటు చేస్తామని, వినియో గంలో లేని 56 ఎయిర్‌పోర్టులను, 31 హెలీప్యాడ్లను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

పట్టణీకరణ ఓ అద్భుత అవకాశం..

పట్టణీకరణ ఒక అద్భుతమైన అవకాశమని, దీనికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రపంచస్థాయి మౌలిక వసతుల కల్పన నిమిత్తం స్మార్ట్ సిటీ మిషన్‌ను ప్రారంభించిందని జైట్లీ చెప్పారు. ఇప్పటికే 99 నగరాలను ఎంపిక చేశామని, రూ. 2.04 కోట్లతో వీటిని అభివృద్ధి చేస్తున్నామని, ఈ నగరాల్లో స్మార్ట్ రోడ్లు, సోలార్ రూఫ్, ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ మొదలైన ప్రాజెక్టులను చేపట్టామని తెలిపారు. రూ. 2,350 కోట్ల ప్రాజెక్టులు పూర్తయ్యాయని, మరో రూ. 20,850 కోట్ల ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయన్నారు. మరింత మంది పర్యాటకులను ఆకర్షించేందుకు దేశంలో 10 పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని జైట్లీ ప్రకటించారు.

పేదల, ప్రజల బడ్జెట్: గడ్కరీ

ఇది పేదల, ప్రజల బడ్జెట్ అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అభివర్ణించారు. మౌలిక వసతుల రంగానికి ఎప్పటిలాగే బడ్జెట్‌లో ప్రాధాన్యత దక్కిందన్నారు. హైవేలకు నిధులు రూ.7 వేల కోట్లు పెరిగాయన్నారు. భారీ కేటాయింపులు జరపడం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.



ప్రజల నుంచి సౌరవిద్యుత్ కొనుగోలు

న్యూఢిల్లీ: ప్రజల నుంచి మిగులు సౌరవిద్యుత్‌ను డిస్కమ్‌లు కొనుగోలు చేసేందుకు విధివిధానాలు రూపొందిస్తామన్న ఆర్థిక మంత్రి జైట్లీ ప్రతిపాదనను పారిశ్రామిక వర్గాలు స్వాగతించాయి. అయితే సోలార్ ఉత్పత్తుల దిగుమతులపై 70 శాతం భద్రతా సుంకం విధిస్తామన్న కేంద్రం ప్రతిపాదనపై మాత్రం ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రజల నుంచి సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు వీలుగా అన్ని రాష్ట్రాలు విధివిధానాలు రూపొందించుకునేలా ప్రోత్సహిస్తామని జైట్లీ గురువారం బడ్జెట్ ప్రసంగంలో చెప్పిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సోలార్ ట్యాంపర్డ్ గ్లాస్ లేదా సోలార్ ప్యానెల్స్‌పై విధిస్తున్న 5 శాతం కస్టమ్స్ సుంకాన్ని రద్దుచేస్తామని ఆయన ప్రకటించారు. భారత పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థకు వచ్చే ఏడాదికిగానూ రూ.10,099.41 కోట్ల పెట్టుబడుల్ని ఈ బడ్జెట్‌లో కేటాయించారు. అలాగే భారత సౌర విద్యుత్ సంస్థ(ఎస్ఈసీఐ)కు వచ్చే ఆర్థిక సంవత్సరానికి కేటాయింపులు తగ్గాయి. 2018–19 కాలానికి ఎస్ఈసీఐకి రూ.217.43 కోట్ల పెట్టుబడుల్ని కేటాయించగా.. ఈ మొత్తం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.250.42 కోట్లుగా ఉంది. మరోవైపు సౌర విద్యుత్‌పై జైట్లీ చేసిన ప్రసంగాన్ని స్వాగతిస్తున్నట్లు ఖైతాన్ సంస్థ భాగస్వామి దిబ్యాన్షు తెలిపారు. ఈ పథకాన్ని ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందోనని ఎదురు చూస్తున్నట్లు వెల్లడించారు.

విద్యుత్‌కు కేటాయింపులు (రూ. కోట్లలో)



ఎన్నికలకు 'గ్రామీణ' అస్త్రం!

ఫ్లాగ్‌షిప్ పథకాలకు దండిగానే నిధులు

రానున్న అసెంబ్లీ, వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా గ్రామీణ ఓటర్లకు గాలం వేసేందుకు మోదీ సర్కారు గట్టిగానే కసరత్తు చేసింది. నోట్ల రద్దుతో పాటు కరువుతో తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్న గ్రామీణ భారతంపై నిధుల వర్షం కురిపించింది. పల్లెవాసులకు మౌలిక సదుపాయాలను భారీగా పెంచేందుకు వీలుగా పలు కీలక పథకాలకు జైట్లీ తన చిట్టచివరి పూర్తిస్థాయి బడ్జెట్(ఎన్డీఏ ప్రస్తుత టర్మ్)లో పెద్దపీట వేశారు. ఉపాధి హామీకి నిధుల పెంపుతో పాటు పల్లెల్లో డిజిటల్ విప్లవమే లక్ష్యమని జైట్లీ ప్రకటించారు. 5 లక్షల వైఫై హాట్‌స్పాట్‌ల ఏర్పాటు, గ్రామాల్లో పేదలకు మరిన్ని ఉచిత విద్యుత్ కనెక్షన్లు, వచ్చే ఏడాది మార్చికల్లా కోటి పక్కా ఇళ్ల నిర్మాణం వంటివన్నీ పూర్తి చేస్తామని వెల్లడించారు. మొత్తంమీద ఈ ఎన్నికల బడ్జెట్‌లో 'గ్రామీణ'రాగాన్ని ఆలపించారని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

➜ గోవర్ధనమంతటి పర్వతాన్ని చిటికెన వేలిపై ఎత్తిపట్టి గోకులవాసులందరికీ రక్షణ కల్పించాడు చిన్నికృష్ణుడు. అలాగే జైట్లీ కూడా అనేకానేక పరిమితుల మధ్యే, ప్రధాన పథకాలన్నింటికీ వీలైనంత భారీ కేటాయింపులు చేస్తూ కత్తిమీద సామును విజయవంతంగా పూర్తి చేశారు...



'ఉపాధి'కి దన్ను..



2018–19 బడ్జెట్ కేటాయింపు
రూ.**55,000** కోట్లు(14.5% పెంపు)

2017–18 బడ్జెట్ కేటాయింపు: రూ.**48,000** కోట్లు

- గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు కీలకంగా మారిన ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకానికి మోదీ ప్రభుత్వం ఈసారీ నిధులను భారీగా విదిల్చింది.
- 2017–18లో బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే సవరించిన అంచనాలు రూ.55,000 కోట్లకు పెంచడం ఈ పథకం అమలు జోరుకు నిదర్శనం.
- వర్షాలపైనే ఆధారపడిన ప్రాంతాల్లో 5 లక్షల వ్యవసాయ చెరువులు, బావుల తవ్వకంతో పాటు సేంద్రియ ఎరువుల తయారీ కోసం 10 లక్షల కంపోస్టు గుంతల ఏర్పాటు వంటి లక్ష్యాలను మోదీ సర్కారు పూర్తిచేసింది.
- ఈ ఏడాది మార్చి చివరి నాటికి మరో 5 లక్షల వ్యవసాయ చెరువుల తవ్వకాన్ని పూర్తి చేయనున్నట్లు కేంద్రం చెబుతోంది.
- అదేవిధంగా ఈ పథకం కింద దాదాపు 22 లక్షల సహజ వనరుల నిర్వహణ(ఎన్ఆర్ఎం–చెక్ డ్యామ్‌లు, ఇతరత్రా నీటి పరిరక్షణ) పనులు జరుగుతున్నాయి. దీనివల్ల 47.1 లక్షల హెక్టార్లకు లబ్ధి చేకూరడంతోపాటు వ్యవసాయ ఉత్పాదకత, ఆదాయాలు పెరిగేందుకు దోహదం చేయనుందని కేంద్రం పేర్కొంది.
- ఈ స్కీమ్‌లో పూర్తయిన దాదాపు 3.29 కోట్ల పనులకు జియో ట్యాగింగ్‌ను చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, 2018 జనవరి 15 నాటికి 3.15 కోట్ల ఆస్తులకు పూర్తి చేశారు.
- కొత్తగా 60 లక్షల పనులను మొదలు పెట్టనున్నారు. 10 లక్షల ఆస్తుల నిర్మాణం, 230 కోట్ల పనిదినాలను సృష్టించడం వంటివి వచ్చే ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్నారు.

'స్వచ్ఛ భారత్' జోరు..

2018–19 కేటాయింపులు
రూ.**15,343** కోట్లు (10% పెంపు)

2017–18 కేటాయింపులు: రూ.**13,948** కోట్లు



- 2019 అక్టోబర్ 2 నాటికి(గాంధీ జయంతి) దేశవ్యాప్తంగా అన్ని కుటుంబాలకు.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం పారిశుధ్యాన్ని(సెప్టిక్ మరుగుదొడ్ల నిర్మాణం) కల్పించడం లక్ష్యం.
- ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకూ 6 కోట్ల వ్యక్తిగత టాయిలెట్ల నిర్మాణం పూర్తయిందని.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరో 1.88 కోట్లను నిర్మించే లక్ష్యంతో బడ్జెట్‌ను పెంచినట్లు జైట్లీ పేర్కొన్నారు.
- ఈ ఏడాది జనవరి 1 నాటికి 284 జిల్లాల్లో మొత్తం 1,32,038 గ్రామ పంచాయతీలు, 3,02,445 గ్రామాలను బహిరంగ మరుగుదొడ్ల రహితం(ఓడీఎఫ్)గా ప్రకటించారు. ఇక 9 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలను(సిక్కిం, హిమాచల్, అరుణాచల్, డామన్ అండ్ డయ్యూ, కేరళ, ఉత్తరాఖండ్, హరియాణా, గుజరాత్) ఓడీఎఫ్‌గా ప్రకటించారు. మొత్తం ఓడీఎఫ్ ప్రాంతాల సంఖ్య 8,02,054కు చేరింది.
- కాగా, పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ పథకం కోసం తాజా బడ్జెట్‌లో రూ.2,500 కోట్లు కేటాయించారు.

ఎన్ఆర్డీడబ్ల్యూపీ..

2018–19 కేటాయింపులు
రూ.**7,000** కోట్లు
(15% పెంపు)

2017–18 కేటాయింపులు
రూ. **6,050** కోట్లు

దేశంలో తాగునీటి సౌకర్యం లేని అన్ని గ్రామీణ ప్రాంతాలకూ తాగునీటిని అందించాలనేది ఈ పథకం లక్ష్యం. నాలుగేళ్లలో 28,000 ఆర్సెనిక్, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సురక్షితమైన తాగునీటిని అందించాలనేది కూడా మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. వచ్చే ఏడాది అరకొర నీటి సదుపాయం ఉన్న 60,000 ప్రాంతాలను, తాగునీరు అందని 9,000 ప్రాంతాలను ఈ పథకం కిందికి తీసుకురావాలని నిర్ణయించారు.

గ్రామీణ టెలిఫోనీ..

2018–19 కేటాయింపులు
రూ.**10,000** కోట్లు(14% తగ్గింపు)


2017–18 కేటాయింపులు
రూ.**11,636** కోట్లు(322% పెంపు)

- దేశంలో టెలికం మౌలిక వసతులను పెంచడమే ఈ పథకం లక్ష్యం. ఇందులో ప్రధానంగా భారత్ నెట్ కార్యక్రమంలో భాగంగా 2019 మార్చి నాటికి దేశంలోని 2.5 లక్షల గ్రామ పంచాయతీలకు హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ కనెక్టివిటీని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- భారత్ నెట్ ఫేజ్–1లో ఇప్పటివరకూ లక్ష గ్రామ పంచాయతీలకు ఆప్టిక్ ఫైబర్ నెట్‌వర్క్‌తో అనుసంధానించామని, తాజాగా గ్రామీణ భారత్‌లో 5 కోట్ల మందికి బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు 5 లక్షల వైఫై హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేయనున్నామని జైట్లీ ప్రకటించారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన..

2018–19 కేటాయింపులు
రూ.**11,485** కోట్లు(8 శాతం పెంపు)

2017–18 కేటాయింపులు
రూ.**10,635** కోట్లు



- విద్యుత్ సౌకర్యం లేని లక్ష గ్రామాలకు కరెంటు.. దారిద్ర్య రేఖకు దిగువన(బీపీఎల్) ఉన్న కుటుంబాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్ లక్ష్యం(సమగ్ర విద్యుదీకరణ స్కీమ్స్–ఐపీడీఎస్). 2018 మే 1 కల్లా దేశంలో అన్ని గ్రామాలకూ విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు జైట్లీ పేర్కొన్నారు.
- ఐపీడీఎస్‌లో భాగంగా సౌభాగ్య ఘర్ యోజన(ఉచిత విద్యుత్ కనెక్షన్లు) కోసం రూ.3,700 కోట్లను, ఫీడర్లను వేరు చేసేందుకు గాను(33/11 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, హై–లో టెన్షన్ విద్యుల్ లైన్ల నిర్మాణం వంటివి) రూ.4,935 కోట్లను కేటాయించారు.
- గ్రామాల్లో కొత్తగా 175 లక్షల బీపీఎల్ కుటుంబాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలనేది లక్ష్యం.

ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై)..



2018–19 కేటాయింపులు
రూ.**19,000** కోట్లు (పెంపు లేదు)

2017–18 కేటాయింపులు
రూ. **19,000** కోట్లు

- మారుమూల గ్రామీణ ప్రాంతాలన్నింటికీ రోడ్డు సదుపాయాన్ని కల్పించే ఉద్దేశంతో 2000లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పథకం ఇది. 2011–14 మధ్య రోజుకు సగటు రోడ్డు నిర్మాణం 73 కిలోమీటర్లు కాగా, 2016–17లో ఇది 133 కిలోమీటర్లకు పెరిగిందని జైట్లీ పేర్కొన్నారు.
- గ్రామీణ ప్రాంతాలను ప్రధాన రోడ్లతో అనుసంధానించడానికి మరో 57,000 కిలోమీటర్ల రోడ్లను నిర్మించాలని ప్రతిపాదించారు. తద్వారా అర్హతగల గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం అనుసంధానం లక్ష్యం. ప్రస్తుతం 82 శాతం అనుసంధానం పూర్తయింది. 2019 మార్చికల్లా 100 శాతం లక్ష్యాన్ని సాధించనున్నట్లు జైట్లీ చెప్పారు.
- 2021 నాటికి మిగిలిన 65,000 అర్హత గల గ్రామీణ ప్రాంతాలను ప్రధాన రోడ్లతో అనుసంధానించేందుకు దాదాపు 2.3 లక్షల కిలోమీటర్ల రోడ్లను నిర్మించాలనేది లక్ష్యం కాగా, దీన్ని 2019 నాటికే పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో(2018 జనవరి 15 నాటికి) 25 వేల కిలోమీటర్ల రోడ్లను నిర్మించారు. 6,400 ప్రాంతాలను అనుసంధానించగలిగారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)..

2018–19 కేటాయింపులు: రూ.**21,000** కోట్లు(8.7 శాతం తగ్గింపు)

2017–18 కేటాయింపులు: రూ. **23,000** కోట్లు



- 2022 కల్లా దేశంలో అందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామనేది మోదీ సర్కారు నినాదం. 2019 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లులేనివాళ్లు, పూరిళ్లలో ఉంటున్న వారికి ఒక కోటి పక్కా ఇళ్లను నిర్మించి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జైట్లీ పేర్కొన్నారు.
- ఈ లక్ష్యంలో ఈ ఏడాది మార్చి కల్లా 51 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కానుందని ప్రభుత్వం పేర్కొంది. 2019 మార్చి నాటికి మరో 49 లక్షల ఇళ్లను నిర్మించనున్నట్లు వెల్లడించింది. కాగా, 2017–18 ఆర్థిక సంవత్సరంలో చూస్తే.. 2017 డిసెంబర్ నాటికి 15.57 లక్షల గ్రామీణ ఇళ్ల నిర్మాణం పూర్తయింది.
- దారిద్ర్య రేఖకు దిగువన(బీపీఎల్) ఉన్న కుటుంబాలు, ఎస్సీ/ఎస్టీలు, వికలాంగులు, బీపీఎల్ మైనారిటీలు ఈ పథకంలో లబ్ధిదారులు. వీరికిచ్చే నిధుల్లో 75 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్రాలు భరిస్తాయి.

మేం కట్టం..



పాలకుల ఆజ్ఞల్ని శిరసావహించేవారు కొందరైతే, వాటిని పూచికపుల్లగా ధిక్కరించి విప్లవాగ్ని రగిల్చినవారు మరికొందరు. చరిత్ర పుటల్లో కొందరు ఇలాంటి ధిక్కారాలకు పాల్పడి పాలకుల పాలిట సింహస్వప్నమై నిలిచారు. పన్ను పోట్లపై దండెత్తారు.

'దండి'గా ధిక్కరణ

➜ తెల్లవాడి దురహంకారంపై తొలి దెబ్బ. రవి అస్తమించని సామ్రాజ్యం మాది.. అంటూ విర్రవీగుతున్న ఆంగ్లేయుల నెత్తిపై తొలి పిడుగు.. అదే ఉప్పు సత్యాగ్రహం. ఉప్పుపై విధించిన పన్నుకు వ్యతిరేకంగా 1930 మార్చి 12న జాతిపిత బాపూజీ నేతృత్వంలో సాగిన ఈ సత్యాగ్రహం ఏప్రిల్ 6న గుజరాత్‌లోని దండిలో బ్రిటిష్ చట్టాలను ధిక్కరించి ఉప్పును తయారుచేయడంతో ముగిసింది.

ఉక్కు మహిళకూ తప్పలేదు..



➜ స్థానిక, సేవల పన్నులకు వ్యతిరేకంగా 1990లో బ్రిటన్ పౌరులు సర్కారుపై తిరుగుబావుటా ఎగురవేశారు. 2కోట్ల మంది ఈ పన్నులను చెల్లించేందుకు నిరాకరించారు. ట్రఫాల్గర్ స్క్వేర్ వద్దకు లక్షలాదిగా చేరుకుని సర్కారుపై యుద్ధభేరి మోగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున గొడవలు, అల్లర్లు చెలరేగాయి. చివరికి నాటి ప్రధాని, ఉక్కు మహిళ మార్గరేట్ థాచర్ ప్రజాగ్రహానికి తలవంచక తప్పలేదు.



టీ కప్పులో 'బోస్టన్'తుపాను..

➜ ఆంగ్లేయుల గుత్తాధిపత్యానికి 'బోస్టన్ టీ పార్టీ' ఉదంతం చెంపపెట్టులాంటిది. బ్రిటన్ ప్రభుత్వానికి చెందిన ఈస్టిండియా కంపెనీకి, వారి తొత్తులకు మాత్రమే టీ పొడి దిగుమతిపై పన్నును మినహాయించడం వలస పాలనలో మగ్గుతున్న అమెరికా వర్తకులకు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. దీంతో బోస్టన్ వర్తకులు తిరుగుబాటు చేసి అక్కడి నౌకల్లోని టీ పొడి మొత్తాన్ని సముద్రంపాలు చేశారు. 1773 డిసెంబర్‌లో జరిగిన ఈ సంఘటన చరిత్రలో బోస్టన్ టీ పార్టీగా వినుతికెక్కింది.

ప్రజలకోసం నగ్నంగా..

➜ పన్నుల పేరిట భర్త అరాచకాన్ని చూడలేక భార్యే ఎదురుతిరిగిన సంఘటన ఇది. 11వ శతాబ్దంలో ఇంగ్లండ్‌లోని మెర్సియా రాజ్యపాలకుడు లియోఫ్రిక్ ప్రజలపై విపరీతంగా పన్నులు వేసి వేధించేవాడు. సామాన్యుల కష్టాలకు చలించిపోయిన అతడి భార్య లేడీ గొడవపడి భర్తతో వాగ్వాదానికి దిగింది. రెచ్చిపోయిన భర్త.. నగ్నంగా శ్వేతాశ్వంపై నగరాన్ని చుట్టొస్తే పన్నుల భారం తగ్గిస్తానన్నాడు. ఆమె ఒప్పుకుంది. గుర్రంపై నగ్నంగా వెళుతున్నప్పుడు ప్రజలు ఇంట్లోంచి బయటకు రావద్దన్న షరతుతో నగ్నంగా నగర వీధుల్లో దౌడులు తీసింది.

బడ్జెట్.. 'బౌగెట్టీ'

బడ్జెట్ అనే మాట 'బౌగెట్టీ' అనే ఫ్రెంచి పదం నుంచి ఆవిర్భవించింది. బౌగెట్టీ అంటే తోలుసంచి అని అర్థం. పూర్వం ఆదాయ వ్యయాలకు సంబంధించిన లెక్కల పత్రాల్ని సభకు తోలుసంచిలో తీసుకొచ్చేవారు. అందువల్లే ఈ మాట వాడుకలోకి వచ్చింది.

పర్యాటకంపై ప్రత్యేక దృష్టి

న్యూఢిల్లీ: దేశంలోని 10 ప్రముఖమైన చరిత్రాత్మక, సాంప్రదాయిక పర్యాటక కేంద్రాలను 'ఐకానిక్ టూరిజం డెస్టినేషన్స్'గా మార్చేందుకు చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నామని జైట్లీ పేర్కొన్నారు. దీంతోపాటుగా భారత పురావస్తు శాఖ ప్రతిపాదించిన 100 ఆదర్శ కట్టడాల వద్ద పర్యాటకానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. నేషనల్ హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్ అండ్ అగ్‌మెంటేషన్ యోజన (హృదయ్)లో భాగంగా ప్రాచీన ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రోప్‌వేలు నిర్మించటం.. ఆయా ప్రాంతాలకు రైల్వే సదుపాయం కల్పించటం, సమీప రైల్వే స్టేషన్ల అభివృద్ధి వంటివి చేపట్టామన్నారు.

పౌష్టికాహార మిషన్‌కు రూ.3 వేల కోట్లు

న్యూఢిల్లీ: జాతీయ పౌష్టికాహార మిషన్(ఎన్ఎన్ఎం)కు ఈ బడ్జెట్‌లో కేటాయింపుల్ని మూడు రెట్లు పెంచారు. గతేడాది రూ.950 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.3,000 కోట్లకు పెంచారు. రాబోయే మూడేళ్లలో(2017–20) ఎన్ఎన్ఎంకు రూ.9,046 కేటాయించాలన్న కేంద్ర కేబినెట్ నిర్ణయం మేరకు బడ్జెట్‌లో తాజా కేటాయింపులు చేశారు. చిన్నారుల్లో పోషకాహారలోపం తదితర సమస్యల్ని నివారించడానికి ఎన్ఎన్ఎం కృషి చేస్తోంది. ఈ ఏడాది కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు బడ్జెట్‌లో రూ.24,700 కేటాయించగా.. దీంట్లో రూ.16,334 కోట్లను అంగన్‌వాడీ సేవలకు వినియోగిస్తారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులకు రూ.6 వేలు అందించే ప్రధాన్‌మంత్రి మాతృ వందన యోజనకు గతేడాది రూ.2,594 కోట్లు కేటాయించగా, ఈసారి ఆ మొత్తం రూ.2,400 కోట్లకు పరిమితమైంది. 'బేటీ బచావో–బేటీ పఢా వో' పథకానికి ఈసారి రూ.280 కోట్లు కేటాయించారు. గతేడాది ఈ మొత్తం రూ.200 కోట్లు. మహిళల రక్షణకు 2013లో రూ.3,500 కోట్లతో ఏర్పాటు చేసిన నిర్భయ ఫండ్‌ను ఈసారి రూ.500 కోట్లకు పెంచారు. చిన్నారుల్ని రక్షించే సేవలకు ఈసారి రూ.725 కోట్లు ఇవ్వనున్నారు.

ఢిల్లీకి రూ.790 కోట్లు

న్యూఢిల్లీ: 2018–19 వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఢిల్లీకి రూ.790 కోట్లు కేటాయించింది. కేంద్ర పన్నుల వాటా పెంచాలని ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం డిమాండ్ చేసినప్పటికీ ఎలాంటి మార్పులేదు. ఈ బడ్జెట్‌లో కేంద్ర సాయం రూ.449.99 కోట్లు. ఇది గత బడ్జెట్‌లో 412.98 కోట్లు. 1984 అల్లర్ల బాధిత కుటుంబాల కోసం గత బడ్జెట్‌లో రూ.15 కోట్లివ్వగా ఈసారి రూ.10 కోట్లే కేటాయించింది. కేంద్ర పన్నుల వాటా కింద ఢిల్లీకి రూ.325 కోట్లు కేటాయించింది. 2001–02 నుంచి కేంద్రంలో ప్రభుత్వాలు మారినా ఈ మొత్తం మాత్రం స్థిరంగా ఉంది.



సగానికిపైగా బడ్జెట్ గ్రామాలకే!

రూ.14.34 లక్షల కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ: తాజా బడ్జెట్‌లో గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ.. బడ్జెట్‌లో సగానికిపైగా గ్రామీణ ప్రాంతాలకే కేటాయించారు. వ్యవసాయంతో పాటు గ్రామీణాభివృద్ధి రంగాలకు పెద్దపీట వేశారు. 2018–19కిగాను మొత్తం బడ్జెట్‌లో సగానికిపైగా.. ఏకంగా 14.34 లక్షల కోట్లను గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర పథకాల కోసం ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 3.17 లక్షల కిలోమీటర్ల పొడవైన రోడ్లు నిర్మిస్తామని, 51 లక్షల కొత్త ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. కొత్తగా 1.75 కోట్ల గృహాలకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని, 1.88 కోట్ల టాయిలెట్లు నిర్మిస్తామని ప్రకటించారు. 2018–19లో మొత్తంగా 321 కోట్ల పనిదినాలు కల్పిస్తామన్నారు. ''దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో గరిష్ట స్థాయిలో జీవనోపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి, వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, మౌలిక సదుపాయాలకు భారీగా నిధులు కేటాయించాం..'' అని జైట్లీ ప్రకటించారు. గ్రామీణాభివృద్ధి శాఖకు గతేడాది కన్నా రూ.7 వేల కోట్లు అదనంగా.. మొత్తం రూ.1.12 లక్షల కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

సైన్స్ అండ్ టెక్నాలజీకి అరకొర నిధులే..

ఆధునిక సాంకేతికతను వినియోగించే దేశంగానే భారత్ మిగిలిపోకూడదు.. సొంతంగా టెక్నాలజీని అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేయాలి'' అని ఆర్థిక సర్వేలో ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించింది. అయితే కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం అది అంతగా ప్రతిఫలించలేదు. కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ రంగాల్లో పరిశోధనల కోసం అత్యున్నత స్థాయి నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం కొంత సానుకూల పరిణామం. అలాగే బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వినియోగంపైనా ఆర్థిక మంత్రి ఆసక్తి కనబరిచారు. బిట్ కాయిన్ వంటి క్రిప్టో కరెన్సీ నిర్వహణలో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఈ టెక్నాలజీతో లావాదేవీల నిర్వహణలో అవినీతి, అక్రమాల్ని పూర్తిస్థాయిలో అడ్డుకోగలమని కేంద్రం



భావిస్తోంది. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అంటే.. 'అన్ని లావాదేవీలను నమోదు చేసేందుకు ఉపయోగపడే ఒక పద్దుల పుస్తకం. ఇది ఒకే చోట కాకుండా.. నెట్‌వర్క్‌లో ఎన్ని కంప్యూటర్లు ఉంటాయో అన్నింటిలోనూ రహస్య సంకేత భాషలో నిక్షిప్తమై ఉంటుంది. అందరూ అనుమతిస్తేగానీ ఈ పద్దుల పుస్తకంలో చిన్న మార్పైనా చేయడం సాధ్యం కాదు. ఎవరైనా చేయాలనుకుంటే వెంటనే అందరికీ తెలిసిపోతుంది'. ప్రభుత్వ పథకాల అమలులో ఈ టెక్నాలజీని వినియోగించాలన్నదే కేంద్రం భావన.

1.5 లక్షల గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యం


ఇక దేశంలో జనాభా కంటే ఎక్కువ మొబైల్స్ అందుబాటులో ఉన్నా.. ఇంటర్నెట్ విషయంలో గ్రామీణ భారతం ఎంతో వెనుకంజలో ఉంది. ఈ లోటు భర్తీకి నేషనల్ నాలెడ్జ్ నెట్‌వర్క్ పేరుతో గ్రామ పంచాయతీల్ని అనుసంధానించే ప్రాజెక్టును గత ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికే లక్ష గ్రామ పంచాయతీల్ని అనుసంధానించినట్లు ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించింది. మిగిలిన 1.5 లక్షల గ్రామాల్ని శరవేగంగా భారత్ నెట్‌లోకి చేర్చే చర్యలు ముమ్మరం చేస్తామని ఈ బడ్జెట్‌లో ప్రకటించడం ఆహ్వానించదగ్గ విషయం. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ కనెక్టివిటీ పెంచేందుకు ఐదు లక్షల వైఫై హాట్‌స్పాట్ల ఏర్పాటు ప్రకటన, డిజిటల్ ఇండియా పథకానికి కేటాయింపులు రెట్టింపు చేయడం, 5జీ మొబైల్ టెక్నాలజీ పరీక్షలకు చెన్నై ఐఐటీలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వంటివి శాస్త్ర సాంకేతిక రంగానికి సంబంధించిన ఇతర ముఖ్యాంశాలు. మొదటి నుంచి భారతదేశంలో పరిశోధనలకు బడ్జెట్‌లో కేటాయింపులు నామమాత్రమే.. స్థూల జాతీయోత్పత్తిలో కనీసం ఒక్క శాతం నిధుల్ని పరిశోధనలకు కేటాయించాలని శాస్త్రవేత్తలు చాలాకాలంగా కోరుతున్నారు. అమెరికా, చైనా వంటి దేశాల్లో స్థూల జాతీయోత్పత్తిలో మూడు నుంచి నాలుగు శాతం నిధులు శాస్త్ర, సాంకేతిక రంగాలకు కేటాయిస్తుండగా.. మన వద్ద అవి అరశాతం దాటకపోవడం గమనార్హం. – సాక్షి, హైదరాబాద్



15 శాతం పెరిగిన సబ్సిడీలు

రూ.2.64 లక్షల కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ: ఆహారం, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులపై సబ్సిడీలు గతేడాది కేటాయింపులతో పోలిస్తే ఈ సారి 15 శాతం పెరిగాయి. 2018–19 ఆర్థిక సంవత్సరంలో సబ్సిడీల కోసం కేంద్రం రూ.2.64 లక్షల కోట్లు కేటాయించింది. గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రకారం ఆహారం, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులపై సబ్సిడీల కోసం రూ.2,64,335.65 కోట్లు కేటాయించారు. బడ్జెట్ సవరణల తర్వాత 2017–18లో ఈ సబ్సిడీల కోసం రూ.2,29,715.65 కోట్లు కేటాయించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆహార సబ్సిడీ కోసం రూ.1,69,323 కోట్లు కేటాయించగా, గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,40,281 కోట్లు కేటాయించారు. ఎరువుల కోసం సబ్సిడీ వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను రూ.70,079.85 కోట్లు కేటాయించారు. యూరియా కోసం వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.44,989.5 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.42,721.7 కోట్లు కేటాయించారు. ఫాస్ఫేట్, పొటాషియం ఎరువుల కోసం రూ.25,090.35 కోట్లు కేటాయించగా, ఈ ఆర్థిక 2017–18 ఆర్థిక సంవత్సరంలో రూ.22,251.8 కోట్లు కేటాయించారు. కాగా, పెట్రోలియం సబ్సిడీ కోసం రూ.24,932.8 కోట్లు కేటాయించగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 24,460.48 కోట్లు కేటాయించారు. ఎల్పీజీ సబ్సిడీ కోసం వచ్చే ఏడాది రూ.24,933 కోట్లు కేటాయించారు.



ఉద్యోగికి ఉత్తి చేయే!!

- పన్ను శ్లాబుల్లో మార్పులు లేవు
- రూ.40వేల వరకూ స్టాండర్డ్ డిడక్షన్‌కు ఓకే
- కానీ రవాణా భత్యం, వైద్య ఖర్చుల పన్ను పరిధిలోకి
- పైపెచ్చు పన్నుపై సెస్సు 3 నుంచి 4 శాతానికి పెంపు
- ఈ లెక్కన చూస్తే స్టాండర్డ్ డిడక్షన్‌తో ఒరిగేది శూన్యం
- వృద్ధుల వైద్య ఖర్చులపై కాస్త కరుణ చూపిన మంత్రి

సాక్షి, అమరావతి: మధ్యతరగతి ఉద్యోగుల ఆశలపై ఆర్థికమంత్రి నీళ్లు చల్లారు. పన్ను శ్లాబుల్లో మార్పులేమీ చేయకుండా కేవలం స్టాండర్డ్ డిడక్షన్‌తో సరిపెట్టుకోమన్నారు. వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించి నాలుగు కీలక మార్పులను ప్రతిపాదించారు. సుమారు 12 ఏళ్ల తర్వాత ఉద్యోగస్తులు, పెన్షనర్ల కోసం స్టాండర్డ్ డిడక్షన్‌ను తిరిగి ప్రవేశపెట్టడమే కొద్దిగా ఊరట కలిగించే విషయం. కానీ దానివల్ల వచ్చే లాభం కూడా చేతికందకుండా నానా మెలికలూ పెట్టారు జైట్లీ. చెల్లించే ఆదాయపన్నుపై వేసే సుంకాన్ని 3 నుంచి 4 శాతానికి పెంచారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో సీనియర్ సిటిజన్లపై మాత్రం కరుణ చూపించారు.

స్టాండర్డ్ డిడక్షన్ రూ.40,000

ఒక ఉద్యోగి ఆఫీసుకు వెళ్లి రావడానికయ్యే వ్యయాలను దృష్టిలో పెట్టుకొని గతంలో స్టాండర్డ్ డిడక్షన్ కింద ఆదాయంలోంచి కొంత మొత్తాన్ని తగ్గించి మిగిలిన దానిపైనే పన్ను లెక్కించేవారు. కానీ దీన్ని 2006–07 అసెస్‌మెంట్ ఇయర్‌లో తొలగించారు. అప్పట్లో స్టాండర్డ్ డిడక్షన్ రూ.30 వేలుగా ఉండేది. 12 ఏళ్ల తర్వాత తిరిగి రూ.40,000 స్టాండర్డ్ డిడక్షన్‌ను జైట్లీ ప్రకటించారు. దీనివల్ల 2.5 కోట్ల మంది లబ్ధి పొందుతారని, ప్రభుత్వానికి రూ.8,000 కోట్ల ఆదాయం తగ్గుతుందని చెప్పారు. కానీ స్టాండర్డ్ డిక్షన్ నేపథ్యంలో ప్రస్తుతం మినహాయింపు పరిధిలో ఉన్న రవాణా, వైద్య చికిత్స అలవెన్సుల్ని పన్ను పరిధిలోకి తెచ్చారు.

అసలు డిడక్షన్ ఎంతంటే...

ఉద్యోగి జీతంలో నెలకు రూ.1,600 చొప్పున (ఏడాదికి రూ.19,200) రవాణా భత్యం ఉంటుంది. దీనిపై ఇపుడు పన్ను లేదు. అలాగే ఏడాదికి రూ.15,000 వరకు మెడికల్ ఖర్చులను ఆదాయం నుంచి తగ్గించి చూపించుకోవచ్చు. ఆ లెక్కన ఏటా రూ.34,200పై ఇప్పుడు కూడా పన్ను లేదు!! మరిక రూ.40,000 స్టాండర్డ్ డిడక్షన్ వల్ల లాభమెంత? కేవలం రూ.5,800!! పెన్షనర్లకు ఇలాంటి భత్యాలు ఉండవు కనక స్టాండర్డ్ డిడక్షన్ వల్ల సీనియర్ సిటిజన్స్‌కు లాభమని చెప్పాలి. ఇది వ్యాపారులు, వృత్తి నిపుణులకు వర్తించదు.

పెరిగిన సెస్ భారం

ఆదాయ పన్నుపై చెల్లించే సుంకాన్ని 3 నుంచి 4 శాతానికి పెంచారు. తద్వారా పన్ను చెల్లింపుదారులకు ట్యాక్స్ శ్లాబును బట్టి రూ.125 నుంచి రూ.2,625 వరకు భారం పడుతుంది. రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలలోపు పన్ను ఆదాయమున్న వారు ప్రస్తుతం 5 శాతం పన్ను చెల్లించాలి. ఈ పరిమితిలో ఉన్నవారు అదనంగా రూ.125 వరకు చెల్లించాలి. అదే 10 శాతం పన్ను పరిధిలో (రూ.5–10 లక్షలు) ఉన్నవారు గరిష్టంగా రూ.1,125, 30 శాతం పన్ను పరిధిలో ఉన్న వారు అదనంగా రూ.2,625 సుంకం చెల్లించాల్సి ఉంటుంది.

సీనియర్లకు కాస్త నయమే!

వయో వృద్ధుల వడ్డీ ఆదాయంపై టీడీఎస్ విధించే పరిమితిని ఐదు రెట్లు పెంచడమే కాకుండా, వైద్య చికిత్స వ్యయాలపై పన్ను మినహాయింపు పరిమితిని కూడా పెంచారు జైట్లీ. స్థిరాదాయాన్నిచ్చే ప్రధాని వయ వందన యోజన పథకాన్ని 2020 వరకు పెంచారు. సెక్షన్ 194ఏ కింద రూ.50,000 వడ్డీ ఆదాయం వరకు ఎలాంటి టీడీఎస్ వసూలు చేయరు. సెక్షన్ 80డీ కింద సీనియర్ సిటిజన్స్ చెల్లించే వైద్య బీమా ప్రీమియం, వైద్య చికిత్సా వ్యయాల పరిమితిని రూ.50,000కు పెంచారు. సెక్షన్ 80డీడీబీ కింద తీవ్ర రోగాల (క్రిటికల్ ఇల్‌నెస్)కు చేసే చికిత్స వ్యయాలపై లభించే పన్ను మినహాయింపు పరిమితిని లక్ష రూపాయలకు పెంచారు. ప్రస్తుతం ఈ పరిమితి సీనియర్ సిటిజన్స్‌కు రూ.40,000, సూపర్ సీనియర్స్‌కు రూ.60,000 ఉంది. వడ్డీరేట్లు తగ్గుతుండటంతో వయోవృద్ధులకు స్థిరమైన ఆదాయాన్ని అందించడానికి ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి వయ వందన యోజన పథకాన్ని 2020కి పొడిగించారు. ఎల్ఐసీ అందించే ఈ పథకంపై 8 శాతం వడ్డీ లభిస్తుంది. అంతేగాక ఈ పథకంలో ఇన్వెస్ట్‌మెంట్ పరిమితిని ప్రస్తుతం రూ.7.5 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచారు.

ఉద్యోగుల ఆదాయాలే ఎక్కువ

ఉద్యోగులు తమ ఆదాయం వ్యాపారుల కంటే తక్కువని భావిస్తుంటారని, కానీ ఇది సరికాదని గణాంకయుక్తంగా చెప్పారు జైట్లీ. ''వ్యాపారులతో పోలిస్తే ఉద్యోగస్థులే ఎక్కువ ఆదాయ పన్ను చెల్లిస్తున్నారు. 2016–17 అసెస్‌మెంట్ ఇయర్‌లో 1.89 కోట్ల మంది ఉద్యోగస్తులు రూ.1.44 లక్షల కోట్ల ఆదాయ పన్ను చెల్లించారు. అంటే సగటున ఒక్కో ఉద్యోగి రూ.76,306 చెల్లించారు. కానీ ఇదే సమయంలో 1.88 కోట్ల మంది వ్యాపారులు రూ.48,000 కోట్ల పన్నే చెల్లించారు. వీరి సగటు చెల్లింపు రూ.25,753 మాత్రమే. పన్ను తక్కువ చెల్లిస్తున్నారంటే వారి ఆదాయం తక్కువే కదా!'' అంటూ లాజిక్ లాగారు ఆర్థిక మంత్రి!

స్టాండర్డ్ డిడక్షన్‌కి బిల్లులక్కర్లేదు

సీబీడీటీ చైర్మన్ సుశీల్ చంద్ర

న్యూఢిల్లీ: తాజా బడ్జెట్‌లో ప్రకటించిన రూ.40,000 స్టాండర్డ్ డిడక్షన్ క్లెయిమ్ చేయడానికి వేతన జీవులు, పెన్షనర్లు ప్రత్యేకంగా బిల్లులు, ఇతరత్రా పత్రాలేవీ సమర్పించాల్సిన అవసరం లేదని కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు సీబీడీటీ చైర్మన్ సుశీల్ చంద్ర వివరణ ఇచ్చారు. వారు నేరుగా ఈ మినహాయింపు పొందవచ్చన్నారు.

షేర్ల లాభాలపై పన్ను!

- దీర్ఘకాలిక ఈక్విటీ లాభాలపై 10 శాతం పన్ను
- ఇన్వెస్ట్ చేసిన ఏడాదిలోపైతే 15 శాతం
- జనవరి 31 వరకు ఆర్జించిన లాభాలకు మినహాయింపు!

సాక్షి, అమరావతి: ఇక నుంచి షేర్లు, మ్యూచువల్ ఫండ్లు ఎప్పుడు అమ్మినా వచ్చే లాభాలపై పన్ను చెల్లించక తప్పదు. షేర్ మార్కెట్ పరిభాషలో దీర్ఘకాలం అంటే ఇప్పటివరకూ ఏడాది! షేర్లు కొని ఏడాదిలోపు విక్రయిస్తే... ఆ లాభాలపై షార్ట్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ 15 శాతం చెల్లించాలి. అదే ఏడాది దాటాక విక్రయిస్తే ఆ లాభాలపై ఇప్పటిదాకా పన్ను లేదు. కానీ షేర్లు, ఈక్విటీ ఫండ్స్‌పై వచ్చే దీర్ఘ కాలిక మూలధన లాభాలపై 10 శాతం పన్నును విధిస్తున్నట్లు తాజా బడ్జెట్లో ప్రకటించారు. ఈ లాభం లక్ష రూపాయలు దాటితే పన్ను పడుతుంది. ఈ పన్నుపై ఇండక్సేషన్‌ను (ద్రవ్యోల్బణ సూచీ) పరిగణనలోకి తీసుకోరు. జనవరి 31 వరకు వచ్చిన లాభాలను ఈ పన్ను పరిధిని నుంచి మినహాయించడం ఒక్కటే ఊరట. 'గ్రాండ్‌ఫాదర్డ్'పేరిట జనవరి 31 వరకు ఉన్న షేర్ల ధర ఆధారంగా లాభాలను లెక్కిస్తారు.

ఉదాహరణ చూద్దాం...

ఏడాది క్రితం మీరు రూ.50 వద్ద కొన్న షేరు ధర జనవరి 31 నాటికి రూ.100కి ఉందనుకుందాం. అంటే ఇప్పటికే మీ షేరు ధర రెట్టింపయింది. ఇప్పుడు ఈ షేరును జూలైలో కూడా రూ.100 వద్ద అమ్మితే మీరు ఎలాంటి పన్నూ చెల్లించాల్సిన అవసరం లేదు. షేరును రూ.120కు అమ్మారనుకుందాం. మీ వాస్తవ లాభం రూ.70 అయినా రూ.20పై పన్ను చెల్లిస్తే చాలు. మిగతా రూ.50 లాభాన్ని జనవరి 31 నాటికే పొందారు గనక దానిపై పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకూ లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ వర్తిస్తుంది. అంటే ఇక నుంచి షేర్లు గానీ, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ గానీ ఇన్వెస్ట్ చేసిన ఏడాది తర్వాత అమ్మితే 10 శాతం, 12 నెలలలోపు అమ్మితే 15 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇది ప్రస్తుతం షేర్ల క్రయవిక్రయాలపై చెల్లిస్తున్న లావాదేవీ పన్నుకు (ఎస్‌టీటీ) అదనం. అంటే ఇప్పుడు ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్‌పై రెండు రకాల పన్నులు చెల్లించాల్సి వస్తుందన్నమాట. భూముల వంటి ఇతర ఆస్తుల్లో 36 నెలలు దాటితే లాంగ్‌టర్మ్ గెయిన్స్‌పై 20 శాతం, ఆ లోపయితే 30 శాతం పన్ను విధిస్తున్నారు.

మ్యూచ్‌వల్ ఫండ్లనూ వదల్లేదు

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌పై 10 శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నును ప్రతిపాదించిన జైట్లీ... ఇన్వెస్టర్లకు ఈక్విటీ ఫండ్లు ఇచ్చే డివిడెండ్‌పైనా 10 శాతం పన్ను వేశారు. లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్నును తప్పించుకోవటానికి ఇన్వెస్టర్లు డివిడెండ్ ప్లాన్లకు మళ్లకుండా చెక్ పెట్టడమే దీని ఉద్దేశమని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నిబంధన ప్రకారం ఇన్వెస్టర్లకు ఫండ్ సంస్థలు మిగులు నిల్వల నుంచి చేసే డివిడెండ్ చెల్లింపులపై పన్నును ముందుగానే చెల్లించాలి. ఇన్వెస్టర్లు నేరుగా చెల్లించాల్సిన అవసరం లేదు. ఎల్‌టీసీజీ అన్నది ఏడాది కాలం దాటిన పెట్టుబడులపై లాభం రూ.లక్ష మించితేనే చెల్లించాల్సి ఉంటుంది. డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ మాత్రం ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్ (డివిడెండ్ ప్లాన్లు)లో ఇన్వెస్ట్ చేసేవారందరూ చెల్లించాల్సినది.

స్వల్పకాలంలో ప్రభావం

డివిడెండ్‌నే ఆదాయంగా భావించే వారిపై తాజా పన్ను గణనీయమైన ప్రభావమే చూపనుంది. తాజా పన్ను ప్రతిపాదనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపొచ్చని హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ చైర్మన్ దీపక్ పరేఖ్ అభిప్రాయపడ్డారు. ఇక మ్యూచువల్ ఫండ్స్ విక్రయించినప్పుడు 0.001 శాతం సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను కూడా చెల్లించాల్సి ఉంటుంది. ''సెంటిమెంట్ ఆధారిత పెట్టుబడుల ఉపసంహరణలు చోటు చేసుకోవచ్చు. అలాగే, ఎల్‌టీసీజీ వల్ల స్వల్పకాలంలో నిధుల ప్రవాహం కూడా నిదానించవచ్చు. అయితే దీర్ఘకాలంలో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపై పెద్దగా ప్రభావం ఉండదు'' అని మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ఇండియా డైరెక్టర్ కౌస్తభ్ బేలపుర్కార్ పేర్కొన్నారు.

వింత పన్నుల విడ్డూరాలు

దూరం.. భారం



దూరానికీ, పన్ను భారానికీ లంకెపెట్టిన చరిత్ర చైనాలోని చౌ వంశీయులది. వారి హయంలో రాజధానికి చేరువలోనున్న పొలాలకు చెందిన రైతులపై 5 శాతం పన్ను విధించే వారు కాగా, దూరాన్ని బట్టి రైతులపై పన్ను భారం గరిష్ఠంగా 25 శాతం వరకు పడేది.

కూతురైతే ఏంటట..!



ఈజిప్టులో పన్నులంటే శ్రమదానం చేయడమట! అందుకే ఖుఫు పిరమిడ్‌ను నిర్మించడానికి ఏకంగా లక్ష మంది 20 ఏళ్లపాటు శ్రమదానం చేశారు. చివరికి ఇది ఎంతదాకా పోయిందంటే.. ఈ బృహత్‌కార్యానికి నిధులు సమకూర్చేందుకు ఫారో చక్రవర్తి తన కుమార్తెను సైతం వ్యభిచారంలోకి దించాడట!! ఆమె తనతో గడిపే విటుల నుంచి డబ్బుతోపాటు పిరమిడ్ నిర్మాణం కోసం వినియోగించే రాళ్లనూ ఫీజు కింద డిమాండ్ చేసేది. తదనంతర కాలంలో ఆమె కోసం నిర్మించిన పిరమిడ్‌లో ఈ రాళ్లను వినియోగించారు. ఇంతకీ ఆ పిరమిడ్‌ను కట్టడానికి ఎన్ని రాళ్లు వాడారో తెలుసా? 20 వేల రాళ్లు!!

మీరూ కట్టండి..



జర్మనీ సర్కారు 2004 జనవరి నుంచి ఈ పన్నును అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం ఫుల్‌టైమ్ సెక్స్‌వర్కర్లు స్థానిక పట్టణ సంస్థకు ప్రతినెలా 150 యూరోలు, పార్ట్ టైమర్లయితే వారి 'పని'దినాలకు ఆరు యూరోల చొప్పున చెల్లించాలి.

'చచ్చినా' వదలను..



పన్నులేసి ప్రజల్ని చంపిన పాలకులు మన కెరుకే! కానీ చచ్చిన తర్వాత కూడా పన్ను లేస్తున్న మహానుభావులూ ఉన్నారు. అది కూడా ఎప్పుడో రాజుల కాలంలోకాదు.. రెండు మూడేళ్ల కిందటే సియాటిల్‌లోని కింగ్ కౌంటీలో మరణంపైనా పన్ను అమలు చేయడం మొదలుపెట్టారు. మృతుని బంధువులు ఈ మేరకు వైద్య పరీక్ష అధికారి కార్యాలయంలో 50 డాలర్లు చెల్లించాలి. అప్పుడు మాత్రమే ఆ మృతదేహాన్ని తగులబెట్టాలన్నా, సమాధి చేయాలన్నా అనుమతి లభిస్తుంది. దీన్ని స్థానికంగా అందరూ 'డెత్ టాక్స్' అని పిలుస్తుంటారు.

వరికి 'ఉరేశారు'..!

రైతు శ్రేయస్సు కోరేవాడే రాజు.. కానీ, జపాన్ పాలకులు అన్నదాతలను పీల్చి పిప్పి చేశారు. జలపుష్పాలైన చేపలు, రొయ్యలు, పీతలపై పన్నులను పూర్తిగా రద్దుచేసి, వరి ఉత్పత్తులపై మాత్రం ఏకంగా 67 శాతం పన్ను వసూలు చేశాడు



జపాన్ చక్రవర్తి హిడెయోషి(1590). రైతులు పండించిన పంటలో మూడింట రెండొంతులు పన్ను కింద రాజుకి సమర్పించాల్సి వచ్చేది. దీంతో అన్నదాతలకు గుప్పెడు గింజలు మాత్రమే మిగిలేవి.

అరకొర నిధులతోనే సరి..

- రాష్ట్రంలోని జాతీయ విద్యాసంస్థలకు కేటాయింపులు అంతంతే
- ఎయిమ్స్ ప్రస్తావన లేనే లేదు
- అగ్రివర్సిటీ, తదతర సంస్థలకూ ప్రత్యేక కేటాయింపులు శూన్యం

సాక్షి, అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంలోని జాతీయ విద్యాసంస్థలకు కేటాయింపులు నిరాశాజనకంగా ఉన్నాయి. విభజన చట్టంలో పేర్కొన్న సంస్థలను ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోగా నెలకొల్పిన వాటికీ నిధుల కేటాయింపు అరకొరగానే ఉంది. ఈ సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వ అంచనాల ప్రకారం దాదాపు రూ.పదివేల కోట్లకు పైగా అవసరమైతే.. ఈ నాలుగేళ్లల్లో కేటాయింపులు నామమాత్రంగానే ఉన్నాయి. గత బడ్జెట్‌ల తీరులోనే ఈసారీ బడ్జెట్ కేటాయింపులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఎయిమ్స్ ప్రస్తావన లేకపోగా.. అగ్రి వర్సిటీ, తదితర సంస్థలకు ప్రత్యేక కేటాయింపులేవీ లేకపోవడం గమనార్హం. దీనిపై పలు వర్గాల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. కనీస సదుపాయాల్లేక జాతీయ విద్యాసంస్థల్లో ఇప్పటికే ప్రమాణాలు దెబ్బతినగా.. ఇవి మరింత దిగజారే వీలున్నట్టుగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.





హామీలకు తగినట్టుగా నిధులేవి..

రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న సంస్థలతోపాటు ఇతర సంస్థల ఏర్పాటుకూ కేంద్రం హామీ ఇచ్చింది. ఆ మేరకు 17 సంస్థలు పూర్తిస్థాయిలో ఏర్పడాలి. అయితే నిధులు సరిపడినంతగా రాకపోతుండడంతో ఏర్పాటైన ఈ సంస్థలన్నీ తాత్కాలిక ఆవాసాల్లో చాలీచాలని సదుపాయాలతో కొనసాగుతున్నాయి. ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎం, ఐఐఎస్ఈఆర్ తదితర సంస్థలదీ అదే పరిస్థితి. రెగ్యులర్ సిబ్బంది లేక తాత్కాలిక ప్రాతిపదికన కొందరిని తీసుకోగా, ఇతర వర్సిటీల నుంచి అప్పుడప్పుడు వచ్చే బోధనా సిబ్బందితో అవి నడుస్తున్నాయి. సరిపడా నిధులు కేటాయిస్తే శాశ్వత భవనాలు, ల్యాబ్‌లు ఇతర సదుపాయాలు కల్పించడానికి వీలుంటుంది. అయితే గడిచిన నాలుగేళ్లల్లో ఆయా సంస్థల ఏర్పాటుకోసం కేటాయించిన నిధులు.. అవసరమైన నిధులతో పోలిస్తే అత్యల్పం కావడం, దీనికితోడు కేటాయించిన నిధులూ పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడంతో ఈ జాతీయ సంస్థల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.

తాజా బడ్జెట్లో ఆయా సంస్థలకు కేటాయింపులు ఇలా..

సంస్థ	కేటాయింపు (రూ.కోట్లల్లో)
సెంట్రల్ వర్సిటీ	10.00
గిరిజన వర్సిటీ	10.00
ఐఐటీ తిరుపతి	50.00
ఐఐఎం విశాఖ	42.00
ఎన్ఐటీ, తాడేపల్లిగూడెం	54.00
ఐఐఎస్ఈఆర్, తిరుపతి	49.00
ఐఐఐటీ కర్నూలు	30.00
ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ	32.00
ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్	5.00

రాష్ట్ర విభజన అనంతరం ఆయా జాతీయ విద్యా సంస్థలకు గత నాలుగేళ్లల్లో జరిగిన బడ్జెట్ కేటాయింపులు, అందులోనూ ఇంకా రావాల్సిన బకాయిల వివరాలివీ.. (రూ.కోట్లలో)

సంస్థ	అవసరం	గత నాలుగేళ్లలో బడ్జెట్ కేటాయింపులు	అందులోనూ బకాయిలు
ఐఐటీ	700.00	108.00	62.00
ఐఐఎస్ఈఆర్	1,500.00	113.00	60.50
ఐఐఎం	900.00	74.92	34.52
ఎన్ఐటీ	400.00	90.00	50.00
ఐఐఐటీ	747.77	53..00	40.00
సెంట్రల్ వర్సిటీ	--	11.00	10.00
గిరిజన వర్సిటీ	--	11.00	10.00
అగ్రివర్సిటీ	1,506.00	122.50	--
ఎయిమ్స్	1,600.00	--	--
ఎన్ఐడీఎం	--	23.07	--
పెట్రోలియం వర్సిటీ	--	--	--
ఐఐఎఫ్‌టీ	--	--	--
ఐఐపీ	--	20.00	--
సీఐపీఈటీ	50.73	--	--
ఎన్ఐడీ	200.00	--	--
నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిఫైనరీ	--	--	--
ఇనిస్టిట్యూట్ ఆఫ్ కలోనరీ స్కిల్స్	98.00	--	--
మొత్తం	7,702.50	626.49	267.02

గమనిక: వీటిలో సెంట్రల్ వర్సిటీ, గిరిజన వర్సిటీ, ఎన్ఐడీఎం, పెట్రోలియం వర్సిటీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెన్‌ట్రేడ్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిఫైనరీలకు సంబంధించి ఎంత అవసరమనేది ఇప్పటివరకు అంచనాలు రూపొందించలేదు.

పోలవరానికి 'కలవరం'!

2018-19 బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించని కేంద్రం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును 2018 నాటికి పాక్షికంగా.. 2019కి సంపూర్ణంగా పూర్తి చేస్తామంటూ సీఎం చంద్రబాబు చెబుతోన్న మాటల్లో చిత్తశుద్ధి లేదన్నది మరోసారి స్పష్టమైంది. ప్రత్యేక హోదాను కేంద్రానికి తాకట్టు పెట్టి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి దక్కేలా చక్రం తిప్పిన చంద్రబాబు.. ఆ ప్రాజెక్టుకు నిధులు రాబట్టడంలో విఫలమయ్యారు. 2017–18 బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు రూ.వెయ్యి కోట్లు కేటాయించిన కేంద్రం.. 2018–19 బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోడమే అందుకు తార్కాణం. ప్రతి సోమవారం వర్చువల్ రివ్యూలు.. పదే పదే భూమి పూజలతో రియాలిటీ షోల తరహాలో నిర్వహించి ప్రజలను మభ్య పెట్టడం.. సత్తాలేని ట్రాన్స్‌ట్రాయ్‌ను తొలగించకపోగా దాన్నే ముందు పెట్టి తనకు కమీషన్‌లు ఇచ్చే వారికి పనులను నామినేషన్‌పై కట్టబెట్టడం మినహా ప్రాజెక్టును పూర్తి చేసే ఉద్దేశం సీఎం చంద్రబాబుకు లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. టీడీపీ భాగస్వామ్యంలోని ఎన్డీయే ప్రభుత్వానికి గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినది చివరి పూర్తి స్థాయి బడ్జెట్ కావడం గమనార్హం. ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడంతో పోలవరం ప్రాజెక్టు 2019 నాటికి పూర్తయ్యే అవకాశాలు కన్పించడం లేదు. ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కేంద్రమే చేపట్టేలా పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)తో ఒప్పందం చేసుకుని ఉంటే, బడ్జెట్‌లో నిధులు కేటాయించి.. వేగంగా పూర్తిచేసే బాధ్యత కేంద్రంపై ఉండేదని జలవనరుల శాఖ సీనియర్ అధికారి ఒకరు 'సాక్షి'తో చెప్పారు. దేశ వ్యాప్తంగా పీఎంకేఎస్‌వై మూడో దశ కింద 48 ప్రాజెక్టులను కేంద్రం గుర్తించింది. వాటిని 2019 జూన్ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించింది. 2018–19 బడ్జెట్‌లో ఎల్ఐటీఎఫ్ కింద రూ.6వేల కోట్లను నాబార్డుకు కేటాయించిన కేంద్రం.. ఆ ప్రాజెక్టులకు ఈ నిధుల నుంచే మంజూరు చేస్తుంది. పోలవరానికీ దీని నుంచే నిధులను కేటాయిస్తుంది. వీటిని పరిగణనలోకి తీసుకుంటే పోలవరానికి రూ.వెయ్యి కోట్లకు మించి వచ్చే పరిస్థితి లేదు.

పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపుల తీరు

సంవత్సరం	బడ్జెట్‌లో కేటాయింపు	పీపీఏకు విడుదల చేసింది	రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసింది
2014–15	250.00	250.00	245.00
2015–16	600.00	600.00	590.00
2016–17	2,514.16	2,514.14	2,514.70
2017–18	1,000.00	979.36	979.36 (ఫిబ్రవరి 1 వరకూ)
2018–19	--	--	--
మొత్తం	4,364..16	4,343.52	4,329.06

ఆయుష్మాన్ 'ఆంధ్రప్రదేశ్'

1.42 కోట్ల కుటుంబాలకు ఆయుష్మాన్ భారత్



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రకటించిన 'ఆయుష్మాన్ భారత్' పథకం ఏపీలో ఎక్కువ మందికి లబ్ధి జరిగే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలు ఏడాదికి రూ.330 ప్రీమియం చెల్లిస్తే రూ.5 లక్షల మేరకు వైద్యం పొందేందుకు ఈ పథకాన్ని రూపొందించారు. మన రాష్ట్రంలో సుమారు మూడున్నర కోట్ల మంది ఈ పథకం పరిధిలోకి వస్తారు. దీంతో పాటు దేశవ్యాప్తంగా 1.5 లక్షల వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

'ఉజ్వల'తో 30 లక్షల కుటుంబాలకు లబ్ధి



సాక్షి, అమరావతి: ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద దేశంలో 80 కోట్ల కుటుంబాలకు సబ్సిడీ గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. ఈ పథకాన్ని కేంద్రం 2016 నుంచి అమలు చేస్తున్నది. కేంద్రం ఇస్తున్న కనె క్షన్లను రాష్ట్ర ప్రభుత్వం దీపం పథకం కింద ఇస్తున్న విషయం తెలిసిందే.



బడ్జెట్ 2018-19

క్రిప్టో కరెన్సీలకు చట్టబద్ధత లేదు: జైట్లీ



న్యూఢిల్లీ: బిట్‌కాయిన్స్ వంటి క్రిప్టో కరెన్సీలకు చట్టబద్ధత లేదని, వీటి విని యోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుం దని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ప్రస్తుతం వర్చువల్ కరెన్సీలను నియంత్రించే చట్టాలేమీ దేశీయంగా లేవని, ఈ తరహా కరెన్సీల లావాదేవీలకు ఆర్‌బీఐ ఏ కంపెనీకి అనుమతులివ్వలేదని జైట్లీ గతేడాది పార్లమెంటుకు తెలిపిన సంగతి తెలిసిందే.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
58 ▼	11 ▼
35,907	11,017

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	7,424	▲	13
డోజోన్స్	26,285	▲	135
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,490	▼	43
డాక్స్	13,004	▼	186
షాంఘై	3,446	▼	35
నికాయ్	23,486	▲	388

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.39	64.52
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.76	91.94
€	యూరో	ఎస్‌బీఐ	80.33	80.49
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.13	59.25
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.16	52.26
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.25	49.35
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.40	18.26
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.77	18.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.16	11.62

ఇన్వెస్టే్రర్!

మార్కెట్‌ను కుదిపేసిన మూలధన లాభాల పన్ను...

స్టాక్ మార్కెట్... అంతలోనే అందలమెక్కిస్తుంది. ఆ ఆనందాన్ని ఆసాంతం ఆస్వాదించేలోపే అధఃపాతాళానికి తొక్కేస్తుంది. ఎందుకు పడుతుందో, ఎప్పుడు ఎగస్తుందో ఒక పట్టాన అర్థం కాని బ్రహ్మపదార్థం సెన్సెక్స్. గురువారం జైట్లీ వేసిన పన్ను 'పాచిక' ఇన్వెస్టర్లకు చుక్కలు చూపించింది. మార్కెట్ ఒక్కసారిగా కుప్పకూలి... అంతలోనే మళ్లీ లాభాల్లోకి రావడం వైకుంఠపాళిని తలపించింది!!



- ఇన్వెస్టర్లను మెప్పించని జైట్లీ బడ్జెట్
- ఎల్‌టీసీజీతో భారీగా నష్టపోయిన సూచీలు
- దేశీయ కొనుగోళ్లతో నష్టాల రికవరీ
- చివరికి స్వల్ప నష్టాలతో ముగింపు
- 58 పాయింట్లు కోల్పోయి 35,907కు సెన్సెక్స్
- 11 పాయింట్ల నష్టంతో 11,017కు నిఫ్టీ

దీర్ఘకాల మూలధన లాభాల పన్ను, ద్రవ్య లోటు లక్ష్యం పెంపు గురువారం స్టాక్ మార్కెట్‌ను భారీ నష్టాల వైపు నడిపించాయి. అయితే దేశీయ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల దన్నుతో చివరకు స్వల్పనష్టాలతో స్టాక్ సూచీలు గట్టెక్కాయి. స్టాక్ సూచీలు వారం గరిష్ట స్థాయికి పడిపోయాయి. సెన్సెక్స్ 36 వేల దిగువకు పడిపోగా, నిఫ్టీ 11,000 పాయింట్ల పైన ముగియగలిగింది. లోక్‌సభలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగం కొనసాగినంతసేపూ స్టాక్ మార్కెట్లో అమ్మకాలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. ట్రేడింగ్ చివర్లో దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు భారీ స్థాయిలో కొనుగోళ్లు జరపడంతో స్టాక్ మార్కెట్ నష్టాల నుంచి రికవరీ అయింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 58 పాయింట్ల నష్టంతో 35,907 పాయింట్ల వద్ద, నిఫ్టీ 11 పాయింట్లు కోల్పోయి 11,017 పాయింట్ల వద్ద ముగిశాయి.

పెరిగిన ద్రవ్యలోటు లక్ష్యం

రూ. లక్షకు మించిన స్టాక్ మార్కెట్ లాభాలపై 10 శాతం దీర్ఘకాల మూలధన లాభాల పన్ను విధించాలనే అరుణ్ జైట్లీ ప్రతిపాదనతో సెన్సెక్స్ 463 పాయింట్లకు పైగా నష్టపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యాన్ని 3.5 శాతానికి పెంచడం, పదేళ్ల బాండ్ రాబడులు 7.5 శాతానికి ఎగియడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అయితే పన్ను వసూళ్లు, గ్రామీణాభివృద్ధి, జీడీపీ, ఉద్యోగ కల్పన తదితర అంశాలకు సంబంధించి అంచనాలు ఆశావహంగా ఉండటం, మౌలిక రంగానికి అధికంగా నిధులు కేటాయించడం, రూ.250 కోట్ల వరకూ టర్నోవర్ ఉన్న వ్యాపార సంస్థపై కార్పొరేట్ ట్యాక్స్‌ను 25 శాతానికి తగ్గించడం ఒకింత సానుకూల ప్రభావం చూపించాయి.

లాభాల్లోంచి నష్టాల్లోకి....

బడ్జెట్‌పై ఆశావహ అంచనాలతో సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. మూలధన లాభాల పన్ను ప్రతిపాదన వరకూ లాభాల్లోనే కొనసాగింది. ఈ ప్రతిపాదన తర్వాత నష్టాల్లోకి జారిపోయింది. సెన్సెక్స్ ఒక దశలో 292 పాయింట్లు లాభపడగా, మరో దశలో 463 పాయింట్లు నష్టపోయింది. ఇక నిఫ్టీ ఒక దశలో 90 పాయింట్లు లాభపడగా, మరోదశలో 149 పాయింట్లు నష్టపోయింది. కాగా గతేడాది బడ్జెట్ రోజు సెన్సెక్స్ 486 పాయింట్లు, నిఫ్టీ 155 పాయింట్ల చొప్పున లాభపడ్డాయి. ఫలితాలు బాగా ఉండటంతో ఎల్ అండ్ టీ 2.8 శాతం లాభపడి రూ.1,456 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన రెండో షేర్ ఇదే.

సెన్సెక్స్ 32,000 పాయింట్లకు: బోఫా-ఎమ్ఎల్



ఈక్విటీ పెట్టుబడులకు సంబంధించి దీర్ఘకాల మూలధన లాభాల పన్ను విధింపు స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుందని విదేశీ బ్రోకరేజ్.. బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లించ్(బోఫా-ఎమ్ఎల్) వ్యాఖ్యానించింది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి సెన్సెక్స్ 32,000 పాయింట్లకు పతనమవుతుందని హెచ్చరించింది. బడ్జెట్ ప్రతిపాదనలు అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయని పేర్కొంది.

ఐఎఫ్ఎస్‌సీకి నియంత్రణ సంస్థ



న్యూఢిల్లీ: ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (ఐఎఫ్ఎస్‌సీ)లో నిర్వహించే ఆర్థిక సేవలన్నింటినీ పర్యవేక్షించేందుకు ఏకీకృత నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు జైట్లీ తెలిపారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో ఉన్న ఐఎఫ్ఎస్‌సీలోని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లావాదేవీలను ప్రోత్సహించేందుకు ప్రవాసీలకు క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ నుంచి మినహాయింపులు, కార్పొరేట్‌యేతర పన్ను చెల్లింపుదారులకు తక్కువ స్థాయిలో 9% మేర కనీస ప్రత్యామ్నాయ పన్ను తదితర చర్యలను ప్రతిపాదించారు.

చిన్న పరిశ్రమలకు జోష్..!



న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈ)పై ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. వీటిలో ముఖ్యంగా కార్పొరేట్ పన్నును 30% నుంచి 25%కి తగ్గించడం ఈ రంగానికి ప్రధానంగా మేలు చేయనుంది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో ముద్రా పథకం కింద ఎంఎస్ఎంఈ రంగానికి రుణ వితరణ లక్ష్యం రూ.3 లక్షల కోట్లుగా జైట్లీ ప్రకటించారు. దీనికి వీలుగా అర్హత నిబంధనలను సమీక్షించనున్నట్టు చెప్పారు. బడ్జెట్‌లో ఎంఎస్ఎంఈ రంగానికి రూ.3,794 కోట్ల నిధుల్ని కేటాయించారు. ఎంఎస్ఎంఈ సంస్థలకు సంబంధించి మొండి బకాయిల సమస్య(ఎన్‌పీఏ)ను పరిష్కరించేందుకు ఓ రోడ్ మ్యాప్‌ను ప్రభుత్వం ప్రకటిస్తుందన్నారు. దీంతో ఈ రంగం ఎదుర్కొంటున్న నిధుల లభ్యత సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఆన్‌లైన్‌లోనే రుణాల జారీని పునరుద్ధరించడం ద్వారా బ్యాంకులు సత్వరం నిర్ణయాలు తీసుకోవడానికి వీలు కలుగుతుందని చెప్పారు. అలాగే, ఈ రంగానికి రుణ సదుపాయం, వడ్డీ రాయితీలు, ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందిస్తామని ప్రకటించారు. 2015 ఏప్రిల్‌లో ముద్రా యోజన పథకం ప్రారంభించగా, ఇప్పటి వరకు రూ.4.6 లక్షల కోట్ల రుణాలను అందించామని, వీటిలో 76% రుణాలు మహిళలకు ఇచ్చినవేనని తెలిపారు.

కార్పొరేట్ పన్ను 25 శాతానికి తగ్గింపు

పన్ను తగ్గించాలంటూ కార్పొరేట్లు ఎప్పటి నుంచో చేస్తున్న డిమాండ్‌కు జైట్లీ ఈ బడ్జెట్‌లో చోటు కల్పించారు. అందరికీ కాకుండా రూ.250 కోట్ల వరకు వార్షిక వ్యాపారం ఉన్న సంస్థలకే కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించారు.



పన్ను తగ్గింపుతో ఎంఎస్ఎంఈ రంగం మొత్తానికి లబ్ధి కలుగుతుందని, పన్నులు చెల్లించే వాటిలో 99 శాతం ఇవేనని మంత్రి చెప్పారు. పన్ను తగ్గింపు వల్ల 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ.7,000 కోట్ల ఆదాయం కోల్పోవాల్సి వస్తుందన్నారు. కాగా, రూ.250 కోట్లకు పైగా టర్నోవర్ కలిగిన కంపెనీలకు గతంలో మాదిరే 30 శాతం కార్పొరేట్ పన్నులో ఎటువంటి మార్పు లేకపోవడంతో చాలావరకూ లిస్టెడ్ కంపెనీలు నిరుత్సాహంతో ఉన్నాయి. కార్పొరేట్ పన్నును 25%కి తగ్గిస్తామని 2015 బడ్జెట్‌లో జైట్లీ హామీనిచ్చారు.

మూడు సాధారణ బీమా కంపెనీల విలీనం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయ ప్రక్రియలో భాగంగా మూడు సాధారణ బీమా సంస్థలను ఒకే కంపెనీ కింద విలీనం చేయనున్నట్లు బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. విలీనానంతరం ఏర్పడే సంస్థను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ చేయనున్నట్లు వివరించారు.



నేషనల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇండియా అష్యూరెన్స్, ఓరియంటల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలను ఒకే బీమా కంపెనీగా విలీనం చేస్తామని, ఆ తర్వాత కొత్తగా ఏర్పాటైన సంస్థను లిస్టింగ్ చేస్తామని జైట్లీ పేర్కొన్నారు. ఎయిరిండియా సహా 24 ప్రభుత్వ రంగ సంస్థల్లో వ్యూహాత్మక వాటాల విక్రయ ప్రక్రియ జరుపుతున్నట్లు జైట్లీ తెలిపారు.

పీఎంఎల్ఏ పరిధిలోకి కార్పొరేట్ మోసాలు


న్యూఢిల్లీ: మనీలాండరింగ్ నిరోధక చట్టాన్ని (పీఎంఎల్ఏ) మరింత పటిష్టం చేసే దిశగా కార్పొరేట్ మోసాలను కూడా ఈ చట్టం పరిధిలోకి తేవాలని కేంద్రం నిర్ణయించింది. మోసపూరితంగా ఆర్జించిన సొమ్మును విదేశాలకు తరలించిన పక్షంలో..



దేశీయంగా సదరు వ్యక్తులకున్న ఆస్తులను జప్తు చేసే విధంగా పీఎంఎల్ఏ చట్టానికి సవరణలు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పీఎంఎల్ఏ కింద అన్నిరకాల నేరాల్లోనూ ఒకే తరహా బెయిల్ షరతులు ఉండేలా ఫైనాన్స్ బిల్లు 2018లో ప్రతిపాదించినట్లు పేర్కొంది.

మొబైల్ ఫోన్ ట్రాకింగ్ వ్యవస్థకు రూ.15 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం దేశంలో మొబైల్ ఫోన్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటుకు రూ.15 కోట్లు కేటాయించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించింది. తద్వారా నకిలీ హ్యాండ్‌సెట్స్ సంఖ్య దిగివస్తుందని, ఫోన్ల దొంగతనాలు తగ్గుతాయని అంచనా.



టెలికం శాఖ (డాట్)లో భాగంగా సెంట్రల్ ఎక్విప్‌మెంట్స్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) వ్యవస్థ బీఎస్ఎన్ఎల్ నేతృత్వంలో ఏర్పాటు కానుంది. ఇది దొంగతనానికి గురైనా లేదా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లలో అన్ని సేవలను నిలిపివేస్తుంది. ఆయా ఫోన్లలో ఏ నెట్‌వర్క్ ఉన్నా, చివరకు సిమ్ కార్డు తీసేసినా, ఆఖరికి ఐఎంఈఐ నంబర్‌ను మార్చేసినప్పటికీ సర్వీసులను బ్లాక్ చేస్తుంది.

బాండ్ల మార్కెట్‌కు బూస్ట్!

- పెద్ద కంపెనీలు పావుశాతం ఇక్కడి నుంచే పొందాలి
- ఈ దిశగా చర్యలు తీసుకుంటామన్న ఆర్థిక మంత్రి



న్యూఢిల్లీ: కార్పొరేట్ బాండ్ల మార్కెట్‌కు మరింత చేయూతనిచ్చే నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. పెద్ద కంపెనీలు తమ నిధుల అవసరాల్లో పావు శాతం మేర బాండ్ల మార్కెట్ నుంచి సమీకరించడాన్ని తప్పనిసరి చేస్తూ సెబీ నిబంధనలను సవరిస్తుందని తెలిపారు. ''దేశంలో చాలా వరకు నియంత్రణ సంస్థలు ఏఏ రేటింగ్ ఉన్న బాండ్లనే పెట్టుబడులకు అర్హమైనవిగా అనుమతిస్తున్నాయి. ఇక నుంచి ఏ గ్రేడ్ రేటింగ్ వున్న బాండ్లను ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్‌గా పరిగణించడం జరుగుతుందని ఆర్థిక మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఏఏ రేటింగ్ వున్న బాండ్లను ఇన్వెస్ట్‌మెంట్‌గ్రేడ్‌గా పరిగణిస్తున్నారు. బాండ్ల మార్కెట్ విస్తృతికి, ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ మార్పునకు అవసరమైన చర్యల్ని ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు తీసుకుంటాయి''అని జైట్లీ చెప్పారు. కార్పొరేట్ బాండ్ల మార్కెట్ మరింత విస్తరించేందుకు, కంపెనీలు నిధుల అవసరాలకు బాండ్ల మార్కెట్‌ను ఆశ్రయించేందుకు ఈ చర్యలు తోడ్పడతాయని భావిస్తున్నట్టు పేర్కొ న్నారు. కార్పొరేట్లు బాండ్ల మార్కెట్‌ను ఆశ్రయించేందుకు ఆర్‌బీఐ ఇప్పటికే మార్గదర్శకాలను విడుదల చేసినట్టు జైట్లీ తెలిపారు.

లగ్జరీ కార్లు మరింత ప్రియం

రూ.10 లక్షల వరకు వడ్డింపు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల ధరలు రూ.10 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. పూర్తిగా విదేశాల్లో తయారై దిగుమతైన మోటారు వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలపై ఉన్న దిగుమతి సుంకాన్ని 10 శాతం నుంచి 15 శాతానికి చేరుస్తూ ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రకటించారు. ట్రక్కులు, బస్సులకు 20 నుంచి 25 శాతానికి పెంచారు.



దీనికితోడు కస్టమ్ డ్యూటీపై 10 శాతం సోషల్ వెల్ఫేర్ సర్‌చార్జ్ పడనుంది. విడిభాగాలపై పన్ను రెట్టింపై 15 శాతంగా ఉంది. టైర్లపై 10 శాతమున్న దిగుమతి సుంకం కాస్తా 15 శాతానికి చేరింది. కొత్త పన్నులతో మోడల్‌నుబట్టి కారు ధర రూ.1.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అధికం అవుతుందని జర్మనీ కార్ల దిగ్గజం ఔడీ వెల్లడించింది. ప్రభుత్వ నిర్ణయం లగ్జరీ కార్ల పరిశ్రమను నిరుత్సాహపరిచిందని ఆడి ఇండియా హెడ్ రహిల్ అన్సారీ పేర్కొన్నారు.

డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ.80,000 కోట్లు

మరిన్ని ఈటీఎఫ్‌లు, మరో డెట్ ఫండ్!

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరంలో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.80,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో సమీకరించిన రూ. లక్ష కోట్లుతో పోల్చితే ఇది 20 శాతం తక్కువ. డిజిన్వెస్ట్‌మెంట్‌లో భాగంగా నిధుల సమీకరణ నిమిత్తం మరిన్ని ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్)ను, ఒక డెట్ ఫండ్‌ను కూడా ఆరంభిస్తామని బడ్జెట్ ప్రతిపాదనల్లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.72,500 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ఇప్పటికే రూ. లక్ష కోట్లు సమీకరించేశామని వివరించారు.



మొబైల్స్.. కాస్త ఖరీదు

- 5 శాతం వరకు పెరగనున్న విక్రయ ధర
- దిగుమతి పన్ను అధికమవడమే కారణం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ డ్యూటీ 15 నుంచి 20 శాతానికి పెరిగింది. దేశీయంగా తయారీని ప్రోత్సహించేందుకే ఈ పెంపు అని బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. అయితే 2017 డిసెంబరు 14 వరకు మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ డ్యూటీ 10 శాతం ఉండేది. డిసెంబరు 15న దీనిని 15 శాతానికి చేరుస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. చార్జర్లు, బ్యాటరీలపై కస్టమ్స్ డ్యూటీ 10 నుంచి 15 శాతానికి ఎగసింది. తాజాగా బడ్జెట్ ప్రకటనతో కొత్త పన్ను వెంటనే అమలులోకి వచ్చింది. అన్ని కంపెనీలు ధరలను సవరించాల్సిందే. దిగుమతైన మొబైల్ ఫోన్ల విక్రయ ధర 5 శాతం వరకు అధికం కానుందని సెల్‌కాన్ సీఎండీ వై.గురు సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. విదేశాల్లో తయారవుతున్న కొన్ని బ్రాండ్లపైనే కస్టమ్స్ డ్యూటీ పెంపు ప్రభావం ఉంటుందని ఇండియన్ సెల్యులార్ అసోసియేషన్ (ఐసీఏ) ప్రెసిడెంట్ పంకజ్ మొహింద్రూ తెలిపారు.

తయారీకి ఊతం..: కస్టమ్ డ్యూటీ పెంపు దేశీయంగా తయారీని ప్రోత్సహిస్తుందని వన్‌ప్లస్ ఇండియా జీఎం వికాస్ అగర్వాల్ తెలిపారు. తమ బ్రాండ్‌కు చెందిన 85 శాతం యూనిట్లు దేశీయంగా ఉత్పత్తి అవుతున్నవేనని చెప్పారు. షావోమీ ఫోన్లలో 5 శాతం మాత్రమే దిగుమతి అవుతున్నాయి. తయారీకి గ్లోబల్ హబ్‌గా భారత్ అవతరిస్తోందని మైక్రోమ్యాక్స్ సహ వ్యవస్థాపకులు రాజేష్ అగర్వాల్ అన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వ్యాపారంతోపాటు ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయని అభిప్రాయపడ్డారు. దిగుమతి సుంకం పెంపు మేక్ ఇన్ ఇండియాకు ఊతమిస్తుందని ప్యానాసోనిక్ ఇండియా సీఈవో మనీష్ శర్మ చెప్పారు. ఖరీదైన స్మార్ట్‌ఫోన్ల రిపేరు మరింత ప్రియం అవుతుందని కూల్‌ప్యాడ్ ఇండియా సీఈవో సయ్యద్ తాజుద్దీన్ పేర్కొన్నారు. కస్టమర్లపై భారం తప్పదని వ్యాఖ్యానించారు. 2018లో అమ్ముడయ్యే ఫోన్లలో భారత్‌లో తయారైనవి 90% ఉంటాయని ఐసీఏ అంచనా. ఐఫోన్ ఎస్‌ఈ మినహా ఆపిల్‌కు చెందిన అన్ని మోడళ్లు విదేశాల్లో తయారై భారత్‌కు దిగుమతి అవుతున్నవే. సామ్‌సంగ్, మోటరోలా, లెనవొ, సోనీ, ఒప్పో, వివో, ఎల్‌జీ, ప్యానాసోనిక్, జియోనీ, వన్‌ప్లస్ తదితర బ్రాండ్లు చాలా మోడళ్లను భారత్‌లో అసెంబుల్ చేస్తున్నా కొంత మేర దిగుమతులపై ఆధారపడక తప్పడం లేదు. కొన్ని చైనా బ్రాండ్లు దిగుమతులపైనే ఆధారపడ్డాయి.

దేశంలో టీవీల తయారీకి ఊతం

పన్ను పెంపుతో స్వల్పంగా ప్రియం కానున్న టీవీలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలివిజన్ ధరలు కాస్త పెరగనున్నాయి. దిగుమతయ్యే ప్యానెళ్లపై కస్టమ్స్ డ్యూటీ ప్రస్తుతమున్న 7.5 శాతం నుంచి 15 శాతానికి తాజా బడ్జెట్‌లో పెంచింది. అలాగే ఎల్‌సీడీ, ఎల్‌ఈడీ, ఓఎల్‌ఈడీ టీవీల విడిభాగాలపై దిగుమతి పన్ను 10 శాతం నుంచి 15 శాతానికి చేర్చారు. దీని ప్రభావంతో టీవీల విక్రయ ధర మోడల్‌నుబట్టి 5 శాతం దాకా పెరిగే చాన్స్ ఉందని పరిశ్రమ వర్గాల సమాచారం. కాగా, ప్రభుత్వ నిర్ణయం పరిశ్రమకు మంచిదేనని కంపెనీలు అంటున్నాయి.



దేశీయంగా తయారీ పెరుగుతుందని చెబుతున్నాయి. ధరల పెంపు ప్రభావం తాత్కాలికంగా ఉంటుందని కంజ్యూమర్ ఎలక్ట్రానిక్స్, అప్లయెన్సెస్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (సియామా) వెల్లడించింది. ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేసిందని సియామా ప్రెసిడెంట్ మనీష్ శర్మ వ్యాఖ్యానించారు.

బడ్జెట్ - కామెంట్


సిమెంటు రంగంలో 8 శాతం వృద్ధి



దేశవ్యాప్తంగా ఒక కోటి అందుబాటు గృహాల నిర్మాణం, 99 స్మార్ట్ సిటీస్ మిషన్, స్వచ్ఛ భారత్ అభియాన్ కింద 2 కోట్ల టాయిలెట్ల నిర్మాణంతో సిమెంటు పరిశ్రమకు మంచి రోజులే. ప్రభుత్వం ప్రకటించిన పథకాల అమలుకు కావాల్సిన నిధులు సమకూర్చి సకాలంలో పూర్తి చేయాలి. ఇదే జరిగితే సిమెంటు రంగంలో 8% వృద్ధి ఆశించొచ్చు. అంటే సుమారు 55 లక్షల టన్నుల సిమెంటు అధికంగా వినియోగం అవుతుంది. ప్రస్తుతం దేశంలో సిమెంటు పరిశ్రమ వృద్ధి 6% లోపు ఉంది. అలాగే 28% ఉన్న జీఎస్టీని 18%కి తగ్గించాలని పరిశ్రమ కోరుతోంది.

–ఎం.రవీందర్ రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్, భారతి సిమెంట్

నేషనల్ హెల్త్ పాలసీ విప్లవాత్మక చర్య



నేషనల్ హెల్త్ పాలసీ కింద 50 కోట్ల మందికి ఆరోగ్య బీమాను అందించడం అత్యంత విప్లవాత్మక చర్య. ఒకవేళ దీన్ని కచ్చితంగా అమలుచేస్తే దేశ ప్రజల ఆరోగ్య స్థితిగతులు మారిపోతాయి. వయో వృద్ధులకు పన్ను ప్రయోజనాలు అందించడం మంచి చర్య. మార్కెట్లు జోరు నేపథ్యంలో 10 శాతం లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు. రూ. 250 కోట్ల దాకా టర్నోవరు ఉన్న సంస్థలకు కార్పొరేట్ ట్యాక్స్‌ను 25 శాతానికి తగ్గించడం వల్ల మిడ్‌క్యాప్ రంగం వృద్ధి చెందుతుంది.

–ప్రీతా రెడ్డి, అపోలో హాస్పిటల్స్ వైస్ చైర్మన్

జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యంగా



జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా బడ్జెట్ ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్యం, ఇన్‌ఫ్రా, సీనియర్ సిటిజన్స్‌పై కేంద్రం అధికదృష్టి కేంద్రీకరించింది. క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ ప్రతికూలమైనది.

–ధీరజ్ రెల్లి, హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ చీఫ్

సామాన్యుడికి ప్రాధాన్యం...



సామాన్యుడే లక్ష్యంగా గ్రామీణ, ఆరోగ్య, ఇన్సూరెన్స్ రంగాల వృద్ధికి దోహదపడేలా చర్యలు ఉన్నాయి. ఎంఎస్ఎంఈలకు కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు వల్ల ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం కలుగుతుంది. ఐటీ రంగానికి వస్తే స్మార్ట్ సిటీలు, ఫిన్‌టెక్‌లకు ప్రాధాన్యం వంటి వాటి గురించి చెప్పుకోవాలి.

–సి.పి.గుర్నాని, టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో

బడ్జెట్‌కు 9/10 రేటింగ్



ఇది 'ఆల్ ఇన్' బడ్జెట్. స్థిర వృద్ధికి దోహదపడేలా ఉంది. దాదాపు చాలా అంశాను ప్రస్తావించారు. నేషనల్ హెల్త్ స్కీమ్, కార్పొరేట్ ట్యాక్స్, వ్యవసాయం, గ్రామీణ వ్యవస్థ గురించి మాట్లాడుకోవాలి. ఉపాధికి ఊతమిచ్చేలా ప్రోత్సాహకాలు ఇచ్చారు.

–రాణా కపూర్, యస్ బ్యాంక్ ఎండీ, సీఈవో

గ్రామీణాభివృద్ధి ధ్యేయంగా




గ్రామీణాభివృద్ధి, వ్యవసాయంపై దృష్టి కేంద్రీకరించడం ఆహ్వానించదగినది. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం విప్లవాత్మమైన మార్పులకు నాందికానుంది. నేషనల్ హెల్త్ స్కీమ్ వల్ల 10 కోట్ల కుటుంబాలు ప్రయోజనం పొందానున్నాయి. మొత్తంగా చూస్తే ఇది ప్రగతిశీల బడ్జెట్. కార్పొరేట్ ట్యాక్స్ తగ్గుదలను రూ. 250 కోట్ల దాకా టర్నోవరు ఉన్న సంస్థలకు మాత్రమే వర్తింపజేయడం కొంత నిరాశ కలిగించింది.

–సతీశ్ రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ చైర్మన్



నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
--	--	--	--	రూ.3,500	3,800 (హెచ్ఎంటీ)	రూ.7,200	రూ.4,400 (టన్నుకు)	--
--	--	--	--					

ఇది ఎన్నికల బడ్జెట్: ఫ్యాప్సీ



బడ్జెట్‌పై ఫ్యాప్సీ మిశ్రమంగా స్పందించింది. ఎలక్షన్ బడ్జెట్‌గా అభివర్ణించింది. ఎంఎస్ఎంఈలకు కార్పొరేట్ ట్యాక్స్‌ను 2017–18 ఆర్థిక సంవత్సరంలో 30 నుంచి 25 శాతానికి తగ్గించడంతోపాటు, రూ.50 కోట్లుగా ఉన్న టర్నోవర్ పరిమితిని రూ.250 కోట్లకు పెంచారు. టర్నోవర్ పరిమితి లేకుండా అన్ని కంపెనీలకు ఈ ప్రయోజనాన్ని వర్తింపజేయాల్సిందని ఫ్యాప్సీ ప్రెసిడెంట్ గౌర శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. తాజాగా విద్యా సెస్సు విధించడం భారంగా పరిగణిస్తున్నాం' అని వివరించారు.

చిన్న పరిశ్రమలకు దన్ను: డిక్కీ



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎంఎస్ఎంఈ రంగానికి ఆశాజనకంగా ఉందని డిక్కీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మన్నెం మధుసూదన రావు తెలిపారు. చిన్న వ్యాపారులకు ముద్ర యోజన కింద రూ.3 లక్షల కోట్ల రూపాయల రుణాలను అంజేస్తామన్న అరుణ్ జైట్లీ ప్రకటన ఆశలు కల్పిస్తోందని అన్నారు. రూ.50 కోట్ల టర్నోవర్‌కు పరిమితం చేసిన 25 శాతం కార్పొరేట్ పన్ను విధానాన్ని రూ.250 కోట్ల టర్నోవర్ వరకు ఉన్న కంపెనీలకు వర్తింపజేయడంతో మధ్యతరహా పరిశ్రమలు దీని కిందకు వస్తాయని చెప్పారు.

ఇన్సూరెన్స్‌కు పట్టం



ప్రస్తుత బడ్జెట్‌లో ఇన్సూరెన్స్ సంబంధిత అంశాలు చాలానే ఉన్నాయి. నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ స్కీమ్, సీనియర్ సిటిజన్స్‌కు ఆరోగ్య బీమాకు సంబంధించి సెక్షన్ 80 డి కింద పన్ను మినహాయింపు పరిమితి పెంపు, జన్ ధన్ ఖాతాదారు లకు ఇన్సూరెన్స్ సర్వీసులు వంటి గురించి చెప్పుకోవాలి. దేశ పౌరులకు సరైన ఆరోగ్య బీమా కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరం.

తపన్ సింఘెల్,
బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో

బడ్జెట్ ప్రభావిత షేర్లు



ప్రస్తుత మోదీ ప్రభుత్వపు అఖరి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వ్యవసాయ, గ్రామీణ ప్రాంతాలకు అధిక ప్రాధాన్యతనిచ్చిన ఈ బడ్జెట్‌లో మౌలిక రంగానికి భారీగానే కేటాయింపులున్నాయి. వివిధ ప్రతిపాదనలకు ప్రభావితమయ్యే ఆయా రంగ షేర్ల వివరాలు...

బడ్జెట్ ప్రతిపాదన	ప్రభావిత షేర్లు
సిగరెట్లపై పెరగని పన్ను	ఐటీసీ
మౌలిక రంగానికి రూ.5.97 లక్షల కోట్ల నిధులు గత బడ్జెట్‌తో పోల్చితే రూ.1 లక్ష కోట్లు అధికం	దిలిప్ బిల్డ్‌కాన్, జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రా, జీఎమ్ఆర్ ఇన్‌ఫ్రా ఎన్‌సీసీ, హెచ్‌సీసీ
వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిపై అధిక దృష్టి మద్దతు ధర పెంపు సాగు రుణాలు 10 శాతం వృద్ధితో రూ.11. లక్షల కోట్లకు గ్రామీణ్ అగ్రికల్చరల్ మార్కెట్ల ఏర్పాటు	ఎన్‌ఏసీఎల్ ఇండస్ట్రీస్, పీఐ ఇండస్ట్రీస్, శక్తి పంప్స్ ఇండియా మోన్‌శాంటో ఇండియా, ఏరీస్ ఆగ్రో, ధనుక ఆగ్రిటెక్, కావేరి సీడ్ కంపెనీ, యూపీఎల్, యాక్షన్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఎస్కార్ట్స్, మహీంద్రా,
ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి నిధులు రెట్టింపు రూ.1,400 కోట్ల కేటాయింపు	శీతల్ కూల్ ప్రొడక్ట్, అవంతి ఫీడ్స్, గోద్రేజ్ ఆగ్రోవెట్, ప్రెష్‌ట్రాప్ ఫ్రూట్స్
పది కోట్ల పేద కుటుంబాలకు నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ స్కీమ్	ఎస్‌బీఐ లైఫ్, ఐసీఐసీఐ ప్రు లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్
ఉడాన్ స్కీమ్ కింద మరిన్ని విమానశ్రయాల అనుసంధానం	స్పైస్‌జెట్, జెట్ ఎయిర్‌వేస్, ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్
గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక, జీవనోపాధి కోసం రూ.14.34 లక్షల కోట్ల కేటాయింపు	ఏసీసీ, శ్రీ సిమెంట్, అంబుజా సిమెంట్, గ్రాసిమ్, అల్ట్రాటెక్ సిమెంట్
అఫర్డబుల్ హౌసింగ్ ఫండ్ ఏర్పాటు	రియల్టీ షేర్లు
ఆయుష్మాన్ భారత్ ప్రోగ్రామ్ కింద 1.5 లక్షల ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు రూ.1,200 కోట్ల కేటాయింపు	హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్, షాల్బీ అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ కోవై మెడికల్ సెంటర్ అండ్ హాస్పిటల్
వచ్చే ఆర్థిక సంవత్సరంలో 2 కోట్ల టాయిలెట్ల నిర్మాణం	సోమానీ సెరామిక్స్, సెరా శానిటరీ వేర్, ఏషియన్ గ్రానిటో, ఏరో గ్రానైట్

ప్రతికూల ప్రభావం

దీర్ఘకాల మూలధన లాభాలపై 10 శాతం పన్ను	రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్, మోతిలాల్ ఓస్వాల్, ఆదిత్య బిర్లా మనీ
రైల్వేలకు రూ.1.48 లక్షల కోట్ల కేటాయింపు కొత్త రైళ్ల, ప్రయాణికుల భద్రత ఊసే లేదు	స్టోన్ ఇండియా, టిటాఘర్ వ్యాగన్స్, కెర్నెక్స్ మైక్రో సిస్టమ్స్, కంటైనర్ కార్పొ

ఉద్యోగులకు అలహాబాద్ బ్యాంక్ షేర్లు

కోల్‌కత: అలహాబాద్ బ్యాంక్ తన ఉద్యోగులకు 'ఎంప్లాయీ షేర్ పర్చేజ్ స్కీమ్' కింద ఐదు కోట్ల షేర్లను ఆఫర్ చేస్తోంది. బుధవారం ప్రారంభమైన ఈ షేర్ ఆఫర్ మరో రెండు వారాల పాటు ఉంటుందని, అన్ని కేటగిరీల ఉద్యోగులకు ఈ షేర్లను ఆఫర్ చేస్తున్నామని అలహాబాద్ బ్యాంక్ తెలిపింది. ఈ స్కీమ్ ద్వారా ఈ బ్యాంక్ రూ.350 కోట్లు సమీకరిస్తుందని అంచనా. మరోవైపు ఈ బ్యాంక్ ఎమ్‌డీ, సీఈఓ ఉషా అనంతసుబ్రహ్మణియన్ .. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్(ఐబీఏ) చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు.

జనవరిలో తయారీ నెమ్మది..!: పీఎంఐ ఇండెక్స్

న్యూఢిల్లీ: తయారీ రంగం జనవరిలో నెమ్మదించింది. నికాయ్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జనవరిలో 52.4 పాయింట్లకు పడింది. గడచిన మూడు నెలల్లో ఇంత తక్కువ స్థాయిలో ఇండెక్స్ నమోదుకావడం ఇదే తొలిసారి. డిసెంబర్‌లో ఇండెక్స్ 54.7 వద్ద ఉంది. ఇది 60 నెలల గరిష్టస్థాయి. జనవరిలో కొత్త బిజినెస్ ఆర్డర్లు, ఉపాధి కల్పన కొంత తక్కువగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. సూచీ ప్రకారం– ఇండెక్స్ 50 పైన ఉంటే దానిని వృద్ధి ధోరణిగానే భావించడం జరుగుతుంది. ఆలోపు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు.

దివాలా ప్రొసీడింగ్స్‌లో పన్ను రాయితీలు

న్యూఢిల్లీ: బకాయిల ఇబ్బందుల్లో కూరుకుపోయిన కంపెనీలను కొనుగోలు చేయడానికి ఒక ఆకర్షణీయమైన ప్రోత్సాహకాన్ని కేంద్రం ప్రకటించింది. దివాలా ప్రొసీడింగ్స్‌లో కంపెనీల కొనుగోలు విషయంలో పన్ను రాయితీలను కల్పించనున్నట్లు కేంద్రం గురువారం ప్రకటించింది. మినిమం ఆల్టర్నేటివ్ ట్యాక్స్ (ఎంఏటీ)కు సంబంధించిన రాయితీ విషయంలో ఆదాయపు పన్ను చట్టంలో తగిన సవరణలు తీసుకువస్తారు. ఇందుకు సంబంధించి 2018–19 బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలు ఏప్రిల్ 1వ తేదీ నుంచీ అమల్లోకి వస్తాయి. 2016 డిసెంబర్ నుంచీ అమల్లోకి వచ్చిన ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టీ కోడ్ (ఐబీసీ) కింద కేసులు భారీగా పెరిగిన నేపథ్యంలో కేంద్రం తాజా నిర్ణయం తీసుకుంది.



హైబ్రిడ్ ఇనుస్ట్రుమెంట్లకు ప్రత్యేక పాలసీ

హైబ్రిడ్ ఇనుస్ట్రుమెంట్లకు ప్రత్యేక విధానాన్ని రూపొందించనున్నట్టు అరుణ్‌జైట్లీ ప్రకటించారు. స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు సహా పలు కీలక విభాగాల్లో విదేశీ నిధుల ఆకర్షణకు ఇవి సరైనవని మంత్రి పేర్కొన్నారు.

కంపెనీలు ఐటీ రిటర్నులు వేయకుంటే ప్రాసిక్యూషన్

ఆదాయ పన్ను రిటర్నులను సకాలంలో దాఖలు చేయడంలో విఫలమయ్యే కంపెనీలు ఇకపై ప్రాసిక్యూషన్ చర్యలు ఎదుర్కొనాల్సి రానుంది. ఇందుకు సంబంధించి ఆదాయ పన్ను చట్టంలో కేంద్రం సవరణలు చేయనుంది. అక్రమ మార్గాల్లో నిధులు మళ్లించడాన్ని నిరోధించే దిశగా డొల్ల కంపెనీలపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తున్న నేపథ్యంలో తాజా ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది.

వెంచర్ క్యాపిటల్, ఏంజెల్ ఇన్వెస్టర్ల బలోపేతం

దేశంలో వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, ఏంజెల్ ఇన్వెస్టర్ల వ్యవస్థల బలోపేతానికి అదనపు చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. నవ్యతకు, ప్రత్యేకమైన అభివృద్ధికి ఇవి అవసరమన్నారు. ''విధానపరమైన చర్యలు ఎన్నో తీసుకున్నాం. స్టార్టప్ ఇండియా కార్యక్రమం చేపట్టాం. ప్రత్యామ్నాయ పెట్టుబడుల విధానాన్ని ప్రవేశపెట్టాం'' అని అన్నారు.

స్పెక్యులేషన్ పరిధి నుంచి అగ్రి డెరివేటివ్స్ తొలగింపు

అగ్రి–కమోడిటీ ఫ్యూచర్స్ మార్కెట్లో హెడ్జింగ్‌ను మరింతగా ప్రోత్సహించే దిశగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేశారు. అగ్రి–కమోడిటీ డెరివేటివ్స్‌లో ట్రేడింగ్‌ను 'నాన్–స్పెక్యులేటివ్' గా వ్యవహరించేలా సంబంధిత చట్టాన్ని సవరించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఈ సవరణలు అమల్లోకి వస్తాయి. ప్రస్తుతం కమోడిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (సీటీటీ) వర్తించే కమోడిటీ డెరివేటివ్స్ లావాదేవీలన్నింటినీ నాన్–స్పెక్యులేటివ్‌గా పరిగణిస్తున్నారు. అయితే, అగ్రి–కమోడిటీలకు సీటీటీ నుంచి మినహాయింపు ఉండగా, వాటి డెరివేటివ్స్‌లో నిర్వహించే ట్రేడింగ్‌ను మాత్రం స్పెక్యులేషన్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో చాలా మంది అగ్రి–డెరివేటివ్స్‌లో ట్రేడింగ్‌కు దూరంగా ఉంటున్నారని .. తాజా మార్పుతో ప్రాసెసింగ్ సంస్థలు, తయారీ సంస్థలు ఇకపై వీటిపై దృష్టి సారించగలవని ఎస్ఎంసీ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ అడ్వైజర్స్ సీఎండీ డీకే అగర్వాల్ తెలిపారు. అగ్రి–డెరివేటివ్స్‌లో వచ్చే లాభాలను వ్యాపార ఆదాయం లేదా నష్టంగా పరిగణించడం జరుగుతుందని పేర్కొన్నారు.

టైటాన్ లాభం 21 శాతం వృద్ధి

TITAN COMPANY

న్యూఢిల్లీ: టాటా గ్రూప్‌కు చెందిన టైటాన్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.282 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో సాధించిన నికర లాభం(రూ.232 కోట్లు)తో పోల్చితే 21 శాతం వృద్ధి సాధించామని టైటాన్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.4,000 కోట్ల నుంచి రూ.4,296 కోట్లకు పెరిగిందని పేర్కొంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో టైటాన్ షేర్4 శాతం నష్టంతో రూ.831 వద్ద ముగిసింది.

అశోక్ లేలాండ్ లాభం మూడు రెట్లు



న్యూఢిల్లీ: హిందుజా గ్రూప్‌కు చెందిన ప్రధాన కంపెనీ, అశోక్ లేలాండ్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో మూడు రెట్లు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం మూడో క్వార్టర్లో రూ.162 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.450 కోట్లకు పెరిగిందని అశోక్ లేలాండ్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.4,854 కోట్ల నుంచి రూ.7,151 కోట్లకు ఎగసిందని వివరించింది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో అశోక్ లేలాండ్ షేర్ 2 శాతం క్షీణించి రూ.123 వద్ద ముగిసింది.

బోర్డ్ మీటింగ్స్

బజాజ్ ఆటో, హిందాల్కో, గ్లాక్సో స్మిత్‌లైన్ ఫార్మా, గోద్రేజ్ ప్రాపర్టీస్, ఎమ్ఆర్‌పీఎల్, టాటా టెలీ సర్వీసెస్, టాటా గ్లోబల్ బేవరేజేస్, వర్ల్‌పూల్ ఇండియా

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,450	▲	60
బంగారం (99.5, 10గ్రా)	30,300	▲	60
వెండి (కిలో)	39,335	▲	165
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	28,930	▼	70
వెండి (కిలో)	– –		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,380	▼	70
బంగారం (22 క్యారెట్లు)	28,930	▼	70
వెండి (కిలో)	42,400	▲	200
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	30,850	▲	50
బంగారం (22 క్యారెట్లు)	28,550		0
వెండి (కిలో)	40,500	▲	100
విశాఖపట్నం			
బంగారం(24 క్యారెట్లు)	31,580		
బంగారం (22 క్యారెట్లు)	28,950		
వెండి (కిలో)	41,000		
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,450	▲	200
బంగారం (22 క్యారెట్లు)	28,750		0
వెండి(కిలో)	40,400		0
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,280	▼	70
బంగారం (22 క్యారెట్లు)	28,930	▼	70
వెండి (కిలో)	40,400		0

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.42 (రాత్రి 11.00కు)	$64.73 (బుధవారం ముగింపు)
బ్రెంట్	69.28 (రాత్రి 11.00కు)	$68.89 (బుధవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 02-2-2018

విశాఖ	365–00
చిత్తూరు	383–00
వరంగల్	362–00
ముంబై	415–00
చెన్నై	390–00
విజయవాడ	360–00
గోదావరి	360–00
నమక్కల్	375–00
01-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	360–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.20
బెంగళూరు	380–00
ఢిల్లీ	385–00
కోల్‌కతా	398–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	428.75	428.85
AMBUJA C	266.45	261.8
ASIAN PA	1153	1128.3
AXIS BAN	592.8	593.6
BAJAJ AU	3412.95	3337.15
BAJAJ FI	1729.45	1677.85
BHARTI A	438.4	439.85

A B C D

20 MICRO	52.15	52.75
3M INDIA	19282.05	18796.15
5PAISA C	304.7	290.2
63 MOONS	103.45	104.8
8K MILES	718.15	736.85
AARTI DR	622.5	624.95
AARTI IN	1100.1	1056.75
AARVI EN	92.75	95
ABAN OFF	206.6	211
BATA IND	710.3	705.95
BAYER CR	4582.15	4551.25
BEARDSEL	62.5	60.2
BEML LIM	1455.75	1454.6
BERGER P	260.15	250.35
BETA DRU	166.5	169.5
BF INVES	309.15	307.85
BF UTILI	469	483.85
BGR ENER	131.65	132.8
BHAGERIA	325.65	316.9
BHANSALI	176.95	169.45
BHARAT B	1373.6	1355.75
BHARAT F	724.45	717.1
DIC INDI	552.45	549.25
DILIP BU	960.55	909.75
DISH TV	77.35	75.2
DISHMAN	375.85	375.8
DIXON TE	3825.55	3750.35
DOLLAR I	439.9	446.7
DOLPHIN	115.1	117.75
DR. LAL	910.45	903.7
DYNAMATI	1823.85	1859.4

E F G H

ECE INDU	380.45	376.5
GUJARAT	142.25	144.1
GUJARAT	146.6	146.9
GUJARAT	200.4	202.85
GUJARAT	241.15	241.35
GUJARAT	753.45	752.2
GUJARAT	819.55	833.2
GUJARAT	845.4	835.75
GULF OIL	904.1	900.6
GULSHAN	82.1	82.55
HARITA S	970.6	981.6
HATSUN A	790.3	796.5
HDFC STA	448.25	427
HEALTHCA	338.1	322.55

I J K L

JET FREI	108.1	112.5
JET KNIT	108	107
JHS SVEN	69.05	69.95
JIND POL	71.3	72.4
JINDAL D	193.2	188.1
JINDAL P	362.55	348.45
JINDAL S	109.35	112.1
JINDAL S	151.75	149.05
JINDAL S	193	198.35
JINDAL S	265.95	266.45
JINDAL W	657.2	662.5
JK CEMEN	1131.25	1114.9
JK LAKSH	413.25	411.75

M N O P

MAJESCO	543.85	544
MAN INDU	126.4	121.75
MAN INFR	64.15	65.2
MANAKSIA	65.3	65.35
MANAPPUR	116.05	110.95
MANG.CHE	70.55	73.7
MANGALAM	174.2	176.45
MANGALAM	397.3	414.95
MANPASAN	386.55	377.5
MANUGRAP	50.55	50.15
PDS MULT	322.85	325
PEARL GL	122.85	125.5
PENNAR E	98.25	99.7
PENNAR I	61	61.15
PERSISTE	784.15	787.85
PETRON E	128.3	129.55
PFIZER L	2314.9	2320.85
PG ELECT	402.95	405
PHILIPS	1159.75	1206.8
PI INDUS	913.5	890.85

R S T U

SESHASAY	987.5	1002.85
SETCO AU	66.5	64.9
SHAKTI P	525.5	537.3
SHALBY L	236.7	236.45
SHALIM P	188.4	188.7
SHANKARA	1656.95	1693.6
SHANTHI	148.4	148.25
SHARDA C	437.3	436.8
SHARDA M	2341.45	2306.25
SHEELA F	1601.8	1592.35
TGB BANQ	54.2	54.25
THANGAMA	556.85	569.4
THE BYKE	188.7	187.1
THE GE S	396.95	401.25
THE HI-T	484.7	477.85
THE INDI	138.35	138.2
THE INDI	166.2	168.15
THE MAND	152	149.4
THE NEW	669.15	637.15
THE P K	539	561.3

V W Y Z

బీఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం 2-2-2018



ట్రిపుల్ జంప్‌లో షీనాకు రజతం

ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా ట్రిపుల్ జంపర్ షీనా నెల్కల్ వార్కే రజతం సాధించింది. గురువారం ఇక్కడ ప్రారంభమైన పోటీల్లో షీనా 13.37 మీటర్ల దూరం దూకింది. కజకిస్థాన్ క్రీడాకారిణి ఐ్రినా ఎక్తోవా (13.79 మీటర్లు) స్వర్ణం గెలుచుకుంది. థి థు థావో భుయ్ (వియత్నాం–13.22 మీటర్లు) మూడో స్థానంలో నిలిచి కాంస్యంతో సరిపెట్టుకుంది. మూడు రోజుల పాటు సాగే ఈ పోటీల్లో భారత్ తరఫున 13 మంది అథ్లెట్లు పాల్గొంటున్నారు.

అదిరే ఆరంభం

తొలి వన్డేలో భారత్ ఘన విజయం

6 వికెట్లతో దక్షిణాఫ్రికా చిత్తు • కోహ్లి సెంచరీ, రాణించిన రహానే
డు ప్లెసిస్ శతకం వృథా • రెండో వన్డే ఆదివారం

ఎక్కడ లక్ష్య ఛేదన ఉంటుందో అక్కడ విరాట్ కోహ్లి ఉంటాడు. ఫార్మాట్ మారినా, వేదిక మారినా వేటలో అతని ఆట మారలేదు. శతకాల జాబితాలో మరో అంకె కొత్తగా వచ్చి చేరిందే తప్ప తేడా ఏమీ లేదు. అతనికి తోడుగా అజింక్య రహానే కూడా జత కలిశాడు. అలవోకగా, ఆడుతూ పాడుతూ, ఎక్కడా ప్రత్యర్థికి అవకాశమే ఇవ్వకుండా ముందుకు సాగిన ఈ ద్వయం దక్షిణాఫ్రికాను ఓ ఆటాడుకుంది. ఫలితమే భారత్‌కు అపురూప విజయం. ఆరు వన్డేల సిరీస్‌లో శుభారంభం.

ముందుగా భారత స్పిన్నర్లు కుల్దీప్, చహల్ దెబ్బకు పరుగులు తీసేందుకు తీవ్రంగా శ్రమించిన దక్షిణాఫ్రికా జట్టు... కెప్టెన్ డు ప్లెసిస్ సెంచరీ ఇన్నింగ్స్‌తో కోలుకుంది. కానీ ఆ జట్టు విధించిన లక్ష్యం భారత్ ముందు చిన్నదిగా మారిపోయింది. ఓపెనర్లు త్వరగానే వెనుదిరిగినా కోహ్లి, రహానే 189 పరుగుల భారీ భాగస్వామ్యం భారత్‌ను ముందంజలో నిలిపింది. చివరి టెస్టులో విజయం తర్వాత డర్బన్ వేదికపై తొలి గెలుపుతో టీమిండియా వన్డేల్లోనూ సఫారీలకు సవాల్ విసిరింది.

డర్బన్: వన్డేల్లో భారత జట్టు తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో చెలరేగింది. దక్షిణాఫ్రికా సిరీస్‌లో సునాయాస విజయంతో శుభారంభం చేసింది. గురువారం ఇక్కడ కింగ్స్‌మీడ్ మైదానంలో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 6 వికెట్లతో ప్రత్యర్థిని చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. కెప్టెన్ డు ప్లెసిస్ (112 బంతుల్లో 120; 11 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. కుల్దీప్ 3, చహల్ 2 వికెట్లు పడగొట్టారు. వీరిద్దరు 20 ఓవర్లలో కేవలం 79 పరుగులే ఇచ్చి 5 వికెట్లు తీయడం సఫారీల పతనాన్ని శాసించింది. అనంతరం భారత్ 45.3 ఓవర్లలో 4 వికెట్లకు 270 పరుగులు చేసి విజయాన్నందుకుంది. కెప్టెన్ కోహ్లి (119 బంతుల్లో 112; 10 ఫోర్లు) వన్డేల్లో 33వ శతకం సాధించగా... అజింక్య రహానే (86 బంతుల్లో 79; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) నాలుగో స్థానంలో కీలక ఇన్నింగ్స్ ఆడి తన ఆటపై ఉన్న అనుమానాలను తొలగించాడు. ప్రస్తుతం సిరీస్‌లో భారత్ 1–0తో ముందంజలో నిలవగా... ఆదివారం సెంచూరియన్‌లో రెండో వన్డే జరుగుతుంది. ఈ గెలుపుతో సొంతగడ్డపై దక్షిణాఫ్రికా వరుస 17 విజయాలకు భారత్ బ్రేక్ వేసింది.



రహానే



డు ప్లెసిస్

కీలక భాగస్వామ్యాలు...

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు ఆశించిన ఆరంభం లభించలేదు. బుమ్రా వేసిన చక్కటి బంతికి ఆమ్లా (16) వికెట్ల ముందు దొరికిపోయాడు. వచ్చీ రాగానే భువనేశ్వర్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు కొట్టి డు ప్లెసిస్ ధాటిని ప్రదర్శించగా... పవర్‌ప్లే ముగిసేసరికి దక్షిణాఫ్రికా 49 పరుగులు చేసింది. ఆ తర్వాత పాండ్యా ఓవర్లోనూ మూడు ఫోర్లతో దక్షిణాఫ్రికా 18 పరుగులు రాబట్టింది. అయితే మరుసటి ఓవర్లో డి కాక్ (49 బంతుల్లో 34; 4 ఫోర్లు)ను ఎల్బీగా అవుట్ చేసి చహల్ మరో వికెట్ అందించాడు. ఈ దశలో లెగ్ స్పిన్ ద్వయం చహల్, కుల్దీప్ సఫారీలను పూర్తిగా కట్టి పడేసింది. ఒక ఎండ్‌లో ప్లెసిస్ వేగంగా ఆడే ప్రయత్నం చేసినా, మరో ఎండ్‌లో తక్కువ వ్యవధిలో మూడు వికెట్లు పడ్డాయి. మార్క్‌రమ్ (9) ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. గుగ్లీతో డుమిని (12)ని క్లీన్ బౌల్డ్ చేసిన కుల్దీప్... తన తర్వాతి ఓవర్లోనే మిల్లర్ (7)ను కూడా పెవిలియన్ పంపించాడు. కవర్స్‌లో కోహ్లి పట్టిన చక్కటి క్యాచ్ మిల్లర్ ఆట ముగించింది. 16–30 ఓవర్ల మధ్య కేవలం 2 ఫోర్లతో దక్షిణాఫ్రికా 55 పరుగులు మాత్రమే చేయగలిగిందంటే భారత బౌలింగ్ ఎంత బాగా సాగిందో అర్థమవుతుంది. 134/5 స్కోరు నుంచి మోరిస్ (37; 4 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి కెప్టెన్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. కుల్దీప్ ఓవర్లో భారీ సిక్సర్ బాదిన అతను మరో రెండు బంతులకే క్లీన్ బౌల్డ్ అయి వెనుదిరిగాడు. అనంతరం బుమ్రా బౌలింగ్‌లో సింగిల్ తీసి 101 బంతుల్లో డు ప్లెసిస్ కెరీర్‌లో 9వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. చివర్లో ప్లెసిస్, ఫెలుక్‌వాయో (27 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) ధాటిగా ఆడి దక్షిణాఫ్రికాకు మెరుగైన స్కోరు అందించారు.

ఒకరితో ఒకరు పోటీ పడి...

భారత్ కూడా ఛేదనను దూకుడుగా ఆరంభించలేకపోయింది. తడబడుతూనే ఇన్నింగ్స్ కొనసాగించిన రోహిత్ శర్మ (20) అనవసరపు షాట్‌కు ప్రయత్నించి ఔట్ కావడంతో జట్టు తొలి వికెట్ కోల్పోయింది. మరోవైపు ధావన్ (29 బంతుల్లో 35; 6 ఫోర్లు) స్వేచ్ఛగా బ్యాట్ ఝళిపించాడు. చక్కటి షాట్లతో అతను చకచకా పరుగులు రాబట్టాడు. అయితే కోహ్లితో సమన్వయ లోపంతో ధావన్ రనౌట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ దశలో కోహ్లి, రహానే కీలక భాగస్వామ్యం జట్టు ఇన్నింగ్స్‌ను నడిపించింది. వీరిద్దరు మంచి సమన్వయంతో ఆడుతూ సఫారీ బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 56 బంతుల్లో కోహ్లి అర్ధ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాత వీరిద్దరు మరింత దూకుడు పెంచారు. సఫారీల పేలవ బౌలింగ్ కూడా భారత్‌కు కలిసొచ్చింది. కొద్ది సేపటికి రహానే కూడా 60 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. అతనికి ఇది వరుసగా ఐదో అర్ధసెంచరీ కావడం విశేషం. తర్వాత వీరిద్దరు వెనుదిరిగి చూడాల్సిన అవసరం లేకపోయింది. ఒకరితో మరొకరు పోటీ పడుతూ పరుగులు సాధించి దూసుకుపోయారు. 105 బంతుల్లో దక్షిణాఫ్రికా గడ్డపై కోహ్లి తొలి సెంచరీ పూర్తయింది. చివర్లో రహానే, కోహ్లి అవుటైనా అప్పటికే మ్యాచ్ భారత్ చేతుల్లోకి వచ్చేసింది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డి కాక్ (ఎల్బీ) (బి) చహల్ 34; ఆమ్లా (ఎల్బీ) (బి) బుమ్రా 16; డు ప్లెసిస్ (సి) పాండ్యా (బి) భువనేశ్వర్ 120; మార్క్‌రమ్ (సి) పాండ్యా (బి) చహల్ 9; డుమిని (బి) కుల్దీప్ 12; మిల్లర్ (సి) కోహ్లి (బి) కుల్దీప్ 7; మోరిస్ (బి) కుల్దీప్ 37; ఫెలుక్‌వాయో (నాటౌట్) 27; రబడ (రనౌట్) 1; మోర్కెల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 269**

వికెట్ల పతనం: 1–30; 2–83; 3–103; 4–122; 5–134; 6–208; 7–264; 8–268. **బౌలింగ్:** భువనేశ్వర్ 10–1–71–1; బుమ్రా 10–0–56–1; పాండ్యా 7–0–41–0; చహల్ 10–0–45–2; కుల్దీప్ 10–0–34–3; జాదవ్ 3–0–19–0

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) డి కాక్ (బి) మోర్కెల్ 20; ధావన్ (రనౌట్) 35; కోహ్లి (సి) రబడ (బి) ఫెలుక్‌వాయో 112; రహానే (సి) తాహిర్ (బి) ఫెలుక్‌వాయో 79; పాండ్యా (నాటౌట్) 3; ధోని (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (45.3 ఓవర్లలో 4 వికెట్లకు) 270**

వికెట్ల పతనం: 1–33; 2–67; 3–256; 4–262. **బౌలింగ్:** మోర్కెల్ 7–0–35–1; రబడ 9.3–0–48–0; మోరిస్ 7–0–52–0; తాహిర్ 10–0–51–0; ఫెలుక్‌వాయో 8–0–42–2; డుమిని 2–0–16–0; మార్క్‌రమ్ 2–0–20–0.



15
విదేశీ గడ్డపై కోహ్లి చేసిన సెంచరీల సంఖ్య

మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ కోహ్లి

1
డర్బన్‌లో దక్షిణాఫ్రికాపై భారత్‌కిదే తొలి విజయం. గతంలో ఈ వేదికపై భారత్ ఏడు మ్యాచ్‌లు ఆడగా... ఆరింటిలో ఓడిపోయింది. మరో మ్యాచ్ రద్దయింది.

KHELO INDIA
Ministry of Youth Affairs and Sports

క్రీడలకు రూ.2,196 కోట్లు

గత బడ్జెట్ కంటే రూ. 258 కోట్లు అధికం

- ‘సాయ్’ నిధుల్లో కోత
- ‘ఖేలో ఇండియా’కు భారీగా పెంపు

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం ప్రవేశపెట్టిన 2018–19 బడ్జెట్‌లో క్రీడా రంగానికి రూ.2,196.36 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ (రూ.1,938.16 కోట్లు) కంటే ఇది రూ.258 కోట్లు అధికం. అయితే... ఈసారి భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్)కు నిధుల్లో కోత విధించారు. గత ఆర్థిక సంవత్సరంలో ‘సాయ్’కు రూ.495.73 కోట్లు ఇవ్వగా... ప్రస్తుతం రూ.429.56 కోట్లతో సరిపెట్టారు. రూ.66.17 కోట్ల మేర కోత విధించారు.

- కేంద్ర ప్రభుత్వ మానస పుత్రిక ‘ఖేలో ఇండియా’కు మాత్రం నిధులను భారీగా పెంచారు. క్రీడా ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో చేపట్టిన ఈ పథకానికి గతేడాది రూ.350కోట్లు ఇవ్వగా... తాజా బడ్జెట్‌లో ఆ మొత్తాన్ని రూ.520.09 కోట్లుగా చూపారు. మొత్తం క్రీడా బడ్జెట్‌లో ఇది 23.67 శాతం కావడం గమనార్హం.
- జమ్మూకశ్మీర్‌లో క్రీడా వసతుల కల్పనకు 2017–18లో రూ.75 కోట్లు ప్రకటించగా ఈసారి రూ.50 కోట్లు మాత్రమే ఇచ్చారు.
- రానున్న కామన్‌వెల్త్, ఆసియా క్రీడల సన్నాహాల్లో ఉన్నవారికి ఎటువంటి ప్రోత్సాహకాలు ఇవ్వలేదు. ఇదే సమయంలో వివిధ జాతీయ క్రీడా సమాఖ్యలకు 2017–18లో రూ.302.18 కోట్లు ఇవ్వగా... తాజాగా మరో రూ.40 కోట్లు పెంచారు.
- క్రీడాకారుల ప్రోత్సాహకాలకు గతేడాది రూ.18.13 కోట్లు ప్రకటించగా... ఈసారి రూ.23 కోట్లకు పెంచారు. క్రీడల్లో మానవ వనరుల అభివృద్ధికి కేటాయింపులను సగానికి సగం తగ్గించి రూ.5 కోట్లకు పరిమితం చేశారు.
- జాతీయ క్రీడాభివృద్ధి నిధి (ఎన్‌ఎస్‌డీఎఫ్)కి రూ.2 కోట్లను, ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా)కు రూ.కోటి కేటాయింపులను యథాతథంగా ఉంచారు.

పాకిస్తాన్‌కు మూడో స్థానం



క్వీన్స్‌టౌన్: అండర్–19 ప్రపంచకప్‌లో పాకిస్తాన్ జట్టు మూడో స్థానంతో సంతృప్తి పడింది. సెమీస్‌లో ఓడిన పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్ జట్ల మధ్య మూడో స్థానం కోసం గురువారం జరగాల్సిన మ్యాచ్ వర్షం వల్ల రద్దవడంతో గ్రూప్ స్థాయిలో మెరుగైన ప్రదర్శన చేసిన పాకిస్తాన్‌ను విజేతగా ప్రకటించారు. దీంతో పాకిస్తాన్ మూడో స్థానంలో, అఫ్ఘానిస్తాన్ నాలుగో స్థానంలో నిలిచాయి. అండర్–19 ప్రపంచకప్‌లో అఫ్ఘానిస్తాన్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. 2014లో ఆ జట్టు అత్యుత్తమంగా ఏడో స్థానం సంపాదించింది.

భారత్ ‘పసిడి’ పంచ్



శ్యామ్



మేరీకోమ్

ఇండియా ఓపెన్ టోర్నీలో 8 స్వర్ణాలు

- ఏపీ బాక్సర్ శ్యామ్‌కు రజతం

న్యూఢిల్లీ: సొంతగడ్డపై భారత బాక్సర్లు తమ పంచ్ పవర్ చాటుకున్నారు. గురువారం ముగిసిన ఇండియా ఓపెన్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో మన బాక్సర్లు మొత్తం 18 కేటగిరీలలో కలిపి 8 స్వర్ణాలు, 10 రజతాలు, 23 కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. మహిళల విభాగంలో మేరీ కోమ్ (48 కేజీలు), మనీషా (54 కేజీలు), పింకీ రాణి (51 కేజీలు), లవ్లీనా (69 కేజీలు), ప్విలావో బసుమతిరి (64 కేజీలు)... పురుషుల విభాగంలో సంజీత్ (91 కేజీలు), అమిత్ (49 కేజీలు), మనీశ్ కౌశిక్ (60 కేజీలు) స్వర్ణ పతకాలను గెలుపొందారు. పురుషుల 49 కేజీల ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ బాక్సర్ కాకర శ్యామ్ కుమార్ 0–5తో భారత్‌కే చెందిన అమిత్ చేతిలో ఓడిపోయి రజత పతకం దక్కించుకున్నాడు. 56 కేజీల విభాగంలో తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుస్సాముద్దీన్ సెమీస్‌లో ఓడి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. 48 కేజీల విభాగం ఫైనల్లో మేరీకోమ్ 4–1తో జోసీ గబుకో (ఫిలిప్పీన్స్)ను ఓడించింది. మహిళల విభాగంలో సోనియా (57 కేజీలు), మీనా కుమారి (54 కేజీలు), సవీటి బూరా (75 కేజీలు), పూజ (69 కేజీలు), సరితా దేవి (60 కేజీలు) ఫైనల్లో ఓడి రజతాలు గెల్చుకున్నారు. పురుషుల విభాగంలో దినేశ్ (69 కేజీలు), దేవాన్ష్ జైస్వాల్ (81 కేజీలు), సతీశ్ కుమార్ (ప్లస్ 91 కేజీలు), సల్మాన్ షేక్ (52 కేజీలు) రజత పతకాలు గెలుపొందారు.

శ్రీకాంత్‌కు చుక్కెదురు

ప్రిక్వార్టర్స్‌లో మలేసియా ప్లేయర్ చేతిలో ఓటమి

క్వార్టర్ ఫైనల్లో సింధు, సైనా • ఇండియా ఓపెన్ టోర్నీ

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సంచలనం నమోదైంది. స్వదేశంలో జరుగుతున్న ఈ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ మూడో ర్యాంకర్ కిడాంబి శ్రీకాంత్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. మలేసియాకు చెందిన అన్‌సీడెడ్ ఇస్కందర్ జుల్కర్‌నైన్ వరుస గేముల్లోనే రెండో సీడ్‌కు షాకిచ్చాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన పీవీ సింధు, నాలుగో సీడ్ సైనా నెహ్వాల్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్‌లో పారుపల్లి కశ్యప్, సమీర్ వర్మ, సాయిప్రణీత్ క్వార్టర్స్ చేరగా... మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్పతో, మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ చోప్రాతో జత కట్టిన తెలుగు తేజం సిక్కి రెడ్డి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది.

ఖేల్ ఖతం...

రెండో సీడ్ శ్రీకాంత్ ఆశ్చర్యకరంగా ఓ అన్‌సీడెడ్ ఆటగాడి చేతిలో కంగుతిన్నాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ ఆటగాడు 19–21, 17–21తో ప్రపంచ 85వ ర్యాంకర్ ఇస్కందర్ జుల్కర్‌నైన్ చేతిలో పరాజయం చవిచూశాడు. మహిళల సింగిల్స్‌లో సింధు, సైనా జోరు మీదున్నారు. ఇద్దరూ ప్రిక్వార్టర్స్ పోటీల్లోనూ అలవోక విజయాలతో ముందంజ వేశారు. టాప్ సీడ్ సింధు 21–10, 21–14తో లిండా జెట్చిరి (బల్గేరియా)పై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఇండోనేసియా టోర్నీ రన్నరప్ సైనా నెహ్వాల్ 21–12, 21–11తో లిన్ హొజ్‌మార్క్ జెర్స్‌ఫెల్డ్ (డెన్మార్క్)పై గెలిచింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో కశ్యప్ 21–19, 19–21, 21–12తో క్వాలిఫయర్ శ్రేయాన్ష్ జైస్వాల్ (భారత్)పై గెలుపొందగా, సమీర్ వర్మ 21–18, 19–21, 21–17తో ఇండోనేసియాకు చెందిన టామీ సుగియార్తోను ఓడించాడు. ఎనిమిదో సీడ్ భమిడిపాటి సాయిప్రణీత్ 21–10, 21–15తో హూ యున్ (హాంకాంగ్)పై నెగ్గాడు.



శ్రీకాంత్

డబుల్స్‌లో దూసుకెళ్తున్న సిక్కిరెడ్డి

మహిళల డబుల్స్‌లో జరిగిన రెండో రౌండ్ పోరులో ఆరో సీడ్ సిక్కిరెడ్డి–అశ్విని పొన్నప్ప జంట 21–9, 21–2తో భారత్‌కే చెందిన మేఘ–సంఘమిత్ర జోడీపై అలవోక విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎనిమిదో సీడ్ సిక్కి రెడ్డి–ప్రణవ్ చోప్రా జంట 21–10, 21–19తో ప్రజక్తా సావంత్ (భారత్)–యోగేంద్రన్ కృష్ణన్ (మలేసియా) జోడీపై గెలిచింది. హైదరాబాద్ యువ ఆటగాడు సాత్విక్ సాయిరాజ్–అశ్విని పొన్నప్ప జోడీ 21–13, 21–14తో మూడో సీడ్ తన్ కియన్ మెంగ్–లై పే జింగ్ (మలేసియా) ద్వయానికి షాకిచ్చింది. పురుషుల డబుల్స్‌లో మను అత్రి–సుమిత్ రెడ్డి 21–11, 21–15తో తుషార్ శర్మ–చంద్రభూషణ్ త్రిపాఠిలపై గెలుపొందగా... సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జంట 21–13, 18–21, 20–22తో చియా బియావో–వాంగ్ జెకాంగ్ (చైనా) జోడీ చేతిలో ఓడిపోయింది.

డిసిల్వా సెంచరీ

శ్రీలంక 187/1



డిసిల్వా

చిట్టగాంగ్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక దీటుగా బదులిస్తోంది. ధనంజయ డిసిల్వా (127 బంతుల్లో 104 బ్యాటింగ్; 15 ఫోర్లు), కుశాల్ మెండిస్ (83 బ్యాటింగ్; 6 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 48 ఓవర్లలో వికెట్ నష్టానికి 187 పరుగులు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 374/4తో గురువారం ఆట కొనసాగించిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 513 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ మోమినుల్ హక్ (176; 16 ఫోర్లు) క్రితం రోజు స్కోరుకు ఒక్క పరుగే జోడించి వెనుదిరిగాడు. చివరి వరుస బ్యాట్స్‌మెన్‌తో కలిసి పోరాడిన కెప్టెన్ మహ్మదుల్లా (83 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) జట్టుకు మెరుగైన స్కోరు అందించాడు. లంక బౌలర్లలో లక్మల్, హెరాత్‌లకు చెరో మూడు వికెట్లు దక్కాయి.

https://play.google.com/store/apps/details?id=com.newseveryday&hl=en

బడ్జెట్‌పై ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు నిరసన

సాక్షి, అమరావతి: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వేతనజీవులకు ఉపశమనం కలిగించే అంశాలను పొందుపర్చకపోవడంపై ఉపాధ్యాయ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. కొత్త వేతన స్కేళ్లను పురస్కరించుకొని రూ.5 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఆశించిన వారికి పన్ను శ్లాబ్‌ల్లో ఎలాంటి మార్పు చేయకపోవడం నిరాశ కలిగించిందని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలతో పాటు వేతన జీవులందరినీ ఈ బడ్జెట్ నిరాశపర్చిందని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బాబుల్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యాసెస్సు కింద వసూలు అయ్యే మొత్తాన్ని విద్యారంగానికే కేటాయించాలని ఆదాయ పన్నుల శ్లాబ్‌లను పెంచకపోవడం నిరాశ కలిగించిందని ఎస్టీయూ అధ్యక్షుడు సుధీర్‌బాబు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు చెప్పారు.

ప్రపంచ శాంతికి బ్రహ్మకుమారీస్ కృషి భేష్

- సీఎం చంద్రబాబునాయుడు
- నెక్కల్లులో యూనివర్సల్ పీస్ రిట్రీట్ సెంటర్‌కు శంకుస్థాపన

సాక్షి అమరావతి బ్యూరో/అమరావతి: ప్రపంచ శాంతి కోసం బ్రహ్మకుమారీస్ చేస్తున్న కృషి అభినందనీయమని.. జీవన ప్రమాణాల మెరుగునకు, మానసిక ఉల్లాసానికి ఈ సంస్థ పాటుపడుతోందని సీఎం చంద్రబాబునాయుడు కొనియాడారు. గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామ సమీపంలో పది ఎకరాలలో నిర్మితమవుతున్న బ్రహ్మకుమారీస్ యూనివర్సల్ పీస్ రిట్రీట్ సెంటర్ భూమి పూజను రాజయోగిని బీకే జానకి దాదీజీ, స్పీకర్ కోడెల శివప్రసాద్, మంత్రులతో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ, సుమారు 147దేశాల్లో 9వేల కేంద్రాల ద్వారా ప్రపంచ శాంతి కోసం కృషిచేస్తున్న ఏకైక సంస్థ బ్రహ్మకుమారీస్ అని చెప్పారు. స్పీకర్ కోడెల మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికంగా, ఉన్నత విలువలతో నడుచుకోవాలని సూచించారు. రాజయోగిని బీకే జానకి దాదీజీ మాట్లాడుతూ, వచ్చే ఏడాదికి మొదటి దశ పనులు పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, చైతన్య తపోవనం వ్యవస్థాపకురాలు మాతా శివానంద సరస్వతి, రాజయోగి బీకే మృత్యుంజయ, రాజయోగిని బీకే సంతోష్ బెహన్, బీకే కుల్దీప్ పాల్గొన్నారు. కాగా, రాష్ట్రంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి 'ముఖ్యమంత్రి ఈ–ఐ' కేంద్రాలను సీఎం చంద్రబాబు గురువారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 115 సెంటర్లలో వీటిని ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాల్లో అత్యాధునిక వైద్య పరికరాలతో కంటిపరీక్షలు చేయడంతో పాటు కళ్లద్దాలు ఉచితంగా ఇస్తారు.



శిలాఫలకాన్ని అవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో జానకి దాదీజీ, మంత్రులు తదితరులు

విశాఖ కనకమహాలక్ష్మి గుడిలో క్షుద్రపూజలు?

పెదవాల్తేరు(విశాఖతూర్పు): విశాఖలోని చినవాల్తేరు రెల్లివీధిలోని శ్రీకనకమహాలక్ష్మి (దుర్గ) దేవస్థానంలో క్షుద్రపూజలు జరిగినట్లు గురువారం పలు టీవీ చానళ్లలో ప్రచారం జరిగింది. ఈ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలో ఉంది. ఆలయంలోని ఓ వ్యక్తి తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఉత్తరాంధ్రకి చెందిన ఓ మంత్రి కోసం ఇక్కడ క్షుద్రపూజలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జనవరి 31న చంద్రగ్రహణం నాడు ప్రధాన అర్చకుడు వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో 9 మంది బయటి అర్చకులతో క్షుద్ర పూజలు చేశారని టీవీ చానళ్లలో ప్రసారమైంది. దీనిపై ఏసీ సుజాత వివరణ కోసం 'సాక్షి' ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

టీడీపీ నేతల కుట్రలో భాగస్వాములుగా పోలీసులు

డీజీపీకి వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు

విజయవాడ సిటీ: టీడీపీ నేతల కుట్రలో పోలీసులు భాగస్వాములుగా మారి తమ పార్టీ కార్యకర్తలు, నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు రాష్ట్ర డీజీపీ ఎం.మాలకొండయ్యకు వినతి పత్రం అందజేశారు. టీడీపీ నేతల ఒత్తిడితో చీటికీమాటికి పోలీసు స్టేషన్లకు పిలిపించి బెయిల్ రాని సెక్షన్లు ప్రయోగిస్తున్నారని గురువారం ఆయనను కలిసి విన్నవించారు. కృష్ణా జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యకర్తలపై పోలీసుల వేధింపులు రోజురోజుకు అధికమయ్యాయని వివరించారు. చట్టాలను, న్యాయాలను అపహాస్యం చేస్తున్న పోలీసు సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకొని రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాలని డీజీపీకి ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. ప్రతిపక్ష పార్టీగా వైఎస్సార్‌సీపీకి ప్రజల తరపున నిరసన తెలిపే హక్కు ఉంటుందని, ఈ విషయంలో పోలీసులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని డీజీపీని కోరగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు కొలుసు పార్థసారధి విలేకరులతో మాట్లాడారు. గతనెల 29న వైఎస్సార్‌సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ పోలీసుల అనుమతితో వాక్ విత్ జగనన్న ర్యాలీ నిర్వహించారు. ఆ సమయంలో అనారోగ్యానికి గురైన 75 ఏళ్ల రామయ్యను ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దానికి బాధ్యుడంటూ టీడీపీ నేతలు స్థానిక ఎస్ఐపై ఒత్తిడి తీసుకొచ్చి జోగి రమేష్‌పై కేసుపెట్టారన్నారు. ఇలా రాష్ట్రంలో అనేక చోట్ల టీడీపీ నేతల ఒత్తిడికి తలొగ్గి తమ నేతలపై అక్రమ కేసులు బనాయించడాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన వెంట పార్టీ రాజకీయ సలహా కమిటీ సభ్యులు ఘట్టమనేని ఆది శేషగిరిరావు, వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, జోగి రమేష్, వెంకట్రావ్, బొప్పన భవకుమార్ తదితరులు ఉన్నారు.



డీజీపీ ఆఫీసు వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు

అన్నిచోట్లా పార్టీ ఇన్‌చార్జిలను పెట్టండి

- 25 లోక్‌సభ స్థానాలపై బీజేపీ రాష్ట్ర నేతలకు అమిత్‌షా ఆదేశం
- పొత్తుపై చంద్రబాబు వ్యాఖ్యల నేపథ్యంలో తాజా నిర్ణయం..

సాక్షి, అమరావతి/న్యూఢిల్లీ: రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాలకు తక్షణమే పార్టీ ఇన్‌చార్జిలను నియమించాలంటూ బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ చేస్తున్న కృషి గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని కూడా వారికి ఆయన సూచించారు. బీజేపీతో పొత్తుపై టీడీపీ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు ఇటీవల వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో అమిత్ షా నుంచి ఈ ఆదేశాలు వెలువడడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలతో ఆయన గురువారం ఢిల్లీలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భేటీలో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.హరిబాబు, రాష్ట్ర పార్టీ సంఘటన కార్యదర్శి రవీంద్రరాజు, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోమువీర్రాజు, పార్టీ శాసనసభాపక్షనేత విష్ణుకుమార్‌రాజు, బీజేపీ మహిళా మోర్చా జాతీయ ఇన్‌చార్జి పురందేశ్వరి, కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాలకుగాను బీజేపీ ప్రస్తుతం 15 స్థానాలను ఎంపిక చేసుకుని.. అక్కడ బూత్‌స్థాయి వరకు బలోపేతంపై దృష్టిపెట్టింది. 15 స్థానాల్లో పార్టీ బలోపేతంపై చేపడుతున్న చర్యల్ని తాజా భేటీలో రాష్ట్ర నేతలు వివరిస్తుండగా.. అమిత్‌షా 15 కాదు, 25 స్థానాల్లోనూ పార్టీలో క్రియాశీలకంగా ఉండేవారిని గుర్తించి ఆయా నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా ఎంపిక చేయాలని ఆదేశించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల విరామ సమయంలో తాను రాష్ట్ర పర్యటనకు వస్తానని, ఆలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించినట్టు సమాచారం. దీంతో ఈ నెల 10న విజయవాడలో రాష్ట్ర పార్టీ కోర్ కమిటీ సమావేశం జరిపి ఇన్‌చార్జిల నియామకంపై చర్చిస్తామని రాష్ట్ర నేతలు తెలిపారు. మార్చి మొదటివారంలో అమిత్ షా రాష్ట్ర పర్యటన ఉండే వీలున్నట్టు సమాచారం. కాగా, బడ్జెట్‌ను మొత్తం దేశాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం ప్రవేశపెడుతుందని, రాష్ట్రాలకు కేటాయింపుల అంశాలను ప్రత్యేకంగా చేర్చనక్కర్లేదని, వాటిని విడిగా చేస్తామని ఈ సమావేశంలో అమిత్ షా చెప్పినట్టు సమాచారం.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం
2-2-2018



కలలను వెంటాడండి!
- సినిమా పేజీలో

షి ఎకానమీ

అమ్మాయిలు వాలిపోతున్నారు



వీడే ఆ హీరో లీ జేయాన్

లీ జేయాన్ వయసు 28 ఏళ్లు. బిజినెస్ టైకూన్. పైగా అందగాడు. చైనా అమ్మాయిలంతా ఇప్పుడు అతడంటే పడి చస్తున్నారు! కాలేజీ అమ్మాయిలకయితే.. 'ఐయామ్ మిసెస్ లీ జేయాన్' అని చెప్పుకోవడం ఫ్యాషన్ అయిపోయింది. లీ కోసం బాయ్‌ఫ్రెండ్స్‌ని కూడా పక్కన పడేస్తున్నారు! మగాళ్లకు శత్రువులా దాపురించిన ఈ లీ ఇంతకీ ఎక్కడి నుంచి ఊడిపడ్డాడు? 'లవ్ అండ్ ప్రొడ్యూజర్' అనే వీడియో గేమ్ నుంచి! అందులోని డైనమిక్ క్యారెక్టరే లీ జేయాన్. డిసెంబర్‌లో ఈ గేమ్ మొబైల్స్‌లోకి వచ్చింది. ఇప్పటి వరకు కోటి మందికి పైగా అమ్మాయిలు డౌన్‌లోడ్ చేసుకున్నారు. మొబైల్‌లో వీడియో గేమ్స్ ఆడుతున్న ప్రతి నలుగురిలో ఒక అమ్మాయి లీతో గేమ్స్ ఆడుతోంది! చైనాలో ఇప్పుడున్నది 'షి ఎకానమీ'. ఆర్థిక వ్యవస్థ అంతా అమ్మాయిల చుట్టూతానే రౌండ్స్ కొడుతోంది. వాళ్లను బుట్టలో వేసుకోడానికి కంపెనీలు రకరకాల ఆసనాలు వేస్తున్నాయి. అందులో భాగంగానే 'లవ్ అండ్ ప్రొడ్యూజర్' అనే ఈ గేమ్ తయారైంది. ఇందులో మన లీ గారితో పాటు, ఒక సైంటిస్టు, ఒక స్పెషల్ ఏజెంటు, ఒక ప్రఖ్యాత గాయకుడు ఉంటారు. ఈ నలుగురిలో ఒక ఆప్షన్ తీసుకుని ముందుకు వెళ్లాలి. గేమ్ స్టార్ట్ అయ్యీ కాగానే చైనా అమ్మాయిలంతా 'లీ'తో చెట్టపట్టాలు వేసుకుని స్మార్ట్‌ఫోన్లో గంటల కొద్దీ తల దూర్చేస్తున్నారు. ఒకటే ఇకఇకలు పకపకలు! లీ అస్సలు అమ్మాయిల మనసు నొప్పించడట. అదీ పాయింట్! అబ్బాయ్‌లూ విన్నారా.. ఈ టిప్ ఏమైనా వర్కవుట్ అవుతుందేమో నోట్ చేసుకోండి.. వెంటనే.



గేమ్ ఆడుతున్న చైనా యువతి

చెట్టు నీడ

బరువు - బాధ్యత

రామయ్య దగ్గర ఓ గాడిద ఉండేది. అది సోమరి గాడిద. ఎప్పుడూ పని తప్పించుకోవాలని చూసేది. లేదంటే, పని తగ్గించుకోవాలని చూసేది. ఉప్పు బస్తాలను మోయడం దాని పని. ఎప్పటిలాగే ఓ రోజు బద్ధకంగా, అయిష్టంగా ఉప్పు బస్తాను మోస్తూ, దారి మధ్యలో నదిలో పడిపోయింది ఆ గాడిద. రామయ్య దానిని లేవదీసి, తిరిగి నడిపించాడు. బస్తాలోని ఉప్పు కరిగిపోవడంతో గాడిదకు బరువు తగ్గింది. ఆ సంగతి గ్రహించిన గాడిద, బరువు తగ్గించుకోడానికి ప్రతిరోజూ ఆ నదిలో పడిపోవడం మొదలుపెట్టింది! అది గమనించాడు రామయ్య. దానికి ఎలాగైనా బుద్ధి చెప్పాలనుకున్నాడు. ఓ రోజు.. ఉప్పుకు బదులుగా, అంతే బరువున్న దూది బస్తాను గాడిద వీపు మీద వేశాడు. బరువు తగ్గించుకోవడం కోసం గాడిద మళ్లీ నీళ్లలో పడింది. అయితే ఈసారి దాని బరువు విపరీతంగా పెరిగింది! చచ్చీచెడీ ఆ బరువును మోసుకొచ్చింది. ఇంటికి రాగానే రామయ్య కూడా గాడిదకు రెండు తగిలించాడు.

> పనిని బాధ్యతగా చెయ్యడం ఉద్యోగ ధర్మం. ఆ ధర్మాన్ని మీరడం అంటే యజమానికి ద్రోహం చెయ్యడమే.

సోమరితనం మనిషిని పాడు చేస్తుంది. అడ్డదారులు వెతికేలా చేస్తుంది. అది ఎప్పటికైనా ప్రమాదం.

నడక ఇక బస్!



బాల్యం నుంచి నడిచి, నడిచి విసుగెత్తి... ఊరికి బస్సు కోసం 17 ఏళ్ల సింధు పడిన ఆరాటం, చేసిన పోరాటం చివరికి ఫలించింది. ఎంత కష్టపడితే ఫలించిందన్నది ఆమె మాటల్లోనే...

దీక్ష పట్టి తన ఊరికి ఆర్టీసీ బస్‌ను సాధించుకున్న ఇంటర్ విద్యార్థిని సింధు

మాది సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రానికి అనుబంధ గ్రామం చిమ్నాపూర్. నాన్న నారాయణరెడ్డిగారి శ్రీనివాస్‌రెడ్డి, అమ్మ సునీత. ఊర్లో కొద్దిపాటి భూమి ఉన్నా పంట పండదు. నాన్న పొద్దునే ప్రైవేటు కంపెనీకి పనికి వెళ్తాడు. అమ్మ గృహిణి, చెల్లి సంగారెడ్డిలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. 'కంది' శిశు మందిర్‌లో ఒకటి నుంచి ఐదో తరగతి దాకా చదువుకున్నా. బడికి వెళ్లాలంటే ఊరు చివర ఉన్న పెద్ద చెరువు కట్ట మీదుగా నడవాల్సిందే. వీలైతే నాన్న వచ్చేవాడు. లేదంటే అటు వైపు వెళ్లేవారితోనో.. కొన్నిసార్లు ఒంటరిగానో నడవాల్సి వచ్చేది. దార్లో ఎదురయ్యే కుక్కలు, పశువులంటే విపరీతమైన భయం. ఐదో తరగతి దాటింది. మళ్లీ ఆరు నుంచి సంగారెడ్డి శిశు మందిర్.. నడక రెండు కిలోమీటర్ల నుంచి నాలుగు కిలోమీటర్లు. కుక్కలు కరిస్తే.. రెండుమార్లు ఆసుపత్రిలో బెడ్ మీద ఉన్నాను. చావు తప్పిందన్నారు.

> చిమ్నాపూర్. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరం. మండల కేంద్రానికి సమీప గ్రామం. ఎటు వెళ్లాలన్నా నాలుగైదేళ్ల క్రితం వరకూ కాలి నడకే. ఇప్పుడు తారు రోడ్డు ఉంది. కానీ షేరింగ్ ఆటో కోసం రెండు కిలోమీటర్లు.. ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలకు వెళ్లాలంటే మూడున్నర కిలోమీటర్లు.. రోగమొచ్చినా.. నొప్పొచ్చినా.. అత్యవసరమైనా.. ఆటో కిరాయికి రెండొందలు! ఆ చిన్నారి పాదాలకు ఈ దూరాలు, లెక్కలు ఏవీ తెలియవు. ఊహ తెలిసినప్పటి నుంచి అనుభవంలోకి వచ్చింది ఒక్కటే.. బడికి వెళ్లాలంటే నడవాలి... కాలేజీకి వెళ్లాలన్నా నడవాల్సిందే. ఒంటరి నడకలో బాల్యంలో భయపెట్టే దెయ్యాలు, భూతాలు.. టీనేజ్‌కి వచ్చాక.. ఎవరు వెంట పడతారో.. వేధిస్తారోనని.. అనునిత్యం భయాలు. బస్సు ఉంటే భయం లేకుండా వెళ్లొచ్చు. గతంలో రోడ్డు లేదు కాబట్టి బస్సు రావడం లేదన్నారు. ఇప్పుడు రోడ్డున్నా బస్సు రావడం కుదరదంటున్నారు.. తెగించింది.. మొండికేసింది.. తిండి మానేసింది.. చివరకు ఒక్కొక్కరు కదలివచ్చారు. చివరకు బస్సు కూడా!!

కల్వకుంట మీదుగా నడక

తొమ్మిది, పదిలో సాయంత్రం పొద్దు పోయే వరకూ స్పెషల్ క్లాస్‌లు. బస్సు ఉంటే బాగుండు.. నడక తప్పేది.. సమయం కలిసి వచ్చేది.. రోజంతా ఇవే ఆలోచనలు. ఎవరికైనా చెపితే నవ్వుతారేమో.. అమ్మా, నాన్నకు చెపితే చదవలేక సాకులు వెతుకుతుందంటారేమో. గతంలో రోడ్డు లేదు.. ఇప్పుడు తారు రోడ్డు.. అయినా ఆటో అంకుల్ ఊరికి రానంటాడు. రెండు కిలోమీటర్లు నడిచి కందికి వెళ్తే.. మళ్లీ సంగారెడ్డికి రాను పోను 20 రూపాయలు. పోనీ కల్వకుంట మీదుగా సంగారెడ్డికి నేరుగా నడిచి వెళ్తే నాలుగు కిలోమీటర్లు. ఎవరైనా వెంటబడతారని భయం! చిన్నప్పుడు ఒక ఆంటీని చంపి.. ఆ కాల్వలోనే పడేశారు. ఇప్పుడు ఇంటర్ ఫస్టియర్.. కొద్దిగా పెద్దదాన్నయిన ఫీలింగ్.

కలెక్టర్ ఆఫీస్‌కి నడక

తొమ్మిది నెలల క్రితం.. అమ్మా నాన్నలకు కూడా తెలియదు.. ఓ సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లా. గవర్నమెంట్ కాలేజీలో పాములు, తేళ్లు వస్తున్నాయి. పక్కనే స్మశానం ఉంది.. అంటూ ఓ విజ్ఞాపన. దాంతో పాటే మా ఊరికీ బస్సు వేయమని మరో అర్జీ. కాలేజీ ఆవరణ శుభ్రం చేశారు. బిల్డింగ్‌కు రంగులు వేశారు. స్మశానం కనబడకుండా గోడ కట్టారు. కానీ ఊరికి బస్సు వేస్తామని చెప్పరేం? అసహనం.. దుఃఖం. అర కిలోమీటరు నడక తప్పుతుందని.. సెకండ్ ఇయర్‌లో ప్రైవేటు కాలేజీకి. ఇప్పుడు నాతో పాటు చెల్లి కూడా సంగారెడ్డి కాలేజీకి.. ఒకరికి ఒకరం తోడు.. అయితే కంది.. అక్కడ నుంచి ఆటో.. లేదంటే కల్వకుంట మీదుగా నడక.



దీక్ష చేస్తున్న సింధురెడ్డి

బస్సు కోసం నడక

జనవరి 2. కాలేజీకి వెళ్లలేదు. అమ్మ సంగారెడ్డి హాస్పిటల్‌లో చెకప్ కోసం వెళ్లింది. బాల్యం గుర్తొస్తోంది.. నడక.. దాని చుట్టూ ముడిపడ్డ అనుభవాలు, జ్ఞాపకాలు, భయాలు. ఇంట్లో ఉండాలనిపించడం లేదు. సంగారెడ్డి కొత్త బస్టాండు వద్దకు వెళ్లా. వెంట తీసుకెళ్లిన బ్లేడుతో చేయి కోసుకున్నా. రక్తం కారుతోంది.. ట్రాఫిక్ పోలీసులు.. ఆ తర్వాత అసలు పోలీసులు.. ఎందుకు చేశావని గదమాయిస్తున్నారు. అందరూ చుట్టూ నిలబడి చూస్తున్నారు. ఊరికి బస్సు కావాలి అన్నాను. పిచ్చిది.. మెంటల్.. అని కామెంట్లు. అయితే స్టేషన్‌కు నడువు.. హుంకరింపు. నా మొండితనం చూసి సంగారెడ్డి డీఎం ఉమా మహేశ్వర్ స్టేషన్‌కు వచ్చిండు. ఐదు రోజుల్లో బస్సు వస్తుందని హామీ. నాన్న వచ్చిండు.. కట్టు కట్టించి ఇంటికి తీసుకుపోయిండు. ఐదు రోజులు.. అన్నం సహించదు.. నీళ్లు తాగబుద్ధి కాదు.. ఊర్లో ఎవరికీ పట్టనిది.. నీకెందుకు? చదువుకో.. బాగుపడు.. కన్నందుకు మమ్మల్ని గోస పెట్టకు.. అమ్మా నాన్న హితబోధ, వేడుకోలు.. ఒక రకంగా నిర్బంధం.. వాళ్లకేం.. తెలుసు నడకంటే నాకెంత నరకమో!

బస్సు వేయలేదని నడక

ఐదు రోజులైనా హామీ ఇచ్చినోళ్లు అడ్రస్ లేరు. అవమానం అనిపించింది. అమ్మా నాన్న వద్దన్నా.. ఊర్లో హనుమాండ్ల గుడికాడ కూర్చున్నా. ఐదు రోజులు.. పది రోజులు.. ఊర్లో వాళ్లు వస్తున్నరు.. మంచి పని చేస్తున్నవన్నరు. నాకు ఇవేమీ పట్టడం లేదు. బస్సు ఎందుకు వేయరు.. ఇదే నా ఆలోచన.. ఆవేదన. పేపర్లలో అప్పుడప్పుడూ నా గురించిన చిన్న వార్తలు. ఆరోగ్యం దెబ్బతింది. సంగారెడ్డి జిల్లా ఆసుపత్రికి తీసుకుపోయిండ్రు. ఈమె బతకదు.. గాంధీకి తీసుకెళ్లమన్నరు.. బస్సు వస్తేనే ఏదైనా అని తెగేసి చెప్పిన. ఐసీయూలో పెట్టిన్రు.

బస్సును చూసేందుకు నడక


జనవరి 24. మా ఊరికి ఎంపీటీసీ కృష్ణగౌడ్ వచ్చిండు. డీఎం వచ్చిండు.. ఇంకెవరెవరో ఉన్నరు.. 'రేపు మీ ఊరికి బస్సు వస్తుంది.. ఎమ్మెల్యే చెప్పమన్నడు' అన్నరు. నాకు నమ్మకం లేదు.. అయినా ఏదో మూలన సంతోషం. రాత్రికి ఇంటికి వెళ్లిన. తెల్లారేసరికి ఊర్లో నా ఫొటోతో ఫ్లెక్సీ! బస్సు వచ్చింది. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వచ్చిండు. దండ వేసి.. నాతోనే రిబ్బన్ కట్ చేయించిండు. అందరం సంగారెడ్డికి వచ్చి.. మళ్లా బస్సులోనే వెనక్కి వచ్చినం.

ఇప్పుడు బస్సు వస్తోంది... కానీ టైం ఇదని చెప్పలేం. పరీక్షలు దగ్గరకు వస్తున్నయి. పోయినేడు నడక టెన్షన్‌తో ఇంగ్లీషులో ఫెయిలైన. ఇప్పుడు చదువుకోవాలే.. పాస్ కావాలే.. వాళ్ల మాట నిలబెట్టుకుంటరనే అనుకుంటున్న. ఊరికి రోజూ బస్సు వస్తే.. ఇంకా బాగా చదువుకుంట.

- కల్వల మల్లికార్జున్‌రెడ్డి, సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి
ఫోటోలు: బగిలి శివప్రసాద్

డ్యామేజ్

అమితాబ్ తప్పుకుంటున్నారు



● అమితాబ్ బచ్చన్ ● షారుక్ ఖాన్

....అయితే ఆయన తప్పుకుంటున్నది సినిమాల నుంచి కాదు.. ట్విట్టర్ ఖాతా నుంచి! యంగ్ హీరోలకంటే కూడా ఎప్పుడూ ట్విట్టర్‌లో యాక్టివ్‌గా ఉండే బిగ్ బీ హఠాత్తుగా ఎందుకు తప్పుకుంటున్నారు? అనే ప్రశ్న రాక మానదు. ట్విట్టర్‌లో తన ఫాలోయర్ల సంఖ్య తగ్గిందని అభిప్రాయపడ్డ అమితాబ్ బుధవారం చేసిన ట్వీట్ సంచలనంగా మారింది. "ట్విటర్... (ట్విట్టర్‌ని ఉద్దేశించి) నువ్వు నా ఫాలోయర్ల సంఖ్యను తగ్గించేశావు. ఇది జోక్‌గా ఉంది. ఇక నీ నుంచి బయటకు రావాల్సిన టైమ్ వచ్చింది. బయట ఇంకా చెప్పాల్సినవి, ఆసక్తికరమైన అంశాలు చాలా ఉన్నాయి. థ్యాంక్యూ" అంటూ తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు ట్విట్టర్‌లో అత్యధిక ఫాలోయర్లు ఉన్న సెలబ్రిటీ బిగ్ బీనే. ఆయన ఫాలోయర్ల సంఖ్య 32,902,353. తాజాగా బిగ్ బీని షారుక్ ఖాన్ దాటేశారు. షారుక్ ట్విట్టర్ ఫాలోయర్ల సంఖ్య 32,944,338. షారుక్ ఫస్ట్ ప్లేస్‌కి రావడంవల్లే బిగ్ బి ఏకంగా ట్విట్టర్ నుంచి తప్పుకోవాలని డిసైడ్ అయ్యారని బాలీవుడ్ టాక్.

సాక్షి
భవిత
II
శుక్రవారం 2-2-2018
స్పర్థయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

విద్య, మానవ వనరుల అభివృద్ధి తదితరాలకు సంబంధించిన ప్రధాన పథకాలు, కార్యక్రమాలు-2018-19 బడ్జెట్ అంచనాలు (రూ.కోట్లలో)

జాతీయ విద్యా మిషన్	32613	ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం	1801
పాఠశాలల్లో మధ్యాహ్న భోజన జాతీయ కార్యక్రమం	10500	సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థాగత, హ్యూమన్ కెపాసిటీ బిల్డింగ్	1109
ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి	5071		
వ్యవసాయ విశ్వవిద్యాలయాలు-సంస్థలు	685	నవకల్పన, సాంకేతిక అభివృద్ధి విస్తరణ	720
హయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్సింగ్ ఏజెన్సీ (హెఫా)	2750		
మైనారిటీ బాలికల విద్య	860	బయోటెక్నాలజీ (పరిశోధన, అభివృద్ధి)	1350

'ఏకలవ్య' పాఠశాలలు.. స్పష్టమైన విధానాలు అవసరం



గిరిజన ప్రాంతాల్లో ఎస్టీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించనున్న ఏకలవ్య పాఠశాలల విషయంలో స్పష్టమైన విధివిధానాలు ప్రకటించడం అవసరం. నవోదయ విద్యాలయాల తరహాలో అని పేర్కొనడం చూస్తే.. కొంత ప్రతికూలతకు ఆస్కారముంది. ఎస్టీ వర్గాలు అధికంగా నివసించే ప్రాంతాలు చాలా సున్నిత సమస్యలు (మావోయిస్టు ప్రాబల్యం) గల ప్రాంతాలు. ఇక్కడ ఏకలవ్య పాఠశాలలను ఏర్పాటు చేసే విషయంలో పకడ్బందీగా వ్యవహరించాలి.

- ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రముఖ విద్యావేత్త, టిస్ విజిటింగ్ ప్రొఫెసర్

పీఎంఆర్ఎఫ్ఎస్.. ఆహ్వానించదగ్గ పరిణామం



ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఫెలోషిప్ స్కీమ్ పేరుతో కొత్తగా.. ఏటా వెయ్యి మంది బీటెక్ విద్యార్థులకు ఐఐటీల్లో పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. దీనికి సంబంధించి దేశంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులు లబ్ధి పొందేలాఎంపిక ప్రక్రియ చేపడితే బాగుంటుంది.

- డాక్టర్ డి.ఎన్.రెడ్డి, డైరెక్టర్, డాక్టర్ సీఆర్‌రావు ఐఎంఎస్‌సీఎస్

నేరుగా ప్రస్తావించక పోవడం నిరాశే



ఐటీ రంగానికి సంబంధించి యువతకు ఉపాధి, నైపుణ్యాల అభివృద్ధి పరంగా నేరుగా ప్రస్తావించకపోవడం నిరాశ కలిగించే అంశమే. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పరిశోధనల దిశగా నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టాలనే నిర్ణయం మాత్రం ప్రయోజనం చేకూర్చేదే.

- టి.వి.మోహన్‌దాస్ పాయ్, ఇన్ఫోసిస్ ఫౌండర్ డైరెక్టర్, చైర్మన్, మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్.

ఇన్‌ఫ్రాలో అవకాశాలు



బడ్జెట్‌లో పేర్కొన్న పథకాలు.. కేటాయింపులను పరిశీలిస్తే.. మౌలిక రంగంలో ఉపాధి అవకాశాలు లభించడం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా సివిల్, ఆర్కిటెక్చర్ విద్యార్థులకు మంచి అవకాశాలు ఖాయం.

- ప్రొఫెసర్.ఎన్.వి.రమణరావు, డైరెక్టర్, నిట్-వరంగల్

పాఠశాల విద్య నుంచి పరిశోధనల వరకు..



కేంద్ర ప్రభుత్వం.. 2018-19 సంవత్సరానికి బడ్జెట్ విడుదల చేసింది! ఎప్పటి మాదిరిగానే.. యువత, విద్యా వర్గాల్లో తమకు కల్పించిన సదుపాయాలేంటి? వాటి వల్ల కలిగే ప్రయోజనం.. ఉపాధి కల్పన దిశగా చేపట్టిన చర్యలు.. వీటిపైనే చర్చజరుగుతోంది. ఈ నేపథ్యంలో తాజా బడ్జెట్‌లో.. విద్యార్థులకు, యువతకు అందుబాటులోకి తెచ్చిన పథకాలపై విశ్లేషణ..



'పాఠశాల విద్యను బలోపేతం చేయాలి' 'విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలి' 'పరిశోధనల దిశగా మరిన్ని అడుగులు వేయాలి' 'కొత్త నైపుణ్యాల పెంపు దిశగా చర్యలు చేపట్టాలి'..

పాఠశాల విద్య నుంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపు వరకు.. అందుకు ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై అన్ని వర్గాల నుంచి వెలువడే అభిప్రాయాలివి. వీటికి అనుగుణంగానే.. తాజా బడ్జెట్‌లో పలు ప్రతిపాదనలు ఉన్నట్లు పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా నాణ్యమైన విద్యను అందించే దిశగా విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, పరిశోధనలకు నిధుల కేటాయింపు; టీచర్లకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాలను ప్రస్తావిస్తున్నారు.

పాఠశాల విద్యకు ప్రోత్సాహకాలు

కేంద్ర బడ్జెట్ 2018-19లో పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా జిల్లాల వారీగా వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రీ నర్సరీ నుంచి 12వ తరగతి వరకూ.. అధిక ప్రాధాన్యంతో నాణ్యమైన విద్యను అందించనున్నట్లు తెలిపారు. ఆ దిశగా ఉపాధ్యాయుల శిక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నారు. తద్వారా దేశంలో శిక్షణ పొందని 13 లక్షల మంది టీచర్లకు శిక్షణ అందించనున్నారు. పాఠశాల విద్యలో ఆధునికతవైపు అడుగుల దిశగా.. బ్లాక్ బోర్డ్ టు డిజిటల్ బోర్డ్ లక్ష్యంగా.. పాఠశాలలను డిజిటలైజ్ చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రారంభించిన దీక్షా (పోర్టల్) కార్యక్రమం ద్వారా టెక్నాలజీ సహాయంతో టీచర్ల నైపుణ్యాలు మెరుగుపరచేందుకు ఏర్పాట్లు చేయనున్నారు.

మౌలిక సదుపాయాలకు లక్ష కోట్లు

విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, పరిశోధనల్లో పెట్టుబడులు పెట్టేందుకు Revitali sing Infrastructure and Systems in Education (RISE) అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా వచ్చే నాలుగేళ్లలో రూ.లక్ష కోట్లను వ్యయం చేయనున్నారు. ఇందుకోసం హయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్సింగ్ ఏజెన్సీ ఏర్పాటు చేయనున్నారు. దీనిద్వారా జాతీయ స్థాయిలో అన్ని ప్రాంతాల్లో.. సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా.. అన్ని వర్గాల వారికి విద్యా సదుపాయాలు కల్పించడం లక్ష్యంగా పేర్కొన్నారు.

ఏకలవ్య పాఠశాలలు

గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రారంభించనున్నారు. అందుకోసం 50 శాతం ఎస్టీ జనాభా, కనీసం 20,000 మంది ఎస్టీలు కలిగిన ప్రతి బ్లాకులో ఒక ఏకలవ్య పాఠశాలను స్థాపించనున్నారు. ఈ పాఠశాలల ద్వారా నవోదయ విద్యాలయాల తరహాలో ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించనున్నారు.

పరిశోధనలపై దృష్టి

బీటెక్ నుంచే పరిశోధనల దిశగా ప్రతిభావంతులను ప్రోత్సహించేలా.. ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఫెలోషిప్ స్కీమ్(పీఎంఆర్ఎఫ్ఎస్) అనే కొత్త పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం ద్వారా.. జాతీయ స్థాయిలో ప్రతిఏటా వేయి మంది బీటెక్ విద్యార్థులకు ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఐఐఎస్సీలో స్కాలర్‌షిప్ సౌకర్యంతో పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం లభించనుంది.

ఆర్కిటెక్చర్ కళాశాలలు

విద్యా రంగానికి ముఖ్యంగా సాంకేతిక విద్యా రంగానికి ఊతమిచ్చే మరో ప్రతిపాదన.. కొత్తగా రెండు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏ) కళాశాలల ఏర్పాటు. దీంతోపాటు జాతీయ స్థాయిలో ఇతర ప్రాంతాల్లో ఐఐటీలు, నిట్‌లలో మరో 18 మంది ఎస్‌పీఏలను ఏర్పాటు చేయనున్నారు.

కొత్తగా 24 మెడికల్ కళాశాలలు



వైద్య, ఆరోగ్య రంగాన్ని సైతం బలోపేతం చేయాలనే ఉద్దేశంతో దేశంలో కొత్తగా 24 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఆస్పత్రులనే బోధనా ఆసుపత్రుల స్థాయికి పెంచి ప్రతి మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు ఒక మెడికల్ కళాశాల ఉండేటట్లు ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఎంబీబీఎస్ ఔత్సాహికులకు మరిన్ని సీట్లు అందుబాటులోకి రానున్నాయి.

యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ

యువతలో నైపుణ్యాలను మరింత మెరుగుపరచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 2020 నాటికి జాతీయ స్థాయిలో 50 లక్షల మంది యువతకు నైపుణ్యా భివృద్ధి శిక్షణ కల్పించనున్నారు. ఇప్పటికే అమలవుతున్న ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, స్కిల్ ఇండియా వంటి పథకాల పరిధిలో వీటిని అమలు చేయనున్నట్లు సమాచారం.

పరిశోధన కేంద్రాలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే మాట. సర్వీసెస్ సెక్టార్ నుంచి టెక్నాలజీ రంగం వరకు దూసుకొస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పరిశోధనల దిశగా కొత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నీతిఆయోగ్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్‌లో పరిశోధనలు, వాటి అప్లికేషన్స్‌కు సంబంధించిన కార్యకలాపాలకు శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం ఫలితంగా యువతకు లబ్ధి చేకూరే అవకాశముందని భావిస్తున్నారు. ముఖ్యంగా అప్లికేషన్స్ విభాగంలో యువతను భాగస్వాములను చేస్తే వారిలో ఈ నైపుణ్యాలు లభించి జాబ్ మార్కెట్‌లో ఆధునిక పరిస్థితుల్లో ముందంజలో నిలవగలరని అంటున్నారు.

'మౌలిక' రంగంలో కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం



తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించిన అంశాలను పరిగణిస్తే.. మౌలిక సదుపాయాల రంగంలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందనేది నిపుణుల అభిప్రాయం. అమృత్ ప్రాజెక్ట్, ఉడాన్, రహదారుల నిర్మాణానికి భారీ కేటాయింపులు చేయడాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


యువతకు ఉపాధి పరంగా బడ్జెట్ ప్రతిపాదనల్లో ఊరట కల్పించే అంశం.. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు పలు రాయితీలు ప్రకటించడం. ఉదాహరణకు.. ముద్ర పథకం ద్వారా ఎంఎస్ఎంఈ రంగంలో కొత్తగా సంస్థలు నెలకొల్పాలనుకునే వారికి రాయితీ, ఆన్‌లైన్‌లోనే రుణ సదుపాయం కల్పించడం వంటి చర్యల ద్వారా ఈ రంగంలో కొత్త సంస్థలు వచ్చే అవకాశం ఉంది.

ప్రత్యక్ష ఉపాధి అంశంలో నిరాశగా

ఈసారి బడ్జెట్‌లో యువతను నిరుత్సాహానికి గురిచేస్తున్న అంశం.. ప్రత్యక్ష ఉపాధికి సంబంధించి ఎలాంటి ప్రకటన లేకపోవడం. జాతీయ జీవనోపాధి పథకానికి (నేషనల్ లైవ్‌లీహుడ్ మిషన్)కు రూ.5,750 కోట్లు కేటాయించినా.. వాటిద్వారా ప్రత్యక్ష ఉపాధి పొందే వారి సంఖ్య తక్కువగానే ఉంటుంది. అది కూడా ఆయా ప్రాంతాల్లోని యువతకే లభిస్తుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

మొత్తంమీద విద్య, ఉపాధి, యువత కోణంలో చూస్తే.. బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలపై నిపుణులు, విద్యావేత్తల నుంచి సానుకూల అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విద్యా రంగంపై కేటాంపులు నామమాత్రమే!




మన దేశంలో తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ఖర్చు చేసేందుకు వెనకాడటంలేదు. కాని ప్రభుత్వం మాత్రం విద్యా రంగానికి సరిపడ కేటాయింపులు చేయడంలేదు. తాజా బడ్జెట్‌నే పరిగణనలోకి తీసుకుంటే.. మొత్తం రెవెన్యూ రాబడులు రూ.15.05 లక్షల కోట్ల నుంచి రూ.17.25 లక్షల కోట్లకు పెరిగాయి. కాని తాజా బడ్జెట్‌లో విద్యా రంగానికి చేసిన కేటాయింపులు కేవలం రూ.85,010 కోట్లు మాత్రమే. గతేడాది కేటాయింపు రూ.81,861కోట్లు కంటే ఇది రూ.3141 కోట్లు మాత్రమే అధికం. అంటే..కేవలం 3.84 శాతం పెరిగింది. ఇందులో 1 శాతం సెస్(రూ.2759 కోట్లు)ను తీసివేస్తే.. గతం కంటే పెరిగింది రూ.391 కోట్లు మాత్రమే! . అంతేకాకుండా విద్యా సెస్‌ను ఆరోగ్య, విద్యా సెస్‌గా పేరు మార్చి ఈ విద్యా సెస్ రూ.11,000 కోట్లను కూడా ఆరోగ్య రంగానికి వెచ్చించే అవకాశం లేకపోలేదు. నికరంగా చూస్తే విద్యా రంగానికి కేటాయింపులు నామమాత్రం.

మన దేశంలో 25ఏళ్ల లోపు వయసు కలిగిన యువత అధిక సంఖ్యలో ఉంది. ఇది మన బలమని మన ప్రధాన మంత్రి విదేశాల్లో ఘనంగా చెబుతుంటారు. కాని వారికి చేసిన కేటాయింపులు మాత్రం ఆశించిన స్థాయిలో లేవు. తాజా బడ్జెట్‌లో ఇంటిగ్రేటెడ్ బీఈడీ, బ్లాక్ బోర్డ్ టు డిజిటల్ బోర్డు వంటి మంచి కార్యక్రమాలు ఉన్నా... అవి బడ్జెట్ ప్రసంగంలో కంటే ఎంహెచ్ఆర్‌డీ విధాన పత్రంలో ఉంటే బాగుంటుంది. రూ.లక్ష కోట్ల రైజ్ పథకాన్ని ఘనంగా ప్రకటించి బడ్జెట్‌లో మాత్రం ఎలాంటి కేటాయింపులు చేయలేదు. ఏకలవ్య స్కీమ్ మంచి పథకమే. కాని బడ్జెట్ కేటాయింపులు లేకుండా ఎలా ముందుకు వెళ్తుంది. అంతిమంగా చూస్తే ప్రభుత్వం ఎలాంటి పెట్టుబడి పెట్టకుండా లాభాలు ఆశిస్తున్నట్లు భావించాల్సి వస్తోంది!!

- మహేశ్ పెరి, పబ్లిషర్, కెరీర్ 360 మ్యాగజీన్

మానవ వనరులపై దృష్టి



తాజా బడ్జెట్‌లో విద్యా ప్రమాణాల మెరుగు, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి, వ్యవసాయం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన అనే అంశాలకు ప్రాధాన్యమిచ్చినట్లు అర్థమవుతోంది. అదేవిధంగా డిజిటల్ ఎకానమీని ప్రోత్సహించడంలో భాగంగా ఏఐ, రోబోటిక్స్, బ్లాక్‌చైన్ టెక్నాలజీపై దృష్టిసారించారు. సరైన మౌలిక సదుపాయాలను అందిచగలిగితే నాణ్యమైన విద్య అనే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

విద్యా శిక్షణ, మౌలిక సదుపాయాల రూపకల్పనకై దీక్ష (DIKSHA), రైజ్ (RISE) పథకాలను ప్రవేశపెట్టారు. నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర. ఉపాధ్యాయులు బ్లాక్‌బోర్డు నుంచి డిజిటల్ బోర్డు వైపు రావాలంటే రీ స్కిల్లింగ్ అవసరం. అందుకోసం దీక్ష ఉపయోగపడుతుంది. ప్రీ నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు అన్ని తరగతులకూ ఏకరీతిన అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటించడం, జిల్లాల వారీగా వ్యూహ రచన చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. బడ్జెట్‌లో మరో ప్రధాన అంశం మౌలిక సదుపాయాల రూపకల్పనకు 'రైజ్' ప్రోగ్రామ్ కింద రూ.లక్ష కోట్లు కేటాయించడం, అందరికీ అందుబాటులో ఉండేలా నాణ్యమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అందిస్తామని చెప్పడం మంచి విషయం. అదే విధంగా నవోదయ విద్యాలయాల మాదిరి గిరిజన ప్రాంతాల్లో 'ఏకలవ్య స్కూల్స్' ఏర్పాటు చేస్తుండటం శుభ పరిణామం. నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియ. ఆ దిశగా యువత ఆలోచించాలి. నేను ఏఐ, బ్లాక్‌చైన్ టెక్నాలజీలను 62 ఏళ్ల వయసులో నేర్చుకున్నాను. ప్రభుత్వాలు సైతం తాత్కాలిక సదుపాయాలు కల్పించడం కాకుండా శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది. మొత్తానికి విద్యా విధానంలో ఉన్న ప్రధాన సమస్యలను, సమీప భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను గుర్తించినట్లు అర్థమవుతోంది. ఇక పరిష్కారం అనేది ప్రభుత్వాల చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంటుంది. ఇప్పుడు మనకు కావాల్సింది మాటలు కాదు. పరిష్కారం. ప్రభుత్వాల నుంచి అదే ఆశిద్దాం.- నందన్ నీలేకని చైర్మన్, ఇన్ఫోసిస్

(హిందూస్థాన్ టైమ్స్ సౌజన్యంతో)

బడ్జెట్ - పదకోశం



- **కన్సాలిడేటెడ్ ఫండ్:** ప్రభుత్వ ఫండ్స్‌లో ఇది అతి ముఖ్యమైనది. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని రాబడులూ, అప్పు తీసుకున్న మొత్తం (రుణం), ప్రభుత్వం ఇచ్చిన రుణాలకు సంబంధించిన రాబడి 'కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా'లో జమవుతుంది. కంటింజెన్సీ ఫండ్ లేదా పబ్లిక్ అకౌంట్ నుంచి కొన్ని మినహాయింపు ఉన్న అంశాలపై జరిగిన వ్యయం తప్ప మిగతా ప్రభుత్వ వ్యయం 'కన్సాలిడేటెడ్ ఫండ్' ద్వారానే జరుగుతుంది. పార్లమెంటు ఆమోదం లేకుండా ఈ ఫండ్ నుంచి నగదు ఉపసంహరణ (విత్‌డ్రా) ఉండదు.
- **కంటింజెన్సీ ఫండ్:** పేరుకు తగినట్లుగానే అత్యవసర లేదా ఊహించని వ్యయం ఈ ఫండ్ నుంచి జరుగుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 267 (1) కింద ఈ ఫండ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఫండ్ కార్పస్ రూ.500 కోట్లు. అత్యవసర పరిస్థితుల్లో ఈ నిధి నుంచి రాష్ట్రపతి వ్యయం చేయవచ్చు. దీనికి పార్లమెంటు ఆమోదం అవసరం లేదు. ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి నిర్వహణలో ఈ నిధి ఉంటుంది.
- **రెవెన్యూ రాబడి/వ్యయం:** ప్రభుత్వ బడ్జెట్‌లోని రెవెన్యూ ఖాతాలో రెవెన్యూ రాబడి, వ్యయం పొందుపరుస్తారు. రెవెన్యూ రాబడికి పన్నులు ప్రధాన ఆధారం. ఆస్తుల కల్పనకు దారితీయని అన్ని వ్యయాలనూ రెవెన్యూ వ్యయాలుగా పరిగణిస్తారు. ఉదాహరణకు జీతభత్యాలు, రాయితీలు, వడ్డీ చెల్లింపులు మొదలైనవి. అంటే ప్రభుత్వ విభాగాలు, సర్వీసుల నిర్వహణకు ఉపయోగించే సొమ్మునే రెవెన్యూ వ్యయంగా పేర్కొనవచ్చు. సాధారణంగా రెవెన్యూ రాబడి, రెవెన్యూ వ్యయం మధ్య తేడా రుణాత్మకంగా ఉంటుంది. దీన్నే రెవెన్యూ లోటు అంటారు. అంటే ప్రభుత్వం.. తన రాబడి కన్నా అధికంగా ఖర్చు చేస్తున్నట్లుగా పరిగణిస్తారు.



- **మూలధన బడ్జెట్:** మూలధన బడ్జెట్ రెవెన్యూ బడ్జెట్‌కు విభిన్నం. ఇందులోని అంశాలు (కాంపొనెంట్స్) దీర్ఘకాల స్వభావం కలిగినవి. మూలధన రాబడి, చెల్లింపులను బడ్జెట్‌లో పొందుపరుస్తారు. ప్రభుత్వం.. ప్రజలు, రిజర్వ్‌బ్యాంక్, విదేశీ సంస్థలు, ప్రభుత్వాల నుంచి తీసుకున్న రుణాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా లభించిన మొత్తం, సెక్యూరిటీల ఆధారంగా చిన్నమొత్తాల నుంచి సేకరించిన రుణం, రాష్ట్ర ప్రావిడెంట్ ఫండ్‌లు, ప్రత్యేక డిపాజిట్ల నుంచి తీసుకున్న అప్పును మూలధన రాబడిగా పరిగణిస్తారు.
 భూమి, భవనాలు, మెషినరీ, పరికరాలు వంటి ఆస్తుల సమీకరణ (అక్విజేషన్)పై జరిగిన మూలధన వ్యయాన్ని మూలధన చెల్లింపులుగా పరిణిస్తారు. షేర్లపై పెట్టుబడి, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రుణాలు, అడ్వాన్సులను మూలధన చెల్లింపులుగా వ్యవహరిస్తారు.
- **కోశ విధానం:** ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వ వ్యయం లేదా పన్నుల రూపకల్పనలో చేసే మార్పును కోశ విధానం అంటారు. ఆర్థిక వ్యవస్థలో సమష్టి డిమాండ్‌తో స్థాయి నియంత్రణకు ఈ మార్పులను ప్రభుత్వం చేస్తుంది. సంప్రదాయంగా కోశ విధానాన్ని రాబడి, వ్యయ విధానంగా భావిస్తాం.




- **ప్రత్యక్ష పన్ను:** పన్ను తొలి ప్రభావం, తుది భారం రెండూ ఒకే వ్యక్తిపై ఉంటే దాన్ని ప్రత్యక్ష పన్ను అంటారు. ఈ భారాన్ని పన్ను చెల్లింపుదారుడు వేరే వ్యక్తులకు బదిలీ చేయలేడు. ఉదాహరణకు ఆదాయపన్ను, కార్పొరేషన్ పన్ను, వారసత్వ పన్ను , బహుమతి పన్ను, ప్రాపర్టీ టాక్స్.
- **పరోక్ష పన్ను:** పన్ను తొలి ప్రభావం, అంతిమ భారం రెండూ వేర్వేరు వ్యక్తులపై ఉంటే అది పరోక్ష పన్ను. ఇందులో పన్ను భారాన్ని బదిలీ చేసేందుకు వీలుంటుంది. వస్తువులపై పరోక్ష పన్ను విధించినప్పుడు ఆ వస్తువుల ధరలు పెరుగుతాయి. కస్టమ్స్ సుంకం, కేంద్ర ఎక్సైజ్, సేవల పన్ను, విలువ కలిపిన పన్ను (వాల్యూ యాడెడ్ టాక్స్: వ్యాట్)లు పరోక్ష పన్నుకు ఉదాహరణలు.
- **అనుబంధ గ్రాంట్లు (సప్లిమెంటరీ గ్రాంట్స్):** ప్రభుత్వ వ్యయ అవసరాలను తీర్చడానికి అవసరమైన అదనపు గ్రాంట్లను అనుబంధ గ్రాంట్లు అంటారు. పార్లమెంటు తొలుత ఆమోదం తెలిపిన గ్రాంట్.. అవసరమైన వ్యయం కన్నా తక్కువగా ఉన్నప్పుడు అదనపు గ్రాంటు అంచనాను తిరిగి పార్లమెంటులో ప్రవేశపెడతారు. ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే లోపల పార్లమెంటు దీన్ని ఆమోదించాల్సి ఉంటుంది. సాధారణంగా ఆర్థిక మంత్రిత్వ శాఖ, రైల్వే మంత్రిత్వ శాఖలు అదనపు గ్రాంట్‌ను కోరతాయి. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) దీన్ని పార్లమెంటు దృష్టికి తీసుకొస్తుంది. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఈ అదనపు (ఎక్సెస్) మొత్తాన్ని పరిశీలించి తన సిఫార్సులను అందిస్తుంది.



- **అప్రాప్రియేషన్ బిల్:** ఆర్థిక సంవత్సరంలో వ్యయ అవసరాల నిమిత్తం 'కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా' నుంచి నిధులను ప్రభుత్వం విత్‌డ్రా చేసుకోవడానికి ఈ బిల్లు అధికారం ఇస్తుంది. బడ్జెట్ ప్రతిపాదన చర్చలు, గ్రాంట్ల డిమాండ్‌పై ఓటింగ్ పూర్తయిన తర్వాత ప్రభుత్వం ఈ అప్రాప్రియేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెడుతుంది.
- **ద్రవ్యలోటు:** ప్రభుత్వం మొత్తం రాబడులు, వ్యయం మధ్య తేడాను ద్రవ్యలోటుగా వ్యవహరిస్తారు. ప్రభుత్వానికి అవసరమైన మొత్తం అప్పులను ఇది సూచిస్తుంది. మొత్తం రాబడిని లెక్కించేటపుడు ఇందులో అప్పులను కలపరు. రెవెన్యూ రాబడు (విదేశీ గ్రాంట్లతో కలిపి)ల కన్నా మొత్తం వ్యయం ఎక్కువగా ఉంటే దాన్ని 'స్థూల ద్రవ్యలోటు'గా భావిస్తారు. దీన్నుంచి కేంద్ర ప్రభుత్వ నికర అప్పులను తీసేస్తే నికర ద్రవ్యలోటు వస్తుంది. రెవెన్యూ లోటు లేదా మూలధన వ్యయంలో అధిక పెరుగుదల వల్ల ద్రవ్యలోటు ఏర్పడుతుంది. దీర్ఘకాల ఆస్తుల కల్పన (కర్మాగారాలు, బిల్డింగ్‌లు)పై జరిగే వ్యయం మూలధన వ్యయం. ట్రెజరీ బిల్లులు, బాండ్ల జారీ ద్వారా మూలధన మార్కెట్ నుంచి లేదా కేంద్ర బ్యాంకు నుంచి రుణం పొంది ద్రవ్యలోటును పూడుస్తారు.

డా॥ తమ్మా కోటిరెడ్డి, ప్రొఫెసర్, ఐబీఎస్.





• అవ్వా బాగున్నావా..

చాటగట్లలో ఆప్యాయంగా మాట్లాడుతున్న జగన్

జగన్‌ను చూసేందుకు తోడేరు క్రాస్ వద్ద చెట్టెక్కిన అభిమానులు



చాటగట్లలో ఓ అవ్వ సమస్యను ఓపికగా వింటున్న ప్రతిపక్ష నేత జగన్

ముత్తుకూరు క్రాస్ వద్ద జగన్‌ను చూడటం కోసం వేచి ఉన్న అక్కచెల్లెమ్మలు

అందరికీ ఆరోగ్యమే లక్ష్యం

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- దారిపొడవునా సమస్యలు చెప్పుకున్న వివిధ వర్గాల ప్రజలు
- మన ప్రభుత్వం రాగానే అందరి సమస్యలు పరిష్కరిస్తాం..
- ఆరోగ్యశ్రీని మరింత మెరుగ్గా అమలు చేస్తామని భరోసా
- పాదయాత్రకు సంఘీభావం తెలిపిన ఆర్టీసీ కార్మికులు

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, దాన్ని సార్థకం చేసేందుకే.. ఆరోగ్యశ్రీలో మార్పులు, చేర్పులు చేయాలని సంకల్పించినట్టు తెలిపారు. ప్రజా సంకల్ప యాత్ర 77వ రోజు గురువారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు శివారు నుంచి ప్రారంభమై.. తోడేరు క్రాస్, ఉప్పుటూరు, చాటగట్ల మీదుగా మరుపూరు వరకూ సాగింది. ఆద్యంతం ప్రజలు జగన్‌కు ఘన స్వాగతం పలికారు. మహిళలు ఎదురేగి నుదుట కుంకుమ దిద్ది హారతులు పట్టారు. వైద్యులు, వీఆర్ఏలు, ఆశా వర్కర్లు, సిరి గోల్డ్ బాధితులతో పాటు వివిధ వర్గాల ప్రజలు జగన్‌కు తమ కష్టాలు చెప్పుకున్నారు.

జీతం రూ.6 వేలన్నా ఇప్పించండన్నా..

తొడేరు క్రాస్ వద్ద ఆశా వర్కర్లు జగన్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. నిత్యం గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్న తమకు, కనీస వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రూ.6 వేలైనా ఇప్పించడంతో పాటు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. మనందరి ప్రభుత్వం వచ్చాక ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని జగన్ వారికి హామీ ఇచ్చారు. తమను ఎస్టీల జాబితాలో చేర్చేలా చూడాలని వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు విన్నవించారు. టీడీపీ హామీ ఇచ్చినా ఇంత వరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1852 నుంచి 1970 వరకు తమకు విముక్త జాతుల కింద విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు ఉండేవని, ఆ తర్వాత తీసేశారని వాపోయారు. రాతి, మట్టి క్వారీల్లో 50 శాతం వడ్డెర్లకు కేటాయించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తానని ఇదివరకే హామీ ఇచ్చిన వైఎస్ జగన్‌కు పలువురు ఆర్టీసీ కార్మికులు మద్దతు తెలిపారు.

చాకిరీ చేయించుకుంటున్నారు..

రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల మంది దాకా ఉన్న తమతో చాకిరీ చేయించుకుంటూ ఆరు వేల రూపాయల జీతం ఇస్తున్నారని, ఈ జీతంలో ఎలా బతకాలని ఏపీ వీఆర్ఏల సంఘం నేతలు వైఎస్ జగన్‌తో గోడు వెళ్లబోసుకున్నారు. తమకు ప్రమోషన్లు కూడా ఇవ్వడం లేదని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. రూపాయి రూపాయి కూడబెట్టి, తినీతినక సిరి గోల్డ్‌లో పెట్టుబడి పెడితే.. తమ కొంపలు ముంచారని, పిల్లల చదువు కోసమని, పెళ్లిళ్లకు పనికొస్తాయని మదుపు చేస్తే.. మోసం చేశారని పొదలకూరుకు చెందిన పలువురు మహిళలు జగన్ ఎదుట వాపోయారు. తమ డబ్బులు తమకు వచ్చేలా చూడాలని కోరారు. ఉన్నత చదవులు చదివినా ఉద్యోగం రావడం లేదని కొందరు, పింఛన్ ఇవ్వడం లేదని అవ్వాతాతలు.. జగన్ ఎదుట సమస్యలను ఏకరువుపెట్టారు. మన ప్రభుత్వం రాగానే అందరి సమస్యలు పరిష్కరిస్తానని జగన్ వారికి ధైర్యం చెప్పారు. తాను ప్రకటించిన నవరత్నాలతో అందరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.


ఆరోగ్యశ్రీతో పేదల ఆరోగ్యానికి భరోసా

ఆరోగ్య శ్రీ వర్తించదంటూ ఆపరేషన్లు చేయడం లేదని పలువురు వైఎస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై జగన్ స్పందిస్తూ.. 'ఇవాళ రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ అమలు పరిస్థితి దారుణంగా ఉంది. మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు తెస్తాం. వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా వైద్యం చేయిస్తాం. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై.. దేశంలో ఎక్కడైనా సరే చికిత్స పొందేలా వీలు కల్పిస్తాం. పేద రోగికి శస్త్ర చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు విశ్రాంతి పొందే రోజుల్లో డబ్బులిస్తాం. తలసీమియా, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.10 వేలు పింఛన్ ఇస్తాం' అని భరోసా ఇచ్చారు.



డాక్టర్లు బాగుంటేనే ప్రజలు బాగుంటారు

ఏపీ మెడికోస్, జూనియర్ డాక్టర్ల అసోసియేషన్‌కు చెందిన సీనియర్ రెసిడెంట్ ఫోరం సభ్యులు పలువురు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. 'మాకు నెలకు రూ.30 వేల వేతనం ఇస్తారట. పైగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేయాలంటున్నారు. డాక్టర్‌కు ఇవ్వాల్సిన వేతనం ఇదేనా? పక్కన తెలంగాణ రాష్ట్రంలో ఇలాగే ఇస్తున్నారా? వైద్య వృత్తికి ఇచ్చే విలువ ఇదేనా? మీరు మా పట్ల ఉదారంగా వ్యవహరించి కనీసం రూ.60 వేల వేతనం ఇప్పించేలా చూడాలి సార్..' అంటూ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏడాది పని చేస్తేనే రాష్ట్రంలో ప్రాక్టీస్ చేయడానికి, లేదా సూపర్ స్పెషాలిటీకి అర్హులవుతారన్న నిబంధన తమ నైపుణ్యాన్ని దెబ్బ తీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో తీసుకొచ్చిన ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ చట్టాన్ని మార్చాలని కోరుతూ, పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రతిపక్ష నేతకు ఇచ్చారు. డాక్టర్ల సమస్యలపై జగన్ స్పందిస్తూ.. వైద్యులు బాగుంటేనే ఆరోగ్య శ్రీ బాగుంటుందని, అప్పుడే రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక డాక్టర్ల సమస్యలను పరిష్కరించేందుకు కచ్చితంగా ప్రాధాన్యం ఇస్తామని వారికి భరోసా ఇచ్చారు.



77వ రోజు

01-02-2018, గురువారం
మరుపూరు,
శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

ఆ తల్లి కన్నీళ్లకు ఏం సమాధానం చెబుతారు?

కొండంత బాధను గుండెల్లోనే దిగమింగుకున్న చాటగట్లకు చెందిన ఆ తల్లి ఆవేదన చూశాక.. నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. తొమ్మిదేళ్ల ఆమె కొడుకు మదన్ బ్లడ్ క్యాన్సర్ వల్ల మృత్యువుతో పోరాడుతున్నాడట. ఆ ప్రాణం నిలబెట్టేందుకు ఇంటిల్లిపాదీ ఒక యజ్ఞమే చేస్తోంది. నెల్లూరులోని ఆస్పత్రికెళితే.. ఈ రాష్ట్రంలోనే ఆ వైద్య సౌకర్యం లేదని సెలవిచ్చారట. పొరుగు రాష్ట్రానికెళితే.. ఆరోగ్యశ్రీ వర్తించదు, వైద్యానికి రూ.8 లక్షల పైచిలుకు ఖర్చవుతుందన్నారని చెప్పింది. తమ ఇల్లూ వాకిలీ అమ్మినా ఏ మూలకూ సరిపోదని ఆ తల్లి బావురుమంది. 'ఏం చేయాలయ్యా..' అని కన్నీరు పెట్టుకుంది. ఆరోగ్యశ్రీకి సవాలక్ష ఆంక్షలు పెట్టి పేదవాడి గుండె ధైర్యాన్ని చిదిమేసిన చంద్రబాబుగారూ.. ఆ తల్లి కన్నీళ్లకు మీరేం సమాధానం చెబుతారు?

స్థానికంగా క్యాన్సర్ వైద్యం చేసే సదుపాయమే ఉండి ఉంటే.. పేదలకు కొంతైనా ఊరట ఉండేది కదా! ఇలా ఆలోచిస్తుండగానే యాదృచ్ఛికంగా నెల్లూరు క్యాన్సర్ ఆస్పత్రి సాధన కమిటీ సభ్యులొచ్చి నన్ను కలిశారు. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం నెల్లూరుకు ప్రాంతీయ క్యాన్సర్ సెంటర్ మంజూరు చేసిందని, కానీ.. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల అది కార్యరూపం దాల్చలేదని చెప్పారు. కొందరు అధికార పార్టీ ముఖ్య నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డుపుల్ల వేయడంతో.. క్యాన్సర్ ఆస్పత్రి ఈ జిల్లా నుంచి తరలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదవాడికి క్యాన్సర్ వస్తే.. ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందేనా?

మరికాసేపటికి సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల సంఘం నాయకులు కలిశారు. ప్రభుత్వం తమపట్ల అన్యాయంగా వ్యవహరిస్తోందని, నిబంధనల మేరకు తమకు ఇవ్వాల్సిన గౌరవ వేతనంలోనూ కోత విధిస్తోందని, ఇచ్చే అరకొర గౌరవ వేతనం కూడా ఏడు నెలలుగా ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేల పైచిలుకు సీనియర్ రెసిడెంట్ వైద్యులు ఆందోళన బాట పట్టారని తెలిపారు. వారితో పనిచేయించుకుని, ఇచ్చే గౌరవ వేతనాన్ని నిబంధనల కన్నా తక్కువ ఇస్తూ, అది కూడా ఏడు నెలలుగా ఇవ్వకపోతే వారెలా బతుకుతారు? వైద్యుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై లేదా? ఇవాళ నన్ను కలిసిన విద్యార్థులు, వైద్యులను చూస్తే విద్య, వైద్యం, పేదల ఆరోగ్యం.. వీటిపై ఈ ప్రభుత్వానికి ఉన్నది కపట ప్రేమేనని తెలుస్తోంది. ఇది ఎంత అన్యాయం!

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. సామాజిక స్థితిగతులను మార్చేది విద్య అయితే, పేదవాడి ఆర్థిక స్థితిగతులను తలకిందులు చేసేది అనారోగ్యం. ఈ రెండింటినీ ఇంతగా నిర్లక్ష్యం చేస్తే.. బడుగు బతుకులకు ఇక దిక్కెవరు? మీ ప్రభుత్వం చేస్తోంది సరైన పనేనా?

వైఎస్. జగన్.



ఉప్పటూరు క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు కిటికీల్లోంచి పాదయాత్రను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రయాణికులు

ప్రజాసంకల్ప యాత్ర 77వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం **1,041.8** కిలో మీటర్లు

77వ రోజు నడిచిన దూరం **7.5** కిలో మీటర్లు

ప్రారంభం: ఉదయం 8 గంటలకు పొదలకూరు

ముగింపు: పొదలకూరు మండలం మరుపూరు

ముఖ్యాంశాలు

- తోడేరు క్రాస్‌రోడ్డు, ఉప్పటూరు క్రాస్‌రోడ్డు, మరుపూరు గ్రామాల్లో ప్రజలతో మమేకం
- చాటగట్లలో పార్టీ పతాకావిష్కరణ

స్ట్రెచర్ లేదని నడిపించారు!

- కాన్పు గదికి వెళ్తుండగా నిండు గర్భిణీ ప్రసవం
- కిందపడి శిశువు మృతి

బేతుల్: ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం ఒక శిశువు నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. నవమాసాలు మోసిన ఒక తల్లికి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది. మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లా ఆస్పత్రిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘోడాడోంగ్రికి చెందిన వికాస్ వర్మ భార్య నీలూ నిండు గర్భిణీ. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు లేకపోవటంతో అంబులెన్స్‌లో బేతుల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రసవ వేదనతో ఉన్న నీలూ వర్మను స్ట్రెచర్‌పై తీసుకెళ్లాల్సిన ఆస్పత్రి సిబ్బంది.. కాన్పుగదికి నడిపించారు. అలా వెళ్తుండగానే ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. నేలపై పడిన శిశువు అక్కడికక్కడే చనిపోయింది. తమ సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆస్పత్రి సివిల్ సర్జన్ ఏకే బరంగా అంగీకరించారు. విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రోస్టర్ విధానానికి సుప్రీం ఆమోదం

- ఈ నెల 5 నుంచి అమల్లోకి..
- పిల్‌ల కేటాయింపు అధికారం సీజేఐ వద్దే

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు కేసుల కేటాయింపునకు సంబంధించిన రోస్టర్ విధానాన్ని సుప్రీంకోర్టు గురువారం ఆమోదించింది. ఆ మేరకు సీజేఐ ఉత్తర్వుల కాపీని సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ ఉత్తర్వుల ప్రకారం.. కొత్త కేసులకు రోస్టర్ విధానం ఈ నెల 5 నుంచి అమల్లోకి రానుంది. సున్నితమైన పిల్‌లు, ముఖ్యమైన కేసుల్ని జూనియర్ న్యాయమూర్తులకు కేటాయిస్తున్నారని ఆరోపిస్తూ.. ఇటీవల అత్యంత సీనియరు న్యాయమూర్తులు జస్టిస్ జే.చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎంబీ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లు ప్రశ్నించిన నేపథ్యంలో రోస్టర్ విధానాన్ని అందరికీ అందుబాటులో ఉంచడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజా ప్రయోజన వ్యాజ్యాల కేటాయింపుల్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ఒక్కరే నిర్ణయిస్తారని 13 పేజీల నోటిఫికేషన్‌లో వెల్లడించారు. లేఖలు రూపంలో వచ్చే పిటిషన్లు, ఎన్నికల కేసులు, కోర్టు ధిక్కార కేసులు, రాజ్యాంగ వ్యవస్థలకు సంబంధించిన కేసుల్ని, తన నేతృత్వంలోని ధర్మాసనానికి సీజేఐ కేటాయించుకున్నారు. సీజేఐ, మరో 11 మంది న్యాయమూర్తులైన జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ గొగోయ్, జస్టిస్ లోకూర్, జస్టిస్ జోసెఫ్, జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఆర్‌కే అగర్వాల్, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఏకే గోయెల్, జస్టిస్ ఆర్.ఎఫ్. నారిమన్‌ల నేతృత్వంలోని ధర్మాసనాలు విచారించనున్న కేసులకు సంబంధించిన అంశాల్ని వెబ్‌సైట్‌లో ఉంచారు. రోస్టర్ ప్రకారం జస్టిస్ చలమేశ్వర్ నేతృత్వంలోని ధర్మాసనం.. కార్మిక, పరోక్ష పన్నులు, భూ సేకరణ, పరిహారం, క్రిమినల్ అంశాల్ని విచారిస్తుంది. జస్టిస్ గొగోయ్ ధర్మసనానికి కార్మిక, పరోక్ష పన్నులు, కంపెనీ చట్టాలు, ట్రాయ్, సెబీ, ఆర్‌బీఐ, క్రిమినల్, వ్యక్తిగత చట్టాలు, కోర్టు ధిక్కారం తదితర అంశాల్ని, జస్టిస్ లోకూర్ ధర్మాసనానికి సేవారంగం, సామాజిక న్యాయం, వ్యక్తిగత చట్టాలు, భూసేకరణ, వినియోగదారుల హక్కుల పరిరక్షణ అంశాల్ని కేటాయించారు. ఇక జస్టిస్ జోసెఫ్ ధర్మాసనం కార్మిక, రెంట్ యాక్ట్, కుటుంబ వ్యవహారాలు, కోర్టు ధిక్కారం, వ్యక్తిగత చట్టాల కిందకు వచ్చే కేసుల్ని విచారిస్తుంది.

'ఫాతిమా'కు రుణమొస్తే మీ డబ్బులిస్తారు

ఫాతిమా బాధిత విద్యార్థులతో మంత్రి కామినేని

సాక్షి, అమరావతి: 'ఫాతిమా వైద్యకళాశాల బాధిత విద్యార్థులందరికీ 45 రోజుల్లో డబ్బులిప్పిస్తాం'.. ఇదీ రెండు మాసాల కిందట వైద్యారోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ చెప్పిన మాట. ఈ నేపథ్యంలో కొంతమంది ఫాతిమా బాధిత విద్యార్థులు మంత్రిని కలిసి తమకు చెప్పిన గడువు ముగిసిందని, ఇప్పటికీ యాజమాన్యం డబ్బులివ్వలేదని చెప్పారు. దీనికి ఆయన స్పందిస్తూ..'ఫాతిమా యాజమాన్యం రుణానికి దరఖాస్తు చేసుకుంది. అది మంజూరైతే మీ డబ్బులను ఇస్తుంది' అని అనడంతో విద్యార్థులు కంగుతిన్నారు. యాజమాన్యానికి మద్దతుగా మంత్రి వ్యవహరిస్తున్నట్లు అనుమానాలు కలుగుతున్నాయని ఆరోపించారు.

మరో ఆరు వర్సిటీల నోటిఫికేషన్లపై స్టే

హైకోర్టు ఉత్తర్వులు.. ● యూనివర్సిటీ పోస్టుల భర్తీ ప్రక్రియకు బ్రేక్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సహాయాచార్యుల పోస్టుల భర్తీకోసం ఆరు యూనివర్సిటీలు జారీ చేసిన నోటిఫికేషన్లను నిలిపివేస్తూ ఉన్నత న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టుల భర్తీలో ఎస్టీ కేటగిరీకి సంబంధించిన రోస్టర్ విధానాన్ని సక్రమంగా పాటించలేదని పలువురు కోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉన్నత విద్యామండలి వర్గాలు తెలిపాయి. దీంతో యూనివర్సిటీ పోస్టుల భర్తీ ప్రక్రియ రెండడుగులు ముందుకు, నాలుగడుగులు వెనక్కు చందమైంది. వర్సిటీ పోస్టుల భర్తీ మొదట్నుంచీ వివాదాస్పదంగా మారడం తెలిసిందే. 14 వర్సిటీల్లోని ఖాళీల భర్తీకి తలపెట్టిన ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో కమిటీని నియమించి రేషనలైజేషన్ చేసింది. ఇందులో అనేక పోస్టుల్ని ఇష్టానుసారం మార్పులు చేసినట్టు విమర్శలొచ్చాయి. వాటి ఆధారంగా 1,110 సహాయాచార్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వగా కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. వర్సిటీల స్వయంప్రతిపత్తికి భిన్నంగా రాష్ట్రస్థాయిలో కమిటీ ద్వారా రేషనలైజేషన్ చేయడాన్ని న్యాయస్థానం తప్పుపట్టింది. అయినప్పటికీ అదే జాబితాలను ఆయా వర్సిటీలద్వారా ఆమోదింపచేసి మళ్లీ నోటిఫికేషన్లు జారీచేయించారు. వీటిపైనా న్యాయవివాదాలు రేగాయి. ఈ నేపథ్యంలో ఏపీపీఎస్సీద్వారా స్క్రీనింగ్ టెస్టు నిర్వహించాలని, ఆపై మెరిట్ జాబితా ప్రకారం భర్తీ బాధ్యతను వర్సిటీలకు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ తరుణంలో కాంట్రాక్టు సహాయాచార్యులు తమ డిమాండ్ల పరిష్కారంపై నిర్ణయం తీసుకోకుండా నోటిఫికేషన్లు ఇవ్వడాన్ని కోర్టులో సవాలు చేశారు. ఈ నేపథ్యంలో మూడు వర్సిటీల నోటిఫికేషన్లపై హైకోర్టు స్టే విధించింది. దీంతో న్యాయవివాదానికి కారణమైన సహాయాచార్యుల డిమాండ్ల పరిశీలనకు వేసిన కమిటీని రద్దుచేస్తూ ప్రభుత్వం బుధవారం కొత్త ఉత్తర్వులిచ్చింది. ఈ విషయాన్ని కోర్టుకు తెలిపి స్టేను తొలగింపచేసుకోవాలని ఉన్నత విద్యామండలి అధికారులు భావిస్తుండగానే.. గురువారం హైకోర్టు మరో ఆరు వర్సిటీలకు సంబంధించిన నోటిఫికేషన్లపై స్టే విధించడంతో మొత్తం ప్రక్రియ నిలిచిపోయినట్లయింది.

ముంచుకొస్తున్న టైం

- మార్చి 31 నాటికి పీఎంకేఎస్‌వై ప్రాజెక్టుల పూర్తికి కేంద్రం డెడ్‌లైన్
- 57 రోజుల్లో ఆ ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే ఆ భారం రాష్ట్రంపైనే
- ఇప్పటిదాకా చేసిన ఖర్చు రూ.44.46 కోట్లకే రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు చెప్పని వైనం

సాక్షి, అమరావతి: సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో సర్కార్ నిర్లక్ష్యానికి ఇదో పరాకాష్ట..!. రాష్ట్ర ప్రభుత్వ చర్యల వల్ల రూ.300 కోట్లు నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. ఏఐబీపీ (సత్వర సాగునీటి ప్రయోజన పథకం) రద్దు చేసిన నేపథ్యంలో ఆ పథకం కింద మంజూరై నిలిచిపోయిన ఆరు ప్రాజెక్టుల పనులను 2018 మార్చిలోగా పూర్తి చేస్తామని ఆ మేరకు 2017-18 బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. 2018 మార్చి 31లోగా పూర్తి చేయకపోతే నిధులు ఇవ్వమని స్పష్టీకరించింది. అదే జరిగితే రూ.300 కోట్లకు పైగా కోల్పోయి, ఆ భారమంతా రాష్ట్ర ఖజానాపై పడుతుంది. మరో 57 రోజులే గడువు ఉండడం, ప్రభుత్వ చర్యలు పనులు పూర్తి దిశగా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గుండ్లకమ్మ కాలువల తవ్వకానికి అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ అడుగడుగునా అడ్డుతగిలింది. తమకు అనుకూలురైన రైతులను కోర్టును ఆశ్రయించేలా చేసి పనులకు అడ్డు తగిలింది. కేవలం 24 ఎకరాల భూసేకరణ పూర్తి కాకపోవడం వల్ల.. అప్పట్లో ప్రాజెక్టు పనులు కొంత మేర మిగిలిపోయాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిపోయిన పనులను పూర్తి చేయడంలోనూ సర్కార్ విఫలమైంది. తోటపల్లి ప్రాజెక్టు కింద ఆయకట్టుకు నీళ్లందించడానికి మిగిలిపోయిన డిస్ట్రిబ్యూటరీల పనులను చేయడంలోనూ సర్కార్ విఫలమైంది. ముసురుమిల్లి, ఎర్రకాల్వ, తాడిపూడి, పుష్కర పథకాలదీ అదే దుస్థితి. ఈ ఆర్థిక సంవత్సరంలో గుండ్లకమ్మకు రూ.12.79 కోట్లు, తోటపల్లికి రూ.29.02 కోట్లు, ముసురుమిల్లికి రూ.40.2 లక్షలు, ఎర్రకాల్వకు రూ.2.24 కోట్లు వెరసి రూ.44.46 కోట్లను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది. వీటికి కూడా లెక్క చెప్పడంలో విఫలమవడంతో కేంద్రం తన వాటా నిధుల విడుదలకు నిరాకరించింది. కేంద్రం నిధులతో ఎలా పడితే అలా పనులు చేసి కమీషన్లు కొట్టేయడానికి అవకాశం ఉండదని, అందువల్లే పనులను రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గడువు మీరిన తర్వాత వాటిని రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టి అంచనా వ్యయాలు పెంచేసి కమీషన్లు కాజేయాలన్నది ప్రభుత్వ పెద్దల పన్నాగమని విశ్లేషకులు భావిస్తున్నారు.

రాజస్తాన్ ఉపఎన్నికల్లో బీజేపీకి షాక్

- రెండు లోక్‌సభ, ఒక అసెంబ్లీ స్థానం కాంగ్రెస్ వశం
- బెంగాల్‌లో తృణమూల్ హవా

జైపూర్/కోల్‌కతా: బీజేపీ జోరుకు రాజస్తాన్‌లో కళ్లెం పడింది. రాష్ట్రంలో రెండు లోక్‌సభ, ఒక అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. అల్వార్, అజ్మీర్ లోక్‌సభ స్థానాలను, మండల్‌గఢ్ అసెంబ్లీ స్థానాన్ని అధికార బీజేపీ నుంచి చేజిక్కించుకుంది. అల్వార్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కరణ్‌సింగ్ యాదవ్ సుమారు 2 లక్షల ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి జస్వంత్ యాదవ్‌ను ఓడించారు. అజ్మీర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి రఘు శర్మ బీజేపీకి చెందిన స్వరూప్ లాంబాను 84 వేల ఓట్ల తేడాతో మట్టికరిపించారు. మండల్‌గఢ్ అసెంబ్లీ సీటును వివేక్ ధాకడ్ 13 వేల ఓట్ల తేడాతో గెలుచుకున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో రాజస్తాన్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాజా ఫలితాలు కాంగ్రెస్‌లో ఉత్సాహం నింపాయి. కాంగ్రెస్ విజయంపై పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేస్తూ.. ఈ ఉప ఎన్నికల్లో ప్రజలు బీజేపీని తిరస్కరించారని ట్వీట్ చేశారు.

తృణమూల్ క్లీన్‌స్వీప్...

పశ్చిమ బెంగాల్‌లో ఒక లోక్‌సభ, ఒక అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. బీజేపీ తన ఓటు షేరును పెంచుకుని రెండో స్థానంలో నిలిచింది. ప్రతిపక్ష సీపీఎం మూడో స్థానానికి దిగజారగా, నోవాపరా అసెంబ్లీ స్థానాన్ని కాంగ్రెస్ అవమానకర రీతిలో కోల్పోయింది. ఆ పార్టీ అభ్యర్థికి ధరావతు కూడా దక్కలేదు. హౌరా జిల్లాలోని ఉలుబెరియా లోక్‌సభ సీటులో టీఎంసీ అభ్యర్థి సాజ్దా అహ్మద్ బీజేపీకి చెందిన అనుపమ్ మల్లిక్‌ను సుమారు 5 లక్షల ఓట్ల తేడాతో చిత్తు చేశారు. తృణమూల్ సిట్టింగ్ ఎంపీ సుల్తాన్ అహ్మద్ మృతిచెందడంతో ఉలుబెరియా నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ఆయన భార్య అయిన సాజ్దానే గెలుపొందారు. నోవాపరా అసెంబ్లీ సీటును తృణమూల్ అభ్యర్థి సునీల్ సింగ్ గెలుచుకున్నారు.



మండల్‌గఢ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

శ్రీశైలంలో 6 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం: కర్నూలు జిల్లాలోని శ్రీశైల పుణ్యక్షేత్రంలో ఈ నెల 6 నుంచి 16 వరకు నవాహ్నిక దీక్షతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా స్వామివార్లకు గర్భాలయంలో జరిగే ప్రత్యేక అభిషేకాలతో పాటు సామూహిక అభిషేకాది ఆర్జితసేవలు, హోమాలు, శాశ్వత, టికెట్ కల్యాణోత్సవాలను తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆలయ ఈఓ భరత్‌గుప్త తెలిపారు. శాశ్వత కల్యాణ సేవాకర్తలకు మహాశివరాత్రి ఉత్సవాలు ముగిసిన తరువాత వీటిని నిర్వహించుకునే అవకాశాన్ని కల్పించినట్లు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ వాహన సేవలు ఉంటాయి. ఈ నెల 13న మహాశివరాత్రి పర్వదినాన శ్రీమల్లికార్జునస్వామికి లింగోద్భవకాల మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, పాగాలంకరణ, స్వామిఅమ్మవార్ల బ్రహ్మోత్సవ కల్యాణం నిర్వహిస్తారు. భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల రథోత్సవం 14న జరగనుంది. బ్రహ్మోత్సవాల ఆరంభపూజల్లో భాగంగా 6న ఉదయం 8:30కు యాగశాల ప్రవేశం, గణపతి పూజ నిర్వహిస్తారు. సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపన, సకల దేవతాహ్వాన పూర్వక ధ్వజారోహణ, ధ్వజపటావిష్కరణ జరుగుతాయి. 9న టీటీడీ తరఫున, 10న రాష్ట్రప్రభుత్వం తరఫున స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పిస్తారు.



20కల్లా ఆర్టీపీపీలో ఆరో యూనిట్ పనులు పూర్తి



ఎర్రగుంట్ల: రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ)లోని 600 మెగా వాట్ల 6వ యూనిట్ పనులను ఈ నెల 20వ తేదీకల్లా పూర్తి చేసి సీఓడీ (కమర్షియల్ ఆపరేషన్ డిక్లరేషన్) చేస్తామని ఏపీ జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) ఎంపీ సుందర్‌సింగ్ స్పష్టం చేశారు. వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని ఆర్టీపీపీలో 6వ యూనిట్ పనులను గురువారం ఆయన పర్యవేక్షించారు. అయితే కూలింగ్ టవర్ పనులు గత నవంబరు 30వ తేదీ నాటికి పూర్తి కావల్సి ఉండగా, పనులు జాప్యం చేస్తుండటంపై సుందర్‌సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.కోట్లల్లో ఖర్చుచేస్తున్నా పనులు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. కాగా, యూనిట్ ప్రారంభం ముందుగానే ఎన్విరాల్‌మెంట్ శాఖ నుంచి అనుమతులు వచ్చినట్లు డైరెక్టర్ సుందర్‌సింగ్ తెలిపారు.


● వెంకటేష్
● వరుణ్ తేజ్

వి అండ్ వి ఫిక్స్ గురూ!

మల్టీస్టారర్ మ్యాచ్ మొదలు పెట్టడానికి రెడీ అవుతున్నారు 'ఎఫ్ 2' బ్యాచ్. ఈ బ్యాచ్ కెప్టెన్ అనిల్ రావిపూడి. ఒక లీడ్ ప్లేయర్ విక్టరీ వెంకటేష్ (వి). మరో లీడ్ ప్లేయర్ ప్లేస్‌లో చాలామంది పేర్లు వినిపించాయి. ఫైనల్‌గా ఆ ప్లేస్‌ను హీరో వరుణ్ తేజ్ (వి) భర్తీ చేశారని ఫిల్మ్‌నగర్ సమాచారం. అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'ఎఫ్ 2' (ఫన్ అండ్ ఫ్రస్టేషన్) టైటిల్‌తో ఓ మల్టీస్టారర్ మూవీ రూపొందనుందనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా రెగ్యులర్ షూట్‌ను మే నెలలో స్టార్ట్ చేయనున్నారని సమాచారం. ఆల్రెడీ వెంకీ రెడీగా ఉన్నారు. ఈ నెల 9న విడుదల కానున్న 'తొలిప్రేమ' సినిమా తర్వాత వరుణ్ తేజ్ ఫ్రీ అయిపోతారు.

'పటాస్, సుప్రీమ్, రాజా ది గ్రేట్' చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలను ఖాతాలో వేసుకున్నారు అనిల్ రావిపూడి. ఇప్పుడు సెకండ్ హ్యాట్రిక్‌ని టార్గెట్ చేశారట. ఆ హ్యాట్రిక్‌ను ఈ మల్టీస్టారర్‌తో స్టార్ట్ చేయనున్నారు. అయితే ఇందులో ఎవరు 'ఫన్' క్యారెక్టర్ చేయబోతున్నారు? 'ఫ్రస్టేట్' అయ్యే క్యారెక్టర్‌లో ఎవరు నటించబోతున్నారన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాలో హీరోయిన్స్ సెలక్షన్స్ కోసం చర్చలు జరుపుతున్నారట చిత్రబృందం.

లవ్లీ జర్నీ


● రాహుల్ రవీంద్రన్, చాందినీ చౌదరి

''**రే**వన్ యాదు నా కోసం మంచి పాత్రను తీర్చిదిద్దారు. అందుకు ఆయనకు థ్యాంక్స్. 'హౌరా బ్రిడ్జ్' సినిమా బాగా వచ్చింది. అందుకే ప్రమోషన్స్ విషయంలో రాజీ పడటం లేదు. చాందిని, మనాలి చక్కగా నటించారు. శేఖర్ ఎక్స్‌ట్రార్డినరీ ట్యూన్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు. ఈ సినిమా లవ్లీ జర్నీ'' అని హీరో రాహుల్ రవీంద్రన్ అన్నారు. ఆయన హీరోగా చాందినీ చౌదరీ, మనాలీ రాథోడ్ హీరోయిన్లుగా రేవన్ యాదు దర్శకత్వంలో వడ్డేపల్లి సత్యనారాయణ ఆశీర్వచనాలతో ఈఎమ్‌వీఈ స్టూడియోస్ పతాకంపై రూపొందిన చిత్రం 'హౌరా బ్రిడ్జ్'. శేఖర్‌చంద్ర సంగీతం అందించిన ఈ సినిమా పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ''దర్శకుడిగా నా రెండో చిత్రం 'హౌరా బ్రిడ్జ్'. సినిమా చాలా బాగా తీశాం'' అన్నారు రేవన్ యాదు. హీరో నిఖిల్, ఏపీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, చాందినీ చౌదరి, శేఖర్ చంద్ర, హీరోలు నారా రోహిత్, నవీన్‌చంద్ర, సంగీత దర్శకుడు సాయికార్తీక్, నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

"ప్రతి ఒక్కరికి డ్రీమ్స్ ఉంటాయి. వాటిని సాకారం చేసుకోవటానికి కష్టపడుతూ ఉండాలి. చిన్నప్పుడు నేను యాక్టర్ అవ్వాలని కలలు కనేదాన్ని. నా కలను నెరవేర్చుకోవడానికి కష్టపడ్డాను. ఇవాళ యాక్టర్‌గా నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాను" అన్నారు నటి కాజల్. అది మాత్రమే కాదు.. కలను సాకారం చేసుకోవడానికి ఏం చేయాలో కూడా చెప్పారు.

కలలను వెంటాడండి!


● కాజల్ అగర్వాల్

జీవితంలో కొన్నిసార్లు మనం ఏం చేస్తున్నామో అర్థం కాని అయోమయ పరిస్థితుల్లో పడిపోవచ్చు. అలాంటి టైమ్‌లో అస్సలు నిరాశ చెందకండి. అలాంటి సిచ్యువేషన్స్‌ను అధిగమించగలిగితేనే సక్సెస్ సాధించగలం.

కొన్నిసార్లు మేం బాగా యాక్ట్ చేయవచ్చు. అయినా రిజల్ట్ మా చేతుల్లో ఉండదు. గెలుపు ఓటములు మన చేతుల్లో ఉండవు. కానీ ఏది వచ్చినా కూడా ఒకేలా తీసుకుని ముందుకు వెళ్లగలగాలి. చేసే పనిలో మనం బెస్ట్ ఇవ్వాలి. రిజల్ట్ ఫేట్ డిసైడ్ చేస్తుంది.

మనం అనుకున్న గోల్ రీచ్ కావడానికి చాలా ప్రశ్నలు ఎదురవుతూ ఉంటాయి. కొన్ని సందర్భాల్లో లోన్లీగా అనిపించొచ్చు. ఎవరూ మనకు లేరని కాదు. మనం తీసుకున్న నిర్ణయాలతో వారు మనతో ఏకీభవించకపోవచ్చు. వాళ్లు కోరుకునేది మన మంచికే అవ్వచ్చు. కానీ మీరు తీసుకున్న డెసిషన్ మీద మీరు నిలబడగలగాలి.

మనం ఏది అచీవ్ చేయాలనుకున్నా కావాల్సినవాళ్ల సహకారం లేనిదే మనం ఏమీ చేయలేము. సో.. ఎప్పటికీ అనుబంధాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

అందరికీ ఇన్‌సెక్యూరిటీస్ ఉంటాయి. అందరం అందరిలా ఉండకపోవచ్చు. మనం ఎవరితో అయినా కంపేర్ చేయదలుచుకుంటే అది నిన్నటి మనతోనే. ఒకవేళ మీరు ఏదైనా ఇంప్రూవ్ చేసుకోవాలనుకుంటే అది కేవలం మీ గ్రోత్‌కు ఉపయోగపడితేనే చేయండి.

ఇవే కాకుండా ప్రస్తుతం ముఖ్యంగా నోట్ చేసుకోవాల్సింది సోషల్ మీడియాలో కామెంట్స్‌ను సీరియస్‌గా తీసుకోకపోవడం.

సేఫ్టీ లేదు


● అమలాపాల్

ఈ మధ్య ఎక్కడ చూసినా మహిళల్ని వేధించటం, వారితో అసభ్యకరంగా ప్రవర్తించటం వంటి వార్తలు చూస్తూనే ఉన్నాం. సాధారణ మహిళల నుంచి సెలబ్రిటీల వరకు ఎవరూ ఈ వేధింపులను తప్పించుకోలేకపోతున్నారు. అఫ్‌కోర్స్.. అందరికీ ఇలాంటి చేదు అనుభవాలు ఎదురు కావనుకోండి. ఆ సంగతలా ఉంచితే.. తాజాగా అమలా పాల్ ఓ చేదు అనుభవం ఎదుర్కొన్నారు. త్వరలో మలేసియాలో జరగబోయే ఓ ఈవెంట్ కోసం చెన్నైలోని టీ నగర్‌లో డ్యాన్స్ ప్రాక్టీస్‌లో పాల్గొంటున్నారు అమలాపాల్. ఆ డ్యాన్స్ స్టూడియోకి అలగేశన్ అనే వ్యక్తి వచ్చి అమలాపాల్‌ను కలిశారు. క్యాజువల్‌గా మాట్లాడటం మొదలుపెట్టాడట. అయితే కొద్దిసేపటి తర్వాత అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ చెన్నై పోలీసులకు ఫిర్యాదు చేశారు అమలా పాల్. వెంటనే అలగేశన్‌ను అదుపులోకి తీసుకున్నారు చెన్నై పోలీసులు. ''మలేసియాలో ఓ బిజినెస్‌మేన్ నిర్వహించే ప్రైవేట్ పార్టీకి అమలాపాల్‌ను ఆహ్వానించడానికి వచ్చాను. ఇంతకు ముందు ఆమె మేనేజర్‌తో కూడా మాట్లాడాను'' అని పోలీసులతో అలగేశన్ అన్నాడట. ఇదే విషయాన్ని అమలాపాల్ మేనేజర్‌ను సంప్రదించగా 'అలగేశన్ ఎవరో తెలియదు' అన్నాడట. ఈ విషయంపై అమలా పాల్ స్పందిస్తూ –''అతని బిహేవియర్ చూసి షాక్ అయ్యాను. చాలా కించపరుస్తూ మాట్లాడాడు. ఈ విషయాన్ని పోలీసుల దగ్గరకు తీసుకువెళ్లటం మంచిదనిపించింది. వర్కింగ్ ఉమన్‌గా నాకు సేఫ్ అనిపించలేదు'' అని పేర్కొన్నారు అమలాపాల్.

రిజల్ట్ కోసం వెయిటింగ్


● మేఘన, సల్మాన్, సంతోషి

మేఘన, సంతోషి, సల్మాన్ ప్రధాన పాత్రల్లో కృష్ణకార్తీక్ దర్శకత్వంలో హారర్, థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'హ్యాక్‌డ్ బై డెవిల్' (హెచ్ బిడి). ఉదయ్‌భాస్కర్. వై నిర్మించిన ఈ సినిమా ఈరోజు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో కృష్ణకార్తీక్ మాట్లాడుతూ– ''హెచ్‌బిడి' నా మొదటి సినిమా. చాలా ఉద్వేగంతో ఉన్నా. పరీక్ష రాసి రిజల్ట్ కోసం ఎదురు చూస్తున్నా. మా సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''కృష్ణకార్తీక్ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాడు. ఆయనకి ఇది తొలి చిత్రమైనా బాగా తెరకెక్కించారు. ఈ సినిమా తర్వాత రెగ్యులర్‌గా సినిమాలు నిర్మిస్తాం'' అన్నారు నిర్మాత ఉదయ్‌భాస్కర్. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, నిర్మాతలు టి.రామ సత్యనారాయణ, రాజ్ కందుకూరి, సాయి వెంకట్, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, ఉప్పల్ ఎమ్మెల్యే ప్రభాకర్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మహి మదన్ యం.యం, కెమెరా: కన్నా కోటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వినయ్ గౌడ్ వై.